సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 130
గురువారం 31-7-2025



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'


సమమా... సమర్పణమా!
నేటి నుంచి ఇంగ్లండ్‌తో భారత్ ఆఖరి టెస్టు
-14లో



'ఫార్చ్యూన్'లో రిలయన్స్ టాప్
జాబితాలో ఎల్ఐసీ, ఐవోసీ, ఎస్‌బీఐ సహా 9 సంస్థలకు చోటు..
-15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


భారత్‌కు బుద్ధుని అవశేషాలు
బ్రిటిష్ హయాంలో భారత్ నుంచి తరలిన బుద్ధుని పవిత్ర అవశేషాలను 127 ఏళ్లకు యూకే నుంచి స్వదేశానికి తీసుకొచ్చారు.
- వివరాలు 6లో▶


విచారణకు క్రికెట్ స్టేడియం కావాలి
'సెంథిల్ మనీలాండరింగ్ కేసులో నిందితుల ఉనికిని గుర్తించడానికి క్రికెట్ స్టేడియం కావాలి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.
- వివరాలు 6లో▶


మీ తీరు నమ్మశక్యంగా లేదు
కమిటీ దర్యాప్తులో నేరం రుజువు కావడంతోనే మరో దారిలేక ఇక్కడికొచ్చారా? అని జస్టిస్ యశ్వంత్‌వర్మను సుప్రీంకోర్టు ప్రశ్నించింది.
- వివరాలు 6లో▶


మీ తియ్యని ప్రేమ.. తగ్గించండి!
'తీపి' ప్రేమ పిల్లల పాలిట శత్రువవుతోంది. పిల్లల్లో చక్కెర వినియోగం తగ్గించకపోతే ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- వివరాలు 3లో▶

25 శాతం సుంకాలు
భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాంబ్


• సుంకాల కౌగిలి

- రష్యాతో వ్యాపారం చేస్తున్నందుకు అదనంగా జరిమానా కూడా...
- ఆగస్టు 1 నుంచి అమల్లోకి నిర్ణయాలు: ట్రంప్ ప్రకటన
- మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యం... మండిపడ్డ కాంగ్రెస్, విపక్షాలు
- దేశ ప్రయోజనాలను కాపాడతాం: కేంద్రం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్‌పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు పేర్కొన్నారు. ఆ మొత్తం ఎంతన్నది పేర్కొనలేదు. ఈ నిర్ణయాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో బుధవారం ఈ మేరకు ఆయన పలు పోస్టులు పెట్టారు. అమెరికాతో భారత వర్తక విధానాలు, నిబంధనలను అత్యంత దారుణమైనవిగా అభివర్ణించారు. ''భారత్ మా మిత్ర దేశమే. కానీ వర్తక, వాణిజ్య సంబంధాల విషయంలో ఆ దేశంతో అంతా సజావుగా లేదు. అమెరికాపై ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. అందుకే ఆ దేశంతో మేం భారీ స్థాయిలో వ్యాపారం చేయడం లేదు''అని రాసుకొచ్చారు. భారత్‌తో అమెరికాకు భారీ వర్తక లోటు ఉందని గుర్తు చేశారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకే అదనంగా జరిమానా విధిస్తున్నట్టు స్పష్టం చేశారు. ''ఉక్రెయిన్‌లో జనహననం ఆగాలని ప్రపంచమంతా ఆకాంక్షిస్తోంది. ఇలాంటి సమయంలో అందుకు పాల్పడుతున్న రష్యాతో భారత్ భారీ వాణిజ్య సంబంధాలు నెరుపుతోంది''అంటూ ఆక్షేపించారు. అదే జరిగితే రష్యాతో వాణిజ్యం చేస్తున్నందుకు అమెరికా నుంచి జరిమానా ఎదుర్కోనున్న తొలి దేశం భారతే అవుతుంది. భారత్‌తో వర్తక ఒప్పందం నిమిత్తం అమెరికా బృందం ఆగస్టు 25 నుంచి భారత్‌లో పర్యటించనుందని కేంద్రం ప్రకటించిన మర్నాడే ట్రంప్ నుంచి అనూహ్యంగా సుంకాల పోటు నిర్ణయం వెలువడటం గమనార్హం. ఈ దెబ్బకు రూపాయి విలువ గత మూడేళ్లలో అత్యధికంగా బుధవారం ఏకంగా 89 పైసలు పతనమైంది. అమెరికా డిమాండ్లకు తలొగ్గేలా భారత్‌పై ఒత్తిడి పెంచడమే ట్రంప్ ప్రకటన ఉద్దేశమని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో జపాన్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌పై కూడా ట్రంప్ ఇలాంటి ఒత్తిళ్లే తెచ్చి అమెరికాకు అనుకూలంగా ఒప్పందాలు
మిగతా 2వ పేజీలో ▶

ప్రభావాన్ని సమీక్షిస్తున్నాం: కేంద్రం
భారత్‌పై 25 శాతం సుంకాల విధింపు, రష్యాతో వర్తకం చేస్తున్నందుకు జరిమానా ప్రకటన తాలూకు ప్రభావాన్ని మదింపు చేస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ''ఇరు దేశాలకూ ఆమోదనీయ, లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు కట్టుబడి ఉన్నాం. కొద్ది నెలలుగా ఆ దిశగాఅత్యున్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి''అని గుర్తు చేసింది. వీటిలో భాగంగా ఆరో రౌండ్ చర్చల నిమిత్తం అమెరికా బృందం ఆగస్టు 25న భారత్ రానుంది.

నింగిలోకి నైసార్
జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతం

- దిగ్విజయంగా కక్ష్యలోకి చేరిన ఇస్రో–నాసా ఉమ్మడి ఉపగ్రహం
- భూమి ఉపరితలం పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం
- భూమిని స్కాన్ చేసే పనిలో అప్పుడే నిమగ్నం
- హసన్‌లోని మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు సిగ్నల్స్
- రూ.11,200 కోట్లతో రూపొందించిన ఈ శాటిలైట్ పదేళ్ల పాటు సేవలు
- ఇక ఆకాశమే హద్దుగా ప్రయోగాలు: ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ వెల్లడి



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) ఉమ్మడి ఉపగ్రహం నైసార్ జీఎస్ఎల్వీ ఎఫ్16 నిప్పులు చిమ్ముతూ బుధవారం నింగిలోకి దూసుకెళ్లింది. నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్న తర్వాత భూమిని స్కాన్ చేయడం ప్రారంభించడంతో ప్రయోగం విజయవంతమైంది. భూమి ఉపరితలం లోతుగా పరిశీలన.. వాతావరణ మార్పులపై అధ్యయనం లాంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఇస్రో, నాసాలు మొట్ట మొదటిసారిగా సంయుక్తంగా 2,392 కేజీల బరువు కలిగిన నైసార్ (నాసా–ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్) ఉపగ్రహాన్ని రూపొందించాయి. జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్వీ ఎఫ్16) ఉపగ్రహ వాహక నౌక ద్వారా భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య సమకాలిక కక్ష్యలో నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇది ప్రత్యేకంగా భూమి ఉపరితల పరిశీలన ఉపగ్రహం కావడం విశేషం. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నాసాది ఎల్–బ్యాండ్, ఇస్రోది ఎస్–బ్యాండ్) భూమిని అత్యంత దగ్గరగా పరిశీలించే ఉపగ్రహం. దీనికి 12 మీటర్ల అన్‌ఫర్లబుల్ మెష్ రిఫ్లెక్టర్ యాంటెన్నాను అమర్చారు. ఈ ఉపగ్రహం తొలిసారిగా స్వీప్‌సార్ టెక్నాలజీని ఉపయోగించి 242 కిలోమీటర్ల అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూమిని పరిశీలిస్తుంది. ఈ ఉపగ్రహం భూగోళాన్ని మొత్తం స్కాన్ చేసి 12 రోజుల వ్యవధిలో అన్ని వాతావరణ పరిస్థితుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా డేటాను అందిస్తుంది. భూమి ఉపరితలంలో
మిగతా 2వ పేజీలో ▶

• సునామీ ప్రకంపనలు


సునామీ ప్రభావంతో రష్యాలోని సివిరో కురిల్స్క్ తీరపట్టణంపై విరుచుకుపడిన రాకాసి అలలు

- రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో సంభవించిన భూకంపం
- రష్యా, జపాన్, అమెరికా, హవాయ్ తీరాలను తాకిన భీకర సునామీ అలలు
- రష్యా తూర్పు తీరం వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో మొదలైన ప్రకంపనలు
- తీరపట్టణాలను కుదిపేసిన అత్యంత ఎత్తైన అలలు
- భారీ భూకంపం ధాటికి చిగురుటాకులా వణికిన తీరదేశాల ప్రజలు

- వివరాలు 6లో


విద్యుత్ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఉచితాల కోసం కొత్త డిస్కమ్

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- రాష్ట్రం యూనిట్‌గా ఏర్పాటు చేయాలని సూచన
- వ్యవసాయానికి, ఇళ్లకు, స్కూళ్లు, కాలేజీలకిచ్చే ఉచిత విద్యుత్ దీని పరిధిలోకి..
- విద్యుత్ రంగంలో సంస్కరణలు తప్పనిసరి అని స్పష్టీకరణ
- రుణాలపై వడ్డీ భారం తగ్గేలా చర్యలు చేపట్టాలన్న సీఎం
- విద్యుత్ శాఖపై డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు కానుంది. వ్యవసాయానికి, ఇళ్లకు 200 యూనిట్ల వరకు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పర్యవేక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇది రాష్ట్రం యూనిట్‌గా పని చేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. డిస్కమ్‌ల స్థితిగతులు, ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడాలంటే విధిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించుకునేందుకు వీలుగా రీస్ట్రక్చరింగ్‌కు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో
మిగతా 3వ పేజీలో ▶

నోట్ల కట్టల మాటున బాబు మహా కుట్ర



ఏస్థాయికైనా దిగజారుతామనేలా దర్యాప్తు సంస్థ మరో బరితెగింపు
రూ.11 కోట్ల జప్తు పేరుతో టీడీపీ కార్యాలయం డైరెక్షన్‌లో హైడ్రామా

మద్యం అక్రమ కేసులో న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే కుతంత్రం
- ఇన్నాళ్లైనా ఒక్క ఆధారమూ చూపలేకపోయారని తప్పుబట్టిన కోర్టు
- నిందితుల బెయిల్ మంజూరును అడ్డుకునేందుకు కొత్త నాటకానికి తెర
- వర్ధమాన్ కాలేజీకి చెందిన నగదును రాజ్ కసిరెడ్డిదిగా నమ్మించే కుట్ర
- గతంలో సోదాల్లో దొరకని డబ్బు.. అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన వైనం
- అదికూడా 2024 జూన్ నుంచి వారి నివాసంలోనే ఉన్నట్లు కట్టుకథలు
- విజయేందర్‌రెడ్డి అనుకూలంగా మారాకనే వారింట్లో నగదు లభ్యం!
- వాళ్లకు ఆ మనిషి అనుకూలంగా మారాకనే డబ్బు దొరకడం ఏమిటి?
- నివాసంలోని సొమ్మును వేరేవాళ్లదిగా ఆయనతోనే చెప్పిస్తూ కుతంత్రం
- ఇదంతా గమనిస్తే... స్పష్టంగా అర్థం అవుతున్న సిట్ పన్నాగం
- ఒకే తరహా ఎ-4 కాగితాల పెట్టెల్లో అర్ధరాత్రి చకచకా పుట్టుకొచ్చిన నగదు
- జప్తు గురించి మీడియాకు లోకేశ్ సన్నిహితుడు కిలారి రాజేశ్ సమాచారం.. ఇదంతా టీడీపీ ప్రధాన కార్యాలయం స్కెచ్చేనని బట్టబయలు
- ఇంతకంటే బరితెగింపు ఏముంటుంది? అక్రమ కేసు అనేందుకు ఇది నిదర్శనం కాదా?
- రూ.11 కోట్లు జప్తు చేసినట్లు చెబుతున్న సిట్ కట్టుకథ బూమరాంగ్

12లో

ఆ షేర్ల బదిలీ అక్రమం
షర్మిలపై వైఎస్ జగన్ కేసులో ఎన్‌సీఎల్‌టీ స్పష్టీకరణ
- పాత షేర్ హోల్డింగ్‌ను పునరుద్ధరించాలంటూ కంపెనీకి ఆదేశాలు
- వైఎస్ జగన్, వైఎస్ భారతి, క్లాసిక్ రియాల్టీ షేర్లూ పునరుద్ధరించాలి
- షేర్ల బదిలీకి పాటించాల్సిన నిబంధనలేవీ పాటించలేదు
- చెల్లెలికి ఆ కంపెనీలో షేర్లన్నీ ఇవ్వాలన్నది వైఎస్ జగన్ ఉద్దేశం
- ఆ ఉద్దేశాన్ని లిఖితపూర్వకంగా తెలియజేస్తూ ఎంఓయూ, గిఫ్ట్ డీడ్
- కేసులు తేలాకే ఆస్తులు బదలాయించాలని గిఫ్ట్ డీడ్‌ను పూర్తిచేయలేదు
- అందుకే ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ పత్రాలు ఇవ్వలేదు
- అవి పోయాయని చెప్పి ప్రతివాదులు డూప్లికేట్ సర్టిఫికెట్లు తీసుకున్నారు
- పిటిషనర్లకు తెలియకుండా అలా చేయటం అక్రమం
- అందుకే గత జూలై 2 నాటి సరస్వతి బోర్డు తీర్మానాన్ని రద్దు చేస్తున్నాం
- వాటాల బదిలీ కూడా రద్దు.. పిటిషనర్ల పేర్లు కంపెనీ బోర్డు రిజిస్టర్‌లో చేర్చాలి
- ఆ విషయాన్ని కంపెనీల రిజిస్ట్రార్‌కు తెలియజేయాలి: ఎన్‌సీఎల్‌టీ స్పష్టీకరణ


NCLT
National Company Law Tribunal

12లో

కాంగ్రెస్ ధారాదత్తం చేసింది

కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలోనే దేశంలో ఉగ్రవాదం వేళ్లూనుకుపోయింది. అధికారంలో ఉండి కూడా ఏ ఒక్కరోజూ ఉగ్రవాదం అంతానికి ధృఢ సంకల్పంతో కాంగ్రెస్ పనిచేయలేదు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో మేం పెకిలించివేస్తున్నాం. త్వరలోనే ఉగ్రవాదం అంతమవుతుంది. దేశ భద్రత అనేది కాంగ్రెస్ ప్రాధాన్యతాంశాల్లో అస్సలు లేదు. ఓటు బ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు మాత్రమే కాంగ్రెస్ అజెండా. వీటిపై మాత్రమే కాంగ్రెస్ దృష్టిపెట్టి జాతీయభద్రత వంటి మిగతా కీలకాంశాలను గాలికొదిలేసింది. దీంతో ఉగ్రవాదం ఊడలుదిగి విపరీతంగా విస్తరించింది.
- వివరాలు 6లో

మేం తిరిగి తీసుకొస్తాం
పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై రాజ్యసభలో అమిత్ షా ప్రసంగం



NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	110 kg	Dressed with Skin	191 kg
₹ 66	Retail Live Bird	132 kg	Skin Less	218 kg

Issued in the interest of consumers



క్లుప్తంగా...

ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్ జగన్ అభినందనలు



సాక్షి, అమరావతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలకు వైఎస్ జగన్ అభినందనలు తెలియజేశారు. నాసా, ఇస్రో ఉమ్మడిగా రూపొందించిన నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ – నైసార్ అనే ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం అభినందనీయం అన్నారు. ఈ అద్భుత విజయంలో పాల్గొన్న శాస్త్రవేత్తలకు, వారి బృందానికి శుభాకాంక్షలు చెబుతూ బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించండి

గడ్కరీని కోరిన ఎంపీ ఈటల రాజేందర్



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–65)లో భాగంగా చింతకుంట సర్కిల్ నుంచి ఆటోనగర్ చౌరస్తా వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిసిన ఈటల.. ఎన్‌హెచ్–65 కి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ రహదారిలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రహదారిపై ప్రమాదాలు, యాక్సెస్ రోడ్ల వలన ఏర్పడుతున్న సమస్యలను ఈటల వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ అత్యంత అవసరమని చెప్పారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని గడ్కరీ హామీ ఇచ్చినట్టు ఈటల తెలిపారు.

జడ్చర్లకు కొత్తగా బైపాస్ ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రికి ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ మీదుగా వెళ్లే జాతీయ రహదారి 167 నుంచి ఎన్‌హెచ్ 44ని కలుపుతూ.. తిరిగి ఎన్‌హెచ్ 167కు అనుసంధానం అయ్యేలా జడ్చర్ల చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పార్లమెంటులో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కేంద్ర మంత్రికి అరుణ వినతిపత్రం అందజేశారు. వాహనాల రద్దీతో జడ్చర్ల పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, బైపాస్ ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించారు. అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు అరుణ తెలిపారు.

ఉగ్రవాదాన్ని ఎలా ఎదుర్కోగలమో ప్రపంచానికి చాటిచెప్పాం

రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: గ్లోబల్ టెర్రరిజాన్ని భారత్ ఎలా ఎదుర్కోగలదో ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి చాటిచెప్పిందని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. శత్రు దేశానికి భారత సైన్యం ఎప్పుడు ధీటుగా జవాబిచ్చినా.. కాంగ్రెస్ వారి ధైర్య సాహసాలపై ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉందని మండిపడ్డారు. బుధవారం రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో లక్ష్మణ్ కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. 'ఇది యుద్ధ శకం కాదు. శాంతి, శ్రేయస్సు, అభివృద్ధి శకం. ఇదే సంకల్పంతో మోదీ ముందుకెళ్తున్నారు. ఆకతాయి చేష్టలను సహించేది లేదు టెర్రరిజాన్ని ఉపేక్షించేది లేదు. ఆపరేషన్ సిందూర్ విషయంలో దేశమంతా ఐక్యంగా ఉంది' అని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

సాక్షి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుంచి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

టోల్ ఫ్రీ నెం.
1800 425 9899





చీరలు కట్టి.. చెట్లుగా మార్చారు!

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా కె గ్రామస్తులు హరితహారం అమల్లో ఆదర్శంగా నిలిచారు. 2021 జూలై 24న కేటీఆర్ జన్మదినం సందర్భంగా గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. వాటిని సంరక్షించేందుకు వినూత్న ఆలోచన చేశారు. గ్రామ సర్పంచ్ గాడ్గే మీనాక్షి సొంతంగా ఖర్చు చేసి చీరలు కొనుగోలు చేశారు. మొక్కలకు ప్లాస్టిక్ కంచెలు వేసి వాటి చుట్టూ చీరలు కట్టారు. నాడు నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి హరిత తోరణంలా కనిపిస్తున్నాయి. గ్రామానికి వచ్చేవారికి స్వాగతం పలికేలా పచ్చని పందిరి ఇలా కనువిందు చేస్తోంది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నింగిలోకి నైసార్

▶ మొదటి పేజీ తరువాయి

నేల వైకల్యం, మంచు పలకాల కదలిక, వృక్ష సంపద, డైనమిక్స్ వంటి చిన్న మార్పులను కూడా గుర్తిస్తుంది. సముద్రపు మంచు వర్గీకరణ, ఓడల గుర్తింపు, తీర ప్రాంత పర్యవేక్షణ, తుపాన్ లక్షణం, నేల తేమలో మార్పులు, ఉపరితల నీటి వనరుల మ్యాపింగ్, పర్యవేక్షణతో పాటు విపత్తుల సమయంలో హెచ్చరికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంది. రూ.11,200 కోట్లతో రూపొందించిన ఈ ఉపగ్రహం పదేళ్లపాటు సేవలు అందిస్తుంది.

ప్రయోగంలో అన్ని దశలు అద్భుతం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్వీ–ఎఫ్16 ప్రయోగాన్ని నిర్వహించారు. ఎరుపు, నారింజ రంగుతో నిప్పులు చిమ్ముతూ నింగివైపునకు అత్యంత వేగంగా దూసుకెళ్లింది. మూడు దశల్లో ప్రయోగించిన రాకెట్‌లో అన్ని దశలు అద్భుతంగా పని చేయడంతో 18.40 నిమిషాలకు కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. బెంగళూరు సమీపంలో హాసన్‌లో ఉన్న గ్రౌండ్‌స్టేషన్‌కు సిగ్నల్స్ అందడంతో ఉపగ్రహం చక్కగా పని చేస్తోందని వారు ప్రకటించారు. ఇది షార్ నుంచి 102వ ప్రయోగం. ప్రయోగం విజయవంతం కావడంతో మిషన్ కంట్రోల్ రూంలో శాస్త్రవేత్తలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని హర్షం వ్యక్తం చేశారు.

ఇక భారీ ప్రయోగాలే లక్ష్యం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇక ఆకాశమే హద్దుగా భారీ ప్రయోగాలే లక్ష్యంగా పని చేస్తుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మే నెల 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం అపజయం కొంత కుంగదీసినా, ఈ ప్రయోగ విజయంతో మరిన్ని ప్రయోగాలను విజయవంతం చేయగలమనే నమ్మకం వచ్చిందన్నారు. ఈ ప్రయోగం తనకు తొలి విజయమని, ఇస్రో బృందానికి అభినందనలు తెలియజేశారు. ఇది ఇస్రో సాధించిన సమష్టి విజయమని చెప్పారు. ఇస్రో–నాసా మధ్య కుదిరిన ఒప్పందంతోనే ఇరు దేశాలకు చెందిన అంతరిక్ష సంస్థలు మొట్టమొదటిసారి చేసిన ప్రయోగం విజయంతం కావడం ఆనందంగా ఉందన్నారు. నాసాతో మరిన్ని ఒప్పందాలు చేసుకుని రాబోయే రోజుల్లో మరో మూడు ప్రయోగాలను నిర్వహించేందుకు నాసా–ఇస్రో సన్నద్ధమవుతున్నాయని తెలిపారు. ఇస్రోకు వాణిజ్య సంస్థగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌కు పీఎస్ఎల్వీ రాకెట్‌ను అప్పగించడంతో ఈ ఏడాది ప్రయివేట్‌గా పీఎస్ఎల్వీ–ఎన్1 పేరుతో నూతన ప్రయోగాన్ని చేపట్టనున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇస్రో నిర్ణయించిన షెడ్యూల్‌లో నిసార్‌తో కలిపి ఏడు ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్వీఎం3–ఎం5 రాకెట్ ద్వారా వాణిజ్యపరంగా బ్లూబర్డ్–6 అనే ఉపగ్రహ ప్రయోగం వుంటుందన్నారు. ఆ తర్వాత పీఎస్ఎల్వీ ఎన్1 రాకెట్ ద్వారా టీడీఎస్–1 అనే ఉపగ్రహాన్ని, హెచ్ఎల్వీఎం (గగన్‌యాన్–1) ద్వారా అన్ క్రూయిడ్ ఆర్బిటల్ టెస్ట్ ఫ్లైట్–1, జీఎస్ఎల్వీ ఎఫ్17 ద్వారా ఐడీఆర్ఎస్ఎస్–1 అనే ఉపగ్రహాన్ని, గగన్‌యాన్ టీవీ–డీ2 ద్వారా టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్–2 అనే ప్రయోగాత్మక ప్రయోగంతో పాటు పీఎస్ఎల్వీ సీ62 ద్వారా ఓషన్‌శాట్–3జీ అనే ఉపగ్రహాలను ప్రయోగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. అనంతరం 2026లో వరుసగా గగన్‌యాన్–2, గగన్‌యాన్–3 ప్రయోగాలే లక్ష్యంగా పెట్టుకున్నామని, చంద్రయాన్–4 ప్రయోగానికి సంబంధించిన పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. కాగా, నిసార్ ప్రయోగాన్ని ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కే రాధాకృష్ణన్, ఏఎస్ కిరణ్‌కుమార్‌లు మిషన్ కంట్రోల్ సెంటర్‌లోని గ్యాలరీ నుంచి వీక్షించారు.



ప్రయోగం సక్సెస్ అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్

ప్రయోగం జరిగింది ఇలా..

- 51.70 మీటర్ల పొడవున్న జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ 420.5 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమైంది.
- నాలుగు స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో మొదటిదశ ప్రారంభమైంది. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 40 టన్నుల ద్రవ ఇంధనం.. స్ట్రాపాన్ బూస్టర్లకు మధ్యలోని కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనాలను (మొత్తం 299 టన్నుల ద్రవ, ఘన ఇంధనాలు) మిళితం చేసి 152 సెకన్లలో మొదటి దశ పూర్తి చేశారు.
- రాకెట్ శిఖర భాగంలోని ఉప గ్రహానికి అమర్చిన హీట్ షీల్డ్ 171.8 సెకన్లకు మొదటి – రెండో దశకు మధ్యలోనే విజయవంతంగా విడిపోయాయి.
- రెండో దశను 294.1 సెకన్లకు పూర్తి చేశారు.
- ఆ తర్వాత అత్యంత కీలకమైన క్రయోజనిక్ దశలో 15 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1,100 సెకన్లకు మూడో దశను కటాఫ్ చేశారు.
- అనంతరం 1,120 సెకన్లకు (18.40 నిమిషాలకు) 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య–సమకాలిక కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- అక్కడి నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరుకు సమీపంలోని హాసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ తన ఆధీనంలోకి తీసుకుని ఉపగ్రహ పనితీరును పర్యవేక్షించడం ప్రారంభించింది. ఉపగ్రహం సంతృప్తికరంగా ఉందని ప్రకటించారు.

ఇస్రో సహకారం మరువలేనిది

నైసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ–ఎఫ్16 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తీరు అమోఘం. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో).. నాసా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, జేపీఎస్ ఇంజినీర్ల పట్ల చూపించిన సహకారం మరువలేనిది. నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని (నైసార్) ఇరుదేశాలకు చెందిన ఇంజినీర్లు, నాసా శాస్త్రవేత్తలు కలిసికట్టుగా చేయడం ఆనందంగా ఉంది. ఇస్రో చూపించిన అభిమానం, సహకారంతో భవిష్యత్తులో మరో రెండు మూడు ప్రయోగాలు చేయడానికి మేము ముందుకొస్తున్నాం. ఈ ప్రయోగంలో పాలు పంచుకున్న ఇస్రో శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు.

– పలువురు నాసా మహిళా శాస్త్రవేత్తలు

నై'సార్'.. చైత్ర రావు..

ప్రయోగంలో శాటిలైట్ డైరెక్టర్‌గా చైత్ర రావు కీలక పాత్ర



సూళ్లూరుపేట: జీఎస్ఎల్వీ–ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగించిన నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నైసార్) ఉపగ్రహానికి చైత్ర రావు అనే మహిళ శాస్త్రవేత్త డైరెక్టర్‌గా వ్యవహరించారు. ప్రయోగం విజయవంతమయ్యాక మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి నమస్కారం.. అంటూ ప్రసంగం ప్రారంభించిన ఆమె.. చివరలో వందేమాతరం.. అని చెప్పడంతో అందరూ ఆమెను తెలుగు మహిళా శాస్త్రవేత్త అనుకున్నారు. అయితే ఆమె మూలాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రమే అయినప్పటికీ ప్రస్తుతం కర్ణాటకలో ఉంటున్నారు. చిన్నపాటి ఇంజినీర్‌గా చేరిన ఆమె అంచెలంచెలుగా ఎదిగి బెంగళూరులో ప్రొఫెసర్ యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఉపగ్రహాలను రూపొందించడం, సమగ్ర పరచడం, పరీక్షించడం వంటి విభాగాల్లో ఆమె సైంటిస్టుగా పని చేస్తున్నారు. గతంలో మార్స్ ఆర్బిట్ మిషన్‌కు స్పేస్ క్రాఫ్ట్ ఆపరేషన్ మేనేజర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత ఖగోళ పరిశోధనకు తయారు చేసిన ఆస్ట్రోశాట్‌లో పేలోడ్స్‌ను అందజేయడంలో కీలక భూమిక పోషించారు. ప్రస్తుతం నైసార్ ఉపగ్రహానికి డైరెక్టర్‌గా వ్యవహరించారు. అమెరికాలోని కాలిఫోర్నియా ఆఫ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ (జేపీఎల్)కి చెందిన ప్రతినిధులతో కలిసి ఆమె ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఇందులో ఎల్–బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్‌ను జేపీఎల్ ప్రతినిధులు, ఎస్–బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్‌ను ఇస్రో రూపొందించిన విషయం తెలిసిందే. చైత్రరావు శాటిలైట్ డైరెక్టర్‌గా కీలకమైన పాత్ర పోషించారు.

సాగునీటి రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించండి

ఆర్ఈసీ సీఎండీకి మంత్రి ఉత్తమ్ వినతి



ఆర్ఈసీ సీఎండీ జితేంద్ర శ్రీవాత్సవకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టుల కోసం తీసుకున్న రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాలని, రుణాలను తిరిగి చెల్లించే కాల పరిమితిని పెంచాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) సీఎండీ జితేంద్ర శ్రీవాత్సవను కోరారు. మంత్రితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా తెలంగాణ భవన్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ప్రస్తుతం ఈ రుణాలు రాష్ట్ర ఆర్థిక వనరులపై గణనీయమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయని మంత్రి ఉత్తమ్ ఆయనకు చెప్పారు. రుణాలు తిరిగి చెల్లించడానికి ఉన్న నిబంధనలు సడలించడం వల్ల రాష్ట్ర ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని వివరించారు. దీనిపై శ్రీవాత్సవ సానుకూలంగా స్పందించారు.

25 శాతం సుంకాలు

▶ మొదటి పేజీ తరువాయి

కుదుర్చుకుందని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. గతంలో చైనాపై కూడా ఇలాగే ట్రంప్ అడ్డగోలుగా టారిఫ్‌లను ప్రకటించడం, చివరికి వెనక్కు తగ్గడం తెలిసిందే. భారత చమురు దిగుమతుల్లో కేవలం 0.2 శాతంగా ఉన్న రష్యా వాటా ఉక్రెయిన్‌తో ఆ దేశం యుద్ధానికి దిగిన అనంతరం ఏకంగా 35 నుంచి 40 శాతానికి పెరిగింది. అయితే ఇప్పటికీ రష్యా నుంచి అతి పెద్ద చమురు దిగుమతిదారుగా చైనాయే నిలుస్తోంది. ఆ దేశంపై మాత్రం ట్రంప్ ఎలాంటి జరిమానాలు విధించలేదు. ట్రంప్ సుంకాల నిర్ణయంపై భారత పరిశ్రమల రంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ట్రంప్ ప్రకటించిన 25 శాతం సుంకాలు ఇప్పటికే అన్ని దేశాలతో పాటు భారత్‌పైనా అమల్లో ఉన్న 10 శాతం బేస్‌లైన్ టారిఫ్‌లకు అదనమా, కాదా అన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. అన్ని దేశాలపై 10 శాతం టారిఫ్ ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వచ్చింది. ట్రంప్ ప్రకటన వెలువడ్డ కాసేపటికే కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భేటీ జరిపి పరిస్థితిని సమీక్షించారు.

ఏప్రిల్లో 26 శాతం సుంకాలు

భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని మంగళవారమే ట్రంప్ మీడియాకు చెప్పడం తెలిసిందే. 25 శాతం టారిఫ్ విధించనున్నట్టు అప్పుడే ఆయన సంకేతాలిచ్చారు. 20 నుంచి 25 శాతం దాకా టారిఫ్‌లు విధిస్తారా అని మీడియా ప్రశ్నించగా, అలాగే భావిస్తున్నట్టు బదులిచ్చారు. గత ఏప్రిల్ 2న భారత్‌పై 26 శాతం టారిఫ్‌లను ట్రంప్ ప్రకటించారు. కొద్ది రోజులకే ఆ నిర్ణయం అమలును 90 రోజుల పాటు, అంటే జూలై 9 దాకా, అనంతరం ఆగస్టు 1 దాకా వాయిదా వేశారు. అమెరికా, భారత్ నడుమ వాణిజ్య ఒప్పందం నిమిత్తం అత్యున్నత స్థాయి బృందాల నడుమ ఇప్పటికే ఐదు రౌండ్ల పాటు చర్చలు జరిగాయి.

అతి పెద్ద వాణిజ్య భాగస్వామి

2021–25 నడుమ భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచింది. భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతం. అమెరికాతో భారత్‌కు 2022–23లో 27.7 బిలియన్లు, 2023–24లో 35.32 బిలియన్లు, 2024–25లో 41 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్య మిగులు నమోదైంది. 2024–25లో భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 186 బిలియన్ డాలర్ల మేర నమోదైంది. వీటిలో భారత్ 86.5 బిలియన్ డాలర్ల మేర వస్తువులను ఎగుమతి చేయగా, 45.3 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది. సేవల రంగంలో అమెరికాకు 28.7 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు జరిపింది. 25.5 బిలియన్ డాలర్ల మేరకు దిగుమతులు చేసుకుంది. మొత్తమ్మీద అమెరికాతో వాణిజ్యంలో భారత్ 44.4 బిలియన్ డాలర్ల మిగులు నమోదు చేసింది. ఇది ట్రంప్‌కు కంటగింపుగా మారింది. అందుకే ఇలా పదేపదే టారిఫ్‌ల కత్తి దూస్తున్నారు. 2024లో అమెరికాకు భారత ఎగుమతుల్లో డ్రగ్ ఫార్ములాలు–బయోలాజికల్స్ (8.1 బిలియన్లు), టెలికం పరికరాలు (6.5 బిలియన్లు), అరుదైన రాళ్లు (5.3 బిలియన్లు) పెట్రోలియం ఉత్పత్తులు (4.1 బిలియన్లు), వాహనాలు–ఆటో పరికరాలు (2.8 బిలియన్లు), బంగారం–ఇతర లోహాలు (3.2 బిలియన్లు) రెడీమేడ్ దుస్తులు, కాటన్ తదితరాలు (2.8 బిలియన్లు) ఇనుము, స్టీల్ ఉత్పత్తులు (2.7 బిలియన్లు) ప్రధానమైనవి. అమెరికా నుంచి దిగుమతుల్లో ప్రధానంగా చమురు (4.5 బిలియన్లు), పెట్రో ఉత్పత్తులు (3.6 బిలియన్లు), బొగ్గు, కోక్ (3.4 బిలియన్లు), ఎలక్ట్రిక్ యంత్రాలు (1.4 బిలియన్లు), విమాన, రాకెట్ల విడిభాగాలు (1.3 బిలియన్లు), బంగారం (1.3 బిలియన్లు) ఉన్నాయి.

మోదీతో ట్రంప్ స్నేహానికి ఇదీ ఫలం

విపక్షాల ధ్వజం

భారత్‌పై 25 శాతం టారిఫ్‌ల విధింపు మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యమేనంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. మోదీతో స్నేహానికి ట్రంప్ ఏ మాత్రమూ విలువ ఇవ్వడం లేదనేందుకు ఇది తాజా నిదర్శనమని ఎద్దేవా చేశాయి. మోదీపై ట్రంప్ పొగడ్తలు, హౌడీ మోడీ వంటి నినాదాలు ఎందుకూ కొరగానివని తేలిపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్–పాక్ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ 30సార్లకు పైగా చెప్పుకున్నారు. పాక్ ఆర్మీ చీఫ్‌కు ప్రత్యేక విందు ఇచ్చారు. ఐఎంఎఫ్ నుంచి భారీ ఆర్థిక సహాయ ప్యాకేజీ ఇప్పించారు. ఇన్ని చేస్తున్నా మౌనంగా భరిస్తే బహుశా ట్రంప్ నుంచి స్పెషల్ ట్రీట్‌మెంట్ లభిస్తుందని మోదీ ఆశపడ్డారు. కానీ అలా జరగలేదు'' అన్నారు. టీఎంసీ, డీఎంకే, ఆర్జేడీ, వామపక్షాలు తదితరాలు కూడా మోదీ ప్రభుత్వానిది ఘోర వైఫల్యమంటూ నిందించాయి. ఇది భారత్‌కు తీవ్ర అవమానమని అభిప్రాయపడ్డాయి.

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం తీర్పు




సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు గురువారం తుది తీర్పు వెలువరించనుంది. ఈ ఫిరాయింపుల కేసుపై చివరిసారిగా ఏప్రిల్ 3న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మసీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పుడు జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఈకేసుపై సీజే ధర్మాసనం కీలక తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీం కోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టి.ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం.సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ రిట్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్‌ను ప్రతివాదిగా చేర్చారు. ఆ పిటిషన్లంటినీ కలిపి విచారించిన ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పును ఎనిమిది వారాలకు రిజర్వ్ చేసింది. ధర్మాసనంలో సీజేపాటు జస్టిస్ వినోద్ చంద్రన్ ఉన్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ

'కోయగూడెం, సత్తుపల్లి' బ్లాకులను సింగరేణికి కేటాయించే ప్రతిపాదన లేదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు కోయగూడెం బ్లాక్–3, సత్తుపల్లి బ్లాక్–3లను సింగరేణి సంస్థకు కేటాయించే ప్రతిపాదనేదీ కేంద్రం పరిశీలనలో లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంతకుముందు వేలం వేసిన కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించినప్పటికీ... అక్కడ ఇప్పటికీ కార్యకలాపాలు ప్రారంభం కాలేదని చెప్పారు. అయితే, ఈ బ్లాకులను తిరిగి సింగరేణికి కేటాయించాలన్న ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం బొగ్గు శాఖ పరిశీలనలో లేదన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కోయగూడెం బ్లాక్–3, సత్తుపల్లి బ్లాక్–3, శ్రావణపల్లి బ్లాక్, పీకే ఓసీ–2 డిప్ సైడ్ బ్లాక్ తదితర కోల్ బ్లాకులను సింగరేణికి కేటాయించాలన్న తెలంగాణ సీఎం అభ్యర్థన కేంద్రానికి అందిందని చెప్పారు. ఇప్పటికే వేలంలో పాల్గొన్న ప్రైవేట్ సంస్థల కన్నా 0.5 శాతం అధిక రెవెన్యూ షేర్ ఇవ్వడానికి సింగరేణి సంస్థ సిద్ధంగా ఉందని సీఎం కేంద్రానికి తెలియజేశారన్నారు. దేశంలో ప్రస్తుతం బొగ్గు బ్లాకులను పారదర్శక, సమాన అవకాశాలతో కూడిన వేలం ప్రక్రియ ద్వారా కేటాయిస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

గ్రీన్ పథకాలకు ఖర్చు సింగరేణిదే..

కాగా, సింగరేణి సహా ఇతర బొగ్గు పీఎస్‌యూస్‌లు తమ సొంత నిధులతో పర్యావరణ పునరుద్ధరణ, పచ్చదన కార్యక్రమాలు చేపడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులేవీ కేటాయించడం లేదని తెలిపారు. లోక్‌సభలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈమేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

టీ–ఫైబర్‌కు రూ.1,779 కోట్లు రుణమివ్వాలని తెలంగాణ వినతి

లోక్‌సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: టీ–ఫైబర్ సంస్థకు రూ.1,779 కోట్ల దీర్ఘకాలిక సున్నా వడ్డీ రుణం మంజూరు చేయాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. సవరించిన భారత్‌నెట్ పథకంలో రుణాలిచ్చే అవకాశం లేదని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. లోక్‌సభలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం టీ–ఫైబర్ పేరుతో రూ.1,779 కోట్ల రుణం, భారత్‌నెట్ ఫేజ్–1 నెట్‌వర్క్‌ను రాష్ట్రానికి అప్పగించాలన్న అంశాలతోపాటు, ఉద్యామి ప్రోత్సాహక పథకం వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. అంతేగాక తాజాగా సవరించిన భారత్‌నెట్ పథకంలో రుణాలిచ్చే అవకాశమే లేదని స్పష్టం చేశారు.

339 గ్రామాలపై టైగర్ కారిడార్ ప్రభావం

లోక్‌సభలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



సాక్షి, న్యూఢిల్లీ: కొమురం భీమ్ టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ కారిడార్‌తో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 339 గ్రామాలపై ప్రభావం పడుతుందంటూ జీవో 49పై బీజేపీ ఎంపీ గోడం నగేశ్ లోక్‌సభలో అభ్యంతరం వ్యక్తంచేశారు. రూల్ 377 కింద మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవో వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన స్థానికులు వారి పారంపర్య వన జీవన విధానాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం తనంతట తానే జీవో రూపొందించి, కేంద్రంపై నెపం వేయడం తగదు. కేంద్ర ప్రభుత్వం ఏ సూచన ఇవ్వకముందే, తెలంగాణ ప్రభుత్వం 1.49 లక్షల హెక్టార్ల భూమిని ట్రైబల్ టైగర్ కారిడార్ పేరుతో కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు జీవో 49 తెచ్చింది. స్థానిక ప్రజల గళం పైకి వచ్చిన తర్వాతే దాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది' అని నగేష్ పేర్కొన్నారు. జీవో 49ను పూర్తిగా రద్దు చేసేలా కేంద్ర అటవీ శాఖ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

రజకులకు ఎస్సీ హోదా కల్పించాలి

కేంద్రాన్ని కోరిన జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్



సాక్షి, న్యూఢిల్లీ: రజక సామాజిక వర్గానికి చెందిన వారందరికీ సమానంగా ఒకే తరహా రిజర్వేషన్ హక్కులు లభించాలని కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో రజక సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కేటగిరీలో రిజర్వేషన్లు అందుతుంటే... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాల్లో మాత్రం వారిని ఓబీసీ కేటగిరీలో ఉంచారన్నారు. దీంతో ఈ రాష్ట్రాల్లోని రజక సామాజిక వర్గానికి చెందిన వారిని ఎస్సీ కేటగిరీలో చేర్చాలని కోరినా వారి డిమాండ్ కార్యరూపం దాల్చలేదన్నారు. లోక్‌సభలో రూల్ 377 కింద సురేశ్ షెట్కార్ ఈ డిమాండ్ చేశారు.

కశ్మీర్‌లో కేసీఆర్ ఫార్ములా అమలు చేయండి

రాజ్యసభలో బీఆర్ఎస్ పక్షనేత కేఆర్ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తీవ్రవాద సమస్యను ఎదుర్కొంటున్న జమ్మూ కశ్మీర్‌లో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫార్ములాను అమలు చేయాలని రాజ్యసభలో బీఆర్ఎస్ పక్షనేత కేఆర్ సురేశ్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఒకప్పుడు తెలంగాణలో తీవ్రవాద ప్రభావం చాలా ఉండేదని కేసీఆర్ సంక్షేమ పథకాలతో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. కేసీఆర్ పేరు ఇష్టంలేదని కేంద్రం భావిస్తే తెలంగాణ ఫార్ములా పేరుతో అమలు చేయాలని కోరారు. బుధవారం రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణలోనూ ఒకప్పుడు కశ్మీర్‌లాంటి పరిస్థితులే ఉండేవి. నాలుగుసార్లు ఎమ్మెల్యేగాఉన్న నేను తీవ్రవాద ప్రభా వం కారణంగా కొన్ని గ్రామాల్లోకి వెళ్లలేకపోయాను. కానీ.. కేసీఆర్ తెచ్చిన సంస్కరణలతో రాష్ట్రంలో పరిస్థితులు మారిపోయాయి' అని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కొన్ని లోపాలు కనిపించాయి. వాటిని మిషన్‌మోడ్‌లో సరిదిద్దాలని కోరుతున్నాను. ప్రతీ యుద్ధం ఆ దేశానికి ఆర్థిక భారమే' అని అన్నారు.

మీ తియ్యని ప్రేమ.. తగ్గించండి!

పిల్లలు అడిగినా, అడక్కపోయినా స్వీట్స్, చాకొలేట్స్ వారి చేతుల్లో పెడతాం. హోమ్‌వర్క్ త్వరగా చేస్తేనో, అల్లరి చేయకుండా ఉంటేనో, ఫలానా పని చేస్తేనే.. ఐస్‌క్రీమ్, కేక్ అంటూ ఆఫర్లు ఇస్తుంటాం. అంతేకాదు ఇంటికి వచ్చే బంధువులు, స్నేహితులు స్వీట్స్, చాకొలేట్స్ తీసుకొచ్చి వద్దు అంటున్నా నోట్లో పెట్టి మరీ వారి ప్రేమను చూపిస్తుంటారు. ఇంతటి 'తీపి' ప్రేమ పిల్లల పాలిట శత్రువు అవుతోందనే విషయం చాలా మంది తల్లిదండ్రులకు తెలియదు. పిల్లల్లో చక్కెర వినియోగం పరిమితం చేయకపోతే ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చక్కెర తింటే శక్తి వస్తుందన్నది పాత మాట. ఇప్పుడు అదే అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. పిల్లల్లో చక్కెర తీసుకోవడం పరిమితం చేయడం వల్ల వారికి మధుమేహం వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని నేచర్ జర్నల్‌లో 2024లో ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది. చిన్నతనంలో చక్కెరను అధికంగా తీసుకోవడం వల్ల పిల్లలలో ఊబకాయం, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చక్కెర పానీయాలను అధికంగా సేవించడం వల్ల కడుపు ఉబ్బరం, కొన్ని సందర్భాల్లో పొట్టలో అసౌకర్యం కూడా సంభవిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆహార పదార్థాల్లో సహజంగా లభించే చక్కెర కాకుండా అదనంగా పరిమితికి మించి చేర్చడం శ్రేయస్కరం కాదన్నది వారి మాట.

- సాక్షి, స్పెషల్ డెస్క్



బర్త్‌డే నాడు కేక్ చాలు

చాలామంది పిల్లలు రోజూ 20-25 టీస్పూన్ల చక్కెర తీసుకుంటున్నారని, ఇది వాళ్ల ఆరోగ్యానికి మంచిది కాదని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిషన్స్ (ఐఏపీ) కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇంట్లో వేడుకలు, విహారయాత్రల సమయంలో పిల్లలకు చక్కెర ఆధారిత ఆహారం ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండటం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. 'పిల్లలకు నెలకు రెండు చిన్న స్కూప్‌లకు మించి ఐస్‌క్రీం ఇవ్వకూడదు. పుట్టినరోజు పార్టీల సందర్భంలో కూల్‌డ్రింకులు, చాక్లెట్లు, బిస్కెట్లు, కేకుల వంటివి అదుపు లేకుండా తింటుంటారు. ఇది మంచిది కాదు. కేక్ తింటారు కాబట్టి ఆ రోజంతా అదనపు చక్కెర ఉన్న ఆహారాన్ని పిల్లలకు ఇవ్వకూడదు ' అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

ఏ వయసు వారికి ఎంత?

రోజుకు అదనపు చక్కెర ఎంత తీసుకోవచ్చు?

రెండేళ్లలోపు పిల్లలు	అదనపు చక్కెర ఇవ్వకూడదు
2-18 ఏళ్లు	2-4 టీ స్పూన్ల వరకు
18 ఏళ్లకుపైబడి	గరిష్టంగా 5 టీస్పూన్లు

ఎన్ని టీస్పూన్లో తెలుసా?

ఒక్కో దానిలో సుమారుగా ఎన్ని టీస్పూన్లు ఉండొచ్చంటే...

కోలా (330 ఎంఎల్)	7-9
చాకొలేట్ బ్రౌనీ (60 గ్రా.)	5-7
ఆరెంజ్ జ్యూస్ (250 ఎంఎల్)	5-6
ఫ్లేవర్డ్ యోగర్ట్ (150 గ్రా.)	4-6

ఇంకాస్త తగ్గించండి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సవరించిన మార్గదర్శకాల ప్రకారం రోజుకు శరీరానికి కావాల్సిన కేలరీల్లో చక్కెర నుంచి వచ్చేవి 5 శాతానికి మించరాదు. అంటే ప్రామాణిక 2,000 కిలో కేలరీల ఆహారంలో రోజుకు గరిష్ఠంగా అదనపు చక్కెర ఐదు టీస్పూన్లకు పరిమితం కావాలి. ఇది పిల్లలు, పెద్దలు ఇద్దరికీ వర్తిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

- ఊబకాయం, మధుమేహం, దంత క్షయం ప్రమాదాన్ని తగ్గించడానికి పిల్లలు చక్కెర వినియోగాన్ని మరింత పరిమితం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.
- రెండేళ్లకు పైబడిన పిల్లలకు అదనపు చక్కెర 2-4 టీస్పూన్లకు మించరాదని డబ్ల్యూహెచ్‌ఓ చెబుతోంది.
- రెండేళ్లలోపు పిల్లలకు అదనపు చక్కెర ఇవ్వకూడదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ స్పష్టం చేశాయి.

పిల్లలకు ఎక్కువ చక్కెర పెడుతున్న తల్లిదండ్రులు

ఫలితంగా బాల్యం నుంచే అనారోగ్య సమస్యలు

రోజుకు గరిష్ఠంగా 5 టీస్పూన్లకు మించరాదు

జాబితా పెద్దదే

పండ్లు, పాల వంటి పదార్థాలలో చక్కెర సహజంగా ఉంటుంది. పాలలో లాక్టోజ్, పండ్లలో ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో వస్తాయి. కానీ ప్రాసెస్డ్ ఫుడ్స్ లేదా వంట సమయంలో అదనంగా చేర్చిన చక్కెర.. కేలరీలను అందించినప్పటికీ విటమిన్లు, ఖనిజాలు లేదా ఫైబర్ వంటి పోషకాలు చాలా తక్కువగా ఉంటాయి. ప్యాక్ చేసిన జ్యూస్‌లు, ఇన్‌స్టంట్ నూడుల్స్, బ్రెడ్, బిస్కెట్లు, సాస్‌లు వంటి చాలా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల్లో, శిశువులకు ఇచ్చే తృణ ధాన్య ఉత్పత్తులు, యోగర్ట్, పోషక/శక్తి పానీయాలు వంటి వాటిలో కూడా అదనంగా చేర్చిన చక్కెర ఉంటోంది.

బడుల్లో షుగర్ బోర్డులు..

ఇటీవలి కాలంలో పిల్లల్లో మధుమేహం కేసులు పెరిగాయి. మరీ ముఖ్యంగా టైప్ 2 మధుమేహం.. ఇటీవల పిల్లల్లోనూ కనిపిస్తుండటంతో సీబీఎస్‌ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాల్లో 'షుగర్ బోర్డులు' ఏర్పాటు చేస్తోంది. అతిగా చక్కెర తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై.. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తోంది. తద్వారా విద్యార్థుల చక్కెర వాడకాన్ని తగ్గించేందుకు వీలవుతుందని సీబీఎస్‌ఈ భావిస్తోంది.

ఆందోళన వ్యక్తం చేసిన సీబీఎస్‌ఈ..

విద్యార్థులు తీసుకోవాల్సిన దానికంటే దాదాపు మూడురెట్లు ఎక్కువగా చక్కెర తీసుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి అని సీబీఎస్‌ఈ ఆందోళన వ్యక్తం చేసింది. '4 నుంచి 10 ఏళ్ల వయసున్న పిల్లలు రోజూ చక్కెర నుంచి సగటున 13 శాతం కేలరీలు పొందుతున్నారు. 11 నుంచి 15 ఏళ్ల వయసు విద్యార్థుల్లో ఇది మరీ ఎక్కువగా 15 శాతం వరకు ఉంది. ఆరోగ్య ప్రమాణాల ప్రకారం ఇది 5 శాతానికి మించి ఉండకూడదు' అని సీబీఎస్‌ఈ తెలిపింది.

క్లుప్తంగా...

బీసీలను మోసగించేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంలో కాంగ్రెస్, బీజేపీ కుట్రలకు పాల్పడుతున్నాయని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. ఓ వైపు బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపిన రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపడం ద్వారా బీసీలను మోసగిస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ఒకే అంశంపై బీసీ బిల్లు పెండింగులో ఉండగా, ఆర్డినెన్స్‌కు ఆమోదం సాధ్యం కాదనే విషయం అందరికీ తెలుసన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, రిజర్వేషన్ల పెంపును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నదే బీఆర్‌ఎస్ డిమాండ్‌గా వినోద్‌కుమార్ పేర్కొన్నారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం కేంద్రానికి పంపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించిన కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపునకు చట్టబద్ధత కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీ బిల్లుల సాధన కోసం ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకు 72 గంటల పాటు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను కవిత బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు తన నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు. కాగా దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సెంట్రల్ జోన్ డీసీపీకి తెలంగాణ జాగృతి నాయకులు దరఖాస్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు తన పోరాటం కొనసాగుతుందని ఆమె చెప్పారు.

'రేవంత్ పాలనలో శాంతిభద్రతలు కరువు'



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, గూండా రాజ్యం నడుస్తోందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బజారు రౌడీలా వ్యవహరిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పార్టీ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు బుధవారం సైబరాబాద్ పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మైనంపల్లి హనుమంతరావుతో పాటు ఆయన కుమారుడు రోహిత్ గూండా రాజ్యాన్ని ప్రోత్సహిస్తున్నారని, వారిపై రౌడీ షీట్ తెరవాలని డిమాండ్ చేశారు.

పోరుబాటలో పార్టీ సైతం

- బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చలో ఢిల్లీ
- ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొననున్న టీపీసీసీ చీఫ్, ఇతర నేతలు
- ధర్నా కోసం ప్రత్యేక రైలు.. ప్రతి జిల్లా నుంచి 50 మంది తరలింపు
- సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ భేటీ



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కార్యాచరణలో పాలుపంచుకోవాలని నిర్ణయించింది. మూడురోజుల పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే మకాం వేయనున్నారు. ఆగస్టు ఆరో తేదీన జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పార్టీ శ్రేణులు పాల్గొనేలా.. ప్రత్యేక రైలులో ప్రతి జిల్లా నుంచి కనీసం 50 మందిని పంపనుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రత్యేక రైలు ఈనెల ఆరో తేదీ ఉదయం కల్లా ఢిల్లీ చేరుకునేలా సమన్వయం చేయనుంది. ఢిల్లీలో పోరాటం నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టనున్న జనహిత పాదయాత్ర షెడ్యూల్‌ను కుదించారు. వాస్తవానికి ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు ఆరు ఉమ్మడి జిల్లాల్లోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో జరగాల్సిన ఈ పాదయాత్రను వచ్చే నెల నాలుగో తేదీకి కుదించారు. నాలుగో తేదీ సాయంత్రం పాదయాత్ర ముగిసిన వెంటనే ముఖ్య నేతలు ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులతో పాటు ముఖ్య నాయకత్వమంతా ఢిల్లీలోనే ఉండి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగస్వాములు కావాలని పీసీసీ పిలుపునిచ్చింది.

త్వరలో కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యుల ప్రకటన

పార్టీ సంస్థాగత నిర్మాణం, పాదయాత్ర, ఢిల్లీ టూర్, నామినేటెడ్ పదవులపై చర్చించేందుకు కాంగ్రెస్ కీలక నేతలు బుధవారం సమావేశమయ్యారు. సీఎం నివాసంలో గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ పాల్గొన్నారు. వీలైనంత త్వరగా పార్టీ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. నామినేటెడ్ పదవుల కోసం జిల్లా ఇన్‌చార్జుల నుంచి వచ్చిన జాబితాలను మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు ముఖ్యమంత్రికి అందజేశారు. ఆయన వీటిని పరిశీలించి తుది జాబితాను ఖరారు చేస్తారని, వారం, పది రోజుల్లో కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యులను అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఇక ఢిల్లీ వేదికగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న బీసీ రిజర్వేషన్ల పోరాట ప్రణాళికను కూడా ఈ సమావేశంలో ఖరారు చేశారు. ఈ నెల ఐదో తేదీన పార్లమెంటు ఉభయసభల్లో ఈ అంశం చర్చకు వచ్చేలా వాయిదా తీర్మానం కోసం పార్టీ తరఫున పట్టు పట్టాలని, ఆరో తేదీన జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని, ఏడో తేదీన రాష్ట్రపతిని కలవాలని నిర్ణయించారు.

నేడు 'కాళేశ్వరం' కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. నివేదిక తీసుకునేందుకు గురువారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయానికి రావాలని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను కమిషన్ కోరింది. జస్టిస్ చంద్రఘోష్ ఆయనకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 14న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. 115 మంది సాక్షులను విచారించిన కమిషన్ తుది నివేదికను సిద్ధం చేసింది.

AVANTHI GROUP OF COLLEGES
Affiliated to JNTUH and Approved by AICTE/PCI & Govt. of TG
APPLICATIONS ARE INVITED FOR B-CATEGORY - ADMISSIONS 2025-26

COLLEGE	Course	Intake	B-Category
AVANTHI INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY, Gunthapally Vill, Hayathnagar Mandal, Near Ramoji Film City, Hyderabad. (CODE : AVIH) (AUTONOMOUS)	CSE	360	108
	ECE	120	36
	CSD	60	18
	CSC	54	16
	CSM	120	36
	EEE	60	18
	MECH	60	18
AVANTHI'S SCIENTIFIC TECHNOLOGICAL & RESEARCH ACADEMY, Gunthapally Vill, Hayathnagar Mandal, Near Ramoji Film City, Hyderabad. (CODE : ASRA)	CSE	60	18
	CSM	60	18
	ECE	60	18
	EEE	30	09
	CIVIL	60	18
	MECH	30	09
	CSD	60	18
AVANTHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES, Gunthapally, Hayathnagar Mandal, Near Ramoji Film City, Hyderabad. (CODE : AVHP)	B PHARMACY	100	30
	PHARMA-D	30	09

The Last Date of Submission of Filled in Applications 10-08-2025 FOR B-CATEGORY
Applications can be had from Avanthi Central Office, Bus Depot Road, Barkatpura, Hyderabad and Avanthi Engineering Colleges Gunthapally, Abdullapurmet, R.R. Dist.
Sd/- PRINCIPAL
Ph: 8328053969, 9963777079, 8686646631, 8704795516

అజ్జూ భాయ్‌కే జూబ్లీహిల్స్?

- మైనారిటీ వర్గం వైపే కాంగ్రెస్ మొగ్గు!
- గత ఎన్నికల్లో పోటీ చేయడాన్నీ పరిగణనలోకి తీసుకుంటున్న అధిష్టానం
- ఉప ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలకు పార్టీ పదును



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీచేసే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరన్న దానిపై సస్పెన్స్ క్రమంగా వీడుతోంది. ఈ సీటు కోసం మైనార్టీ, కమ్మ, బీసీ సామాజిక వర్గాల నేతలు పోటీ పడుతున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ వైపే ఈసారి కూడా పార్టీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. కమ్మ సామాజిక వర్గం నుంచి అభ్యర్థిని ఎంపిక చేసే అంశం కూడా పరిశీలనలో ఉందని, టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌ను బరిలో దించే అవకాశం ఉందని అంటున్నారు. ఇంకోవైపు బీసీ కోటాలో నవీన్ యాదవ్ పేరు కూడా విన్పిస్తున్నా.. మైనార్టీ వర్గం వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపుతుందనే అభిప్రాయం పార్టీవర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రతి మంత్రి పరిధిలో కొందరు చైర్మన్లు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఈ ఏడాది అక్టోబర్‌లో ఉప ఎన్నిక జరగవచ్చనే అంచనాలో ఉన్న అధికార కాంగ్రెస్ ఇప్పటినుంచే గెలుపు వ్యూహాలకు పదును పెడుతోంది. ఇప్పటికే సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్‌లకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. తాజాగా 25 మంది కార్పొరేషన్ చైర్మన్లను కూడా రంగంలోకి దింపింది. ప్రతి మంత్రి పరిధిలో కొందరు చైర్మన్లు బూత్‌స్థాయిలో పనిచేసేలా కార్యాచరణ రూపొందించింది. కార్పొరేషన్ చైర్మన్లు కేస వేణు, పటేల్ రమేశ్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, ముప్పా విజయ్‌బాబు, మానాల మోహన్‌రెడ్డి, బండ్రు శోభారాణి, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, గుత్తా అమిత్‌రెడ్డి, ఇనగాల వెంకట్రామిరెడ్డి, శివసేనారెడ్డి, బెల్లయ్య నాయక్, తాహెర్ బిన్ అహ్మద్, లక్ష్మణ్ యాదవ్, రాయల నాగేశ్వరరావు, ఒబేదుల్లా కొత్వాల్, ఈరవత్రి అనిల్, జంగా రాఘవరెడ్డి, రియాజ్, ఎన్.ప్రీతంలను ముగ్గురు మంత్రుల పరిధిలో పనిచేయాల్సిందిగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆదేశించారు. సోషల్ మీడియాకు మన్నె సతీశ్, సాంస్కృతిక బృందాలకు పుంజాల అలేఖ్య, వెన్నెల, వికలాంగ ఓటర్ల ప్రచారానికి ముత్తినేని వీరయ్య వర్మలు సారథ్యం వహించేలా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కార్పొరేషన్ చైర్మన్లతో.. మంత్రి పొన్నంతో కలిసి మరో మంత్రి తుమ్మల నాగేశ్వరావు తన నివాసంలో భేటీ అయ్యారు. పోలింగ్ బూత్ స్థాయిలో అమలు చేయాల్సిన కార్యాచరణపై వారితో చర్చించారు.

బీసీ రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



భద్రాచలం/పాల్వంచ రూరల్/ఇల్లెందు: రాష్ట్రంలో అమలు చేస్తున్న బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, కులమతాల ఆధారంగా రిజర్వేషన్లు చేయొద్దనేదే తమ వాదన అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పాల్వంచ, ఇల్లెందుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, మళ్లీ ఇప్పుడు బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు కేటాయించాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో ఐదు గ్రామ పంచాయతీలు విలీనం కావడంలో బీఆర్‌ఎస్‌దే కీలకపాత్ర అని, ఆ పాపం కేసీఆర్‌దేనని ఆరోపించారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో అన్యమత సంస్థకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని, ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాంచందర్‌రావు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం తమదేనని ధీమా వ్యక్తంచేశారు. ఆయన వెంట మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉచితాల కోసం కొత్త డిస్కమ్

▶ మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీలు హరీశ్, కృష్ణభాస్కర్.. డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, రెడ్‌కో ఎండీ అనిల తదితరులతో సీఎం సమీక్ష జరిపారు.

అధిక వడ్డీ రుణాలతో డిస్కమ్‌లు డీలా..

విద్యుత్ రంగంలో సంస్కరణలు తప్పనిసరి అని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లకు అదనంగా మరో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాలన్నీ తీసుకురావడం వల్ల ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. డిస్కమ్‌ల పునర్వ్యవస్థీకరణతో వాటిపై ఉన్న రుణ భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. పది శాతం వడ్డీతో తీసుకున్న రుణాలతో డిస్కమ్‌లు డీలా పడ్డాయని అన్నారు.

స్కూళ్లు, సర్కారు కార్యాలయాలకు సౌర విద్యుత్


రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలన్నారు. రాష్ట్ర సచివాలయానికి కూడా సౌర విద్యుత్ అందించాలని, వెంటనే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎండాకాలంలో సచివాలయంలో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారిన నేపథ్యంలో సోలార్ రూఫ్ టాప్ షెడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు లబ్ధి చేకూర్చాలి

ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకం రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ఏరియాల్లో యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడేళ్లలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు ఈ పథకం వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను అందించాలని చెప్పారు.

చంద్రబాబు రుణం తీర్చుకుంటున్నారు

సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్



మోత్కూరు: సీఎం రేవంత్‌రెడ్డి సమైక్యాంధ్ర కీలు బొమ్మ అని, చంద్రబాబునాయుడు రుణం తీర్చుకుంటున్న తెలంగాణ ద్రోహి అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణాళికలు లేకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుటాహుటిన హెలికాప్టర్‌లో వెళ్లి నాగార్జునసాగర్ నీటిని విడుదల చేశారని, నీరంతా సముద్రంలోకి వెళ్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేస్తే తెలంగాణలో 50 లక్షల ఎకరాలకు సాగు నీరందించవచ్చని తెలిపారు. తామెప్పుడూ ఆంధ్రాకు సాగర్ జలాలు ఇవ్వలేదని, దమ్ముంటే కన్నెపల్లి పంప్‌హౌస్‌ను మంత్రి ఉత్తమ్ ప్రారంభించాలని సవాలు విసిరారు. చంద్రబాబునాయుడు వద్ద సలహాదారుడిగా పని చేసిన ఆదిత్యనాథ్ దాస్‌నే రేవంత్‌రెడ్డి నీటిపారుదల సలహాదారుడిగా నియమించుకున్నాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ నాటకాలు ఆడుతున్నారని, ఇదే నిజమైతే సిట్ విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది పరోక్షంగా నరేంద్రమోదీ అని, రాహుల్‌గాంధీకి ఏమీ తెలియదన్నారు.

కొత్తగా 16 లక్షల మందికి 'రేషన్'

- పేదల దీవెనతోనే ఇందిరమ్మ ప్రభుత్వం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



లబ్ధిదారుకు రేషన్‌కార్డు అందిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

నేలకొండపల్లి: పేదల దీవెనలతోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఆయన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ం గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, బీఆర్‌ఎస్ సర్కారు తప్పిదాలతో కోట్లాది మంది పేదలు ఇబ్బంది పడ్డారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక కొత్తగా 16 లక్షల మంది పేర్లను పాత రేషన్ కార్డుల్లో చేర్చామని, 5.06 లక్షల కొత్త కార్డులు ఇచ్చామని, తద్వారా వారందరికీ సన్నబియ్యం అందుతున్నాయని తెలిపారు. ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి, మూడు నెలలకు ఒకేసారి ఇచ్చామని చెప్పారు. తమ ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందని అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి లక్ష మంది మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పేవారని, తమ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదల ముఖాల్లో సంతోషం కనిపిస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని అర్హులందరికీ మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ప్రస్తుత లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం నిధులు జమ అవుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులకు కేంద్రం భారీ కోత: సీతక్క



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల్లో భారీగా కోత విధించడం వల్ల రాష్ట్రాలు నష్టపోతున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాల భారం పూర్తిగా రాష్ట్రాలపై కేంద్రం మోపుతోందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించి గత ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్ 4779 రద్దు చేసి, గతంలో తొలగించిన వారిని తిరిగి నియమించేలా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల వేతన అసమానతలను వెంటనే తొలగించాలని, 7,111 మందికి సమాన వేతనం అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సచివాలయంలో తొలిసారిగా ఫీల్డ్ అసిస్టెంట్లతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అభ్యర్థన మేరకు వారి బదిలీలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు కూడా మంజూరు చేస్తామని ప్రకటించారు.

గురుకుల వ్యవస్థను గాడిన పెట్టండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి గురుకుల వ్యవస్థను గాడిన పెట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ అలంపూర్ గురుకుల విద్యార్థులు చేస్తున్న పాదయాత్రపై బుధవారం ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసం పాదయాత్ర చేయడం కాదు.. గురుకుల పిల్లల పాదయాత్రపై దృష్టి సారించాలని కోరారు. తరగతి గదుల్లో ఉండాల్సిన భావి భారత విద్యార్థులను పట్టెడన్నం, తాగునీళ్ల కోసం నడిరోడ్డు ఎక్కించిన దుర్మార్గ చరిత్ర ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక అడిగినా ప్రభుత్వంలో చలనం కలగదా అని ప్రశ్నించారు. ప్రశ్నించిన, ప్రతిపక్షాలపై జులుం ప్రదర్శించే రేవంత్‌రెడ్డి...పాదయాత్ర చేస్తున్న గురుకుల విద్యార్థులకు ఏమని సమాధానం చెబుతారని హరీశ్ ప్రశ్నించారు.

కార్మికుల భద్రతపై రాజీ పడేది లేదు: వివేక్



సాక్షి, హైదరాబాద్: పరిశ్రమలు భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోవలసి వస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం నగరంలోని హోటల్ ప్లాజా గ్రీన్‌ల్యాండ్‌లో 'రసాయన, ఔషధ పరిశ్రమలలో భద్రత' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కార్మికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఎల్ఈటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా తయారు చేసిన చెక్‌లిస్ట్ ఆధారంగా భద్రతా ప్రమాణాల స్థితిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. వర్క్‌షాప్‌లో 120 రసాయన పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



తప్పనిసరైనప్పుడు నిశ్శబ్దంగా ఉండగల సామర్థ్యం ఉన్న వ్యక్తి మాత్రమే తప్పనిసరైనప్పుడు మాట్లాడగలిగిన సామర్థ్యాన్ని కలిగి ఉంటాడు.

– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 31 జూలై 2025

సకాలంలో ఐసీజే హితవు

విజయం గ్యారెంటీగా దక్కుతుందంటేనే పోరాడాలన్న దృక్పథం ఉంటే ఈ ప్రపంచం ఇంతగా మారేది కాదు. ప్రగతి బాటన పయనించేది కాదు. యుద్ధాల్లో గెలిచేవీ ఉంటాయి, ఓటమికి తలవంచేవీ ఉంటాయి... పోరు మాత్రం ఆగొద్దని పసిఫిక్ మహాసముద్ర మారుమూల ప్రాంతంలో 300 ద్వీప సమూహాలతో కూడిన ఒక చిన్న దేశం ఫిజీలో సంకల్పం చెప్పుకున్న 27 మంది విశ్వవిద్యాలయ విద్యార్థులు రాజేసిన ఉద్యమం అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) ఎన్నదగ్గ తీర్పు నివ్వటానికి దోహదపడింది. వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ఫలితాల నివారణ బాధ్యత అన్ని దేశాలకూ ఉంటుందనీ, ఈ ధరిత్రిని పరిరక్షించటం సకల దేశాల చట్టబద్ధ కర్తవ్యమనీ ఐసీజే వెలువరించిన ఈ తీర్పు అందరినీ ఆలోచింపజేస్తోంది. తమ తమ దేశాల న్యాయస్థానాలనే బేఖాతరు చేస్తున్న ఏలికలు తామర తంపరగా పెరిగిన వర్తమానంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఏ దేశమైనా పట్టించుకుంటుందని, అమలు చేస్తుందని భావించటం దురాశే కావొచ్చు. ఆ తీర్పు కేవలం సలహా పూర్వకమైనదే. కానీ బాధ్యతా రహితంగా వాతావరణానికి చేటు తెచ్చే నిర్ణయాలు తీసుకుంటూ భూగోళపు మనుగడకే ముప్పు తెస్తున్న దేశాలపై నైతిక ఒత్తిడికి అది దోహద పడుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ప్రమాదపుటంచుల్లో జీవనం సాగిస్తున్న ద్వీపకల్ప దేశాల గోడు ప్రపంచమంతా వినటానికీ, పర్యావరణ ఉద్యమకారుల ఆందోళనల వెనకున్న వాస్తవ స్థితిగతుల్ని ప్రజానీకం అర్థం చేసుకోవటానికీ అది తోడ్పడుతుంది. ఈ కృషిలో పాలుపంచుకున్న వన్నీ ద్వీపకల్ప దేశాలు. భూతాపోన్నతి హెచ్చితే సముద్ర మట్టాలు పెరిగి ముందుగా మునిగే పసిఫిక్ మహాసముద్ర ప్రాంతానివి.

భూగోళాన్ని 2050 కల్లా ఉద్గారాల రహితంగా మార్చాలన్న సంకల్పంతో 2015లో కుదిరిన ప్యారిస్ ఒడంబడికను అమెరికా బేఖాతరు చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన తొలి ఏలుబడిలో ఒకసారి దీన్నుంచి బయటకొస్తున్నట్టు ప్రకటించగా, అటుతర్వాత వచ్చిన జో బైడెన్ ప్రభుత్వం మళ్లీ చేరింది. రెండోసారి వచ్చాక ట్రంప్ మళ్లీ ఒడంబడిక నుంచి నిష్క్రమించారు. బయటకు పోలేదన్న మాటేగానీ... ఒడంబడికపై సంతకాలు చేసిన ఇతర సంపన్న దేశాలు సైతం దాన్ని నీరుగార్చే విధంగానే ప్రవర్తిస్తున్నాయి. ఒడంబడిక నిర్దేశించిన లక్ష్యాలు ఉన్నతమైనవి. వాటిని చిత్తశుద్ధితో అమలుచేస్తే భూగోళం సురక్షితంగా ఉంటుంది. భూతాపంలో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కే పరిమితం చేయాలని, 2050–100 మధ్య అన్ని దేశాలూ శిలాజ ఇంధనాల ప్రమేయం లేని ఆర్థిక వ్యవస్థల రూపకల్పనకు దోహదపడాలని ఒడంబడిక నిర్దేశిస్తోంది. ఉద్గారాల తగ్గింపు అంశంలో ఏ దేశం కార్యాచరణ ఏ విధంగా ఉన్నదో ప్రతి అయిదేళ్లకూ సమీక్షించాలని సూచించింది. ఆర్థిక స్తోమత అంతగా లేని దేశాలకు సంపన్న రాజ్యాలు చేయూతనివ్వాలని, హరిత ఇంధన సాంకేతికతలను చవగ్గా అందించాలని కూడా కోరింది. ఏం చేయాలో చెప్పిన ప్యారిస్ శిఖరాగ్ర సదస్సు ఎలా చేయాలో చెప్పలేదు. నిర్దిష్టమైన చర్యలకు కట్టుబడి ఉంటామని సంతకాలు చేసిన దేశాలు విఫలమైన పక్షంలో తీసుకోదగిన చర్యలేమిటో ప్రకటించలేదు. అందుకే ఆ ఒడంబడిక అమలు నత్తనడక నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐసీజే తీర్పు ప్రపంచ పౌరులందరిలో ఆలోచన రేకెత్తించి, తమ తమ దేశాల ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావటానికి తోడ్పడుతుంది.

ఎవరికీ పట్టని, ఎవరూ పరిగణనలోకి తీసుకోని ఈ సమస్య తీవ్రతను చాటడానికి తొలుత ఫిజీలోని దక్షిణ పసిఫిక్ విశ్వవిద్యాలయ విద్యార్థులు నడుం బిగించారు. ఒక తరగతి గదిలో చర్చగా మొదలైన ఈ అంశం వాతావరణ మార్పులపై పోరాడే పసిఫిక్ ఐలాండ్ స్టూడెంట్స్ ఫైటింగ్ క్లైమేట్ ఛేంజ్ (పీఐఎస్ఎఫ్‌సీసీ) అనే సంస్థ ఆవిర్భావానికి 2019లో అంకురార్పణ చేసింది. ఈ సంస్థ పసిఫిక్ ద్వీపకల్ప దేశాలను ఒప్పించటంతోపాటు అలాంటి ప్రమాదం పొంచివుండే మరికొన్ని దేశాలు కూడా కలిసివచ్చేలా చేసింది. ద్వీపకల్ప దేశం వనౌతు ఇందుకు చొరవచూపింది. చూస్తుండగానే యూరప్, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు సైతం ఇందులో భాగస్వామ్యం తీసుకున్నాయి. వివిధ దేశాలతో మూడు రౌండ్ల చర్చల తర్వాత ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టే తీర్మానంపై 105 దేశాలు సంతకం చేశాయి. ఐసీజే అభిప్రాయాన్ని కోరుతూ 2023 మార్చిలో ప్రవేశ పెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందటం, అది ఐసీజేకు చేరటం జరిగిపోయింది.

నిజానికి ఒడంబడిక కుదిరేనాటికి వాతావరణ మార్పుల వల్ల పొంచివున్న ముప్పు గురించిన ప్రత్యక్షానుభవం ఈ స్థాయిలో లేదు. ఈ పదేళ్లలో ధనిక, బీద దేశాల తారతమ్యం లేకుండా అన్నిచోట్లా ప్రకృతి విపత్తులు విరుచుకుపడ్డాయి. లక్షలమంది ప్రాణాలు తీస్తున్నాయి. రుతువులు పూర్తిగా గతి తప్పాయి. ఏదోమూల అతివృష్టి, అనావృష్టి రివాజుగా మారాయి. తీవ్ర వాతావరణ మార్పుల వల్ల అంటురోగాల వ్యాప్తితోపాటు మానసిక వ్యాధులు సైతం పుట్టుకొస్తున్నాయని శాస్త్రవేత్తలు ఇటీవలే నిర్ధారించారు. కానీ సంపన్న దేశాల నిర్లక్ష్యం ఎలావుందో చెప్పుకోవటానికి నిరుడు అజర్‌బైజాన్ రాజధాని బాకూ నగరంలో జరిగిన 'కాప్–29' సదస్సే నిదర్శనం. ప్యారిస్ ఒడంబడికతో పడే ఆర్థిక భారాన్ని ఎలా సర్దుబాటు చేయాలన్న అంశంపై జరిగిన ఆ సదస్సుకు దాదాపు సంపన్న దేశాలన్నీ ముఖం చాటేశాయి. ఈ నేపథ్యంలో ఐసీజే వెలువరించిన తాజా తీర్పు ఈ బాపతు దేశాల కళ్లు తెరిపించటానికీ, వాతావరణం మరింత అధ్వాన్నం కాకుండా ఉండటానికీ దోహదపడుతుందని ఆశించాలి.

సుప్రీంకోర్టు సంశయించకూడదు!

విశ్లేషణ



అంశుల్ దాల్మియా

బిహార్‌లో ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సునిశిత సవరణ (ఎస్.ఐ.ఆర్.–సర్) నిర్వహించాలన్న భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన వివిధ పిటిషన్లపై సుప్రీం కోర్టు వాదోపవాదాలను వింటోంది. ఈలోగా, ఆ తతంగానికి సంబంధించిన మొదటి దశ ఇటీవలే పూర్తయింది. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల లోగా జాబితాలను మెరుగుపరచాలని 'సర్' లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశ పూర్తయ్యేనాటికి జాబితాలో చేర్చాలని కోరుతూ 7.24 కోట్ల దరఖాస్తులు వచ్చాయని కమిషన్ వెల్లడించింది. జాబితాల సవరణ మొదలుపెట్టిన జూన్ 24 నాటికి రాష్ట్రంలో నమోదై ఉన్న ఓటర్ల సంఖ్య కన్నా అది 65 లక్షలు తక్కువ.



◆ బిహార్‌లో 'సర్' మొదటి దశ పూర్తయ్యేనాటికి ఓటర్ల జాబితాలో చేర్చాలని కోరుతూ 7.24 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. అయితే, ఇది రాష్ట్రంలో నమోదై ఉన్న ఓటర్ల సంఖ్య కన్నా 65 లక్షలు తక్కువ.

◆ లక్ష్మీ చంద్రసేన్ వర్సెస్ ఏ.కె.ఎం. హసన్ (1985) కేసులో ఓటర్ల జాబితాలను సవరించాలని ఆదేశించడానికి సుప్రీంకోర్టు వెనుకాడింది. అది ఎన్నికలపై న్యాయ వ్యవస్థ అవాంఛనీయ జోక్యానికి కారణమవుతుందనీ, ఒక్కోసారి ఎన్నికల నిరవధిక వాయిదాకు దారి తీస్తుందనీ కోర్టు కలవరపడింది.

పిటిషనర్ల ఆగ్రహానికి కారణాలు

1950 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 21వ సెక్షన్ కింద ఓటర్ల జాబితాలను సవరించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. కానీ, రెండు ముఖ్యమైన అంశాలు పిటిషనర్లకు కోపం తెప్పించాయి. ఒకటి – 2003 తర్వాత నమోదైన ఓటర్లు అందరూ తిరిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలనీ, అందుకు తగిన అర్హతను చూపాలనీ కోరడం. రెండు – వారు ఆ పని చేయడానికి ఒక నెల వ్యవధి మాత్రమే ఇవ్వడం.

తిరిగి పేరు నమోదు చేసుకునేందుకు తక్కువ వ్యవధినివ్వడం, వేగంగా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చూడటం వల్ల ఈ విధానం అపారదర్శకంగా తయారైంది. మూకుమ్మడిగా పేర్లు తొలగింపునకు గురవుతాయనే తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అయినా, ఈ కార్యక్రమాన్ని నిలిపివేసేందుకు కోర్టు తిరస్కరించింది. ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డులను కూడా 'పరిగణన'లోకి తీసుకోవలసిందని మాత్రమే కోర్టు కోరింది. ఆ విధంగా చాలా మందిని అనర్హులుగా చేయనున్నారనే విమర్శలకు తావు ఇవ్వకుండా ప్రయత్నించింది.

ఓటర్ల జాబితా ఎందుకు కీలకం?

భారతదేశంలో ప్రజాస్వామ్య హృదయాన్ని పదిలపరచేది ఓటు హక్కేనని, దాన్ని వినియోగించుకోవడంలోని ప్రాధాన్యాన్ని వివరిస్తూ గతంలో కొన్ని తీర్పులు వెలువడ్డాయి. అయితే, ఓటు హక్కు చట్టపరమైన హక్కుగానే మిగిలిపోయింది. దాని అస్తిత్వం ఒక ప్రత్యేక శాసనంతో ముడిపడి ఉంది. దానివల్ల వచ్చిన చిక్కేమిటంటే, ఆ హక్కు విషయంలో జోక్యం చేసుకోవచ్చు లేదా అది కొన్ని షరతులకు లోబడి ఉండేటట్లు చేయవచ్చు.

నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారికి మాత్రమే ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని 1951 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 62వ సెక్షన్ పేర్కొంటోంది. ఫలితంగా, అర్హులైన ఓటర్లను గుర్తించడంలో ఓటర్ల జాబితాలను రూపొందించడం లేదా సవరించడం ముఖ్యమైన ప్రక్రియగా మారింది. గడువు ముగిసిన తర్వాత ఓటర్ల జాబితాలను సవరించడానికి అనుమతించబోమని ఒకసారి బిహార్ విషయంలోనే బైద్యనాథ్ పంజియార్ వర్సెస్ సీతారామ్ మహతో (1969) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. నమోదుకు కడపటి తేదీ ముగిసిన తర్వాత, ఓటర్ల జాబితాలకు సవరణ తేవడం, చేర్చడం లేదా తొలగించడం, ఒకచోటు నుంచి ఇంకో చోటుకు మార్చడం చేయకుండా 1960 నాటి నిబంధనలు నివారిస్తున్నాయి. జాబితాల సవరణపై స్టే విధించడానికి సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించడం బట్టి, ప్రస్తుత కేసులో పిటిషనర్లకు అనుకూలంగా ఫలితం వస్తుందని ఆశించడానికి అటువంటి పూర్వ ప్రమాణాలు, నిబంధనలు స్ఫూర్తినిచ్చేవిగా లేవు.

పైగా, సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను రెండు కారణాల రీత్యా తోసిపుచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకటి– అటువంటి కేసులను సమీక్షించడానికి సుప్రీంకోర్టుకు ఉన్న పరిధులు పరిమితం. రెండు– ఎన్నికలను జాప్యం చేసేందుకే అలాంటి కేసులు పెట్టే ఎత్తుగడ అనుసరిస్తూ ఉంటారని సుప్రీంకోర్టుకు ఎప్పుడూ ఒక సందేహం ఉంటుంది.

ఫిర్యాదులు చేయడం సాధ్యమేనా?

ఫిర్యాదులు చేసేందుకు లేదా సమస్యలు పరిష్కరించాలని కోరేందుకు వీలుగా ఒక ఆంతరంగిక సమీక్షా యంత్రాంగాన్ని 1950 నాటి చట్టం సమకూరుస్తోంది. ఎన్నికల అధికారులపై ఎవరైనా అభ్యంతరాలు లేవనెత్తవచ్చు. తదుపరి ఆదేశాలు జారీ చేయవలసిందిగా కమిషన్‌ను కోరవచ్చు. కోర్టులను ఆశ్రయించడానికి ముందు ఆ మార్గాలను అనుసరించవలసిందిగా కోర్టు గతంలో పలుమార్లు స్పష్టం చేసింది. ఉత్తర ప్రదేశ్‌కు సంబంధించి ఎన్నికల జాబితాలను రూపొందించడం, మార్పు చేర్పులు చేయడంలో అవకతవకలు జరిగాయని, జోక్యం చేసుకోవలసిందని కోరుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం (1996)పై అనురాగ్ నారాయణ్ సింగ్ పెట్టిన కేసులో తలదూర్చేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. బిహార్ సవరణ ప్రక్రియలోని న్యాయ బద్ధతను విశ్లేషించేటపుడు కోర్టు ఈసారి కూడా అదే రీతిలో, ఫిర్యాదు దారులందరినీ ఆ యా చట్టపరమైన ప్రక్రియల వైపు మళ్ళవలసిందిగా సూచించి చేతులు దులుపుకోవచ్చు.

ఈ ఆంతరంగిక పరిష్కార యంత్రాంగాలలో వేళ్ళూనుకుపోయిన సమస్యలు చాలా ఉన్నాయని గతంలో వచ్చిన కేసులు చెబుతున్నాయి. ఫిర్యాదులతో వెళ్ళడం అధికారులకు రుచించకపోవడం వల్ల, వారు తమ అభ్యంతరాలను చెవికెక్కించుకున్నది లేదని కొందరు వాపోయిన సందర్భాలున్నాయి. పైగా, మురికివాడల నివాసుల వంటి బలహీన వర్గాల పౌరులలో కొన్ని వర్గాలకు ఈ ప్రక్రియ అందని మావిపండుగానే ఉంది.

ఓటరుగా అనర్హుడవని వచ్చిన నోటీసులను చదువు సంధ్యలు లేనివారు అర్థం చేసుకోగలరా? ఎన్నికల అధికారి ముందుకు వెళ్ళడం కోసమని దినసరి వేతన కార్మికుడు ఒక రోజు పనిని వదులుకోగలడా? న్యాయ పరిరక్షణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత బిహార్ 'సర్' కేసులో సుప్రీంకోర్టు గణనీయంగా కల్పించుకుని సరైన తీర్పరిగా వ్యవహరించవలసి ఉంది.

ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో...

లక్ష్మీ చంద్రసేన్ వర్సెస్ ఏ.కె.ఎం. హసన్ (1985) కేసులో ఓటర్ల జాబితాలను సవరించాలని ఆదేశించడానికి సుప్రీంకోర్టు వెనుకాడింది. అది ఎన్నికలపై న్యాయవ్యవస్థ అవాంఛనీయ జోక్యానికి కారణమవుతుందనీ, ఒక్కోసారి ఎన్నికల నిరవధిక వాయిదాకు దారి తీస్తుందనీ కోర్టు కలవరపడింది. ఎన్నికలు ఎంత ఎక్కువగా అనివార్యమైతే, దానిలో జోక్యం చేసుకునేందుకు కోర్టు అంత ఎక్కువగా విముఖత చూపుతుందన్న అప్రకటిత సూత్రం ఒకటి ఉంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకుంటే మాత్రం, అది మొత్తం ఎన్నికలను విషపూరితం చేసే అవకాశం ఉంటుంది కనుక కోర్టు ఆ బాధ్యతను భుజాలకు ఎత్తుకుంటుంది. దాన్ని పరిష్కరించేందుకు తదనంతరం, కోర్టు ఒక ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు.

అసెంబ్లీ ఎన్నికల్లో జోక్యం చేసుకున్నట్లు అవుతుందనే సాకుతో బిహార్ విషయంలో తలదూర్చేందుకు కోర్టు మొదట తిరస్కరించవచ్చు. ఓటర్ల జాబితాల సవరణ అక్రమమని ఒకవేళ కోర్టు భావించినా కూడా ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం కానీ, అనర్హులుగా చేసే విధానాన్ని నివారించడం కానీ చేయకపోవచ్చు. భారతీయ ప్రజాస్వామ్యానికి కించిత్తు హాని జరుగుతుందని తలచినా అప్రమత్తంగా ఉండే కాపలాదారు పాత్రనే సుప్రీంకోర్టు చాలా సందర్భాలలో నిర్వహిస్తూ వచ్చింది. ఓటు వేసేందుకు ప్రజలకు ఉన్న హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాథమిక పునాది కనుక ఈ సమస్యను పరిష్కరించే బాధ్యతను సుప్రీం కోర్టు చేపట్టడం ఇప్పుడు చాలా ముఖ్యం.

వ్యాసకర్త 'విధి సెంటర్ ఫర్ లీగల్ స్టడీస్' రిసెర్చ్ ఫెలో

('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఊహల ప్రకంపనలు



మీరు భూవిజ్ఞాన శాస్త్రవేత్త కాకపోతే, రష్యా తూర్పు తీరంలో 8.8 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపానికి హాస్యాస్పదమైన కారణాల గురించి ఊహాగానాలు చేయటం మానేయండి. జూలై 20 నుండి ఇప్పటి వరకు కామ్చాట్కాలో 5.0 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతలో కనీసం 50 భూకంపాలు సంభవించాయి.

– జేసన్ స్టిఫ్, వాతావరణ శాస్త్రవేత్త

జీవితాన్ని వెంబడించాలి



మీరు మీ అతి పెద్ద అవకాశాన్ని ఉపయోగించుకోకపోతే, అది మీదే అన్నట్లుగా మిమ్మల్ని మీరు నమ్మకపోతే, మీ జీవితం దానిపైనే ఆధారపడి ఉందని దానిని మీరు వెంబడించకపోతే... మీరు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకున్నట్లు! ఇంకా చెప్పాలంటే... మీరు మీ జీవితాన్ని అగౌరవ పరుస్తున్నట్లు!!

– రాజ్ శమానీ, రచయిత

ఆచరణే ఆదర్శం



మనం అనేక సామాజిక సమస్యలకు ప్రభుత్వాన్ని లేదా ఇతరులను నిందిస్తాం. కానీ నిజమైన మార్పు మనతోనే మొదలౌతుంది. అందువల్ల మంచికి మనం ఆదర్శంగా ఉండాలి. విచారకరం ఏంటంటే – విద్యావంతులు, ఉన్నత వర్గాలు కూడా అలా ఉండలేకపోవటం!

– నితిన్ కామత్, ఇన్వెస్టర్

జాతీయ బాధ్యత



1970లలో 'ప్రాజెక్ట్ టైగర్'లో నేను స్వచ్ఛందంగా పని చేసినప్పుడు ఈ శోభాయమానమైన జంతువు భవిష్యత్తు అనిశ్చితంగా అనిపించింది. అలాంటిది ఇప్పుడు ప్రపంచంలోని పులులలో 75 శాతం మన దగ్గరే ఉన్నాయి. వాటిని సంరక్షించుకోవటం మన జాతీయ బాధ్యత.

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక బోధకులు

తెలియని దారులు



వృద్ధి అనేది సరళ రేఖ కాదు. నైపుణ్యం క్రమానుగతంగా జమవుతూ ఉండటం వల్ల ఏర్పడే శిఖర రూపం. పరిణామం చెందటానికి మీరు మనసును మీకు తెలియని దానివైపు మళ్లించాలి. తెలిసిన దారిలో మళ్లింపులుండవు, మార్పులుండవు. అభివృద్ధి ఉండదు.

– అనుభవ్ దూబే, స్పీకర్

ఇన్ బాక్స్

బాలలపై డీఎన్ఏ క్రౌర్యం

హైదరాబాద్‌లో ఒక సంతాన సాఫల్య కేంద్రం, దంపతుల సమ్మతి లేకుండా దాత వీర్యాన్ని ఉపయోగించిందన్న ఆరోపణలతో తాజాగా వెలుగులోకి వచ్చిన కేసు, కలవరపరిచే అనేక నైతిక లోపాలను బహిర్గతం చేసింది. ఆ దంపతులు తరచు అనారోగ్యంతో ఉంటున్న తమ బిడ్డకు డీఎన్ఏ పితృత్వ పరీక్ష చేయించినప్పుడు సాఫల్య కేంద్రం పాల్పడుతున్న దారుణాలు బయట పడ్డాయి. అంతకంటే అమానవీయం, ఆ బాలుడు జన్యుపరమైన పితృత్వ పరీక్షకు గురికావలసి రావటం!

అపర్ణ అజింక్య ఫిరోడియా కేసులో (2023) సుప్రీంకోర్టు – పిల్లలను వైవాహిక వివాదాలను పరిష్కరించు కోవడానికి ఉపయోగించుకోరాదని స్పష్టం చేసింది. భారతదేశం ఆమోదించిన 'బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి ఒడంబడిక' ప్రకారం చూసినా... పిల్లలకు గోప్యత, గుర్తింపు, శారీరక సమగ్రత హక్కులు ఉన్నాయి. సమ్మతి లేని డీఎన్ఏ పరీక్ష ఈ మూడింటినీ ఉల్లంఘిస్తుంది.



'సహాయక పునరుత్పత్తి సాంకేతికత (నియంత్రణ) చట్టం–2021లోని సెక్షన్ 31(1) ప్రకారం, 'సహాయక పునరుత్పత్తి సాంకేతికత ద్వారా జన్మించిన బిడ్డ, ఆ సేవలు కోరిన దంపతుల జీవ సంబంధమైన బిడ్డగానే పరిగణన పొందాలి. సహజంగా జన్మించిన బిడ్డకు లభించే అన్ని హక్కులు, అధికారాలు ఆ బిడ్డకు కూడా వర్తిస్తాయి. ఇదే చట్టంలోని సెక్షన్ 33(1)(ఎ) ప్రకారం, కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన బిడ్డను వదిలివేయడం, నిరాకరించడం, వేధించడం వంటివి నిషేధం. డీఎన్ఏ పరీక్ష ఫలితంగా ఆ బిడ్డను తిరస్కరించినా, నిర్లక్ష్యం చేసినా, వదిలివేసినా కూడా అది శిక్షార్హమైన నేరమే!


కోర్టు పర్యవేక్షణ లేకుండా ఇటువంటి పరీక్షలు నిర్వహించే ప్రైవేటు డీఎన్ఏ ల్యాబ్‌లను ప్రభుత్వం నిషేధించాలి. నియంత్రణ లేని హోమ్ డెలివరీ పితృత్వ డీఎన్ఏ టెస్టింగ్ కిట్‌లు కూడా ఇప్పుడు సులభంగా అందుబాటులో ఉంటున్నాయి! వాటిపైనా చట్టపరమైన గట్టి నియంత్రణ అవసరం. లేకుంటే ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లలు ఉన్న మిగతా కుటుంబాలకు కూడా – ముఖ్యంగా అనుమానం, అనారోగ్యం వంటి కారణాలతో, డీఎన్ఏ పరీక్షలు చేయించాలనే ఆలోచన కలిగే అవకాశం ఉంది. మరోవైపు, ప్రైవేటు ఫెర్టిలిటీ క్లినిక్‌లలో జవాబుదారీతనం లేకపోవడాన్ని విస్మరించకూడదు. ఇందుకోసం ప్రభుత్వ నియంత్రణలో ఒక ప్రోటోకాల్‌ను ఏర్పాటు చేయటం అవసరం.

డీఎన్ఏ పరీక్ష జీవ సంబంధాన్ని వెల్లడించవచ్చు. కానీ అది ప్రేమ, సంరక్షణ, కుటుంబాన్ని నిర్వచించలేదు. తమ గురించి తాము నిర్ణయించుకునేంత పరిణతి బాలలకు వచ్చేవరకు, బాలల శరీరాలు పెద్దల అభద్రతాభావాలకు ప్రయోగశాలలు కాకూడదు.

– శ్రీనివాస్ మాధవ్ । సమాచార హక్కు పరిశోధకులు

గిరిజన ఖనిజాల దోపిడీ!

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

తరతరాలుగా అడవినే కన్నతల్లిగా భావించి జీవనం సాగిస్తూ, బ్రిటిష్ వలస పాలనకు, బ్రిటిష్ వారి గిరిజన దోపిడీ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ అనేక మంది గిరిజనులు అమరులు అయ్యారు. అయితే అధికారం చేతులు మార్చుకున్న తర్వాత దేశ పాలకులు కూడా గిరిజన వ్యతిరేక విధానాలే అమలు జరుపుతూ అటవీ ఖనిజ సంపదలను దేశ, విదేశాల బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారు. దానిని వ్యతిరేకిస్తున్న గిరిజనులపై అణచివేత చర్యల్ని చేపడుతున్నారు.

భారతదేశంలో వివిధ రకాల విలువైన ఖనిజాలు అపారంగా ఉన్నాయి. ముఖ్యంగా ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, గోవా, బిహార్, ఆంధ్రప్రదేశ్ , పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల అడవుల్లో ఇనుప ఖనిజం, గ్రానైట్ , బొగ్గు, మైకా, సున్నపు రాయి, యురేనియం ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. ప్రపంచంలో ఖనిజాలు అపారంగా ఉన్న దేశాల్లో ఇండియా మూడవ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఖనిజ విలువలు, సంపదలో రెండవ స్థానంలో (మొదటిది జార్ఖండ్) ఉంది. ఇంత విస్తారంగా ఉన్న ఖనిజ సంపదను, గనులను, అటవీ భూములను ప్రైవేటు వ్యక్తుల, బహుళజాతి సంస్థల పరం చేసేందుకు అడ్డంకిగా ఉన్న అంశాలను తొలగించేందుకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 1980 నాటి అటవీ హక్కుల పరిరక్షణ చట్టంలో మౌలిక సవరణలు చేసింది. ఇక, చంద్రబాబు నాయకత్వాన ఉన్న ఏపీ కూటమి ప్రభుత్వం గిరిజనులు పోరాటాల ద్వారా సాధించుకున్న 1/70 చట్ట సవరణకు పూనుకొని, తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో వెనక్కి తగ్గింది.

దేశం నుండి కొన్ని లక్షల టన్నుల ఖనిజాలు, ముడి లోహాలు బహుళజాతి సంస్థల కార్ఖానాలకు, గిడ్డంగులకు తరలి పోతున్నాయి. వీటి విలువ కోట్ల రూపాయల్లో ఉంది. ఖనిజ వ్యాపారాల ద్వారా దేశ, విదేశీ వ్యాపార సంస్థలు వేల కోట్లు సంపాదిస్తున్నాయి. ఖనిజ నిక్షేపాలు ఎవరి నేలలో ఉన్నాయో, వాటిని ఎవరు తవ్వితీస్తున్నారో వారి జీవితాలు మాత్రం దుర్భరంగా మారాయి.

1947 నుండి భారతదేశ పాలకులు గనుల రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగించే విధానాలనే అనుసరించారు. 1957 చట్టంలోనే గనుల తవ్వకానికి ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగించే వీలు కల్పించారు. 1960లో వెలువడిన ఖనిజాల రాయితీ నిబంధనల్లో ప్రైవేటు వ్యక్తుల,



◆ విస్తారంగా ఉన్న ఖనిజ సంపదను, గనులను, అటవీ భూములను ప్రైవేట్ వ్యక్తుల, బహుళజాతి సంస్థల పరం చేసేందుకు అడ్డంకిగా ఉన్న అంశాలను తొలగించేందుకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 1980 నాటి అటవీ హక్కుల పరిరక్షణ చట్టంలో మౌలిక సవరణలు చేసింది. ఇక, చంద్రబాబు నాయకత్వాన ఉన్న ఏపీ కూటమి ప్రభుత్వం... గిరిజనులు పోరాటాల ద్వారా సాధించుకున్న 1/70 చట్ట సవ రణకు పూనుకొని, తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో వెనక్కి తగ్గింది.

సంస్థల చేతికి ఖనిజ నిల్వలు కట్టబెట్టటానికి అవసరమైన విధి విధానాలు రూపొందించారు. దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత 1988లో వెలువడిన ఖనిజాల సంరక్షణ, అభివృద్ధి నిబంధనలు ప్రైవేటీకరణ వేగాన్ని పెంచాయి. 1993లో మొదటిసారిగా రూపుదిద్దుకున్న జాతీయ ఖనిజ విధానం పూర్తిగా ప్రపంచీకరణ శక్తుల కనుసన్నల్లో బహుళజాతి సంస్థల ప్రయోజనాలు నెరవేర్చే విధంగా ఉంది.

1994లో మరోసారి చట్ట సవరణ చేసి ఇనుప ఖనిజం, రాగి, మాంగనీస్, సీసం, జింక్, గంధకం, బంగారం, వజ్రాలు, నికెల్ మొదలైన ఖనిజ నిక్షేపాల్లోకి పెద్ద ఎత్తున ప్రైవేటు సంస్థల, బహుళజాతి సంస్థల ప్రవేశానికి అవకాశం కల్పించారు. దాంతో బహుళజాతి సంస్థలు నేరుగా, దళారుల ద్వారా మైనింగ్ రంగంలోకి ప్రవేశించాయి. ఈ సంస్థలన్నీ భారత ఖనిజాల ద్వారా వేల కోట్లు లాభాలు పొందుతున్నాయి. ఆదివాసీ ప్రజలు మాత్రం భూములు, నివాస ప్రాంతాలు కోల్పోయి నిరాశ్రయులు అవుతున్నారు. మరోవైపు ప్రభుత్వం తమకు వెచ్చించాల్సిన సంపదను దేశ ప్రజలు కోల్పోతున్నారు. ఖనిజ తవ్వకాలు, ఇతర కారణాల వల్ల 2001 నుండి 2.31 మిలియన్ల హెక్టార్లలో అడవులను నరికివేయటం జరిగింది. ఫలితంగా పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఖనిజాల వ్యాపారంలో విపరీతమైన లాభాలు ఉండటంతో స్థానిక పెత్తందార్లు, వ్యాపారులు, అధికారులు, రాజకీయ నాయకులు కలగలసి మాఫియాగా ఏర్పడ్డారు. ఈ మాఫియా బహుళజాతి సంస్థలతో చేతులు కలిపింది. ప్రభుత్వ అనుమతుల ప్రకారం గనులు తవ్వితేనే 99 శాతం లాభాలు వస్తుంటే, అక్రమ తవ్వకాల ద్వారా వచ్చే లాభాలను ఊహించలేము. వారికి వచ్చే లాభాల్లో ఒక శాతం మాత్రమే ప్రభుత్వం పన్నుల ద్వారా వసూలు చేస్తున్నది. ప్రైవేటీకరణ విధానాలతో దూసుకుపోతూ, దేశ ఖనిజ సంపదలను దేశ, విదేశీ సంస్థల పరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ఖనిజ సంపద దేశ ప్రజలకే చెందాలనీ, 1980 అటవీ హక్కుల చట్టానికి చేసిన సవరణలను ఉపసంహరించాలనీ గిరిజనులతో పాటు యావన్మంది ప్రజలూ ఉద్యమించాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

మారగలిగే స్వభావం

సృష్టిలో అనేక జీవరాశులున్నాయి. ప్రతి జీవి మరొక జీవికంటే విలక్షణంగానే ఉంటుంది. మనస్సు, బుద్ధి కలిగిన మానవులయినా అంతే! 'పుర్రెకో బుద్ధి' అన్నట్లు ఒక వ్యక్తి కంటే మరో వ్యక్తి భిన్నంగానే ఉంటాడు. వారి వారి స్వభావమే దానికి కారణం. స్వభావమనేది జీవికి సహజాతంగా ఏర్పడుతుంది. పాముకు బుస కొట్టడం స్వభావం, తేలుకు కుట్టటం స్వభావం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఒక యోగి స్నానం చేయటానికి నదికి వెళ్ళాడు. నది చూడబోతే వరదతో పరవళ్ళు తొక్కుతోంది. కెరటాలు గట్టు మీదికి కూడా దూసుకు వస్తున్నాయి. ఆ యోగి ఒడ్డునే కూర్చొని స్నానం చేయనారంభించాడు. ఇంతలో ఒక పెద్ద తేలు ఆ కెరటాల్లో కొట్టుకొని పోతూ కనిపించింది. అది ఉక్కిరిబిక్కిరైపోతోంది. దాని బాధ గమనిస్తున్న ఆ యోగి తన దోసిలితో ఆ తేలును పట్టి గట్టున పడవేశాడు. అది కాస్త వూపిరి పీల్చుకొని తోకతో ఆ యోగిని కుట్టింది.

ఆ తేలు కిందపడి జరజరా పాకిపోతూంటే మళ్ళా పెద్ద కెరటం వచ్చి దాన్ని లోపలికి లాక్కెళ్ళింది. తిరిగి నీళ్ళలో కింద మీదవుతూ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆ యోగి చూశాడు. ఊరుకున్నాడా? లేదు. మరోసారి దాన్ని రక్షించాడు. అది మరొకసారి కుట్టింది.

ఈ వ్యవహారమంతా గట్టున కూర్చున్న ఒక పెద్దమనిషి చూస్తున్నాడు. 'అయ్యా! ఇందాకటి నుంచి చూస్తున్నాను. ఆ తేలు విష జంతువు కదా! దాన్ని మీరు రక్షించటమేమిటి? పోనీ రక్షించారు కదా అని అదేమైనా ఊరుకున్నాదా? కుట్టింది. అయినా మీరు దాన్ని యింకా రక్షించాలని తాపత్రయపడటం చూస్తే ఆశ్చర్యంగా ఉంది' అన్నాడు.

యోగి ఆ మాటలు విని, 'బాబూ! దాని స్వభావం కుట్టడమే. మన స్వభావం దాన్ని రక్షించటమే' అని నవ్వుతూ అన్నాడు.

చూశారా! ఎవరి స్వభావం ఎవరు మానుకున్నారు? '**స్వభావో దురతిక్రమః**' అన్నారు. మనిషితో బాటే పుట్టిన స్వభావాన్ని అతిక్రమించటం ఎవరి తరమూ కాదు. రాక్షసులు ఎంత తపస్సంపన్నులయినా వారి దుష్ట స్వభావాన్ని వదిలి పెట్టినట్లు ఏ పురాణంలోనైనా చూశామా? '**ధ్వాంక్షా నింబ ఫలాని భక్షత యితి స్వాభావికీ తన్మతిః**' అంటాడొక కవి. అంటే కాకి వేప పళ్ళు తింటోంది. అంటే అది దాని స్వభావమన్నమాట అని.

అయితే ఈ స్వభావాన్ని మార్చటానికి మార్గం లేకపోలేదు. అదే సద్గురువు నాశ్రయించటం! సద్గురువు తల్చుకుంటే ఎంతటి క్రూర స్వభావాన్నయినా తన ఉపదేశంతో, తన చర్యతో మార్చి వేయగలడు.

జయ గురు దత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి రా.3.50 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** చిత్త రా.12.49 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.7.18 నుండి 9.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, **అమృతఘడియలు:** సా.5.50 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

రిమ్స్ మెడికో ఆత్మహత్య

- వసతి గృహంలో ఉరేసుకుని అఘాయిత్యం


సాహిల్

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మెడికో సాహిల్ చౌదరి (20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల ఆవరణలోని వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. విద్యార్థులు ఉదయం తరగతులకు వెళ్లినప్పటికీ సాహిల్ హాస్టల్‌లోనే ఉండిపోయాడు. ఫ్యాన్‌కు ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు గమనించి విషయాన్ని రిమ్స్ అధికారులకు తెలియజేయడంతో చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజస్తాన్‌లోని జైపూర్‌కు చెందిన సాహిల్ చౌదరి ఆలిండియా కోటాలో సీటు సాధించాడు. మొదటి సంవత్సరంలో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణుడయ్యాడు. ఆగస్టు 2 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం కలిగిస్తోంది. చదువులో రాణిస్తున్న సదరు విద్యార్థి అఘాయిత్యానికి పాల్పడటంతో స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి రిమ్స్‌కు చేరుకున్నారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మెడికోల ద్వారా సంఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, సాహిల్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

108 అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేక రైతు మృతి!

మహబూబ్‌నగర్ క్రైం: ఛాతీలో నొప్పి రావడంతో 108 అంబులెన్స్‌లో తరలించే క్రమంలో అందులో ఆక్సిజన్ లేకపోవడంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకుంది. మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామానికి చెందిన బొజ్జయ్య (65) బుధవారం తన వ్యవసాయ పొలంలో ఉండగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు మూసాపేటలోని ఓ ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ వెళ్లడానికి 108కి కాల్ చేశారు. దాదాపు 20 నిమిషాల తర్వాత అక్కడికి చేరుకున్న 108 వాహనంలో బొజ్జయ్యను తీసుకుని జిల్లాకేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బొజ్జయ్యను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు 108లో ఆక్సిజన్ సదుపాయం లేకపోవడం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. ఆక్సిజన్ పెట్టాలని సిబ్బందిని కోరినా పెట్టలేదని వారు మండిపడ్డారు. ఈ ఘటనపై 108 మేనేజర్ రవిని వివరణ కోరగా.. జిల్లాలో ఉన్న ప్రతి 108లో ఆక్సిజన్ సౌకర్యం ఉంటుందని, ఈ అంబులెన్స్‌లో కూడా ఉందని చెప్పారు. మృతుడి కుటుంబసభ్యులే అంబులెన్స్ మహిళా టెక్నీషియన్‌పై దాడి చేశారని తెలిపారు.

పాముకాటుకు బాలుడు బలి

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన
- మరో ఘటనలో విద్యార్థినికి తప్పిన ప్రమాదం


శ్యాం మృతదేహం

రెబ్బెన/ఉండవెల్లి: రాష్ట్రంలో జరిగిన రెండు పాము కాటు ఘటనల్లో ఒక బాలుడు మృతిచెందగా, మరో ఘటనలో విద్యార్థినికి ప్రాణాపాయం తప్పింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం లక్ష్మీపూర్ పంచాయతీ పరిధి గొల్లగూడకు చెందిన మొగిలి చిన్నన్న, అనూష పెద్ద కుమారుడు మొగిలి శ్యాం(4) మంగళవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నేలపై పడుకున్నాడు. రాత్రి 10.30 గంటల సమయంలో చెవి నొప్పిగా ఉందంటూ ఏడుస్తూ నిద్ర లేచాడు. తల్లిదండ్రులు మొదట చెవిపోటుగా భావించారు. తలగడ కింద కట్ల పామును గుర్తించడంతో హుటాహుటిన రెబ్బెన పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆస్పత్రి సిబ్బంది బాలుడి రక్త నమూనా సేకరించి బెల్లంపల్లికి వెళ్లాలని సూచించారు. అంబులెన్స్ లేకపోవడంతో తల్లిదండ్రులే బైక్‌పై బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అప్పటికే శ్యాం పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, రెబ్బెన పీహెచ్‌సీలో బాలుడికి కనీస వైద్యం అందించలేదని, సరైన వైద్యం అందిస్తే బాబు బతికేవాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, బ్లడ్ శాంపిల్ తీసి యాంటీవీనమ్ ఇంజక్షన్ లోడ్ చేసుకుని వచ్చేసరికే బాలుడిని తీసుకుని తల్లిదండ్రులు వెళ్లిపోయారని పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్ తెలిపారు. మరో ఘటనలో జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఓ విద్యార్థిని పాముకాటుకు గురైంది. మండలంలోని మెన్నిపాడుకు చెందిన దాక్షాయణి కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఉదయం 9:10 గంటలకు పాఠశాల ప్రాంగణంలో తోటి విద్యార్థినులతో కలిసి ప్రార్థన చేస్తుండగా పాముకాటుకు గురైంది. అక్కడే ఉన్న నర్సు లావణ్య విద్యార్థినికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆకుపసరు తాగించారు. తర్వాత ఆమెను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అక్కడి వైద్యులు చెప్పారు.

ఖాళీ లారీలు.. కదలని వాహనాలు!

సరుకులు తరలించకుండానే పన్నుల మొత్తం క్లెయిమ్

- రూ.100 కోట్ల విలువైన నకిలీ బిల్లుల మోసాన్ని గుర్తించిన జీఎస్టీ విభాగం
- రూ.33.20 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్టు ప్రాథమికంగా నిర్ధారణ
- కెషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ అనే ప్రైవేటు కంపెనీపై ఫిర్యాదు
- కార్పొరేట్ కార్యాలయంతో పాటు పలుచోట్ల తనిఖీలు



సాక్షి, హైదరాబాద్: ఖాళీ లారీలు రయ్యిమంటూ జాతీయ రహదారులపై దూసుకెళ్తాయి.. అలా దూసుకెళ్లే వాహనాల్లో ఏదో ఒక సరుకు తరలించినట్టు బిల్డప్ ఇస్తారు.. సదరు వాహనాలు టోల్‌గేట్లు దాటుకుంటూ వెళ్లినట్లుగా ఆధారాలు చూపెడతారు..నకిలీ బిల్లులు తయారు చేస్తారు. ఇదిలావుంటే ఎవరికంటా పడని ప్రదేశంలో ఓ వాహనాన్ని రోజుల తరబడి పార్క్ చేస్తారు.. ఆ వాహనం సరుకులు తరలించినట్లు బిల్లుల్లో చూపెడతారు.. సరుకులు తరలించినందునే వాహనం ఊళ్లో లేదని చెబుతారు.. నకిలీ బిల్లులు తయారు చేస్తారు. ఆయా నకిలీ బిల్లుల ఆధారంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేసుకుంటారు. ఇలా ఖాళీ లారీలు, కదలని వాహనాల్లో సరుకును తరలించామంటూ మోసానికి పాల్పడిన ఓ ప్రైవేట్ కంపెనీ గుట్టును తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ రట్టు చేసింది. ఆ శాఖ కమిషనర్ కె.హరిత ఆధ్వర్యంలో ఈ కొత్త రకం మోసం బట్టబయలయ్యింది. వివరాల్లోకి వెళితే...

భారీగా సరుకులు తరలించినట్టు చూపించి..

కెషాన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ సికింద్రాబాద్‌లోని ఎస్పీ రోడ్‌లో కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటు చేసుకుంది. మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమోటివ్ పార్కు, ముప్పిరెడ్డి గ్రామాల్లో కాపర్ తయారీ యూనిట్లు పెట్టింది. బన్సీలాల్‌పేటలో గోదాం ఏర్పాటు చేసుకుంది. అయితే ఈ మధ్య కాలంలో ఈ సంస్థ భారీ విలువ కలిగిన కాపర్ సరుకులను ఇతర రాష్ట్రాలకు తరలించినట్టు బిల్లులు జారీ చేసింది. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పంపినట్టు చూపిన ఈ బిల్లులపై సందేహంతో పన్నుల శాఖ అధికారులు కార్పొరేట్ కార్యాలయం, గోదాం, తయారీ యూనిట్లలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అసలు విషయం బయటపడింది. అసలు ఈ కంపెనీ ఎలాంటి సరుకులు తరలించకుండానే ఖాళీ వాహనాలను పంపి టోల్‌గేట్ల వద్ద రికార్డు చేయించి సరుకు వెళ్లినట్టు బిల్లులు చేసుకుంటున్నట్లు తేలింది. వాహనాల్లో ఎలాంటి సరుకు లేకుండానే ఈ-వేబిల్లులు తయారు చేశారని, వీటి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని వెల్లడైంది. ఇలా నకిలీ బిల్లుల ద్వారా రూ.33.20 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను ఈ కంపెనీ పొందినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయింది.

పన్ను మోసాలను అడ్డుకుంటాం

పన్ను ఎగవేయడం, లేదంటే అక్రమంగా పన్నును క్లెయిమ్ చేయాలని వ్యాపారులు చేసే ప్రయత్నాలపై గట్టి పర్యవేక్షణ ఉంచుతున్నామని రాష్ట్ర పన్నుల శాఖ కమిషనర్ కె. హరిత వెల్లడించారు. అన్ని రకాల పన్ను మోసాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో రాష్ట్ర ఖజానాకు రావాల్సిన పన్నును ఖచ్చితంగా రాబట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మోసాలకు పాల్పడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
– జీఎస్టీ కమిషనర్ హరిత

కెషాన్ డైరెక్టర్లపై ఫిర్యాదు

తనిఖీల సందర్భంగా కంపెనీ ఖాతా పుస్తకాలు, రిజిస్టర్లు, హార్డ్ డిస్కులు, సీసీటీవీ ఫుటేజ్ తదితర సమాచారం, ఆధారాలను స్వాధీనం చేసుకున్న పన్నుల శాఖ.. ఆ సంస్థ డైరెక్టర్లు వికాశ్‌కుమార్, రజనీష్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేసింది. అదే విధంగా ఏపీ 29 టీఏ 7213 అనే నంబర్ గల వాహనం ఈ ఏడాది జూన్ నుంచి ఎక్కడికీ వెళ్లలేదు. కానీ మెహిదీపట్నం –1 సర్కిల్ పరిధిలో ఉన్న ఆ వాహనం నంబర్ ద్వారా అనేక ఈ వే బిల్లులు సృష్టించారు. దీంతో ఇందుకు సంబంధించి కూడా వాహన యజమానిపై పన్నుల శాఖ అధికారి ఫిర్యాదు చేశారు.

ఫిజి, పోర్చుగల్ దేశాల్లో ఉపాధి

- రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా వీసాల జారీ
- నిరుద్యోగులకు సదవకాశమంటున్న అధికారులు

మోర్తాడ్ (బాల్కొండ): విదేశాల్లో ఉపాధి పొందాలనుకునే నిరుద్యోగులకు ప్రభుత్వరంగ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) పోర్చుగల్, ఫిజి దేశాల్లో పని కల్పించడానికి వీసాల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దళారుల మోసాలకు చెక్‌పెట్టాలనే సంకల్పంతో టామ్‌కామ్ విదేశీ వీసాలు జారీ చేస్తోంది. తాజాగా పోర్చుగల్, ఫిజి ద్వీపంలో ఉపాధికి బాటలు వేస్తుంది.

పోర్చుగల్‌లో ఇలా...

పర్యాటక రంగంలోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో ఈ రంగంలోనే వివిధ హోదాలలో పనిచేయడానికి యువతకు అవకాశం ఉంది. ఎగ్జిక్యూటివ్ చీఫ్, కుక్, కిచెన్ అసిస్టెంట్, డిష్ వాషర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఈవెంట్ కో ఆర్డినేటర్, స్పా థెరపిస్ట్ ఉద్యోగాలకు అవకాశం ఉంది. డిగ్రీ, ఇంటర్, హోటల్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఇతర సర్టిఫికెట్ కోర్సులు చదువుకుని ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి వీసాలు జారీ చేయనున్నారు. మన కరెన్సీలో రూ.1 లక్ష నుంచి రూ.1.50 వరకు వేతనాలు అందనున్నాయి. డిప్లొమా, హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్ చదువుకుని ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి వీసాలు ఇవ్వనున్నారు. ఈ రంగంలో కూడా రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు హోదాను బట్టి జీతం చెల్లించనున్నారు. ద్వీప దేశమైన ఫిజిలోనూ పలు పోస్టులకు వీసాలు ఇవ్వనున్నారు. రూ.45 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనం లభించనుంది..

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి..

ఫిజి, పోర్చుగల్ దేశాల్లో ఉపాధి కోసం జారీ చేయనున్న వీసాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా కార్యాలయంలో సంప్రదించాలి. మధ్యవర్తులను నమ్మి మోసపోవడంకంటే ప్రభుత్వరంగ సంస్థ ద్వారా వీసాలు పొందడం ఎంతో మేలు.
– నాగ భారతి, టామ్‌కామ్ జనరల్ మేనేజర్

ఈడీ అదుపులో తలసాని ఓఎస్‌డీ కల్యాణ్

- గొర్రెల స్కామ్ కేసులో అదుపులోకి ..
- కల్యాణ్ ఇంట్లో భారీగా నగదు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్‌డీ కల్యాణ్‌కుమార్ ఇంటితో పాటు గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మాజీ ఎండీ రాంచందర్‌నాయక్, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయి, శ్రీనివాస్‌రావు సహా కాంట్రాక్టర్లు మొయిద్దీన్, ఇక్రముద్దీన్ ఇళ్లు, ఆఫీసుల్లో తనిఖీలు జరిగాయి. 8 ఈడీ బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. సోదాల అనంతరం కల్యాణ్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. రాంచందర్, మొయినుద్దీన్‌తో కలిసి కళ్యాణ్ అక్రమాలకు పాల్పడినట్లు ధ్రువీకరించిన ఈడీ... ఇందులో రూ.700 కోట్ల కుంభకోణం జరిగినట్లు భావిస్తోంది. దీనిపై మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతోంది. సోదాల సందర్భంగా కల్యాణ్ ఇంట్లో ఈడీ అధికారులు భారీగా నగదు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఏడేళ్ల చిన్నారిపై సామూహిక లైంగిక దాడి

- నిందితుల్లో బాలిక సొంత అన్నసహా మరో నలుగురు
- మూడు రోజుల తర్వాత ఘటన వెలుగులోకి..

జడ్చర్ల: అభం శుభం తెలియని చిన్నారిపై ఐదుగురు బాలురు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన సంఘటన జడ్చర్లలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జడ్చర్లలోని 167 నంబర్ జాతీయ రహదారిని ఆనుకునిఉన్న ఓ కాలనీలో నివాసం ఉంటున్న ఏడేళ్ల చిన్నారిపై ఐదుగురు బాలురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారిలో చిన్నారి సొంత అన్న కూడా ఉన్నాడు. మూడు రోజుల క్రితం (ఆదివారం) పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారిపై చుట్టుపక్కల ఇళ్లకు చెందిన ఐదుగురు బాలురు లైంగికదాడికి పాల్పడ్డారు. నిందితుల్లో ఒకరు ఇంటర్ చదువుతున్న 16 ఏళ్ల బాలుడు, మరో నలుగురు ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. అత్యాచారం జరిగిన తరువాత చిన్నారితో సహా అందరూ ఏమీ తెలియనట్లు ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు. ఆరోజు నుంచి బాలికకు కడుపునొప్పి రావడంతో పాటు అనారోగ్యానికి గురికావడంతో బుధవారం సాయంత్రం చిన్నారి తల్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. డాక్టర్ పరిశీలించి లైంగిక దాడి జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని చిన్నారిని విచారించగా.. తాను పక్కింట్లో ఆడుకోవడానికి వెళ్లిన సమయంలో తన సొంత అన్న, స్నేహితులు కలిసి తనకు తెలియకుండానే ఏదో చేశారని చిన్నారి పోలీసుల ముందు అమాయకంగా చెప్పింది. వైద్య పరీక్షల అనంతరం చిన్నారిని జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి పంపారు. మైనర్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఘటనపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీసీసీల ఏర్పాటులో తెలంగాణ అగ్రగామి



బాంద్రా–కుర్లా తరహాలో నియోపోలిస్ ఐటీ పార్కులో మౌలిక వసతులు

'ది లీడర్‌షిప్ ఫెడరేషన్' సదస్సులో జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: గడచిన మూడు నాలుగేళ్లుగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటులో హైదరాబాద్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. పారిశ్రామిక దిగ్గజ సంస్థలు తమ జీసీసీల ఏర్పాటు, విస్తరణకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. 'ది లీడర్‌షిప్ ఫెడరేషన్' హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రెండో లీడర్‌షిప్ రెండో సదస్సులో జయేశ్ రంజన్ కీలకోపన్యాసం చేశారు. జీసీసీల ఏర్పాటులో బెంగళూరు, హైదరాబాద్ నడుమ పోటీ ఉన్నట్లు కనిపిస్తున్నా హైదరాబాద్‌లో మెరుగైన మౌలిక వసతులు ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న 'నియోపోలిస్'ఐటీ పార్కులో ముంబైలోని బాంద్రా కుర్లా తరహా మౌలిక వసతులు ఉంటాయన్నారు. ఈ సదస్సుకు పలు ప్రపంచ దిగ్గజ సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విద్యారంగ ప్రతినిధులు, ఆవిష్కరణల హబ్‌లకు చెందిన 300కు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. నైపుణ్య శిక్షణ, ఏఐ సంసిద్ధత వంటి అంశాలపై చర్చించారు. సప్నా గ్రోవర్ (మైక్రోసాఫ్ట్), శ్రీకాంత్ కమారాజు (అడోబ్), డాక్టర్ దినేశ్ చంద్రశేఖర్ (సెంటిఫిక్), నవీన్ బిష్ణోయి (మార్వెల్), అమర్ షా (డియాగో), దివేశ్ సింగ్లా (సిగ్నంట్ హెల్త్), పంచమ్ తజా (డెల్టా కాపిటా), అనుప్రితా భట్టాచార్య (మెర్క్ ఐటీ), మలహార్ పినెల్లీ (7– ఎలెవన్) తదితరులు చర్చాగోష్టిలో పాల్గొన్నారు.

పురుగులున్నా.. తినాల్సిందే!

- కడుపులో కూడా పురుగులుంటాయి కదా అంటున్నారు
- గద్వాల జిల్లా ఉండవెల్లి జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల ఆవేదన
- ఆగ్రహంతో కలెక్టరేట్ ముట్టడికి పది కిలోమీటర్ల పాదయాత్ర
- నచ్చజెప్పి తిప్పిపంపిన అధికారులు.. హాస్టల్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్


జాతీయ రహదారిపై పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు

ఉండవెల్లి: హాస్టల్‌లో పురుగుల అన్నం వడ్డిస్తున్నారని ఆరోపిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల రోడ్డెక్కారు. 50 మంది విద్యార్థులు బుధవారం పాదయాత్రగా కలెక్టరేట్‌కు బయలుదేరారు. 10 కి.మీ. పాదయాత్ర చేసి ఇటిక్యాలపాడు శివారుకు చేరుకోగా.. తహసీల్దార్లు ప్రభాకర్, జోషి శ్రీనివాస్ శర్మ, సీఐ రవిబాబు, ఎస్ఐలు శేఖర్, చంద్రకాంత్ కలిసి విద్యార్థులను అడ్డుకున్నారు. వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి తిరిగి గురుకులానికి తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'అన్నంలో పురుగులుంటాయి.. కడుపులో కూడా ఉంటాయి. అదే అన్నం తినాలి'అని ఉపాధ్యాయిని రజిత బెదిరిస్తున్నారని తెలిపారు. వార్డెన్ రేణుక సమయానికి రారని, అసలు విద్యార్థుల సమస్యలే పట్టించుకోరని ఆరోపించారు. ఈ విషయాలన్నీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

అదనపు కలెక్టర్ ఆగ్రహం..

విద్యార్థుల ఆందోళన గురించి తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగ్‌రావు.. గురుకులాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేస్తానని, ఏ సమస్య ఉన్నా పేపర్‌పై రాసి అందులో వేస్తే నేరుగా తానే పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి వార్డెన్, కిచెన్ స్టాఫ్ ఎవరు అసభ్యకరంగా మాట్లాడినా సమాచారం అందించాలని సూచించారు. ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కిచెన్ గది, ఆర్వో ప్లాంటును పరిశీలించారు. వాచ్‌మన్ మద్యం తాగి వస్తే చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.



మందు పిచికారీ ఆధునికమే..

పంట సాగులో ఆధునిక యంత్రాలు ఉపయోగిస్తూ రైతులు ముందుకు సాగుతున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటల్లో ఆధునికతతో పనులు చేస్తూ ఖర్చును తగ్గించుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో పత్తి పంటలో ట్రాక్టర్ స్ప్రేయర్‌తో మందు పిచికారీ చేస్తున్నారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజులపాటు మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్–25 నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు డ్యూటీ మీట్ ప్రారంభం కానుంది.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
Lr.No.E1/4/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది:30-07-2025
రూ.544.50 లక్షల మొత్తంతో వివిధ పనులను చేపట్టుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ: 31-07-2025 సా.4.30 గం. నుండి 07-08-2025 సా.4.30 గం. వరకు కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరుచుట: సా.4.31 గం.కు కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేదా వారి డిప్యూటీచే తెరవబడుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in ని దర్శించండి లేదా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం.8555870616
సం/- కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.5784-PP/CL/Advt/1/2025-26, Dt. 30-07-2025

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, పిఆర్ సర్కిల్, మంచిర్యాల
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 127-139/SE PR/MNCL/2025-26 తేది: 29-07-2025
పనుల సంఖ్య (13): పిఆర్ సర్కిల్, మంచిర్యాలలో CDP, STSDF, MRR & CRR గ్రాంటు క్రింద మంజూరైన పనులు (13 నం.లు) కొరకు దిగువ సంతకందారు టెండర్లు కోరుచున్నారు. మొత్తం అంచనా వ్యయం రూ.1469.60. టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో 31-07-2025 నుండి లభిస్తాయి మరియు అవి ప్రచురణ తేదీ నుండి (07) రోజుల వరకు లభిస్తాయి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/-సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ సర్కిల్, మంచిర్యాల
DIPR RO No. 5756-PP/CL/Advt/1/2025-26, Dt: 30-07-2025

తెలంగాణ ప్రభుత్వం
దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ/ TVCC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
ప్రకటన నం. TVCC/C1/119/2024 తేది: 30-07-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ ద్వారా నమోదిత సంస్థలు / కంపెనీలు లేదా వారి అధీకృత డీలర్లు/ పార్ట్‌నర్/ రీసెల్లర్ నుండి సరఫరా కొరకు దిగువ తెలిపిన సహాయ పరికరాలు మరియు సాధనములు సేకరణకుగాను వెబ్‌సైట్ https://tender.telangana.gov.in ఇ-మెయిల్ ఐడి: mdtgvcc@gmail.com ద్వారా ఆన్‌లైన్ బిడ్లు పిలువబడుచున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 31-07-2025. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి: 040-24559048. ఫైల్/ఎన్ఐటి నంబరు : 1) TVCC/C1/119/2024-25/5, 5జి స్మార్ట్ ఫోన్స్.
సం/- డైరెక్టర్ & ఎక్స్ అఫీషియో, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.5793-PP/CL/Advt/1/2025-26, Dt.30.07.2025

ఉస్మానియా విశ్వవిద్యాలయం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e NIT.No.396/EE/UBD/2025 తేది : 28.07.2025
పని పేరు : నిజామ్ కాలేజ్, O.U లోని లైబ్రరీ భవనం ప్రక్కన మరియు వెనుకవైపు కూలిపోయిన గోడ స్థానంలో ప్రహరీగోడ పునర్నిర్మాణం. బిడ్ల ముగింపునకు చివరి తేదీ / సమయం : 13.08.2025న సా.5.00 గం. వరకు. ECV : రూ.8,04,525/-. పేరు & చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బిల్డింగ్స్ డివిజన్, O.U. హైదరాబాద్-7, ఫోన్ నం. 8331997266. తదుపరి వివరాలను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ www.tender.telangana.gov.in వద్ద తేది: 30.07.2025న ఉ. 11.00 గం. తర్వాత నుండి చూడవలెను.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
DIPR RO No.5755-PP/CL/Advt/1/2025-26, Dt. 30.07.2025

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-టెండరు నం. & తేది	పని పేరు	ఖర్చు (సుమారు)	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది
EP. No.73/ CGM(E)/ TC/T1/ TD-II/MoM-Beeramguda/ 2025-26, dtd: 30/07/2025.	2 సంవత్సరాల కాలానికి EAM సెక్షన్, P'cheru, EAM సెల్-III, TD-II, P'Cheru పరిధిలో బీరంగూడ GLSR ప్రెమిసెస్‌కు పటాన్‌చెరు క్యాంపస్ పంపింగ్ వద్ద అనుబంధ ఎక్విప్‌మెంట్‌తోపాటు 3 నం.లు 250 KW/6.6KV పంప్‌సెట్స్ కలిగిన 6.6KV పంపింగ్ స్టేషన్ మరియు అనుబంధ ఎక్విప్‌మెంట్‌తోపాటు 2 నం.లు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కలిగిన 33KV ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ యొక్క MoM	రూ. 128.01 లక్షలు	31-07-2025న సా.4.00 గం.కు

టెండరుదారులు సమాచారమును ప్రధానంగా ZIP ఫార్మాట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04, తెలంగాణ.

తెలంగాణ ప్రభుత్వం
దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, తెలంగాణ
వికలాంగుల సంక్షేమ భవన్, నల్గొండ X రోడ్స్, మలక్‌పేట్, హైదరాబాద్-500036.
(ఫోన్ నం.: 040-245590480)
ప్రకటన
దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, తెలంగాణ రాష్ట్రం నియంత్రణలో గల ప్రభుత్వ బధిరులు మరియు అంధుల ఆశ్రమ పాఠశాలలలో పనిచేయుటకు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, సెకండరీ గ్రేడ్ బేసిక్ ట్రైన్డ్ టీచర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఆగస్టు, 2025 నుండి తాత్కాలికంగా పనిచేయుటకు అర్హత గల వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తు ఫారం, అర్హత ప్రమాణాలు, రెమ్యూనరేషన్ మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ www.wdsc.telangana.gov.inలో లభిస్తాయి. మద్దతు డాక్యుమెంట్లతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని తగువిధంగా పూర్తిచేసి ఈ ప్రకటన జారీ తేదీ నుండి 7 రోజులలోగా wdsc2025recruitment@gmail.com కు మెయిల్ పంపవలెను. ఏ కారణాలు తెలుపకుండా ఏదైనా దరఖాస్తును అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు హక్కు డైరెక్టర్‌కు కలదు. ఈ విషయానికి సంబంధించి ఎటువంటి కరస్పాండెన్స్ అనుమతించబడదు.
DIPR RO No.5791-PP/CL/Advt/1/2025-26, Dt.30.07.2025 సం/- శ్రీమతి B. శైలజ, డైరెక్టర్

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वीं मंज़िल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुड़गांव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్
కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు, ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5,
IMT మనేసర్, గుర్గావ్, హర్యానా - 122050
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన
[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప-సెక్షన్ (2) మరియు ఉప-సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]
బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-2/248(2)/2025-26/911 తేది: 22.07.2025
నిర్దేశం:
దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద తెలంగాణ రాష్ట్రంలోని (28) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AB5280668	U22300TG2019OPC137921	DECALOG BOOK HOUSE (OPC) PRIVATE LIMITED
2	AB5421523	U47912TS2023PTC176771	DAKILA ECOSYSTEM MARKETING PRIVATE LIMITED
3	AB5081395	U72200TG2013PTC086515	ENCIERRO SOFTWARE PRIVATE LIMITED
4	AB4420518	U72900TG2019PTC132258	SPAB TECHNOLOGIES PRIVATE LIMITED
5	AB4435469	U72500TG2018PTC121580	COGAI SOLUTIONS PRIVATE LIMITED
6	AB4633017	U70200TG2016PTC110782	ASTRA PRIVATE LIMITED
7	AB4721762	U82990TS2024PTC189450	AIKYAVIKASA SOLUTIONS PRIVATE LIMITED
8	AB4944883	U62011TS2023PTC175536	BLIPPER TECHNOLOGIES PRIVATE LIMITED
9	AB4865561	U37200TG2020PTC143811	ECO-FINE BRIQUETTES PRIVATE LIMITED
10	AB5229863	U74999TG2019PTC130144	JUSTREDEEM ONLINE PRIVATE LIMITED
11	AB5039077	U70109TG2022PTC166256	EPIPHANY REALTORS PRIVATE LIMITED
12	AB5259673	U74110TG2018PTC125759	RCJ ENTERPRISES PRIVATE LIMITED
13	AB5146841	U93030TG2019OPC133824	VEDUS CONFERENCES (OPC) PRIVATE LIMITED
14	AB4613744	U72900TG2022PTC158971	PRIMSUM TECH PRIVATE LIMITED
15	AB4927770	U74999TG2016PTC109229	CORPORATE FILINGS INDIA PRIVATE LIMITED
16	AB4837516	U74900TG2016PTC103749	SKEDOOL IT PRIVATE LIMITED
17	AB4776194	U74999TG2018PTC123351	PRONIA BUSINESS SOLUTIONS PRIVATE LIMITED
18	AB4707267	U85100TG2021PTC151924	MYHEALTH LINE MEDICAL TECHNOLOGIES PRIVATE LIMITED
19	AB4473738	U72900TG2020OPC140118	CARTPASSION (OPC) PRIVATE LIMITED
20	AB4967153	U47820TS2023PTC177444	MAD ABOUT DRIP CLOTHING PRIVATE LIMITED
21	AB5133902	U74999TG2019PTC132538	SAFEAFTER SERVICES PRIVATE LIMITED
22	AB5191966	U74999TG2020PTC145667	BIOSEPHIA ENGINEERING SERVICES PRIVATE LIMITED
23	AB5249393	U62091TS2023PTC176976	TAVAS DIGITAL PRIVATE LIMITED
24	AB5405185	U14200TG2007PTC054933	SAHASRA MINERALS PRIVATE LIMITED
25	AB4797929	U74999TG2017PTC118532	PROCADUS STEEL PRIVATE LIMITED
26	AB5399242	U32909TS2023PTC171465	SRI NITHYAVEDA TATTVA PRIVATE LIMITED
27	AB5387129	U31402TG1977PTC002225	ELECTROFLO BATTERIES PVT LTD
28	AB4177242	U70102TG2008PTC062319	NAVYA SHELTERS PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారని లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఎ/లోని ఉప-సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప-సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ/ వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేరు(లు) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీలరిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.
(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.
రౌనక్ అగర్వాల్,
అసిస్టెంట్ రిజిస్ట్రార్,
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్
CBC 07123/11/0326/2526

సునామీ ప్రకంపనలు

రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో సంభవించిన భూకంపం

- రష్యా, జపాన్, అమెరికా, హవాయ్ తీరాలను తాకిన భీకర సునామీ అలలు
- రష్యా తూర్పు తీరం వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో మొదలైన ప్రకంపనలు
- తీరపట్టణాలను కుదిపేసిన అత్యంత ఎత్తైన అలలు
- చివురుటాకులా వణికిన తీరదేశాల ప్రజలు



భూకంపం ధాటికి రష్యాలో కుప్పకూలిన ఓ భవనం

టోక్యో/మాస్కో/వాషింగ్టన్/న్యూఢిల్లీ: రష్యా సమీప పసిఫిక్ మహాసముద్రగర్భంలో జనించిన ప్రళయ భీకర సునామీ రెప్పపాటులో ఆ సముద్ర తీర దేశాలను చివురుటాకులా వణికించింది. సముద్రగర్భ భూకంపం ధాటికి ఉద్భవించిన రాకాసి అలలు క్రూరంగా తీరపట్టణాలపై విరుచుకుపడ్డాయి. రిక్టర్‌స్కేల్‌పై 8.8 తీవ్రతతో మొదలైన భూ ప్రకంపనలు తీర దేశాల్లోని కోట్లాది మంది ప్రజలను ప్రాణభయంతో పరుగులు పెట్టించాయి. భవనాలు పేకమేడల్లా కూలుతాయన్న భయంతో ఇప్పటికే లక్షలాది మంది తీరప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఆగకుండా ప్రకంపనలు ఉధృతస్థాయిలో రావడంతో భవనాలు కొన్ని నిమిషాలపాటు ఊగిపోయాయి. తీర ప్రాంతాల్లోకి సముద్రపునీరు ఊహించనంతగా కొట్టుకొచ్చింది. రష్యా తూర్పున సుదూరంగా ఉన్న కామ్‌చట్కా ద్వీపకల్పంలోని పెట్రోపావ్లోవ్స్క్-కామ్చాట్‌స్కీ నగర సమీపంలో ఈ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం రష్యాలో బుధవారం ఉదయం 11.24 గంటలకు పసిఫిక్ మహాసముద్రగర్భంలో 21 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించామని అమెరికా జియాలజికల్ సర్వే సంస్థ ప్రకటించింది. కామ్‌చట్కా పరిధిలో కొన్ని చోట్ల అలలు ఏకంగా 20 అడుగుల ఎత్తులో దూసుకొచ్చి తీరంలో పెను విలయం సృష్టించాయని రష్యా సోషనాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. సివిరో కురిల్స్క్ తీరపట్టణంపై 14 అడుగుల ఎత్తైన రాకాసి అలలు విరుచుకుపడ్డాయి. తీరంలోని నిర్మాణాలను సర్వనాశనం చేశాయి. రష్యా మొదలు జపాన్, అమెరికా, హవాయి, న్యూజిలాండ్, చిలీ, కొలంబియా దాకా సమీపంలోని అన్ని దేశాలను సునామీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఆయా దేశాల ప్రభుత్వాలు ఇచ్చిన సునామీ హెచ్చరికలతో తీరప్రాంతాల్లోని ప్రజలంతా ప్రాణభయంతో ఎత్తైన ప్రదేశాలు, బీచ్‌లకు దూరంగా ఉన్న పచ్చికబయళ్లకు పరుగులు తీశారు. ప్రకంపనలకు తాము ఉంటున్న భవనాలు ఊగిపోవడంతో కొందరు భయంతో కిటికీల నుంచి బయటకు దూకి గాయాలపాలయ్యారు. అమెరికాలోని హోనలూనూ సిటీలో జనం ఒక్కసారిగా కార్లతో వేరే చోట్లకు తరలిపోవడంతో రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. ద్వీప రాష్ట్రం హవాయిలో పలుచోట్ల సునామీ సైరన్లు మోగించారు. భూ ప్రకంపనలు జపాన్ తీరాలను తాకినా ఆ దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ స్పష్టంచేసింది. సాధారణంగా భూకంపం తర్వాత వచ్చే ప్రకంపనల తీవ్రత అత్యల్పంగా ఉంటుంది. కానీబుధవారం సంభవించిన పెను భూకంపం ధాటికి ఆ తర్వాత వచ్చే ప్రకంపనలు సైతం 6.9 తీవ్రతతో విస్తరించడం గమనార్హం. సునామీ తర్వాత పలు దేశాల బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి.

1900 ఏడాది నుంచి సంభవించిన భారీ భూకంపాలు

- 1960 చిలీ దేశంలోని బియబియో (రిక్టర్ స్కేల్‌పై 9.5 తీవ్రత)
- 1964 అమెరికాలోని అలాస్కా(రిక్టర్ స్కేల్‌పై 9.2 తీవ్రత)
- 2011 జపాన్‌లోని తొహోకూ (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)
- 2004 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)
- 1952 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 9 తీవ్రత)
- 2025 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 2010 చిలీలోని బియోబియో (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 1906 ఈక్వెడార్‌లోని ఎస్మిరాల్డాస్ (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 1965 అమెరికాలోని అలాస్కా (రిక్టర్ స్కేల్‌పై 8.7 తీవ్రత)
- 2012 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రత)

బద్దలైన అగ్నిపర్వతం

భూకంపం సంభవించినప్పుడే రష్యాలోని కామ్‌చట్కా పరిధిలోని కిచెవ్‌స్కయా సోప్రా అగ్నిపర్వతం బద్దలైంది. ఉత్తరార్ధ గోళంలోనే అతిపెద్ద అగ్నిపర్వతాల్లో ఒకటైన ఈ అగ్నిపర్వతం బద్దలవడంతో అందులోంచి భారీ స్థాయిలో లావా ఎగజిమ్మింది. పలు పేలుళ్లు సైతం వినిపించాయని రష్యా అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని జియోఫిజికల్ విభాగం ప్రకటించింది. పలు దేశాల్లో ప్రకంపనలు తీవ్రస్థాయిలో సంభవించినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. కొన్ని దేశాలు అత్యధిక స్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసి తర్వాత పెనుప్రమాదం లేదని తెలిశాక ఉపసంహరించుకున్నాయి.

అయినా సర్జరీ ఆగలేదు...

రష్యాలోని కామ్‌చట్కా ప్రాంతంలో భూకంపం వచ్చినప్పుడే అక్కడి ఒక ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స జరుగుతోంది. కాళ్ల కింద నేల కదులుతున్నా వైద్యులు ఏమాత్రం జంకకుండా జాగ్రత్తగా సర్జరీ విజయవంతంగా పూర్తిచేశారు. సంబంధిత వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆపరేషన్ థియేటర్‌లోని రోగి పడుకున్న స్ట్రెచర్‌ను సహాయక సిబ్బంది గట్టిగా పట్టుకోవడం, వైద్యులు సర్జరీని కొనసాగించడం ఆ వీడియోలో రికార్డయింది. దీంతో ఆపత్కాలంలోనూ వైద్యులు చూపిన వృత్తి నిబద్ధతను మెచ్చుకుంటూ పలువురు సామాజికమాధ్యమాల్లో కామెంట్లు పెట్టారు.



జపాన్‌లోని సోసాసిటీ కుజుకురీ తీర ప్రాంతంలో సునామీ అలలు



సునామీ హెచ్చరికతో జపాన్ పశ్చిమ తీర ప్రాంతంలోని బీచ్ వెల వెల



ముకావ టౌన్ (జపాన్)లో సునామీ భయంతో మిద్దెనెక్కిన జనం

కాంగ్రెస్ ధారాదత్తం చేసింది

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మేం తిరిగి తీసుకొస్తాం • రాజ్యసభలో అమిత్ షా

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై రాజ్యసభలో 16 గంటల చర్చకు ప్రభుత్వం తరఫున సమాధానంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ పాపం కాంగ్రెస్‌దే అని ధ్వజమెత్తారు. '' దేశ భద్రత అనేది కాంగ్రెస్ ప్రాధాన్యతాంశాల్లో అస్సలు లేదు. ఓటు బ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు మాత్రమే కాంగ్రెస్ అజెండా. వీటిపై మాత్రమే కాంగ్రెస్ దృష్టిపెట్టి జాతీయభద్రత వంటి మిగతా కీలకాంశాలను గాలికొదిలేసింది. దీంతో ఉగ్రవాదం విపరీతంగా విస్తరించింది. దీనికి ఏకైక కారణం కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు, పేలవమైన రాజకీయ విధానాలు. కాంగ్రెస్ ఘోర తప్పిదాల కారణంగానే కశ్మీర్‌లో కొంతభాగం మన చేజారింది. అలా కాంగ్రెస్సే పాకిస్తాన్‌కు పీఓకేను అప్పగించింది. వాళ్లు ఇచ్చిన పీఓకేను మేం తిరిగి తీసుకొస్తాం. ఘటన జరిగాక సమీక్ష జరపడం కాంగ్రెస్ విధానం. అసలు అలాంటివి సంభవించకుండా ముందే అప్రమత్తంగా ఉండటం మా నైజం'' అని అమిత్ షా అన్నారు. ''పహల్గాం పాశవిక హత్యాకాండలో అమాయకులు చనిపోయారు. వాళ్ల తలకు గురిపెట్టి మరీ ఉగ్రవాదులు తూటాలు పేల్చారు. అదే తీరులో ఆపరేషన్ మహాదేవ్‌లో పహల్గాం ఉగ్రవాదుల తలల్లోకి మేం కూడా తూటాలు దించాం. పహల్గాం బాధిత కుటుంబాలు కోరుకున్నది మేం నెరవేర్చాం. ఆపరేషన్ మహదేవ్‌లో అంతమైన ముగ్గురు ఉగ్రవాదులకు లష్కరే తోయిబాతో సంబంధాలున్నట్లు ఆర్మీ దర్యాప్తులో స్పష్టమైంది. మహిళలు, చిన్నారుల ఎదుట నీ మతమేంటి? అని అడిగిమరీ అమాయకుల ప్రాణాలు తీసిన పహల్గాం వంటి హేయమైన ఘటన గతంలో ఎన్నడూ జరగలేదు'' అని అమిత్ షా అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వయంగా వచ్చి మాట్లాడాలని విపక్షసభ్యులు పట్టుబట్టారు. ఆయన బదులు నేను మాట్లాడుతున్నానని అమిత్ షా సర్దిచెప్పే ప్రయత్నంచేసినా విపక్షసభ్యులు వినిపించుకోకుండా నిరసనగా వాకౌట్ చేశారు. తర్వాత అమిత్ షా తన ప్రసంగాన్ని కొనసాగించారు.



విచారణ కోసం క్రికెట్ స్టేడియం కావాలి

మాజీ మంత్రి సెంథిల్ కేసులో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ: తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ మనీలాండరింగ్ కేసు విచారణలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసును బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. విచారణలో ఇప్పటికే 2,000 మంది నిందితులతోపాటు 500 మంది సాక్షులను ప్రవేశ పెట్టడంపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. '' కేసులో నిందితుల ఉనికిని గుర్తించడానికి ట్రయల్ కోర్టు గది సరిపోదు. క్రికెట్ స్టేడియం కావాలి'' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు వ్యాఖ్యానించింది. నిందితులు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కావాలనే విచారణ తాత్సారం చేస్తున్నట్టు కనిపిస్తోందని న్యాయపరమైన జోక్యం ఇష్టం లేకపోతే.. సెంథిల్ కేసులను ఎంత తొందరగా గౌరవంగా ముగిస్తే అంత మంచిదని వ్యాఖ్యానించింది. అన్నాడీఎంకే హయాంలో రవాణా మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీ ఉద్యోగాల పేరుతో లంచాలు తీసుకున్నారని ఆరోపిస్తూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత ఆయన డీఎంకేలో చేరారు. మంత్రి అయ్యారు. అయితే ఈ కేసులో ఈడీ సెంథిల్‌ను 2023లో అరెస్టు చేసింది. ఏడాదిపాటు జైల్లో ఉన్న ఆయన బెయిల్‌పై బయటికొచ్చారు. డీఎంకే ప్రభుత్వం ఆయను మళ్లీ మంత్రిని చేసింది. ఈ కేసులో బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సెంథిల్ తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చిన వేలాది మంది బాధితులను... లంచాలిచ్చిన వారంటూ రెండు కేసుల్లో నిందితులుగా చేర్చారు. బాధితులను నిందితులుగా పరిగణించడంపై పిటిషనర్ వై బాలాజీ తరఫు న్యాయవాది తన వాదనను వినిపించారు. మనవడి ఉద్యోగం కోసం నగలు అమ్ముకున్న బామ్మలెలా నిందితులు అవుతారని, వారు బాధితులు అవతారని వాదించారు. ఉద్యోగాల కోసం డబ్బులు వసూలు చేసిన మాజీ మంత్రి, ఆయన సోదరుడు, ఆయన వ్యక్తిగత సహాయకుడే అసలైన నిందితులని కోర్టుకు నివేదించారు. ఇతర నిందితులు నేరం చేశారని సాంకేతికంగా అంగీకరించిన కోర్టు.. వారు నిందితులకంటే ఎక్కువగా బాధితులు అవుతారని, వారిని విచారించడం మరింత జాప్యానికి దారి తీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిని విచారించడం ఎప్పుడు పూర్తవుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది.

మీ తీరు నమ్మశక్యంగా లేదు

- అంతర్గత కమిటీ విచారణలో దోషిగా తేలాకే మా వద్దకు రావాలని అనిపించిందా?
- 'కాలిన కరెన్సీ' ఉదంతంలో జస్టిస్ వర్మకు సుప్రీం సూటి ప్రశ్న
- తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఏర్పాటైన అంతర్గత విచారణ కమిటీ దర్యాప్తులో నేరం నిరూపణ కావడంతోనే మరోమార్గంలేక తమను ఆశ్రయించారా? అని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అంతర్గత విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో వేసిన కేసును బుధవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఆయన వైఖరిపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తంచేసింది. '' కాలిక కరెన్సీలు మీ అధికారిక నివాసంలో బయల్పడిన ఉదంతంలో ఇన్-హౌస్ కమిటీ ఎదుట ఎందుకు హాజరయ్యారు? అక్కడ మీ నేరం రుజువుకావడంతోనే ఇక్కడికొచ్చారా? అప్పుడు ఆ కమిటీని వ్యతిరేకించని మీరు ఇప్పుడెందుకు కమిటీ నివేదికను తప్పుబడుతున్నారు? మీ ధోరణి నమ్మశక్యంగా లేదు'' అని కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో జస్టిస్ వర్మ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ తన వాదనలు వినిపించారు. ''తొలుత సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ఘటన వీడియోను అప్‌లోడ్ చేశారు. జడ్జి ఈ నేరం చేశారని సుప్రీం అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందనే తప్పుడు అభిప్రాయం ఈ వీడియోను అప్‌లోడ్ చేయడంతో కల్గింది. కేసు ఒకవైపే మొగ్గుచూపేలా వీడియో ప్రభావితం చేస్తోంది. అందుకే ఆలస్యంగా కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది'' అని సిబల్ వివరణ ఇచ్చారు.

సుప్రీంకోర్టు అనేది పోస్టాఫీస్ కాదు

ఏకపక్షంగా నేరం జరిగిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందే నిర్ధారించుకుని వెంటనే అభిశంసనకు రాష్ట్రపతికి సిఫార్సు చేసినట్లు స్పష్టమవుతోందని సిబల్ వ్యాఖ్యానించారు. దీంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. '' నివేదికకు అనుగుణంగా వ్యవహరించే ఒక పోస్టాఫీస్‌లా సుప్రీంకోర్టును జమకట్టకండి. సుప్రీంకోర్టు అనేది న్యాయవ్యవస్థకు సంబంధించిన సర్వోన్నతమైన పీఠం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉన్న వాళ్లు తమ విధిని తప్పక నెరవేర్చాల్సి ఉంటుంది. జడ్జిపై తీవ్రమైన నేరారోపణలను రూఢీచేస్తూ ఒక అంతర్గత నివేదిక తమకు అందితే తప్పకుండా వెంటనే రాష్ట్రపతి, ప్రధానికి సమాచారం అందజేయాల్సిన బాధ్యత సీజేఐదే. అది ఆయన విద్యుక్త ధర్మం. అంతర్గత కమిటీ ఏర్పాటు అనేది 1999 నుంచే అమల్లో ఉంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై సిబల్ తన వాదనలు కొనసాగించారు. జడ్జీల తొలగింపు ప్రక్రియ అనేది జడ్జీల (విచారణ)చట్టం ద్వారా మాత్రమే జరగాలిగానీ ఇలా అంతర్గత విచారణ కమిటీ నివేదికతో తొలగింపు ప్రక్రియను మొదలెట్టకూడదు'' అని సిబల్ వాదించారు. వాదనల తర్వాత సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పును రిజర్వ్ చేసింది.

ఆయనో చైనా గురు

రాహుల్‌పై కేంద్ర మంత్రి జైశంకర్ విమర్శలు

న్యూఢిల్లీ: చైనాలో పర్యటించి కూడా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ దేశ ప్రయోజనాలకు లాభం ఒనగూరేలా ఎలాంటి సానుకూల ఫలితాలు తీసుకురాలేదన్న విపక్షాల విమర్శలకు జైశంకర్ దీటుగా బదులిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. '' మన చైనా గురు(రాహుల్)కు ఈపాటి చైనా పరిజ్ఞానం ఎలా వచ్చిందంటే ఆయన 2008లో బీజింగ్ ఒలింపిక్స్ కాలంలో చైనాకు ప్రత్యేక అతిథిగా వెళ్లి అక్కడి వాళ్లతో భేటీ అయ్యారు. చైనా రాయబారితో ప్రత్యేక ట్యూషన్లు చెప్పించుకున్నారు. మరెందరినో చైనా గురువులు (రాహుల్, సోనియాగాంధీ) కలిశారు. వాళ్లలాగా నేనేమీ రహస్య భేటీలు జరపలేదు. ఇటీవల నా చైనా పర్యటనలో సరిహద్దుల వెంట ఉద్రిక్తతల తగ్గింపు, వాణిజ్యం పెంపు, ద్వైపాక్షిక అంశాలపైనే చర్చించా. 1960వ దశకం నుంచే చైనా, భారత్ మధ్య సహకారం మొదలైంది. అంతకంటే బాగా పాక్, చైనాల మధ్య సహకారం బలపడిందని మన చైనా గురు చెబుతున్న దాంట్లో నిజం ఉంది. అయితే ఇందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంభించిన విధానాలే కారణం. పీఓకే రూపంలో భారత భూభాగం పాక్ వశంకావడంతో ఆ భూభాగం గుండా పాక్, చైనాల మధ్య వాణిజ్యం హెచ్చింది. దాంతో భారత్, చైనాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడలేదు. పీఓకేను కోల్పోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది'' అని జైశంకర్ చెప్పారు. '' 41 సంవత్సరాలపాటు విదేశీ వ్యవహారాల్లో పనిచేశా. ముఖ్యంగా గతంలో ఎన్నడూలేనంతగా సుదీర్ఘకాలంపాటు చైనాలో పనిచేసిన భారతరాయబారిని నేనే. అయినా సరే నన్నెప్పుడూ చైనా ప్రత్యేకంగా ఏ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. కానీ మన చైనా గురువులు (రాహుల్, సోనియా) 2008లో బీజింగ్ ఒలింపిక్స్‌లో ప్రత్యేక ఆహ్వానితులుగా అక్కడికి వెళ్లారు'' అని జైశంకర్ అన్నారు.

రింగ్ ఆఫ్ ఫైర్

భూ పొరల్లో మృత్యునర్తనం! • 40 వేల కి.మీ. పొడవైన యమపాశం

ప్రకృతి ఓ దెయ్యంలా మెల్లగా ఒళ్లు విరుచుకుని అలా సాగర జలాల్లోకి కాలు పెట్టింది..! అంతే తీరాన్ని తుత్తునియలు చేసేలా అలలు మిన్నంటి మరీ ఎగిసిపడ్డాయి. ఆ ధాటికి భూమి ఉలిక్కిపడింది. రష్యాను రారెత్తించిన బలమైన భూకంపం, ఆ వెంటనే విరుచుకుపడ్డ సునామీ హడలెత్తించాయి. ప్రపంచపు మోకాలిగా చెప్పదగ్గ ఆ రహస్య ప్రాంతంలో పుట్టిన మంటలు, ప్రకంపనలతో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. ఆ ప్రాంతమే 'రింగ్ ఆఫ్ ఫైర్'. అగ్నిపర్వతాలు ఎందుకు అక్కడే ఉప్పొంగుతాయి? భూకంపాలు ఎందుకు అక్కడే రంచనుగా ప్రతి వారం సంభవిస్తాయి? ఈ వలయం, దాని తాలూకు విలయం వెనక దాగున్న రహస్యం ఏమిటి?

సైలెంట్ కిల్లర్

మౌనంగా కనిపించే మృగాలే మహా ప్రమాదకరం. రింగ్ ఆఫ్ ఫైర్‌లోని అగ్నిపర్వతాలు కూడా ఆ బాపతే. చూసేందుకు నిద్రాణంగా కనిపిస్తాయి కానీ, భూమి లోతుల్లో మంటలు ముదిరిన ప్రతిసారీ ఆ మౌనం పెను శబ్దంగా మారుతుంది. కొన్నిసార్లు విస్ఫోటనంలా బయటపడుతుంది. రష్యాలోని కమ్చా తీరంలో ఎగిసిపడి, ఇటు జపాన్‌తీరాన్ని కూడా తాకిన ఆ రాకాసి అలలకు కారణమదే. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ అచ్చం వలయంలా ఉంటుంది. అతి పెద్దదైన పసిఫిక్ మహాసముద్రాన్ని అట్టడుగున కప్పేసే అగ్నివలయమిది. ఈ మంటల మార్గం దాదాపు 40 వేల కిలోమీటర్ల పొడవుంటుంది! దక్షిణ అమెరికా కొసన మొదలై ఉత్తర అమెరికా తీరాల దాకొనసాగుతుంది. అటు అలాస్కా ద్వీపాలను తాకి, బేరింగ్ సముద్రం దాటి, జపాన్ మీదుగా ఇటు న్యూజిలాండ్ వరకు వ్యాపించి ఉంది. దక్షిణ ధ్రువంలోని మంచు అగ్నిపర్వతాల వరకు చేరుతుంది. ఈ మార్గంలోని దేశాలు మనకు తెలియని ప్రమాదంతో నిత్యం మందుపాతరపై భయం భయంగా గడుపుతున్నాయి. చిలీ, పెరూ, మెక్సికో, అమెరికా, కెనడా, రష్యా, జపాన్, ఫిలిప్పీన్స్, ఇండొనేసియా, న్యూజిలాండ్... ఇలా ప్రపంచంలోని అతి శక్తిమంతమైన అగ్నిపర్వతాలన్నీ ఈ వలయంలోనే ఉన్నాయి. భూకంపాలు, అగ్ని విస్ఫోటనలూ ఈ ప్రాంతంలోనే ఎక్కువ.

పలకల్లో కలకలం

రింగ్ ఆఫ్ ఫైర్‌లో జరుగుతున్నది భూమి లోతుల్లో భూ పలకల పోరాటం. బయటి నుంచి బలంగా, స్థిరంగా కనిపించే భూమి లోలోతుల్లో ఈ భూ పలకలు ఎప్పుడూ కదులుతూనే ఉంటాయి. అవి పరస్పరం ఢీకొన్నప్పుడు భూమి కంపిస్తుంది. ఒక పలక కిందకి జారితే అక్కడ పెను మంటల్లాంటివి పుట్టుకొస్తాయి. రష్యాలో తాజా భూకంపానికి కారణం కూడా ఇదే. పసిఫిక్ ప్లేట్ తాలూకు ఒక పెద్ద భూ పలకం, ఉత్తర అమెరికా పలకం పరస్పరం ఢీకొన్నాయి. దాంతో భూమి లోతుల్లో ఒత్తిడి పెరిగి భూగోళం అంతటినీ ఊపేసింది. అందుకే కమ్చట్కా తీరంలో ఏకంగా 8.8 తీవ్రతతో నేల వణికిపోయింది. ఆ వెంటనే సముద్రం గర్జించి అలలుగా ఎగిసింది. ఇలాంటివి రింగ్ ఆఫ్ ఫైర్‌లో నిజానికి నిత్య సన్నివేశాలే.

పసిఫిక్‌కు గుండెకాయ!

పసిఫిక్ మహాసముద్రాన్ని ఒక సువిశాల శరీరంగా భావిస్తే రింగ్ ఆఫ్ ఫైర్‌ను దాని గుండెగా చెప్పొచ్చు. అక్కడే శ్వాస, అక్కడే ధ్వని, అక్కడే మంట! ఈ గుండె ఒక్కసారి గట్టిగా కొట్టుకుందంటే చాలు... రష్యాలో అలలు ఎగసిపడతాయి. జపాన్ తీరాలు వణికిపోతాయి. అలాంటి గుండెపోటు ఇప్పుడు జరుగుతోంది. అదే కమ్చట్కాలో, జపాన్‌తీరాంలో సునామీ రూపంలో ఎగసిపడింది. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ మానవాళికి ఒక శక్తి, ఒక శాపం, ఒక శాస్త్రం. అది ఎప్పుడు, ఎక్కడ మళ్లీ పుడుతుందో ఎవ్వరికీ తెలీదు. పుట్టిందంటే మాత్రం దాని దెబ్బకు ప్రపంచమంతా విలవిలలాడిపోవాల్సిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్

వాంగా చెప్పినట్టే ..ఐతే కొంచెం లేటుగా!

అవును. ఆమె చెప్పిందే జరిగింది. జపనీస్ బాబా వాంగా పేరిట ఫేమస్ అయిన మాంగా ఆర్టిస్ట్ రియో తత్సుకి చెప్పింది అక్షరాలా నిజమైంది. జపాన్ తీరాలను పెద్ద సునామీ తాకింది. ఆమె చెప్పిన తేదీన కాకపోయినా మొత్తానికైతే ఘటన జరగనే జరిగింది. జపాన్ తీరాన్ని జులై 5న సునామీ ముంచెత్తుతుందని చెప్పగా ఆ ఉత్పాతం జూలై 30న ముంచుకొచ్చింది. దాంతో మాంగా పేరు సోషల్ మీడియాలో మరోసారి మారుమోగుతోంది.

ఎవరీ రియో తత్సుకి?

తత్సుకి సాధారణ మాంగా ఆర్టిస్ట్ కాదు. ఆమె కలల మధ్య నడిచిన సత్యమని చెబితే అతిశయోక్తేమీ కాదు. 'ద ఫ్యూచర్ దట్ ఐ సా (నేను చూసిన భవిష్యత్తు)' పేరిట 1990 దశాబ్దం చివరలో ఆమె ఓ పుస్తకం రాసింది! ఆ పుస్తకంలో తాను నిద్రలో చూసిన కలల్ని కథలుగా మార్చింది. అప్పట్లో దాన్నెవరూ పట్టించుకోలేదు. కామిక్ పుస్తకంగా భావించారు. 2011 మార్చిలో భారీ విపత్తు వస్తుందని పుస్తకంపై ఓ మాట ఉంది. అన్నట్టుగానే అదే నెలలో జపాన్‌ను భూకంపం, సునామీ వణికించాయి. దాంతో అంతా షాకయ్యారు. ఆ ఘటన తర్వాత ఆమెకు భవిష్యద్దర్శన శక్తి ఉందని కొందరు నమ్మడం మొదలుపెట్టారు. తత్సుకి కలలు ఇప్పుడు మరోసారి ప్రజలను భయపెడుతున్నాయి. ఆ పుస్తకానికి 2021లో మరో ఎడిషన్ తీసుకొచ్చిందామె. అందులో ఓ కొత్త తేదీ వేసింది. అదే 2025 జూలై 5. ఆ రోజు ఫిలిప్పైన్స్ సముద్రంలో భారీ విస్ఫోటనం జరగబోతుందని, సముద్రం ఉప్పొంగిబోతుందని, వరుస భూకంపాలు రావొచ్చని చెప్పింది. 2011 సునామీ కన్నా మూడు రెట్లు ఎక్కువ ప్రళయం రావచ్చంటూ డ్రాయింగ్ వేసింది. అంతటి ఉత్పాతం జరగకపోయినా అదే నెలలో జపాన్‌ను సునామీ వణికించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

127 ఏళ్ల తర్వాత భారత్‌కు బుద్ధుని అవశేషాలు

దేశ సాంస్కృతిక వారసత్వానికి సంతోషకరమైన రోజుగా మోదీ అభివర్ణన

న్యూఢిల్లీ: బ్రిటిష్ హయాంలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుని పవిత్ర అవశేషాలను 127 ఏళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి తీసుకొచ్చారు. ఈ వివరాలు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం తన సామాజికమాధ్యమ ఖాతా 'ఎక్స్'లో పంచుకున్నారు. శతాబ్దం తర్వాత బుద్ధుని అవశేషాలు భారత్‌కు తిరిగి రావడం నిజంగా దేశ సాంస్కృతిక వారసత్వానికి సంతోషకరమైన రోజు అని ప్రధాని మోదీ అభివర్ణించారు. 1898 సంవత్సరంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని పిప్రాహ్వ ప్రాంతంలో పురావస్తు తవ్వకాలు ముమ్మరంగా జరిగాయి. ఆ తవ్వకాల్లో బుద్ధుని పవిత్ర అవశేషాలు బయల్పడ్డాయి. అయితే నాటి బ్రిటన్‌పాలకులు భారత్ నుంచి ఈ అవశేషాలను యూకేకు తరలించారు. '' గౌతమ బుద్ధుని పవిత్ర అవశేషాలు ఏకంగా 127 సంవత్సరాల అనంతరం మళ్లీ స్వదేశమైన భారత్‌కు తీసుకురావడం దేశ ప్రజలందరికీ ఎంతో గర్వకారణం. బుద్ధుడు, ఆయన బోధనలతో భారత దేశానికి ఉన్న అనుబంధాన్ని ఈ పవిత్ర అవశేషాలు మరోసారి చాటిచెబుతున్నాయి'' అని 'ఎక్స్'లో ప్రధాని మోదీ పోస్ట్‌పెట్టారు. '' మహాద్భుతమైన ఘన వారసత్వం, సంస్కృతిని పరిరక్షించడంలో మన నిబద్ధతను ఈ అవశేషాలు చాటుతున్నాయి'' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ అవశేషాలు ఈ ఏడాది ప్రారంభంలో ఓ అంతర్జాతీయ సంస్థ చేపట్టిన వేలంపాటలో తొలిసారిగా ప్రత్యక్షమయ్యాయి. దీంతో వీటిని ఎలాగైనా తిరిగి భారత్‌కు రప్పించేందుకు మా ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు కృషిచేసిన వారందరికీ నా అభినందనలు'' అని మోదీ అన్నారు.

నాటి పేటికలో బంగారు రత్నాభరణాలు

piprahwa. com వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం నేపాల్ సరిహద్దులోని పిప్రాహ్వ బౌద్ధమతానికి సంబంధించిన పురాతన స్తూపం ఉంది. అక్కడ నాటి బ్రిటన్ పాలకులు తవ్వకాలు జరిపారు. దాంతో అక్కడ భూగర్భంలో పెద్ద రాతిపెట్టెలో కొన్ని అవశేషాలు బయల్పడ్డాయి. ఇందులో బుద్ధునికి సంబంధించినవిగా భావిస్తున్న అస్థి అవశేషాలు, సున్నపురాయి పేటిక, బంగారు ఆభరణాలు, రత్నాల వంటివి ఉన్నాయి. బుద్ధుని నిర్యాణం తర్వాత బుద్ధుని అవశేషాలను ఆనాటి రాజ్యాల రాజులకు పంపిణీ చేసేందుకు అవశేషాలను కొన్ని భాగాలుగా విభజించారు. అందులో కొంతభాగాన్ని నేడు థాయ్‌లాండ్‌గా పిలుస్తున్న సియామ్ ప్రాంతంలోని రాజుకు అందజేశారు. ఆనాడు తవ్వకాల్లో బయల్పడిన సున్నపురాయి మృతపేటిక ప్రస్తుతం కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. ప్రస్తుతం ఈ పిప్రాహ్వ గ్రామం ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ జిల్లా కేంద్రం సమీపంలో ఉంది. ఇది బుద్ధుడు జన్మించిన లుంబినీ వనానికి కేవలం 9 మైళ్ల దూరంలో ఉంది.



సాక్షి హైదరాబాద్

గురువారం । 31 । జూలై । 2025



రేషనింగ్‌పై రగడ!
గ్రేటర్‌లో 'రేషనింగ్' వ్యవస్థపై రగడ నెలకొంది. పౌరసరఫరాల శాఖ చీఫ్ రేషనింగ్ విభాగం, జిల్లా పరిపాలన యంత్రాంగం మధ్య కొత్త రేషన్ కార్డుల వ్యవహారంపై చిచ్చు రగిలింది. -8లో



కళ్లకు గంత.. ఆ కళ ఓ వింత
కళ్లకు గంతలు కట్టుకుని గీసిన చిత్రాలకు నగర కళాభిమానులు జై కొడుతున్నారు. తాము సైతం అదే కళను సాధన చేస్తూ సృజనాత్మకతను పెంచుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 30.0/23.0

వాతావరణం
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

సన్నాహాల దారిలో..

త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు

- రెండు దశల్లో నిర్మించనున్న హెచ్ఎండీఏ
- మొదటి దశలో రావిర్యాల– మీర్‌ఖాన్‌పేట్
- రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్– ఆమన్‌గల్ వరకు
- మహా నగరాభివృద్ధిలో ఎంతో కీలకం

సాక్షి, సిటీబ్యూరో: ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఫ్యూచర్‌సిటీ మీదుగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సన్నాహాలు చేపట్టింది. రెండు దశల్లో పూర్తిచేయనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్అండ్‌టీ సంస్థ టెండర్లను దక్కించుకున్న సంగతి తెలిసిందే. మొదటి దశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రూ.1665 కోట్లతో చేపట్టనున్న 19.20 కి.మీ. రోడ్డును రిత్విక్ సంస్థకు అప్పగించారు. మొదటి దశలో రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణకు ప్రభుత్వం రూ.246 కోట్లు కేటాయించింది. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్ వరకు 22.3 కి.మీ మేర నిర్మించనున్నారు. రూ.2,365 కోట్లతో చేపట్టనున్న రెండో దశ పనులను ఎల్అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. రెండో దశ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.345 కోట్లు కేటాయించింది. మొత్తం రూ.4030 కోట్లతో 41 కిలోమీటర్లకు పైగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం హెచ్ఎండీఏ రూ.591 కోట్లతో మొత్తం 1003.61 ఎకరాల భూములను సేకరించనుంది. ఇందులో సుమారు 202 ఎకరాలు టీజీఐఐసీకి చెందినవి కాగా, మరో 231.72 ఎకరాల అటవీ భూములు కూడా ఉన్నాయి. భూముల సేకరణ కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులను గతంలోనే ఇచ్చింది.



హైదరాబాద్ 'ఫ్యూచర్'కు మణిహారం..

హైదరాబాద్ మహా నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్‌సిటీ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుతో ఆర్థికాభివృద్ధి పరుగులు పెట్టనుందని ప్రభుత్వం భావిస్తోంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రధాన రహదారుల మధ్య నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఎంతో కీలకం కానుంది. టౌన్‌షిప్‌లు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, లాజిస్టిక్ హబ్స్ తదితర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు సీమ్‌లెస్ జర్నీ సదుపాయాన్ని అందజేయనుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు కొత్తగా నిర్మించనున్న మెట్రో రైల్ కారిడార్‌ను గ్రీన్‌ఫీల్డ్ మార్గంలోనే చేపట్టనున్నారు. ఇతర రూట్లలో ఎలివేటెడ్ కారిడార్‌లుగా నిర్మించనుండగా. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో మెట్రోరైల్ కారిడార్ భూమిపైనే నిర్మించనున్నారు. పర్యావరణ హితమైన ఫ్యూచర్‌సిటీ విస్తరణకు ఈ మార్గం దోహదం చేయనుంది. టెండర్లను దక్కించుకున్న సంస్థలకు త్వరలో వర్క్ ఆర్డర్‌లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ముష్కి చెరువుపై విజిలెన్స్ విచారణ



ముష్కి చెరువు వద్ద విచారణ చేస్తున్నఅధికారులు

మణికొండ: ముష్కి చెరువు అభివృద్ధికి హెచ్ఎండీఏతో తత్వా రియల్ ఎస్టేట్ సంస్థ చేసుకున్న ఒప్పందం, ఇప్పటి వరకు చేపట్టిన పనులు, చెరువును కుదించటం వెనక ఉన్న మతలబులపై హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. బుధవారం విజిలెన్స్ డీఎస్పీ, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో కలుస్తున్న మురుగునీటిని దత్తత, స్వచ్ఛంద సంస్థలు అరికట్టడలేదని,అందుకు విరుద్ధంగా ముష్కి చెరువులో మురుగునీటినికలపటం విడ్డూరంగాఉందన్నారు. చెరువుల విస్తీర్ణాన్ని పరిరక్షించాల్సింది పోయి దాని ఏకంగా 40 ఎకరాలు కుదించటం వెనక పెద్ద కుట్ర ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువులో మురుగునీరు కలవటంతో తీవ్ర దుర్గంధం, దోమల సమస్యతో చుట్టు పక్కల ప్రాంతాల్లోనివసించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ రంగ శాఖల మధ్య సమన్వయం లేకపోవటంతోనే ఆగడాలు సాగుతున్నాయన్నారు.చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన విజిలెన్స్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ పద్మప్రియ త్వరలోనే జలమండలి, మున్సిపల్, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ తదితర శాఖలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హైడ్రా కమీషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన నెల రోజుల సమయంలోపు చెరువును పూర్వస్థితికి తెచ్చేందుకు, తప్పులు చేసిన సంస్థలపై చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయి, నార్సింగి మున్సిపాలిటీ ఏఈ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ నరేంద్ర, నివాసితుల సంఘం నాయకుడు గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనురాగ బంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ పర్వదినం సమీపిస్తున్న తరుణంలో మార్కెట్‌లో విభిన్న రకాల రాఖీలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటినుంచే కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి. నగరంలోని బేగంబజార్‌లో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి.

సింగిల్ యూజ్.. ప్లాస్టిక్ బ్యాన్

చట్ట సవరణ చేయనున్న జీహెచ్ఎంసీ

- ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల బ్యాన్ ప్రధాన ధ్యేయం
- 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉంటే నిషేధం
- పకడ్బందీగా అమలుకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్ నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ వినియోగాన్ని త్వరలో పూర్తిగా నిషేధించనున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో నగరంలో దీని నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే క్యారీ బ్యాగ్‌లను సంపూర్ణంగా నిషేధించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ పేరిట దీన్ని అమల్లోకి తేనున్నారు. గతంలోనూ పలు పర్యాయాలు నిర్ణీత మైక్రాన్ల కంటే తక్కువ మైక్రాన్ల ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. కానీ, ఆదిలో అట్టహాసమే తప్ప అమలులో అటకెక్కింది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..
ప్లాస్టిక్ నిషేధం కోసం 2007 నుంచే ప్రయత్నాలు చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నిషేధం అమలు కోసమని పెనాల్టీలను రూ.5 వేల నుంచి మొదలు పెడితే లక్ష రూపాయల వరకు విధిస్తూ పలు సర్క్యులర్లు, జీవోలు జారీ అయినప్పటికీ, అమలులో మాత్రం నీరు గారింది. ఈ నేపథ్యంలో దీన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు తాజాగా జీహెచ్ఎంసీ చట్ట సవరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వ ఆమోదం అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించనున్నారు. తద్వారా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ వినియోగంలో లేని నగరంగా హైదరాబాద్ ఉండాలని భావిస్తున్నారు. టీసీయూర్ (తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్) వరకు దీన్ని అమలు చేసే ఆలోచనలున్నప్పటికీ.. తొలుత చట్ట సవరణ ద్వారా జీహెచ్ఎంసీ పరిధి వరకు కట్టుదిట్టంగా అమలు చేయాలని భావిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని చట్ట సవరణ చేయనున్నారు.

గతంలో ఇలా..
- ఎన్ని మైక్రాన్ల లోపు ఉంటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ో క్రమేపీ మారుతోంది. 20 మైక్రాన్ల లోపు వాటిని ఒకప్పుడు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌గా పరిగణించగా, ప్రస్తుతం ఇది 120 మైక్రాన్లకు చేరింది. జీహెచ్ఎంసీ ఏర్పాటైన తొలినాళ్లలోనే 2007 ఆగస్టు 8న జారీ అయిన సర్క్యులర్ మేరకు 20 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్స్ అమ్మినవారికి రూ.5వేలు, వినియోగించిన వారికి రూ.500 జరిమానాలు విధించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 2011లో 40 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్స్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, విక్రయాలు జరగరాదన్నారు.
- 2016లో మొదటిసారి రూ.10వేల జరిమానాతో పాటు మూడోసారి సంస్థ మూసివేత వరకు చర్యలుంటాయని పేర్కొన్నారు. 2017లో వెలువడిన జీవో మేరకు నిషేధం అమల్లో జీహెచ్ఎంసీ విఫలమైతే జీహెచ్ఎంసీకి పీసీబీ రూ.25వేల జరిమానా విధిస్తుందని పేర్కొన్నారు. దాదాపు మూడేళ్ల క్రితం 2022లో డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లకు లక్ష రూపాయల జరిమానా నుంచి ప్రారంభించి సంస్థల సీజ్ వరకు చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వు జారీ చేశారు. ఒక టాస్క్‌ఫోర్స్ సైతం ఏర్పాటు చేశారు. అమలులో మాత్రం విఫలమయ్యారు. పర్యవసానంగా ఏ మార్కెట్‌కు, దుకాణానికి వెళ్లినా ప్రజలకు మాత్రం క్యారీబ్యాగ్‌ల భారం అదనంగా పడుతోంది. గత పాలకమండలిలోనూ నగరంలో ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధానికి ఆమోదం తెలిపిన సర్వసభ్య సమావేశం ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాక తిరిగి పట్టించుకోలేదు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు..
నిషేధానికి చేయనున్న చట్ట సవరణలోనూ కొన్ని ప్రత్యేక అవసరాలకు మినహాయింపులు ఉండనున్నట్లు తెలిసింది. నిషేధం అమల్లోకి వస్తే నగరంలో వివిధ సమస్యలు తగ్గుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నాలాల్లో వ్యర్థాలు చాలా వరకు తగ్గుతాయి. తద్వారా వరద సమస్యలు తగ్గుతాయి. ఎగుమతి కోసం ప్రత్యేకంగా ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ ఉత్పత్తి చేసేవారికి, సీల్డు సరుకుల ప్యాకేజీలు, పాలు,పాల ఉత్పత్తుల ప్యాకింగ్స్, నర్సరీల అవసరాలకు అనుమతించే అవకాశం ఉంది. కాగా.. ప్రభుత్వ నిర్ణయానికనుగుణంగా మినహాయింపులు ఉండనున్నాయి.

పెండింగ్ ఆర్వోబీలు, ఆర్‌యూబీలను త్వరితగతిన పూర్తి చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీల నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న రైల్వేలెవల్ క్రాసింగ్‌లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో జీహెచ్ఎంసీ, దక్షిణమధ్య రైల్వే అధికారుల సంయుక్త సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్‌వీ కర్ణన్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్, హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ మేనేజర్ కె.ముత్యాలనాయుడు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు చోట్ల ఉన్న లెవల్ క్రాసింగ్‌లతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ట్రాఫిక్ స్తంభించిపోతోందని పేర్కొన్నారు. దశలవారీగా వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. మరోవైపు నాంపల్లి, మౌలాలీ, హఫీజ్‌పేట్ రైల్వేయార్డులకు పెద్ద ఎత్తున వచ్చి చేరుతున్న డ్రైనేజీ నీటిని అరికట్టేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా రైల్వే అధికారులు కోరారు.

యూపీహెచ్‌సీ నిర్మాణాలను సత్వరమే చేపట్టండి

కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని గుర్తించిన వివిధ ప్రాంతాల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ సత్వరమే చేపట్టాలని కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో 14 యూపీహెచ్‌సీలకు ఒక్కోదానికి 200 చదరపు గజాలకు పైగా స్థలం ఉండాలని ఆమె సూచించారు. ఖైరతాబాద్‌లో 6, చార్మినార్‌లో 4, కంటోన్మెంట్‌లో 4.. మొత్తం 14 యూపీహెచ్‌సీ నిర్మాణాలు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, సీఎంఓహెచ్ డాక్టర్ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్, హేమలత, జీహెచ్ఎంసీ ఇంజినీర్లు సువర్ణ, రాధిక, డీఈ శివ ప్రకాష్, జగదీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతే టార్గెట్

- గ్రేటర్‌లో ముమ్మరంగా వర్షాకాల పారిశుద్ధ్య కార్యక్రమం
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

లక్డీకాపూల్: వర్షాకాలం నేపథ్యంలో నగర పౌరుల ఆరోగ్యమే ధ్యేయమని జీహెచ్ఎంసీ యంత్రాంగం భావిస్తోంది. గ్రేటర్ పరిధిలో ఈ నెల 29న ప్రారంభమైన వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే 30 వార్డుల్లో పూర్తి కాగా వచ్చే నెల 8 నాటికి మొత్తం 150 వార్డులను పూర్తి స్థాయిలో క్లీన్ చేసేందుకు సమాయత్తమైంది. ఈ క్రమంలో 'ఆరోగ్య, పరిశుభ్ర హైదరాబాద్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత మార్గదర్శనంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ నేతృత్వంలో ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్ ముందుకు సాగుతోంది. ఈ డ్రైవ్‌లో ఘన, నిర్మాణ, కూల్చివేత, పచ్చి వ్యర్థాలు, ఇంజినీరింగ్, అర్బన్ బయో డైవర్సిటీ విభాగాల పనుల కారణంగా ఏర్పడిన మిగులు వ్యర్థాలు, వర్షాల వల్ల ఏర్పడిన సిల్ట్ డిపాజిట్‌లను తొలగిస్తున్నారు. వీటిపై కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్ర కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా దోమల నివారణకు నిర్మాణాత్మకమైన చర్యలకు దిశానిర్దేశం చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయవద్దంటూ నగర ప్రజలకు కమిషనర్ సూచిస్తున్నారు. బుధవారం హిమాయత్‌నగర్ విట్టల్‌వాడీ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో కార్పొరేటర్, డిప్యూటీ కమిషనర్‌లు పాల్గొన్ని ప్రజాభాగస్వామ్యంతో చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలోని చెత్త, చెదారం, వరదలతో ఏర్పడిన సిల్ట్ తొలగించారు. గోషామహల్ సర్కిల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ తెలిపారు.





లక్డీకాపూల్‌లో ట్రాఫిక్‌జాం..

నగరంలో
మోస్తరు వర్షం

నగరంలో బుధవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రహదారులపై వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

నిరంతరాయంగా పూడికతీత

నాలాలు, క్యాచ్‌పిట్లు, కల్వర్టులపై హైడ్రా కన్ను

- ఎక్కడ చూసినా భారీ స్థాయిలో కనిపిస్తున్న వ్యర్థాలు


సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నాలాలు, క్యాచ్ పిట్లు, కల్వర్టులు వద్ద హైడ్రా సిబ్బంది నిరంతరాయంగా కన్నేసి ఉంచుతున్నారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు సజావుగా సాగేందుకు, సమీప ప్రాంతాలకు ముప్పు తప్పించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన వరద కాలువలకు ఇప్పుడు మోక్షం లభిస్తోంది. హైడ్రా అధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు (డీఆర్ఎఫ్), మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ (ఎంఈటీ) నిరంతరాయంగా పని చేస్తున్నాయి. వర్షం కురిసినప్పుడు ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఈ బృందాలు వర్షం లేని సమయంలో పూడికతీత పనులు చేపడుతున్నాయి. కల్వర్టులు, క్యాచ్‌పిట్లు, వరద కాలువల వద్ద లారీల కొద్దీ పూడిక బయట పడుతోంది. అల్వాల్‌లోని బృందావన్ కాలనీలోని కల్వర్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, సిల్ట్‌ను హైడ్రా తొలగించింది. బుల్కాపూర్ నాలాలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సిల్ట్‌తో పాటు చెత్తను తొలగించే పనులు జరుగుతున్నాయి. టోలీచౌక్ ప్రాంతంలోని హకీంపేట, హఫీజ్ బాబా నగర్, సాబాజ్‌కాలనీ అయేషా మసీద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో టన్నుల కొద్దీ చెత్త బయటకు వస్తోంది.



ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్స్‌లోని సాయి సదన్ కాంప్లెక్స్, వివేకానంద్ కాలనీలోని క్యాచ్ పిట్స్ నుంచి మట్టిని తొలగిస్తున్నారు. శివరాంపల్లిలోని ఇందిరా నగర్ కాలనీలో నాలా నుంచి తీసిన పూడికను లారీలతో తరలిస్తున్నారు. బోరబండలోని పెద్దమ్మనగర్‌లో ఒకప్పుడు వర్షం పడితే వరద నీరు రహదారులను ముంచెత్తేది. అక్కడి నాలాలు, క్యాప్‌పిట్స్‌లో సిల్ట్ తొలగించడంతో ఈ ఇబ్బంది తప్పింది. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్ రోడ్డులోని కూడికుంట లేక్ ఔట్ లెట్‌లో పేరుకుపోయిన చెత్తను హైడ్రా తొలగించింది.

నైసార్ ప్రయోగానికి కూకట్‌పల్లి పరికరాలు

బ్యాటరీ స్లీవ్‌లెస్‌లను అందించిన నాగసాయి ఇంజినీరింగ్ కంపెనీ



కంపెనీ యజమాని నాగభూషణ్‌రెడ్డి

కూకట్‌పల్లి: ప్రపంచంలోనే ప్రతి అణువును పసిగట్టే ప్రతిష్టాత్మకమైన నైసార్ శాటిలైట్ ప్రయోగానికి నగరంలోని కూకట్‌పల్లి పారిశ్రామిక ప్రాంతానికి చెందిన నాగసాయి ప్రొసిషన్ ఇంజినీర్స్ లిమిటెడ్ కంపెనీ మరోసారి విలువైన పరికరాలను అందజేసి చరిత్ర సృష్టించింది. 1998 నుంచి ఇప్పటి వరకు 58 శాటిలైట్ ప్రయోగాల్లో పాలు పంచుకున్న నాగసాయి కంపెనీ నైసార్ ప్రయోగంలో తమ విలువైన సేవలు అందించడాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఇప్పటి వరకు చంద్రయాన్ -3, చంద్రయాన్ -2, ఆదిత్య ఎల్-1, డాకింగ్ ఇన్ స్పేస్ వంటి ప్రతిష్టాత్మకమైన ప్రయోగాల్లో నాగసాయి పాత్ర కీలకంగా మారింది. భవిష్యత్తులో శాటిలైట్ ప్రయోగమైన చంద్రయాన్-4కు గగన్‌యాన్ ప్రాజెక్ట్‌కు కూడా సేవలందించనుంది. నైసార్ ప్రయోగం ద్వారా 12 రోజుల్లో భూమి మీద ఉండే ప్రతి వస్తువును స్కాన్ చేసే గుణం ఉంది. ఇది ప్రపంచానికి ఎంతో ఉపయోగకరం. ఈ శాటిలైట్ ఒకేసారి 242 కిలోమీటర్లను స్కాన్ చేస్తుంది. 12 రోజుల్లోనే భూమిని మొత్తం పరిశీలిస్తుందని శాస్త్రవేతలు చెబుతున్నారు. నైసార్ ప్రయోగం తుపాన్లు, భూకంపం, సునామీలను ముందే పసిగడుతుంది. కొండ చరియలు విరిగిపోవడాన్ని, అగ్ని పర్వత విస్ఫోటాలను కనిపెడుతుంది. భూ వాతావరణ మార్పులు వంటి సేవలను అందించబోతోంది. నాసా, ఇస్రో సంయుక్తంగా ఏర్పడ్డ నైసార్ శాటిలైట్‌కు కూకట్‌పల్లి నుంచి పరికరాలు అందించడం ఎంతో గర్వకారణంగా ఉందని నాగసాయి ఇంజినీరింగ్ కంపెనీ యజమాని నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 58 శాటిలైట్ ప్రయోగాల్లో నాగసాయి కంపెనీ పరికరాలను అందించిందన్నారు. నాగసాయి కంపెనీకి ఇస్రో ఛైర్మన్, భారత ప్రధాని నుంచి ప్రశంస పత్రాలు అందాయన్నారు. బుధవారం సాయంత్రం అంతరిక్షంలోకి వెళ్లే నైసార్ కూడా విజయవంతమై ప్రపంచానికి ఎంతో ఉపయోగకరంగా ఉండాలని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



నైసార్ శాటిలైట్‌కు అందించిన పరికరాలు

సాక్షి గురువారం । 31 । జులై । 2025

వాటర్ స్పోర్ట్స్‌కు హబ్‌గా తెలంగాణ

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


విజేతలతో గవర్నర్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: అన్ని క్రీడల తరహాలోనే వాటర్ స్పోర్ట్స్‌కు కూడా తెలంగాణ హబ్‌గా మారుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు మెడల్స్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ మంచి చోటన్నారు. ఇక్కడ అన్ని రకాల వసతులు వినియోగించుకుని క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కాగా యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ బాలుర విభాగంలో మహ్మద్ రిజ్వాన్ గోల్డ్ మెడల్ గెలవగా..కృష్ణ వెంకటాచలం రామకృష్ణ సిల్వర్ , ఆకాశ్ కుమార్ కాంస్యాన్ని సొంతం చేసుకున్నారు. ఇదే కేటగిరీలో బాలికల విభాగంలో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్‌కు చెందిన షేర్ రమీజా భాను స్వర్ణం గెలవగా..సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ సెయిలర్ శృంగేరి రాయ్ రజతాన్ని, తెలంగాణకు చెందిన చంద్రలేఖ కాంస్యం కైవసం చేసుకున్నారు. ఐఎల్ సిఎ4 కేటగిరీలో బాలుర విభాగంలో రమాకాంత్, ప్రీతిసివాల్, అంకిత్ సింగ్ సిసోడియా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో ఆస్తా పాండే స్వర్ణం, తుల్సీ పట్లే రజతం, కాత్యాయని కౌశిక్ కాంస్యం సాధించారు. ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ బాలుర విభాగంలో ఆడ్రియన్ ఆంటోని స్వర్ణం, యువరాజ్ రజతం, వి.హనుమంతు కాంస్యం సాధించారు. ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ బాలికల విభాగంలో సోనియా బరార్ స్వర్ణం , జె.శిరీష రజతం, శ్రిష్టి బరార్ కాంస్యం సాధించారు. ఇక 29ఈఆర్ బాలుర విభాగంలో అజయ్ గజ్జి,సత్యం జా స్వర్ణం, శరణ్య జాదవ్, శివం వాల్మీకి రజతం, ఆకాశ్ ఎం.తంగాయ్, కృష్ణ దివాకర్ కాంస్యం సాధించారు. 420 మిక్స్‌డ్ కేటగిరీలో తనూజా కామేశ్వర్, శ్రవణ్ కత్రావత్ స్వర్ణం, సమృద్ధి, పార్థ్ సింగ్ చౌహాన్ రజతం, ఏకలవ్య బతం, వనిషికా సికర్వార్ కాంస్యం గెలిచారు. వీరంతా గవర్నర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ మన తెలంగాణ జగిత్యాల జిల్లాలో వ్యవసాయ భూమి శ్రీగంధం మొక్కలతో అర ఎకరం కేవలం 10 లక్షల రూపాయలు మాత్రమే ఆఫర్ ఒక్క నెల రోజులు మాత్రమే. ఫోన్: 9515999718 [HA-16114]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800535]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, A JOSEPHINE D/o. J MARY R/o 1- 38-330, Indiramma Nagar, Near Govt HighSchool, Police Line, Rasoolpura, Sec-bad, Hyd, T.S. Shall henceforth be known As ANNAI MARIA JOSEPHINE D/o. LAWRENCE. [SCA25006836]

■ I Praveen S/o, Nagshetty R/o Plot No 02, Udgir Road, Near RRK College, Akkamahadevi Chouk, Madhav Nagar, Bidar, Karnataka, 585402 have changed my name to Praveen Biradar S/o Nagshetty Biradar. [DA-44899]

■ I, Durre Shahwar W/o Mohammad Masood Pasha. H. no. 1-5-214, Suraram Colony, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Hyderabad, Telangana - 500055. Have changed my name from Durre Shahwar to Ghousia Durreshahwar as per Aadhar. For all Records [SCA25006839]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783379]

Wanted

■ Hyd-రియల్ ఎస్టేట్ Co.కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్ కై జీ+కమీ+2 వీలర్+రూం+భో. ఫ్రీ, Age: 32, సె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15063]

■ అర్జెంటుగా సెక్యూరిటీగార్డ్స్ ఎర్రగడ్డ, సనత్‌నగర్, ఆదిబట్ల, గుమ్మడిదల, KPHB, బంజారాహిల్స్, గచ్చిబౌలి. వాచ్‌మెన్, హౌస్ కీపింగ్ కావలెను. Salary +Food+రూం. Ph: 8331837003, 9908533694 [HA-16115]

■ క్విక్ జాబ్స్: రిసెప్షనిస్ట్, టి.కా., క్యాషియర్, డే.ఎంట్రీ, కం.ఆపరేటర్, ఫార్మా, షాపింగ్ మాల్, హెల్పర్స్, సె.గార్డ్, సూ॥వై., జీ॥ 15-35K ఫ్రీ రూం+మీల్స్. 7989824632 [SCA25006785]

■ ఫ్రీ ట్రైనింగ్: వీ॥ఎడిటింగ్, న్యూస్ రీ॥, యాంకర్స్, రిపోర్టర్, కెమెరామెన్ కోర్స్. 45/90 డేస్ M/F, పా/పు టైం, వ-16-55, జీ:12-30K. రూం+మీల్స్. 9505251777 [SCA25006784]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]

■ Wanted Business Operation Manager & Tellecallers Age : 25 to 35. Salary. 55,000 Contact. svgemsand jewellers. 9966709787, 9100522814 [HA-8248]

■ Wanted. Receptionst & Counseelor(Female) with any Degree. Sri Sai Edu Academy, VRK Silk, Near By KPHB. 9701067576, 9000119376 [HA-583]

■ Nampally, Malakpet, Hayat nagar, Jublihills areas Require Security Guards, No consultancy 9700746126, Malakpet [SCA25006606]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

మహిళా ఎస్ఐపై దాడి: కేసు నమోదు

బంజారాహిల్స్: విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐని తోసేయడంతో పాటు పోతరాజు కొరడాతో కొట్టిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ప్రభుత్వ స్థలంలో పెద్దమ్మ తల్లి ఆలయం కూల్చివేత ఘటనకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సంఖ్యలో బస్తీవాసులతో కలిసి కొంతమంది నేతలు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలంలోకి వెళ్లనీయకుండా బంజారాహిల్స్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా బందోబస్తు చేస్తున్న పోలీసులను తోసుకుంటూ వెళ్తున్న క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో భాగంగా బంజారాహిల్స్ ఎస్ఐ సంధ్యారాణితో పాటు మరికొంత మంది పోలీసులను తోసేశారు. దీంతో పాటు పార్శిగుట్ట ప్రాంతం నుంచి శివశక్తి అవతారంలోని పూజాసాయి అనే వ్యక్తి తన చేతిలోని పోతరాజు కొరడాతో ఎస్ఐ సంధ్యారాణి తలపై కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదుతో పూజాసాయిపై బీఎన్ఎస్ 121(1), 195 (1), 329 (3), రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళా జూనియర్ ఆర్టిస్ట్‌కు వేధింపులు

బంజారాహిల్స్: తనను బెదిరిస్తూ డబ్బులు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామంటూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ మహిళా జూనియర్ ఆర్టిస్ట్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని ఇందిరానగర్‌లో నివసించే జి.వెంకటలక్ష్మి అనే జూనియర్ ఆర్టిస్ట్‌ను బుజ్జిరెడ్డి, వెంకటలక్ష్మి అనే ఇద్దరూ కలిసి తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్నారు. మానసికంగా, శారీరకంగా వేధించడమే కాకుండా తన గదికి వచ్చి దుర్భాషలాడుతున్నారని, బెదిరిస్తున్నారని, తనకు క్యారెక్టర్‌ను దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిరోజూ తనకు ఫోన్ చేసి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకపోతే తన కాల్ రికార్డింగ్స్, వీడియోలను సోషల్ మీడియాలో, కుటుంబ సభ్యులకు షేర్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల వ్యాపారి కిడ్నాప్..నగదు దోపిడీ!

ఫిలింనగర్: నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వ్యక్తిని ఆటోలో వచ్చిన ముగ్గురు ఆగంతకులు కిడ్నాప్ చేసి పర్సుతో పాటు నగదు లాక్కెళ్లిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం... షేక్‌పేట వినోభానగర్‌కు చెందిన హరిజన్ శ్రీనివాస్ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం అర్ధరాత్రి తన స్నేహితుడు బాల్‌రాజ్‌తో కలిసి సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. ద్వారకానగర్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో వీరి వద్ద సడెన్ బ్రేక్ వేసి బెదిరించగా బాల్‌రాజ్ అక్కడి నుంచి తప్పించుకున్నాడు. శ్రీనివాస్‌ను ఆటోలో ఉన్న ముగ్గురు ఆగంతకులు బలవంతంగా ఆటోలోకి ఎక్కించి కొద్దిదూరం తీసుకువెళ్లి కొట్టి పర్సు లాక్కొన్నారు. అందులో ఉన్న రూ.6 వేల నగదు, ఏటీఎం, పాన్ కార్డులు తీసుకుని శ్రీనివాస్‌ను ఆటో నుంచి బయటకు తోసేసి ఉడాయించారు. అదే రోజు రాత్రి బాధితుడు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆటోలో వచ్చిన ఆగంతకుల కోసం గాలింపు చేపట్టారు.

బాలికను వేధించిన కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

అంబర్‌పేట: మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో (పోక్సోయాక్ట్) నిందితుడికి నాంపల్లి అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్ కథనం ప్రకారం.. బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూస్ క్వార్టర్స్‌కు చెందిన సాలిమీద వంశీ (20) డెకరేషన్ పనులు చేస్తుంటాడు. 2022లో వంశీ అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన అప్పటి అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నిందితుడు వంశీని అరెస్ట్ చేసి కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ టి.అనిత బుధవారం నిందితుడు వంశీకి 20 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.రెండు లక్షల పరిహారాన్ని ప్రకటిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

వైద్యురాలి అదృశ్యం

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఓ ఆస్పత్రిలో పనిచేసే వైద్యురాలు కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ విజయ్‌నగర్ కాలనీకి చెందిన మందం శిరీష జనరల్ ఫిజీషియన్ వైద్యురాలు. అమీర్‌పేట వెల్‌నెస్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శిరీషకు ఆంటోని అనే వ్యక్తి పరిచయం కాగా అతడికి ష్యూరిటీగా ఉండి బ్యాంకులో రుణం ఇప్పించింది. ఈ విషయం ఇంట్లో తల్లిదండ్రులకు తెలియడంతో రుణం ఎందుకు ఇప్పించావని మందలించారు. అనంతరం ఈ నెల 28న ఎప్పటిలాగే ఆసుపత్రికి వెళ్లిన శిరీష డ్యూటీ ముగించుకుని ఇంటికి రాలేదు. దీంతో సోదరి ఫోన్ చేయగా ఇంటికే వస్తున్నానని చెప్పి ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసింది. మరుసటి రోజు సోదరి ఫోన్‌కు మెసేజ్ పెట్టింది. 'ఇంట్లో గొడవ జరగడం వల్ల ఇంటికి రాలేదు. మా స్నేహితురాలి ఇంటికి వచ్చాను. తర్వాత వస్తానని ఇంట్లో చెప్పు' మెసేజ్ చేసింది. తల్లి సుధేష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

పోచారం: అనారోగ్యం కారణంగా ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడకు చెందిన బత్తిని సుజాత, అంజయ్య దంపతుల కూతురు నాగమణి (19) గుండెలో రంధ్రం ఉండటంతో శారీరకంగా చురుకుగా ఉండేది కాదు. 10వ తరగతి వరకు చదువుకున్న తర్వాత ఆరేళ్లుగా ఇంటి వద్దే ఉంటోంది. నాగమణి అనారోగ్యంగా ఉండటంతో నెల రోజుల క్రితం సమీపంలోని ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. రక్తహీనత ఉన్నట్లు వైద్యులు గుర్తించి అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులకు తాను భారంగా ఉన్నట్లు నాగమణి భావించేది. మంగళవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా, ఆమె సోదరుడు స్నేహితులను కలిసేందుకు బయటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ప్రయాణికురాలి వద్ద విదేశీ పక్షుల పట్టివేత

శంషాబాద్: విదేశీ పక్షులను అక్రమంగా తరలిస్తున్న మహిళను కస్టమ్స్ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన నస్రుల్లా ఇర్ఫాన్ బ్యాంకాక్ నుంచి బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆమె లగేజీలను తనిఖీ చేసిన కస్టమ్స్ అధికారులకు అందులో ఆస్ట్రేలియా, నార్త్ క్వీన్‌లాండ్‌లో ఉండే అరుదైన డబుల్ ఐడ్ ఫిగ్ ప్యారట్స్ (రామచిలుకలు) 11 సజీవంగా ఉన్నవి, రెండు చనిపోయి ఉన్నవి, హాంగ్‌కాంగ్‌లో అధికంగా ఉండే సిల్వర్ ఈయర్డ్ మెసియా (వెండి చెవులు) తెల్ల చెవులు కలిగిన పక్షులు (రెండు చనిపోయిన పక్షులను) ఉండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన అక్రమ రవాణాకు సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రేషనింగ్‌పై రగడ!

పౌర సరఫరాల శాఖ వర్సెస్ రెవెన్యూ శాఖ

- చీఫ్ రేషనింగ్ ఆఫీస్ పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ పర్యవేక్షణ
- కొత్త రేషన్ దరఖాస్తుల విచారణలో అలసత్వం
- కార్డుల మంజూరులో చేతివాటంపై కలెక్టర్ సీరియస్
- రెవెన్యూ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వానికి లేఖ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో 'రేషనింగ్' వ్యవస్థపై రగడ నెలకొంది. పౌరసరఫరాల శాఖ చీఫ్ రేషనింగ్ విభాగం, జిల్లా పరిపాలన యంత్రాంగం మధ్య కొత్త రేషన్ కార్డుల వ్యవహారంపై చిచ్చు రగిలింది .కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణలో అలసత్వం, కార్డుల మంజూరులో చేతివాటాన్ని తీవ్రంగా పరిగణించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఏకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అన్ని జిల్లాల మాదిరిగా 'హైదరాబాద్'లో కూడా ప్రజాపంపిణీ వ్యవస్థ పర్యవేక్షణ బాధ్యతను జిల్లా పరిపాలన యంత్రాంగం పరిధిలో తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి లేఖరాసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అయితే హైదరాబాద్‌లో ' ప్రజాపంపిణీ వ్యవస్థ' ను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చీఫ్ రేషనింగ్ విభాగం ఉండటంతో పౌరసరఫరాల శాఖ కలెక్టర్ ప్రతిపాదనలపై విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ పరిధిలో సుమారు 6.48 లక్షల కార్డులు ఉన్నాయి. గత ఆరు మాసాల నుంచి సుమారు 2,19,321 కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఇప్పటి వరకు కేవలం 47,374 దరఖాస్తులపై మాత్రమే క్షేత్రస్థాయి విచారణ పూర్తికాగా, 44,415 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. మిగిలిన కుటుంబాల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో మగ్గుతున్నాయి. వాస్తవంగా కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికి సిబ్బంది కొరత, అధికారుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం, చేతులు తడిపితే కాని ముందుకు సాగని పనితీరుతో క్షేత్రస్థాయి విచారణ నత్త నడకగా సాగుతోంది.

మంత్రి చొరవతో..

క్షేత్రస్థాయి విచారణలో జాప్యం జరుగుతుండడాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్‌గా పరిగణించారు. వారం క్రితం రేషన్‌కార్డుల వ్యవహారంపై సమీక్ష నిర్వహించి పెండింగ్ అప్లికేషన్ ప్రాసెస్, వెరిఫికేషన్ సర్కిళ్ల వారీగా నోడల్ అధికారుల పర్యవేక్షణలో సివిల్ సప్లయ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీల సమన్వయంతో చర్యలు చేపట్టే విధంగా ఆదేశించారు. ఇందు కోసం జీహెచ్ఎంసీ నుండి 1100 మంది ఆర్పీలను కేటాయించారు. దీంతో గత నాలుగురోజుల క్రితం పౌరసరఫరా శాఖ సర్కిల్స్‌లోని పెండింగ్ దరఖాస్తులను జీహెచ్ఎంసీకి అప్పగించింది. ఇక వార్డుల వారీగా కొత్త దరఖాస్తులపై విచారణ కొనసాగుతోంది.

సిఫార్సులకే ప్రాధాన్యం

హైదరాబాద్ పౌరసరఫరాల శాఖ పరిధిలో ఇప్పటి వరకు మంజూరైన కొత్త రేషన్ కార్డుల్లో సగానికి పైగా సిఫార్సులతోనే ఇచ్చినట్లుగా ఆరోపణలు వినవస్తున్నాయి. కొందరు మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్ల మధ్య దళారులుగా అవతారమెత్తి చేతివాటం ప్రదర్శిస్తూ కార్డులు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. దరఖాస్తుదారుల నుంచి కనీసం రూ.3 వేల నుండి 5 వేల వరకు వసూలు చేసి పక్షం రోజుల్లో కార్డులు మంజూరు చేయిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. సిఫార్సులు లేని దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో మగ్గుతుండగా, సిఫార్సులుంటే పక్షం రోజుల క్రితం దరఖాస్తులకు సైతం మోక్షం లభిస్తున్నట్లు తెలుస్తోంది.

పెండింగ్‌లో ప్రతిపాదనలు

ఉమ్మడి ఏపీలోనే ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మహానగరంలోని 12 అర్బన్ సర్కిల్స్‌ను సీఆర్వో పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనలు రూపొందించారు. తాజాగా అర్బన్ సర్కిల్స్ 14కు చేరాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 14 సర్కిల్స్ ఉన్నాయి. అయితే హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ వ్యవస్థ మాత్రం తొమ్మిది అర్బన్ సర్కిళ్లతో పనిచేస్తుండగా, మరో ఐదు సర్కిళ్లు నగర శివారు ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఇవి పూర్తిగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తున్నాయి. హైదరాబాద్ సీఆర్వో పరిధిలోకి మిగితా ఐదు అర్బన్ సర్కిల్స్‌ను కూడా తీసుకొస్తే బాగుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించగా పెండింగ్‌లో మగ్గుతోంది.

బైక్ చోరీల ముఠా ఆటకట్టు

ఆరుగురి అరెస్టు, రిమాండ్..ఆరు బైకుల స్వాధీనం


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కుత్బుల్లాపూర్: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఆరుగురు ముఠా సభ్యులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా జగన్నాథ్‌పూర్‌కు చెందిన మహ్మద్ గౌస్, ఆసిఫాబాద్ సందీప్‌నగర్‌కు చెందిన నవీద్ అబ్దుల్, కుత్బుల్లాపూర్‌కు చెందిన దుర్గం విజయ్, ఆసిఫాబాద్‌కు చెందిన గౌస్‌బాబా షేక్, సోహెబ్‌ఖాన్‌లు ముఠాగా ఏర్పడి రోడ్లపై, ఇంటి వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను తస్కరిస్తూ వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. వీరిపై పలు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. సుభాష్‌నగర్‌కు చెందిన వ్యాపారి రాకేష్ ఫాతారామ్ ఈ నెల 26న తన ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్ చోరీకి గురైందని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఏసీపీ బాలగంగిరెడ్డి నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మరో నలుగురు సైతం బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడించారు. వీరు పేట్‌బషీరాబాద్, మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుండి ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పేట్‌బషీరాబాద్ పోలీసులను డీసీపీ కోటిరెడ్డి అభినందించారు.

కాలాపత్తర్‌లో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: దక్షిణ మండలం పోలీసులు బుధవారం రాత్రి పాతబస్తీలోని కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సమగ్ర కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పెద్ద మొత్తంలో నిషిద్ధ వస్తువులు, నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు, రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా నేతృత్వంలో 200 మంది పోలీసులతో కలిసి నవాబ్‌సాబ్ కుంట, బషరత్ నగర్, రంజన్ కాలనీలలో సోదాలు నిర్వహించారు. 100 కిలోల ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అలాగే అక్రమ రీఫిల్లింగ్ కోసం ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు, నంబర్ ప్లేట్లు లేని 78 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మూడు నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. ఈ ఆపరేషన్‌లో సౌత్ జోన్ అదనపు డీసీపీ మజీద్, ఫలక్‌నుమా ఏసీపీ మహ్మద్ జావీద్‌లతో పాటు కాలాపత్తర్ పోలీసులు పాల్గొన్నారు.

జల్సాలకు బానిసలై చోరీలు

ముగ్గురు దొంగల అరెస్టు..రిమాండ్


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: గంజాయి, డ్రగ్స్..ఇతర జల్సాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వారి వద్ద నుండి రూ.3.5లక్షల విలువ చేసే సొత్తును రికవరీ చేశారు. డీఐ కనకయ్య తెల్పిన వివరాల ప్రకారం.. ఈ నెల 27వతేదీన సాయంత్రం షాపూర్‌నగర్‌లో అఖిల అనే యువతి ఫోన్ మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తుండగా...ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు వెనుకనుండి వచ్చి అఖిల చేతిలోని ఫోన్ లాక్కుని పరారయ్యారు. దీనిపై ఆమె జీడిమెట్ల స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి..

కేసు దర్యాప్తులో భాగంగా జీడిమెట్ల డీఐ కనకయ్య బృందం స్థానికంగా ఉన్న పలు కెమెరాలను పరిశీలించారు. అందులో ఉన్న ఓ యువకుడిని పాత దొంగగా గుర్తించారు. సదరు యువకులు ఇప్పటికే నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. దొంగలు కూకట్‌పల్లికి చెందిన ఆర్.వైజయంత్, జగద్గిరిగుట్టకు చెందిన ఆర్.శివ, అదే ప్రాంతానికి చెందిన ఆర్.నరేష్‌నాయక్‌లుగా గుర్తించారు. వీరంతా ప్రతిరోజు గంజాయి తాగి వివిధ ప్రాంతాల్లో సమావేశం అవుతారని తెలుసుకున్న పోలీసులు.... కదలికలపై నిఘా పెట్టి బుధవారం ఉదయం ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా పలుచోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు, మొత్తం రూ.3.5 లక్షల విలువ చేసే సొత్తు రికవరీ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్ఐ శ్యాంబాబు, ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ప్రేమ్‌కుమార్, నరేష్, రాజ్‌కుమార్, సుబ్బారావు, మోహన్‌లను బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ నరేష్‌రెడ్డి అభినందించారు.

నేడు గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాలేజీలో సంప్రదించాలని సూచించారు. టెన్త్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, నాలుగు పాస్ పోర్టుసైజు ఫొటోలతో రావాలని సూచించారు.

వన మహోత్సవంలో మంత్రి కొండా సురేఖ

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ పరిధిలోని గుమ్మడవెల్లి ఫారెస్ట్ భూముల్లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం సీడ్ బాల్స్ విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి వన మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, స్థానిక నాయకులు ఉన్నారు.


ఉసురు తీసిన కుటుంబ కలహాలు

భార్యాభర్తల ఆత్మహత్య


శ్రీనివాస్, దుర్గరాణి (ఫైల్)

నిజాంపేట్: భార్యా భర్తల మధ్య మనస్పర్థలతో ఇద్దరూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విషాదకర సంఘటన బాచుపల్లి పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఏపీలోని అంబేడ్కర్ కొనసీమ జిల్లా ఎర్రవల్లి మండలం, కాకరవర్రు గ్రామానికి చెందిన వెల్పూరి దుర్గ శ్రీనివాస్ ప్రగతినగర్‌లోని మిథిలానగర్ శాంతివనం అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ భార్య దుర్గరాణి, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో గత పదిహేను రోజుల క్రితం భార్యభర్తల మధ్య పెద్దలు పంచాయతీ పెట్టి ఇద్దరికీ సర్ది చెప్పారు. అయినా గొడవలు మాత్రం ఆగలేదు. ఈ క్రమంలో బుధవారం దుర్గరాణి (22) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన భర్త శ్రీనివాస్ నిజాంపేట్‌లోని శ్రీనివాస్ హౌజింగ్ సొసైటీలోని స్వప్న నిలయం అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న అక్క బావల వద్దకు వెళ్లాడు. తిరిగి అందరూ కలిసి ప్రగతినగర్‌కు వేర్వేరు బైక్‌లపై బయలుదేరారు. శ్రీనివాస్ పెట్రోల్ వేయించుకునేందుకు బంక్‌లో ఆగగా..అతని అక్క, బావలు మిథిలానగర్‌కు వెళ్లారు. శ్రీనివాస్ మాత్రం తిరిగి నిజాంపేట్‌లోని తన అక్క ఇంటికి వెళ్లి అక్కడే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ బావ దుర్గారావుకు ఆయన కుమారుడు ఈ విషయాన్ని చెప్పాడు. దీంతో దుర్గారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు



బడంగ్‌పేట్: పొదుపు సంఘాలకు అండగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి అన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బుధవారం మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లింకేజీ కింద మంజూరైన రూ.2 కోట్ల రుణాలను అందజేశారు. అనంతరం గాంధీనగర్ చౌరస్తాలో మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ కృపాకర్, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, టీపీఓ కిరణ్, డీఈఈ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు అదనపు నీటిని సరఫరా చేయండి

పంజగుట్ట: హరీగేట్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రెండు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ సీజీఎమ్ ప్రభును బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎ.మహేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ... పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం అమలవుతున్నందున విద్యార్థులు వాడుకునేందుకు ఒక వాటర్ ట్యాంకర్ సరిపోవడం లేదన్నారు. రెండు ట్యాంకర్లను సరఫరా చేయాలని పాఠశాల సిబ్బంది మహేష్ యాదవ్ దృష్టికి సమస్య తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ మేరకు సీజీఎమ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సత్తాచాటాలి



సమావేశంలో పాల్గొన్న మంత్రి వివేక్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని మెజారిటీని తీసుకురావాలని, ముఖ్యంగా షేక్‌పేటలో భారీ మెజారిటీ రావాలని మంత్రి వివేక్ సూచించారు. బుధవారం షేక్‌పేట డివిజన్ కార్యకర్తలతో మంత్రి వివేక్, మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. బూత్ కమిటీలతో పాటు ప్రతి కార్యకర్తనూ కాపాడుకోవాలని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అన్నారు. పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, నేతలు ప్రీతి, మోయిన్, నిజామ్, జ్యోతి, సోనీ, స్వరూప, రమేష్, రఘు, ఒమర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో ఆంధ్రా పెత్తనం'

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో ఆంధ్రా వ్యక్తుల పెత్తనం కొనసాగుతోందని తెలంగాణ సినిమా వేదిక అధ్యక్షుడు లారా ఆరోపించారు. మంగళవారం ఫిల్మ్ చాంబర్‌లో వేదిక ఆధ్వర్యంలో జరిగిన జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి 94వ జయంతి వేడుకల్లో జరిగిన గొడవపై బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో టీసీవీ గౌరవ సలహాదారు ప్రఫుల్ రాంరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో సినారెతో పాటు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జయరాజ్, దాశరథి ఫొటోలు ఎందుకు పెట్టలేదని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అక్కడి వారిని నిలదీశారని తెలిపారు. అయితే అక్కడ ఉన్న ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి ప్రసన్న కుమార్ పాశం యదగిరిపై దురుసుగా ప్రవర్తించి గొడవకు దిగారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా తెలంగాణ కవులకు, కళాకారులకు గౌరవం దక్కకపోవడం బాధాకరం అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌గా మార్చి, తెలంగాణ నటులను, కవులను, కళాకారులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి చంద్రన్న ప్రసాద్, యాదగిరి, రత్నం పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో గ్యాంగ్ అరాచకాల నేపథ్యంలో అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్న వీరబోయిన ముఖేష్ కుమార్ మృతికి సంతాపంగా బుధవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఖైరతాబాద్‌లోని వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్స్, ఐమాక్స్‌తో సహా మధ్యాహ్నం వరకు బంద్ పాటించారు.

సన్న బియ్యం.. పేదల్లో సంతోషం

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని తీసుకుంటున్న పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో కాంగ్రెస్ దళిత నాయకుడు యాదగిరి నివాసంలో బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఉచితంగా సన్నం బియ్యం అందించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు పేదలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతున్నాయన్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే ఎ.కృష్ణ గతంలో గ్రానైట్ వర్క్ హెల్పర్‌గా పని చేసేవాడు. అనారోగ్యం వల్ల పని చేయడం లేదు. మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 25న ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేదు. దీంతో కుమార్తె దీక్ష మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మెరుగైన బోధనకు మరింత పదును

- ప్రతి నెలా సమీక్షా సమావేశాలు
- మెరుగైన బోధనపై చర్చలు

కాంప్లెక్స్ మీటింగ్స్‌లో అభిప్రాయాలు పంచుకుంటున్న టీచర్లు



బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్లకు బోధనా పద్ధతులు వివరిస్తూ...

బంజారాహిల్స్: విద్యార్థులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధనా పద్ధతుల్లో మార్పులు చేర్పులు, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రతి నెల విద్యాశాఖ జోనల్ పరిధిలో కాంప్లెక్స్ మీటింగ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, బోరబండ, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిల్లో ఈ నెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు వేర్వేరు పాఠశాలల్లో ఈ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టు టీచర్లంతా ఈ మీటింగ్‌కు హాజరై ఇతర టీచర్లతో బోధనకు సంబంధించి మెళకువలు నేర్చుకోవడం, విద్యార్థుల సమస్యలు, పాఠాలు చెప్పే విధానంలో కొత్తగా వస్తున్న మార్పులపై సమీక్షించుకుంటున్నారు.

- అందులోభాగంగా బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న 17 పాఠశాలలకు చెందిన 34 మంది ఇంగ్లిష్ టీచర్లు హాజరయ్యారు. ఇంగ్లిష్ బోధించడంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను కొంతమంది టీచర్లు సమావేశంలో లేవనెత్తగా ఆ సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో మరో టీచర్ స్పష్టం చేశారు. ఇలా ఒకరి నుంచి ఇంకొకరు నాణ్యమైన, తేలికైన బోధనకు సంబంధించి అభిప్రాయాలను షేర్ చేసుకోవడానికి ఈ సమావేశాలు దోహదపడుతున్నాయి. బుధవారం ఎర్రమంజిల్ హైస్కూల్‌లో తెలుగు, జవహర్‌నగర్ హైస్కూల్‌లో హిందీ సబ్జెక్టులపై కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు.
- ఈ నెల 31వ తేదీ గురువారం యూసుఫ్‌గూడ హైస్కూల్‌లో బయాలజీ, అమీర్‌పేట హైస్కూల్‌లో మ్యాథ్స్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7 గతి స్కూల్‌లో ఫిజిక్స్ సబ్జెక్టులపై సమీక్షా సమావేశం ఉంటుంది.
- ఆయా సబ్జెక్టు టీచర్లు ఈ మీటింగ్‌లకు హాజరవుతూ తమ అభిప్రాయాలను పంచుకోవడమే కాకుండా తమకు తెలియని విషయాలను సహచర టీచర్ల నుంచి తెలుసుకుంటున్నారు.
- విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు వారికి తేలికగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పడానికి సహచర టీచర్లు ఎలా బోధిస్తున్నారు. తాము ఎలా బోధిస్తున్నాం అనే విషయమై ఈ సమావేశాల్లో చర్చలు జరుగుతున్నాయి.
- ఒకరికి తెలిసిన విషయాన్ని ఇంకొకరికి తెలియజేయడం వల్ల మొత్తంగా విద్యార్థికి మరింత లాభం చేకూరే రీతిలో సమావేశాలు ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయులంటున్నారు.
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో ప్రతి నెలా ఈ కాంప్లెక్స్ మీటింగ్‌లు నిర్వహిస్తుండగా షేక్‌పేట, అమీర్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలో ఒక్కో స్కూల్‌లో ఎంపిక చేస్తూ అక్కడ ఒక్కో సబ్జెక్టుపై ఈ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- ఒక్కో మండలం నుంచి ఇద్దర టీచర్లను రీసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేస్తున్నారు.
- రీసోర్స్ పర్సన్లు ఈ మీటింగ్‌లకు హాజరై సమావేశానికి హాజరై ఉపాధ్యాయులకు ఆయా సబ్జెక్టులపై కొంత శిక్షణ ఇస్తున్నారు.

కమ్యూనిటీ ఆర్గనైజర్లకు పూర్తయిన శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ శిరీష

బంజారాహిల్స్: డిజిటల్ బోర్డ్ అనే అంశంపై నగర వ్యాప్తంగా జీహెచ్ఎంసీలో ఉన్న కమ్యూనిటీ ఆర్గనైజర్లకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో నగర వ్యాప్తంగా వివిధ సర్కిళ్లలోని సుమారు 20 మంది కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.. ట్రైనర్ శిరీష వీరికి రాబోయే రోజుల్లో టెక్నాలజీ ఆధారంగా ఏఐ ఆధారితంగా డాటా బేస్ ఎంట్రీతో పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలనతో పాటు మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చే విధంగా తీసుకోవాల్సిన వారికి కల్పించాల్సిన అవగాహనపై వివరించారు. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో మహిళా గ్రూపుల్లో ఉండే మహిళలకు ప్రభుత్వ పథకాలతో పాటు వారికి చదువుల్లో సరైన గైడెన్స్ ఇవ్వాలని సూచించారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్





అపోలో జనరల్ ఆస్పత్రి వద్ద రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి జనరల్ విభాగం వద్ద వాహనాలను లోపలికి అనుమతించకపోవడంతో కొద్ది రోజులుగా ఆస్పత్రికి వస్తున్న రోగులు, వారి సహాయకులు గేటుకు రెండు వైపులా రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.. దీంతో ఫిలింనగర్ బస్తీలకు వెళ్లే దారంతా వాహనాల రద్దీతో నిండిపోతున్నది. ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో స్థానికంగా న్యూసెన్స్‌గా మారింది. దీనికి తోడు ఈ రోడ్డుకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణకు గురి కావడం అక్కడ కూడా వాహనాలు ఏర్పాటు కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ ఆక్రమణలు తొలగించడంతో పాటు వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రి నుంచి పంజగుట్ట చౌరస్తా వరకు రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలు అటు వాహనదారులకు, ఇటు పాదచారులతో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతుండడంతో ఫిర్యాదులు అందుకున్న పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామ్‌ప్రసాద్ నేతృత్వంలో ఎస్‌ఐలు, సిబ్బంది బుధవారం ఫుట్‌పాత్ ఆక్రమణలు పెద్ద ఎత్తున తొలగించారు. రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఆక్రమణలు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుండగా సుమారు 25 వరకు ఆక్రమణలను పోలీసులు తొలగించి క్రేన్ సహాయంతో అక్కడి నుంచి తరలించారు. మరోసారి ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలు తొలగించడంతో ఈ రోడ్డు చాలావరకు క్లీన్ అయ్యింది.

కష్టపడేవారికే కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు



ఉపేందర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం లభిస్తుందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం నల్లేరు మీద నడకేనని కాంగ్రెస్ నేత, సిటీ గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కమలాపురి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల ముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లు, ప్రతి కాలనీ, బస్తీలు, ప్రతి గడప తిరిగానని, టీహోప్ ఎన్‌జీవోతో వేలాది మందికి సహాయం చేశామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దలు చెప్పడం వల్ల పోటీకి దూరంగా ఉన్నానని, కానీ ఇప్పుడు పార్టీ తన అభ్యర్థిత్వాన్ని పరిశీలనలోకి తీసుకొని టికెట్ కేటాయించాలని కోరారు. గత ఎన్నికల్లో మాదిరి కాకుండా అధిష్టానం లోతుగా పరిశీలన చేసి స్థానికంగా పార్టీకోసం నిలబడ్డ వారికి సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యుల సేవలు స్ఫూర్తిదాయకం

నిమ్స్ వైద్యుడికి ఆత్మీయ సత్కారం



మాట్లాడుతున్న డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: అరుదైన శస్త్రచికిత్సలకు చిరునామాగా నిలిచిన 'నిమ్స్'కు వైద్యుల సేవలు స్ఫూర్తిదాయకమని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. వైద్యనిపుణుల కృషి ఫలితంగా ఎంతో మంది పేద రోగులకు ఉచితంగా క్లిష్టతరమైన చికిత్సలను సైతం అందిస్తున్నామన్నారు. బుధవారం నిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లోని 'ట్రామా' ఆడిటోరియంలో ఉద్యోగ విరమణ చేయనున్న యూరాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సి.హెచ్.రాంరెడ్డికి ఘనంగా ఆత్మీయ సత్కారం జరిగింది. యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. డాక్టర్ రామిరెడ్డి తన 32 సంవత్సరాల పాటు రోగులకు అందించిన విశేష సేవలను కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా యూరాలజీ విభాగం సరికొత్త రికార్డులను సృష్టించిందన్నారు. ముఖ్యంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సల్లో నిమ్స్ చరిత్రను తిరగరాశారన్నారు. యూరాలజీ సీనియర్ ప్రొ. రాహుల్ దేవరాజ్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొ. శాంతివీర్, నెఫ్రాలజీ హెచ్ఓడీ ప్రొ. భూషణ్ రాజు, ప్రొ. గంగాధర్, ప్రొ. స్వర్ణలతలతో పాటు అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ.కృష్ణారెడ్డి, కార్డియాలజిస్టు సాయి సతీష్, ఆర్థోపెడిక్ వైద్యులు ప్రొ.నాగేష్, ఏఎంఎస్‌లు డా. చరణ్ రాజ్, డా. రాకేష్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్ ప్రొ. సాయి సతీశ్, ప్రొ. చంద్ర శేఖర్, ప్రొ. సాయిబాబా పాల్గొన్నారు. ప్రొ. రాంరెడ్డిని యూరాలజీ, నెఫ్రాలజీ వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నందినగర్ బస్తీలో కబ్జాల కూల్చివేత



ఆక్రమణలను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ బస్తీలో కొన్ని సంవత్సరాలుగా బస్తీలోని రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన డబ్బాలను, స్థానిక వ్యాపారుల షెడ్లను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం నేలమట్టం చేశారు. కొన్ని రోజుల క్రితం నందినగర్ బస్టాప్‌లోని ఆక్రమణలు తొలగించిన అధికారుల్లో బస్తీల్లో సైతం రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నట్లు వీటి వల్ల బస్తీలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బస్తీలో పర్యటించిన అధికారులు వెంటనే ఇక్కడ ఆక్రమణలన్నింటినీ నేలమట్టం చేశారు. మరోసారి ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించాల్సి వస్తుందని జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య తెలిపారు.

వేడుకగా తొట్టెల ఊరేగింపు



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో హరినాథ్ మిత్రబృందం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దంపతులు దేదీప్య విజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. డప్పుల వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, విద్యుత్ దీపాలంకరణలు, మహిళలు, స్థానిక యూత్ నృత్యాలు మధ్య తొట్టెల ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది.

ద్విచక్ర వాహనం చోరీ

హిమాయత్‌నగర్: మెట్రో స్టేషన్ వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి సమాచారం మేరకు... విఠల్‌వాడీలో నివాసం ఉంటున్న ఆనంద్ హైటెక్ సిటీలోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల నారాయణగూడలోని మెట్రో స్టేషన్ సమీపంలో తన ద్విచక్రవాహనం నిలిపి మెట్రో రైలులో హైటెక్ సిటీకి వెళ్లాడు. తిరిగి వచ్చే వరకు తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో ఆనంద్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

హింసాత్మక సంఘటనపై పోలీసుల సీరియస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మతల్లి ఆలయం పేరుతో ఆందోళన చేస్తున్న క్రమంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై పోలీసులు సీరియస్ అయ్యారు. మంగళవారం ఆందోళనలో భాగంగా భారీ ఎత్తున బోనాలతో వచ్చిన వివిధ హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు బందోబస్తులో ఉన్న పోలీసులను తోసుకుంటూ స్థలంలోకి ప్రవేశించడం, అడ్డువచ్చిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి నేతృత్వంలోని వందలాది మంది ఆందోళనకారులు పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను తోసేసి ముందుకువచ్చారు. ఫెన్సింగ్ వేసిన ప్రభుత్వ స్థలంలోకి రేకులను ధ్వంసం చేసి ప్రవేశించారు. అడ్డువచ్చిన బంజారాహిల్స్ పోలీసులను, ర్యాపిడ్ యాక్షన్ బలగాలను కిందపడేస్తూ ముందుకువెళ్లారు. ప్రభుత్వ స్థలంలోకి వెళ్లి పెద్దమ్మ తల్లి ఆలయం తొలగించిన ప్రాంతంలో బోనాలు సమర్పించడంతో పాటు తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ ఘటనలో ఆందోళనకారులు హింసాత్మకంగా వ్యవహరించారు. ఫెన్సింగ్‌కు వాడిన రాడ్లను, ఇతర వస్తువులను ఆయుధాలుగా వాడి తీవ్ర భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడ్డారంటూ బంజారాహిల్స్ ఎస్‌ఐ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కరాటే కళ్యాణి, లంకాల దీపక్‌రెడ్డి, మహేష్‌కుమార్‌యాదవ్, రాధా మనోహర్ దాస్ స్వామి, శివకుమార్, నవీన్‌యాదవ్, జయమ్మయాదవ్, ప్రియాచౌదరి, సుభాష్ చందర్‌లతో సహా వివిధ సంఘాలకు చెందిన సుమారు 30 మందిపై బీఎన్‌ఎస్ 121 (1), 191 (2), 191 (3), 195 91), 132, 351 (2), 324 (4), 79, 126 (2), 329 (3), 292, 61 (2), రెడ్‌విత్ 190 సెక్షన్లతో పాటు పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యం సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనగర్‌కాలనీ: మహిళలందరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే ప్రారంభంలోనే గుర్తిస్తే వ్యాధిని నివారించవచ్చని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు సూచించారు. మోతీనగర్ సంస్కార్ ది లైఫ్ స్కూల్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ లెజెండ్స్, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత సాధారణ పరీక్షలు, బ్రెస్ట్ కేన్సర్, ఈసీజీ, బ్లడ్, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. మహిళలు ఆరోగ్యకమైన ఆహారం, వ్యాయామంతో పాటు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. గృహిణులకు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడంలో అలసత్వం వహిస్తారని, వారి కోసమే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనట్లు స్కూల్ సీఈఓ, రోటరీ క్లబ్ ప్రతినిధి మోహనవంశీ తెలిపారు. ఇలాంటి శిబిరాలను మరిన్ని నిర్వహించి అవగాహన పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట



అంబేద్కర్‌నగర్‌లో పర్యటిస్తున్న అధికారులు

ఫిలింనగర్: బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి బుధవారం సంబంధిత అధికారులు, సిబ్బంది బస్తీబాట నిర్వహిస్తూ స్థానికులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని రోడ్డు నెంబర్-9 అంబేద్కర్‌నగర్ బస్తీలో బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు, డీఈ హనుమంతరెడ్డి, ఏడీఈ రమేష్, ఏఈ పవిత్రతో పాటు సిబ్బంది పర్యటించారు. విద్యుత్ స్తంభాల సమస్య ఎక్కువగా ఉన్నందున స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ఎనిమిది విద్యుత్ స్తంభాలు కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యటనలో బస్తీ కమిటీ సభ్యులు పాల్గొని విద్యుత్ అధికారులను స్వాగతించారు.


బెదిరిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

ఫిలింనగర్: తనను ఇష్టానుసారంగా దుర్భాషలాడడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని టాలీవుడ్ చానల్ సమీపంలో ఉన్న గోల్డెన్ జూబ్లీ రెసిడెన్సీలో నివాసం ఉండే టి.అవినాష్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయన కొద్ది రోజులుగా ఎర్రబాగి రమేష్ అనే వ్యక్తి వేర్వేరు నంబర్ల నుంచి ఫోన్ చేస్తూ ఇష్టానుసారంగా తిట్టడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అర్ధరాత్రి కూడా కాల్ చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. రమేష్ నుంచి తనకు ప్రాణహాని ఉందని బెదిరిస్తూ కాల్స్ చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడని, చర్యలు తీసుకోవాలంటూ అవినాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లిహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్
రోడ్ నెంబర్ 14, జూబ్లిహిల్స్, హైదరాబాద్ - 500 033

ప్రకటన

శ్రీ ఏ. శ్రీనివాస్, ఎంప్లాయి నంబర్ : 065, హోదా : ఆఫీస్ అసిస్టెంట్
ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా, మీరు తేది : 01.12.2023 నుండి ఇప్పటి వరకు విధులకు హాజరు కాలేదు. ఏవిధమైన సెలవు మంజూరు కాకుండా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మరియు ముందస్తు అనుమతులు లేకుండా దీర్ఘ కాలంగా మీ విధులకు మీ అంతట మీరుగా గైర్హాజరు అయినారు.
మీరు కార్యాలయంలో ఇచ్చిన చిరునామాకు తేది : 30.04.2024, 31.05.2024 మరియు 12.06.2025 యాజమాన్యం వారు అనధికార గైర్హాజరు సంబంధించిన షోకాజ్ నోటీసు పంపించడం జరిగింది. సదరు లేఖలు బట్వాడా కాలేక వెనుదిరిగినవి. ఈ కారణాల వలన మీరు ఉద్యోగంలో ఆసక్తి కలిగిలేరు మరియు మీరు స్వంతంగా ఉద్యోగానికి మీరంతట మీరుగా స్వస్తి పలికారు అని భావిస్తున్నాము. అయితే యాజమాన్యం వారు మరో అవకాశంగా తేదీ : 08.08.2025 లోపు మీరు మీ డ్యూటీకి రిపోర్ట్ చేయవలసిందిగా మరియు పైన వివరించినట్లుగా మీ అనధికార గైర్హాజరుకు సంబంధించి వ్రాత పూర్వకంగా మీ సంజాయిషీని దాఖలు చేయవలసిందిగా కోరుచున్నాము. లేని పిమ్మట మీరు ఉద్యోగాన్ని కొనసాగించుటలో ఆసక్తి కలిగిలేరని మరియు మీ స్వంత కారణాలతో మీరు విధులకు స్వస్తి పలికారని భావించబడుతుంది. మీ సౌలభ్యం ప్రకారం కార్యాలయ పని దినములలో కార్యాలయానికి వచ్చి మా అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నందు సంప్రదించి మీ ఖాతాను సెటిల్ చేసుకోవలసిందిగా కోరడమైనది.
ప్రదేశం: హైదరాబాద్ — ఇట్లు
తేదీ: 30.07.2025 — కిలారు రాజేశ్వర రావు, సెక్రటరీ



ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న యువకుడి అరెస్ట్

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ వేస్తున్న యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నడుస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం రాత్రి మధురానగర్ పీఎస్ మొబైల్ సిబ్బంది మధురానగర్‌కాలనీలో విధులు నిర్వహిస్తుండగా ఎస్.సునీల్ అనే యువకుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వేస్తూ కనిపించాడు. అతని వద్దకు పోలీసులు వెళ్లగా పారిపోవడానికి ప్రయత్నించాడు. దాంతో ఏఎస్‌ఐ శంకరయ్య అతని సిబ్బంది యువకుడిని పట్టుకుని విచారించారు. దాంతో ఆన్‌లైన్ బెట్టింగ్ విషయాన్ని అంగీకరించాడు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఉప ముఖ్యమంత్రిని కలిసిన టాసా నేతలు



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన టాసా నాయకులు

ఏజీవర్సిటీ: తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టాసా) నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం ప్రజాభవన్‌లో కలిశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యలను వివరించారు. బోధన సిబ్బంది సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని కోరారు. అధ్యాపక, విద్యార్థి నిష్పత్తిని పెంచితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ ర్యాంకు మెరుగుపడే అవకాశం ఉందని వివరించారు. 2018 తర్వాత ఉద్యోగ నియామకాలు లేవని, మరోవైపు ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. అన్ని విశ్వవిద్యాలయాల మాదిరిగా 65 ఏళ్ల పదవీ విరమణ వయసును వ్యవసాయ వర్సిటీ ప్రొఫెసర్లకు, సిబ్బందికి వర్తింపజేయాలని కోరారు. తమ విన్నపాలకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని టాసా నాయకులు తెలిపారు.

కలెక్టర్ సిటీ లైబ్రరీ సందర్శన



చిక్కడపల్లి గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పలని కదిరవన్, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, ముషీరాబాద్ తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌తో కలిసి విద్యార్థులు, నిరుద్యోగులకు అందుతున్న బుక్స్, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. పుస్తకాల విభాగాలు, ప్రిజర్వేషన్, పిల్లల విభాగం, అంద విద్యార్థుల సెక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు త్వరగా విడుదల చేయాలని కోరుతూ నిరుద్యోగులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రంథాలయంలో ఐదు రూపాయల అల్పాహార కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ తనిఖీ



అమీర్‌పేట ప్రధాన రోడ్డులో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

బంజారాహిల్స్: వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అమలును జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ బుధవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి తనిఖీ చేశారు. అమీర్‌పేట ప్రధాన రోడ్డుతోపాటు పంజగుట్టలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకుగాను వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఈ నెల 29 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 వార్డుల్లో చేపడుతున్నామని వెల్లడించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతిపౌరుడు భాగస్వాములు కావాలన్నారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తమ ఇంటి పరిసరాలు, ప్రాంగణాల్లో నీరు నిల్వ లేకుండా చూస్తూ పారిశుద్ధ్య సిబ్బంది సహకరించాలని కమిషనర్ కోరారు.

బెస్ట్ ఉర్దూ టీచర్లకు త్వరలో అవార్డులు

వివరాలు వెల్లడించిన ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అసదుల్లా

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీచర్లకు త్వరలో ఉర్దూ అకాడమీ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేయనున్నట్లు అకాడమీ డైరెక్టర్ అసదుల్లా, అసిస్టెంట్ డైరెక్టర్ వి.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్, యూనివర్సిటీ విభాగాల్లో ఉపాధ్యాయులకు, అధ్యాపకులు ఇవ్వనున్న అవార్డుల వివరాలను వారు వెల్లడించారు. 33 జిల్లాల్లో ప్రతి జిల్లాకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున మొత్తం 165 మంది టీచర్లకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉర్దూ యూనివర్సిటీ, మెడికల్ యూనివర్సిటీ విభాగాల్లో ఇద్దరు చొప్పున అధ్యాపకులకు అవార్డు అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, సంక్షేమశాఖ మంత్రి నేతృత్వంలో ఉర్దూ భాషాభివృద్ధికి అకాడమీ అహర్నిశలు శ్రమిస్తోందని పేర్కొన్నారు. చిన్న ఉర్దూ పత్రికలు, కవిత్వం, పుస్తకాలు, రచయితలు తదితర ఏడు విభాగాల్లో చేస్తున్న సేవను గుర్తించి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రతిఏటా ఉర్దూ భాష అభివృద్ధికి అత్యుత్తమ సేవ చేసినవారికి మౌలానా ఆజాద్, మఖ్దూమ్ అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కంపెనీలు కదిలేనా.. కాలుష్యం వదిలేనా!

- ఔటర్ వెలుపలకు తరలించే అంశంపై మరోసారి చర్చ
- సీఎం ఆదేశాలు అమలుకు నోచుకునేనా?
- కాటేదాన్, ఐడీఏ బొల్లారం, జీడిమెట్లల్లో కాలుష్యభూతం

నగరంలోనే తిష్ట వేసిన కాలుష్య కారక పరిశ్రమలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పారిశ్రామిక వాడలు కాలుష్యపు జాడలుగా మారాయి. నగరవాసిని కాలుష్యభూతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది. కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలుష్యకారక పరిశ్రమలను శివారులోకి తరలించాలనే ప్రతిపాదన మరోసారి తెర మీదికి వచ్చింది. ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపలకు ఈ పరిశ్రమలను తరలించాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల తరలింపు ప్రక్రియను వేగిరం చేయాలని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంత్రాంగాన్ని ఆదేశించారు. పరిశ్రమలను శివారులోకి తరలించాలని 2012లో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా కేసీఆర్ సర్కారు కూడా ఈ అంశంపై కసరత్తు చేసింది. అయితే, ఈ వ్యవహారం ఆశించిన మేరకు ఫలితాలనివ్వలేదు. పారిశ్రామికవేత్తల లాబీయింగ్‌తో పరిశ్రమల తరలింపు ప్రక్రియకు బ్రేక్ పడింది. కాలుష్య ఉద్గారాలను వెదజల్లుతున్న పరిశ్రమలు జనావాసాల్లో కొనసాగడం శ్రేయస్కరం కాదని, మొదట్లో పారిశ్రామికవాడలు శివార్లలో ఉన్నప్పటికీ నగరీకరణ నేపథ్యంలో అక్కడ కూడా కాలనీలు వెలిసినందున వీటి తరలింపు అనివార్యమని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే రసాయనిక కంపెనీలను సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల్లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో భూములను సేకరించి, పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేశారు. ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించారు. భూములను తీసుకున్న పరిశ్రమలు తమ కార్యకలాపాలను మాత్రం నగరం నుంచే కొనసాగిస్తున్నాయి.

రసాయన జలాల నిర్వహణ అధ్వానం

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల వేలసంఖ్యలో చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. జీడిమెట్ల, కాటేదాన్, బొల్లారం, భోలక్‌పూర్, చర్లపల్లి, లింగంపల్లి తదితర పారిశ్రామిక వాడలో బీహెచ్ఈఎల్, ఐడీపీఎల్, హెచ్ఎంటీ, తోళ్ల పరిశ్రమ, ఐరన్, స్టీల్ వంటి భారీ పరిశ్రమలతోపాటు పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఏర్పాటయ్యాయి. వాటికి అనుసంధానంగా మరికొన్ని పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు, కార్మికులు, ఉపాధి కోసం వివిధ వర్గాలకు చెందినవారు నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కాలుష్య ప్రభావంతో జనాలు రోగాల బారిన పడుతున్నారు. వ్యర్థ జలాల నిర్వహణ అధ్వానంగా ఉంది. సాధారణ మురుగు కాలువల్లో ప్రమాదకరమైన రసాయన వ్యర్థ జలాలను విడిచిపెడుతుండటం స్థానికులకు సంకటంగా మారింది. స్థానికుల నుంచి ఫిర్యాదు వస్తేనే పీసీబీ అధికారులు చర్యలకు ఆదేశిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మూసివేయాలని చెప్పినా, అనధికారికంగా కార్యకలాపాలను నడిపిస్తున్నారు.

2 వేలకుపైగా రెడ్ కేటగిరీ పరిశ్రమలు

రాష్ట్రంలో సుమారు 3,800 రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉండగా అందులో సుమారు 2 వేలకుపైగా పరిశ్రమలు నగరంలోనే ఉన్నట్లు అంచనా. ఆరెంజ్ కేటగిరీలోని 4 వేలకుపైగా పరిశ్రమల్లో సుమారు 2,500 వరకు నగర పరిధిలోనే ఉండొచ్చని అంచనా. వీటిల్లో ఇప్పటి వరకు సుమారుగా 40 శాతం కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. భోలక్‌పూర్‌లోని తోలు పరిశ్రమను మేడ్చల్ జిల్లాకు, ఇనుము, స్టీల్ పరిశ్రమలను వికారాబాద్ జిల్లా రాకంచర్లకు, నూనె తయారీ పరిశ్రమలకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో టీజీఐఐసీ మౌలిక వసతులను అభివృద్ధి చేసి, పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. ఆసక్తి ఉన్న పరిశ్రమలకు ఆయా ప్రాంతాల్లో స్థలాలను కేటాయించారు. కొంత కాలం వేచి చూసి మీరు వెళ్లకపోతే ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించినా యాజమాన్యాల్లో పెద్దగా మార్పు కనిపించలేదు.

వెట్టి విముక్తి కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు

సదస్సులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



సనత్‌నగర్: తెలంగాణను వెట్టిచాకిరి విముక్తి రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి అయిన కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని, ఆర్థిక సహకారం కూడా అందిస్తుందని ప్రకటించారు. జాతీయ వెట్టిచాకిరి విముక్తి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ, తెలంగాణ అసంఘటిత కార్మికుల సంఘం, స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వివేక్ వెంకటస్వామి వెట్టిచాకిరి, అక్రమ రవాణా సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్‌ను 8069 434343 ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ప్రతి ఏడాది కేటాయిస్తున్న 3,500 ఇందిరమ్మ ఇళ్లలో వెట్టిచాకిరి విముక్తి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరతానని పేర్కొన్నారు. వెట్టిచాకిరిని నిషేధించి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరమని, ఇది మానవత్వానికి మచ్చ అని అభివర్ణించారు. ఇక నుంచి ఫిబ్రవరి 9న వెట్టిచాకిరి విముక్తి దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి ప్రకటించారు. విముక్తి అయిన కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయం అందించనున్నామని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200పైగా వెట్టిచాకిరి విముక్తి కార్మికులు పాల్గొన్నారు. కార్మికుల బాధలను విన్న ప్రముఖ నటి, బ్లూక్రాస్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో యువతకు సాధికారత



అప్రెంటిస్‌లకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందజేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: స్వచ్ఛ తులిప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌తో యువతను పట్టణ పారిశుద్ధ్యంలో చురుకుగా పాల్గొనేలా చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె ఎస్‌బీఎం-యు 2.0 కింద ఇంటర్న్‌షిప్ పూర్తిన అప్రెంటిస్‌లకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏఐసీటీఈ పోర్టల్ ద్వారా ఎనిమిది మందిని ఇంటర్న్‌షిప్‌లకు ఎంపిక చేసి జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య వ్యవస్థల్లో నిర్మాణాత్మక శిక్షణను అందించామన్నారు. ఈ క్రమంలో ఫతుల్లగూడ సీఅండ్‌డీ వేస్ట్ ప్లాంట్, జవహర్‌నగర్ ఎంఎస్‌డబ్ల్యూ ఫెసిలిటీకి క్షేత్ర సందర్శనల ద్వారా ఆచరణాత్మక అనుభవాన్ని పొందారన్నారు. ఈ క్రమంలో అప్రెంటిస్లు ఘన వ్యర్థాలను వేరు చేయడం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధ అవగాహన, సమాజ పరిశుభ్రతను ప్రోత్సహించే ఐఈసీ ప్రచారాల్లో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడానికి కార్యాచరణ సిఫార్సులతో కూడిన ప్రాజెక్ట్ నివేదికను సమర్పించారని మేయర్ విజయలక్ష్మి తెలిపారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రాఘవాచారి విజ్ఞప్తి



పంజగుట్ట: రాష్ట్రంలో వెంటనే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2008లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఐదుగురు సభ్యుల కమిటీ వేసి తమిళనాడు, రాజస్థాన్, కేరళ, గుజరాత్‌లో స్వర్ణకార కార్పొరేషన్ విధివిధానాలు తెలుసుకుని 2009లో నివేదిక తెప్పించుకున్నారని గుర్తుచేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, కోశాధికారి గొట్టిముక్కల చంద్రశేఖర్‌తో కలిసి మాట్లాడారు. కార్పొరేట్ జ్యువెలరీ షాపులు వచ్చి తమ పొట్టకొడుతున్నాయని, కార్పొరేట్ షాపుల్లో పుస్తె, మెట్టలు అమ్మకుండా జీవో తీసుకురావాలని అన్నారు. దొంగ బంగారం కొన్నారనే నెపంతో పోలీసుల వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపని చేస్తున్న స్వర్ణకారులు 45 ఏళ్లకే కంటిచూపు కోల్పోతున్నారని, గీత, చేనేత కార్మికుల మాదిరిగా 50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వర్ణకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు దుబ్బాక కిషన్ రావు, ఎర్రోజు చారి, నాగరాజు, ఇంద్రాల రాజు, హరిప్రసాద్, సతీష్‌చారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీగెట్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీగెట్-2025 దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 11వ తేదీ వరకు పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 27 కేంద్రాల్లో జరగనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఎఫ్‌డీడీఐలో అడ్మిషన్లకు చివరి అవకాశం

- దరఖాస్తు గడువు ఆగస్టు 11

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్- హైదరాబాద్ క్యాంపస్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి చివరి అవకాశం కల్పించాలని అధికారులు బుధవారం నిర్ణయించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఎం.డీఈఎస్, ఎంబీఏ, అండర్ గ్రాడ్యుయేట్ బీబీఏ కోర్సులో ఖాళీ సీట్ల భర్తీకి 'స్పాట్ అడ్మిషన్ డ్రైవ్'నిర్వహించాలని నిర్ణయించారు. మొదట వచ్చినవారికి ముందుగా అడ్మిషన్ అవకాశం కల్పిస్తారు. అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఆగస్టు 11వ తేదీ అని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9505555133, 7869398146 నంబర్లలో సంప్రదించాలి. ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ వెబ్‌సైట్ www.fddiindia.comను సందర్శించాలి.

సీఎం ప్రజావాణి ప్రజాపాలనకు నిదర్శనం



చిన్నారెడ్డిని అభినందిస్తున్న రవిశేఖర్ రెడ్డి

లక్డీకాపూల్: సీఎం ప్రజావాణి చొరవతో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని, ఈ కార్యక్రమం ప్రజాపాలనకు నిదర్శనమని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బేగంపేటలోని ప్రజాభవన్‌లో ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక అయిన సీఎం ప్రజావాణి కార్యకలాపాలను స్ఫూర్తిదాయకమైన రీతిలో కొనసాగిస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ వర్సిటీలో బీసీ సెల్ ఏర్పాటు

- వీసీ అల్దాస్ జానయ్య

ఏజీవర్సిటీ: బీసీ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేసినట్లు వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య తెలిపారు. బీసీ ఉద్యోగులు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు బుధవారం జరిగిన పాలక మండల సమావేశంలో ఈ విషయంపై చర్చించామని తెలిపారు. ఉస్మానియా, కాకతీయ వర్సిటీలతోపాటు ఇతర విశ్వవిద్యాలయాల్లోనూ ఇప్పటికే బీసీ సెల్ ఏర్పాటు చేశారని చెప్పారు. బీసీ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సెల్ సూచిస్తుందని వీసీ తెలిపారు.

ఆరోగ్యం అనేది సమాజ ఆత్మ

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



స్టార్ ఆస్పత్రిలో 'స్టార్ సర్వీసెస్ ఆన్ మైగేట్'ను ప్రారంభిస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: భారతదేశ వైద్య రాజధానిగా హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో కమ్యూనిటీ ఆధారిత మల్టీ స్పెషాలిటీ ఆరోగ్యం సంరక్షణ సేవలను 'స్టార్ సర్వీసెస్ ఆన్ మైగేట్'పేరిట బుధవారం ఆయన ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యం అనేది కేవలం ఒక రంగం కాదని, అది సమాజ ఆత్మ అని పేర్కొన్నారు. భారతదేశంలో మొదటిసారిగా కమ్యూనిటీ ఆధారిత వైద్య సేవలను అందించడం విశేషమన్నారు. తెలంగాణలో ఇంటింటికి డిజిటల్ వైద్యం సమాజ ఆరోగ్య సంరక్షణలో సరికొత్త అధ్యాయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని డిజిటల్ ప్రజారోగ్యంలో అగ్రగామిగా నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వైద్య సేవలందించడంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. కమ్యూనిటీ కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ ఒక ఆకాంక్ష కాదని, ఒక అవసరమని గుర్తు చేశారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఆస్పత్రులు చేస్తున్న కృషి అభినందనీయమ న్నారు. మైగేట్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ జందాల్ మాట్లాడుతూ కమ్యూనిటీల్లో రోజువారీ అనారోగ్య పరిష్కారాలే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ అనేది ఒక నూతన అధ్యాయమన్నారు. సమావేశంలో స్టార్ ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ మేడక్కర్, పలువురు వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి



మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

నాంపల్లి: మానవ అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని 'ప్రజ్వల'సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'హ్యూమన్ ట్రాఫికింగ్ ఈజ్ ఆర్గనైజ్డ్ క్రైమ్-ఎండ్ ద ఎక్స్‌ప్లాయిటేషన్'అనే థీమ్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సీతక్క మాట్లాడుతూ సునీతా కృష్ణన్ 32 వేల మంది అమ్మాయిలు, మహిళలను వ్యభిచార కూపం నుంచి విముక్తి కల్పించారని అన్నారు. ప్రాణాలకు తెగించి మానవ అక్రమ రవాణా ముఠాపై సునీతాకృష్ణన్ చేస్తున్న పోరాటం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళా భద్రత కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మహిళల పేదరికాన్ని నిర్మూలించేందుకు సెర్ప్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నామని వివరించారు. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (శాంతిభద్రతలు) మహేష్ భగవత్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వ్యతిరేక యాక్ట్(ఐటీపీఏ)కు సంబంధించిన ముఖ్యమైన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల్లో లంబాడీల చేర్పు సక్రమమే



మాట్లాడుతున్న సంజీవ్ నాయక్

సేవాలాల్ సేన అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్

పంజగుట్ట: లంబాడీలు ఎస్టీ జాబితాలో ఉండటం సక్రమమే కానీ, అక్రమం కాదన్న విషయం తెలుసుకోవాలని, అవసరమైతే ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ సవాల్ విసిరారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీ, సుగాలి, బంజారా తెగలను తొలగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావుల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. అన్నదమ్ముల వలే ఉన్న గోండు, బంజారా తెగలను విడదీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లగచర్లలో లంబాడీలు తిరుగుబాటు చేశారనే కోపంతోనే రేవంత్‌రెడ్డి, పొంగులేటి లంబాడీలను ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల్లో కేసు వెనక్కి తీసుకోకపోతే ఎంత పోరాటానికైనా సిద్ధమన్నారు. బంజారాలు శ్రావణమాసంలో చేసుకునే తీజ్ పండగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆరోజు సెలవు దినంగా ప్రకటించాలని సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడిత్యా కళ్యాణ్ నాయక్, రాజు రాథోడ్, భూక్య రమేష్ నాయక్, రవి నాయక్, సక్రు నాయక్, శ్రీనివాస్ నాయక్, మోహన్ నాయక్, కుమార్, జగన్, సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టాలి

యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్



మాట్లాడుతున్న రవీందర్ యాదవ్

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కుంట రవీందర్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీజేపీ నేతలను అడ్డుకుంటామని హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి జాతీయ ఉపాధ్యక్షుడు ఎర్రంస్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శి నక్క రాములు యాదవ్, జాతీయ అధికార ప్రతినిధి కుమారస్వామి యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలను అణగదొక్కారని, ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత బీసీల మీద కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలపై ప్రేమ ఉన్నట్టు నటిస్తూ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో బీసీల అణిచివేతనే ప్రధానంగా బీజేపీ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. 0.1 శాతం జనాభా ఉన్న అగ్రకుల వ్యక్తికి బీజేపీ రాష్ట్ర చీఫ్ పదవి ఇచ్చి బీసీలను అవమానించారని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం జంతర్ మంతర్ దగ్గర చేపట్టబోయే ధర్నాలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి సభ్యులు తెనుగు రాజు ముదిరాజ్, విలాస్ యాదవ్, అమర్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో పాండ్యా బస్తీబాట

సాక్షి, సిటీబ్యూరో: బస్తీబాట కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జోనల్ చీఫ్ ఇంజనీర్ పాండ్యా, జనరల్ మేనేజర్ పి.అంజయ్యలతో కూడిన అధికారుల బృందం బుధవారం కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రనగర్ 11 కేవీ ఫీడర్‌ను తనిఖీ చేసింది. విద్యుత్ వినియోగదారులకు ఇంజనీర్లు మరింత నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. గత మూడు మాసాలుగా బిల్లులు చెల్లించని విద్యుత్ కనెక్షన్లపై ఆరా తీశారు. బిల్లులు చెల్లించేలా వినియోగదారులపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌టీ బిల్ స్టాప్ సర్వీసులకు నోటీసులు జారీ చేయడంతో పాటు అదే సర్వే నంబర్/ఇంటి నంబర్ పేరుతో తీసుకున్న ఇతర కనెక్షన్లను తొలగించాలని సూచించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు అంతరాయాలు ఎక్కువగా నమోదైన ఫీడర్‌ను తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఎల్సీలు తీసుకునే ఇంజనీర్లు/ లైన్‌మెన్లపై ఇకపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । గురువారం ।
31 । జూలై । 2025



మోడల్స్.. హొయలు..

మూసాపేట: హైదర్‌నగర్ ప్రధాన రహదారి ధర్మారెడ్డికాలనీలోని ఓ షోరూంలో బుధవారం సినీ నటులు, మోడల్స్ సందడి చేశారు. కూకట్‌పల్లి శాఖ షోరూంలో 62వ వార్షికోత్సవం సందర్భంగా సినీ నటి వర్షిణి సౌందర్యరాజన్, మిస్ ఇండియా తెలంగాణ ఫేమ్ ఊర్మిళ చౌహన్, ఇతర మోడల్స్ పాల్గొని నూతన కలెక్షన్స్‌ను ప్రారంభించి, వాటిని ధరించి హొయలు పోయారు. కార్యక్రమంలో నర్సింగ్ గ్రూప్ ఎండీ సంజయ్ సింఘానియ, మోడల్స్ ఉన్నారు.





కాదేదీ కవితకు, కళకు కూడా అనర్హం. కళ్లు తెరచి చూసేవారికి కనువిందు చేసే చిత్రకళ.. కళ్లకు గంతలు కట్టుకొని చిత్రకారులు సృష్టించింది అని తెలిస్తే వీక్షకులకు అదో వినూత్న అనుభూతి. అలాంటి చిత్రాలకే కాదు.. ఆ చిత్రకళకూ ఇప్పుడు నగరంలో కళాభిమానులు జై కొడుతున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని చిత్రకారులు గీసిన చిత్రాలను చూడటానికి మాత్రమే కాదు తాము సైతం అదే కళను సాధన చేస్తూ ఓ వైపు సృజనాత్మకత పెంచుకుంటూ మరోవైపు మానసిక ప్రశాంతత పొందుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో





కళ్లకు గంత..
ఆ కళ ఓ వింత

నగరంలో ఆదరణ పెంచుకుంటున్న బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్

వినూత్న శైలి ఆర్ట్‌ఫార్మ్.. సైకలాజికల్ థెరపీ కూడా.. | దేశవ్యాప్తంగా ఈ కళలో చేయి తిరిగిన చిత్రకారులెందరో.. | నగరంలో ఆసక్తికి అనుగుణంగా నలుదిశలా వర్క్‌షాప్స్

బ్లైండ్. ట్రెండ్.

కొన్నేళ్లుగా బాగా ఆదరణకు నోచుకుంటున్న బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్ అనేది కళాకారులు కళ్లకు కట్టు కట్టి, తమ భావోద్వేగాలను, ఊహాశక్తిని ఆధారంగా చేసుకుని పెయింటింగ్స్ రూపొందించే ఒక అరుదైన కళా ప్రక్రియ. మన దేశంలో ఈ ఆర్ట్‌కు సంబంధించి ప్రత్యేక గుర్తింపు పొందిన కొందరు ప్రముఖ కళాకారుల్లో రాజస్థాన్‌కు చెందిన మహేష్ చంద్ర శర్మ దాదాపు 6 వేల చిత్రాలను కేవలం స్పర్శ ఆధారంగా చిత్రీకరించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు నామినేట్ అయ్యారు. ఎన్నో సోషల్ వర్క్ కార్యక్రమాలలో పాల్గొంటూ సమాజ సేవ కోసం తన కళను వినియోగిస్తున్నారు. మైసూరుకు చెందిన శ్రీనివాస్ బి.బ్లైండ్ ఫోల్డ్ మల్టీటాలెంటెడ్ ఆర్టిస్టుగా పేరు పొందారు. కేవలం చిత్రకళే కాదు, సంగీతం, డాన్స్ వంటి ఇతర కళారూపాల్లో కూడా కళ్లకు కట్టు వేసుకుని ప్రదర్శనలిచ్చారు. దేశవ్యాప్తంగా పలు స్కూల్స్, కళాకేంద్రాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాడు. బెంగుళూర్ నివాసి నివేదిత గౌడ టీవీ ప్రోగ్రామ్స్‌లో బ్లైండ్‌ఫోల్డ్ డ్రాయింగ్, స్కెచ్ డెమోస్ ద్వారా గుర్తింపు పొందారు. యువతలో సృజన పెంపొందించేందుకు బ్లైండ్‌ఫోల్డ్ ఆర్ట్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. నగరంలో బ్లైండ్‌ఫోల్డ్ ఆర్ట్ నిపుణులుగా జె.వేణుగోపాల్ పేరొందారు. ఆయన కళ్లకు గంతలతో 'గణేశ' 'ప్రపంచ ఉష్ణోగ్రత' వంటి చిత్రాలు గీశారు.






పీస్‌ఫుల్.. కలర్‌ఫుల్..

కొత్త కొత్త కళలను సాధన చేయడం పట్ల నగరవాసుల్లో ముఖ్యంగా యువతలో క్రేజ్ పెరుగుతోంది. పలు ఇన్నోవేషన్స్‌కు సిటీ కేంద్రంగా మారుతున్న వేళ, ఈ తరహా వినూత్న ఆర్ట్ ఫార్మాట్లు యువతలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దాంతో బ్లైండ్‌ఫోల్డ్ ఆర్ట్ ఈవెంట్స్ ట్రెండ్‌గా మారుతున్నాయి. కళను అనుభవించడంలో కొత్త కోణాలను అన్వేషించే వారికి వీటి వర్క్‌షాప్‌లు ఆసక్తికరంగా మారడంతో పలు ఆర్ట్ స్టూడియోలు, కమ్యూనిటీ సెంటర్లు బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నాయి. వయసులకు అతీతంగా నగరవాసులు వీటిలో పాల్గొంటున్నారు. ఈ బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్ ఈవెంట్స్, వర్క్‌షాప్స్ కేవలం వినూత్న కళను నేర్చుకోవడానికి మాత్రమే కాదు కాదు, చూస్తూ అనుభవిస్తూ కళను సృష్టించే ఈ కళారీతి మైండ్‌ఫుల్‌నెస్, స్ట్రెస్ రిలీఫ్, ఇన్నర్ కాన్ఫిడెన్స్ పెంపొందించుకోవడంలో సహాయపడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

ఇటీవల నగరంలో 'బ్లైండ్‌ఫోల్డ్ ఆర్ట్ ఛాలెంజ్' కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొనేవారు కళ్లకు గంతలు కట్టుకుని బొమ్మల్ని గీయాలి అంతేకాక అది ఏ బొమ్మో కూడా ఊహించాలి. ఎస్‌సిఎమ్ హైదరాబాద్ ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఛాలెంజ్‌లో బహుళ రౌండ్ల తర్వాత విజేతలను ఎంపిక చేశారు. సాధారణ వ్యక్తుల కన్నా దృష్టి లోపం ఉన్నవారికి. ఇతర ఇంద్రియాల పట్ల అవగాహన వాటి శక్తుల పట్ల ఆలోచన పెంచడం లక్ష్యంగా దీనిని నిర్వహించారు.



స్ఫూర్తిని అందిస్తున్న బ్లైండ్ ఫోల్డ్ విజయాలు..

చిత్రకళ మాత్రమే కాకుండా బ్లైండ్ ఫోల్డ్ అనేది చాలా కళలకు, సాహసాలకు విస్తరిస్తోంది. నగరంలో ఇది ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ.. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వారు సాధిస్తున్న విజయాలు నగరవాసులకు స్ఫూర్తిని అందిస్తున్నాయి. అలాంటి వాటిలో..

- మంగుళూర్‌కి చెందిన మెజీషియన్ సమర్థ్ షెనాయ్: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా 300 కి.మీ. స్కూటర్ రైడ్‌ను కళ్లకు గంతలు కట్టుకుని పూర్తి చేశారు.
- బీహార్‌లోని దర్భాంగా ప్రాంతవాసి అయిన మోనికా గుప్తా అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవంలో కళ్లకు గంతలు కట్టుకుని రంగోలిని గీసి అందర్నీ ఆకట్టుకున్నారు.
- ముంబైకి చెందిన అఫాన్ కుట్టి కళ్లకు గంతలు కట్టుకుని రూబిక్స్ క్యూబ్‌లను ఉపయోగించి క్రికెటర్ మొహమ్మద్ షమీ చిత్రపటాన్ని సృష్టించాడు.
- చెన్నైకి చెందిన శిల్పి చంద్రు స్పర్శ, విజువలైజేషన్ కళ మధ్య సంబంధాన్ని వివరిస్తూ కళ్లకు గంతలు కట్టుకుని శిల్పాలను సృష్టించే శిల్పకారుడిగా పేరొందారు.
- వాయిద్య కారులు, గాయకులు సహా అందరూ కళ్లకు గంతలు కట్టుకుని ప్రదర్శన ఇచ్చే ముంబైకి చెందిన బ్లైండ్ ఆర్కెస్ట్రా కళాకారులు కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన ప్రచారం



సాక్షి, సిటీబ్యూరో: వినియోగదారుల భద్రత చర్యలలో భాగంగా, స్కామ్ సే బచో 2.0 అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు సోషల్ వేదిక 'మెటా' నగర ప్రతినిధులు తెలిపారు. దీని ద్వారా డిజిటల్ భద్రతా చిట్కాలను అందిస్తామని, నకిలీ రుణాలు, ఓటీపీ ఫ్రాడ్ వంటి సాధారణ ఆన్‌లైన్ స్కామ్‌ల గురించి డిజిటల్ వినియోగదారులకు తెలియజేసేందుకు ప్రచారం చేపట్టినట్లు వివరించారు. ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ సహకారంతో దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాల కేసులను అరికట్టేందుకు దృష్టి పెట్టిందన్నారు.

బ్యూటీ కలెక్షన్ 'బికమింగ్ హర్'





సాక్షి, సిటీబ్యూరో: ప్రఖ్యాత డిజైనర్ రిధి మెహ్రా తన కొత్త బ్రైడల్ కలెక్షన్ 'బికమింగ్ హర్'ను నగరంలో తొలిసారిగా ఆవిష్కరించారు. ఆసీ జైన్, వందన అరోరా ఆధ్వర్యంలో సాగిన ఈవెంట్ ఫ్యాషన్‌కు, మహిళా వ్యక్తిత్వానికి అద్భుత ప్రతిబింబంగా నిలిచింది. ఈ కలెక్షన్ వివాహానికి ముందు మహిళ అనుభవించే భావోద్వేగాలు, కలల్ని ప్రతిబింబిస్తూ ట్రెడిషనల్ ఎలిమెంట్స్‌తో మోడర్న్ టచ్ కలిపి తీర్చిదిద్దారు. రెడ్, ఐవరీతో పాటు లైలాక్, ఆరెంజ్ వంటి హ్యూస్ కలిపిన వర్ణవైచిత్రం, రఫుల్ సారీలు, స్టిచ్డ్ స్కర్ట్స్, రెషమ్ వర్క్ లాంటి డిజైన్స్ ద్వారా ప్రతి వధువు తన ప్రత్యేకతను చాటుకునే అవకాశం పొందుతుంది. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించిన రన్ వే ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ కలెక్షన్ లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ప్రపంచానికి ఒక కొత్త మలుపుగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.



డాగ్ థెరపీ..
ఒత్తిడికి బైబై..

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో డాగ్ థెరపీ

ప్రయాణికులకు అందుబాటులో టాయ్ పూడుల్స్ | డొమెస్టిక్, ఇంటర్నేషనల్ టెర్మినళ్లలో ఏర్పాటు | సుశిక్షితులైన నాలుగు శునక రాజాలు

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అందమైన టాయ్ పూడుల్స్ ప్రయాణికులను సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. చిరకాల నేస్తాల్లా పలకరిస్తాయి. తాకితే చాలు వచ్చి ఒడిలో వాలిపోతాయి. ప్రయాణికులకు ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తాయి. పిల్లలు ఆడుకొనే సున్నితమైన టాయ్స్‌ను తలపించే ఈ శునక రాజాలు ఇప్పుడు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యేక ఆకర్షణగా మారాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రయాణికుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం డాగ్ థెరపీలో భాగంగా వినూత్నంగా ఈ శునకాలను ప్రవేశ పెట్టింది. ప్రయాణికులు బయలుదేరే ప్రవేశ ద్వారాల వద్ద ఈ శునకాలు కనువిందు చేస్తూ కనిపిస్తాయి.

సాక్షి, సిటీబ్యూరో



టాయ్ పూడుల్స్ శునకాలకు తర్ఫీదు

సాధారణంగా ప్రయాణం అనగానే ఏదో ఒక స్థాయిలో ఒత్తిడి ఉంటుంది. పద్మవ్యూహంలాంటి ట్రాఫిక్ రద్దీని ఛేదించుకొని సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవడమే ఒక సవాల్, ఏదో ఒక విధంగా ఆ సవాల్‌ను అధిగమించి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత మరోవిధమైన ఆందోళన మొదలవుతుంది. భద్రతా తనిఖీలు దాటుకొని లగేజీ బరువు సరిచూసుకొని, బోర్డింగ్ పాస్ తీసుకొనే వరకు టెన్షన్‌గానే ఉంటుంది. వరుసగా తనిఖీలు, ఇమ్మిగ్రేషన్ వంటి ప్రహసనాలన్నీ ముగించుకొని టెర్మినల్‌కు చేరుకొనే వరకు ఒత్తిడి ఉంటుంది. ఈ క్రమంలో ప్రయాణికులకు ఆ ఒత్తిడి నుంచి ఊరటనిచ్చేందుకు మానసిక ప్రశాంతత కలిగించేందుకు డాగ్‌థెరపీ దోహదం చేయనుంది. ప్రస్తుతం ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ప్రయాణికులకు ఈ డాగ్ థెరపీ సదుపాయం అందుబాటులో ఉంది. అదే తరహాలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం నాలుగు టాయ్ పూడుల్స్ శునకాలకు ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. అలాగే వాటి నిర్వహణ కోసం నిపుణులను కూడా అందుబాటులో ఉంచారు. 'ఈ టాయ్ పూడుల్స్ ఎంతో మృదుస్వభావాన్ని కలిగి ఉంటాయి. పెద్దలు, పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటాయి. అందరితో కలిసిపోయేవిధంగా శిక్షణనిచ్చారు.' అని ఎయిర్‌పోర్టు అధికారి ఒకరు తెలిపారు. ఒంటరిగా ప్రయాణం చేసేవారికి కొన్ని గంటల పాటు ఇవి తోడుగా ఉంటాయని చెప్పారు.

సెల్ఫీ ప్లీజ్..

ఈ శునకాలను ప్రయాణికులకు తమ బాల్యాన్ని గుర్తుకు తెస్తాయి. వాటితో ఆటలాడుకోవచ్చు. ఒడిలోకి తీసుకొని నిమురుతూ కాలక్షేపం చేయొచ్చు. సెల్ఫీలు కూడా తీసుకోవచ్చు. టాయ్ పూడుల్స్ ద్వారా పొందే అనుభూతులు ప్రయాణికులకు ఆత్మవిశ్వాసాన్ని, ఆనందాన్ని కలగజేస్తాయని, డాగ్ థెరపీలో ఇది ఒక భాగమని నిర్వాహకులు తెలిపారు. వీటితో కాలక్షేపం చేసేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 'డాగ్ థెరపీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడికి గురయ్యే కార్టిసాల్ హార్మోన్‌లను తగ్గిస్తుందని చెప్పారు. అలాగే ఆనందాన్ని కలిగించే ఆక్సిటోసిన్‌ను పెంచుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ పోర్టులో ఉన్న 4 శునకాలు వారానికి 5 రోజులు అంటే ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 6 గంటల పాటు అందుబాటులో ఉంటాయి.



ఈజీగా జర్నీ..

- సాధారణంగా విమానప్రయాణంలో రకరకాల ఒత్తిళ్లు ఉంటాయి. విమాన ప్రయాణం పట్ల ఉండే భయం, ఆందోళనలను డాగ్‌థెరపీ ద్వారా అధిగమించవచ్చు.
- అంతర్జాతీయ ప్రయాణాల్లో ఆలస్యంగా నడిచే విమానాల వల్ల కనెక్టింగ్ ఫ్లైట్ లభిస్తుందో లేదోననే భయం పట్టుకుంటుంది. ఆ సమయంలో ఈ శునకాలు ఒక డైవర్షన్ టెక్నిక్‌లా పని చేస్తాయి.



పరస్పర పరిచయం కోసం..

మాదాపూర్: నిఫ్ట్ విద్యార్థుల బ్యాచ్ కోసం ఒరియంటేషన్ 2025 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు నిఫ్ట్ డైరెక్టర్, విభాగ అధిపతులతో పరస్పర పరిచయం కల్పించే విధంగా ఉంటుంది. అకాడమిక్ వ్యూహాలు, నిఫ్ట్ క్యాంపస్‌లోని వివిధ క్లబ్‌లు, ఫ్యాకల్టీ మెంటార్లు, విద్యార్థి కౌన్సిలర్ తదితర వనరులు, సేవలపై అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో 215 మంది అండర్ గ్రాడ్యుయేట్, 33 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, బ్యాంక్ అకౌంట్స్, విద్య రుణాలు, హాస్టల్ సౌకర్యం, మొబైల్ సేవల ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో నిఫ్ట్ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ మాలిని దివాకల, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పృథ్వీ రాజ్ మాల్, ప్రొఫెసర్లు అన్నాజీ శర్మ, జ్యోతిర్మయి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



‘కుర్ర’ గుండె.. కుప్పకూలిపోతోంది

యువతలో పెరుగుతున్న ‘కార్డియాక్ అరెస్టులు’

సమయానికి సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

ఆరోగ్యకరమైన జీవనశైలి, హెల్త్ చెకప్‌లు ప్రధానం

మంచి ఎనర్జీతో షటిల్ ఆడుతున్న ఓ పాతికేళ్ల యువకుడు.. అప్పటివరకూ బాగుండి అకస్మాత్తుగా కుప్పకూలిపోతాడు... కారణం సడన్ హార్ట్ అరెస్ట్.

తన యూత్‌ఫుల్ పవర్‌తో డ్యాన్స్ చేస్తున్న యువతి అకస్మాత్తుగా కుదేలై కిందపడిపోతుంది... దానికీ కారణం హఠాత్తుగా గుండె ఆగిపోవడం!

పోలీస్ కావాలన్న లక్ష్యంతో సెలక్షన్ కోసం పరుగెత్తుతున్న ఓ యువకుడు పరుగు మధ్యలోనే పడిపోతాడు..

చాలా జోష్‌తో జిమ్‌లో వ్యాయామం చేస్తున్న టీనేజీ కుర్రాడు నేలకూలిపోతాడు. వీటన్నింటికీ కారణం.. అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం!

ఇటీవల ఇలాంటి కేసులను ఎక్కువగా చూస్తున్నాం. యువత ఇలా ఎందుకు కుప్పకూలిపోతున్నారు.. కారణాలేంటి?

యువకుల్లో చాలామంది అకస్మాత్తుగా గుండె ఆగిపోయి (కార్డియాక్ అరెస్ట్ కారణంగా) హఠాన్మరణాల పాలవుతున్నారు. ఇటీవలి కొన్ని అధ్యయనాలు చెప్పేదేమిటంటే.. ఈ ధోరణేమీ కొత్తది కాదు, ముందు నుంచీ ఉన్నదే. కాకపోతే ఇటీవల సోషల్ మీడియా చురుకుదనం కారణంగా ఇలాంటి విషయాలు విస్తృతంగా వైరల్ అయిపోతుండటంతో అందరికీ తెలుస్తున్నాయంటున్నారు నిపుణులు. ఉదాహరణకు కొన్ని మెడికల్ రిపోర్టుల ప్రకారం.. 2014 - 18 మధ్యకాలంలో ఒక్క ఫుట్‌బాల్ ఆట మైదానాల్లోనే 617 మంది ఆడుతూ మృతి చెందిన సంఘటనలను తార్కాణంగా చూపుతున్నారు. ఇక కోవిడ్ తర్వాత ఇలాంటి సంఘటనలు వెలుగు చూడటం మరింత పెరిగింది. ఒక అధ్యయనం ప్రకారం.. 2020–21 మధ్య ఏడాది కాలంలోనే ఈ తరహా హఠాన్మరణాలు మునుపటి కంటే 16 శాతం పెరిగాయి. 2021–22 మధ్య ఆ పెరుగుదల 17 శాతంగా ఉంది.



డాక్టర్ ఎంఎస్ఎస్ ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

సాక్షి, ఫీచర్స్ - హెల్త్ డెస్క్

ఆ రెండింటికీ తేడా ఉంది

అకస్మాత్తుగా మృతిచెందడానికి ఒక్క గుండెపోటే కచ్చితమైన కారణమంటూ చాలామంది పొరబడుతుంటారు. గుండెపోటు కూడా ఒక కారణమైనప్పటికీ ఇతర కారణాలూ ఉండవచ్చు. కార్డియాక్ అరెస్టుకూ, గుండెపోటుకూ మధ్య తేడా ఉంది. స్పందిస్తూ ఉన్న గుండె అకస్మాత్తుగా ఆగిపోవడాన్ని కార్డియాక్ అరెస్ట్ అనీ, ఆ కారణంగా మృతిచెందడాన్ని సడన్ కార్డియాక్ డెత్ అనీ చెప్పవచ్చు. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. వీటిల్లో ప్రధానమైన కారణం గుండెపోటు. అయితే కొంతమందిలో వేరే కారణాల వల్ల కూడా కార్డియాక్ అరెస్ట్ రావచ్చు. ఉదాహరణకు వారికి చిన్నప్పట్నుంచే గుండె సంబంధ కొన్ని సమస్యలు ఉండటం, అకస్మాత్తుగా అవి ఒకేసారి బయటపడటంతో హఠాత్తుగా గుండె ఆగిపోతుంది. గుండె స్పందనలు క్రమం తప్పకుండా జరుగుతుండటానికి గుండెలోని ఒక ఎలక్ట్రిక్ కేంద్రం నుంచి ఒకే తీరున ఎలక్ట్రిక్ తరంగాలు వెలువడుతుంటాయి. ఈ ఎలక్ట్రిక్ తరంగాలు వెలువడటంలో అంతరాయం ఏర్పడినప్పుడు కూడా గుండె అకస్మాత్తుగా ఆగిపోతుంది.

గుండెపోటులో ఇలా..

గుండెకు ప్రధానంగా మూడు ధమనుల ద్వారా రక్తసరఫరా జరుగుతుంది. వీటిలో ఏ రక్తనాళం మూసుకుపోయినా గుండె కండరాలకు అందాల్సిన రక్తం అందక గుండెపోటు వస్తుంది. ఇలాంటప్పుడు సమయానికి హాస్పిటల్‌కు తీసుకెళ్తే బాధితులను బతికించేందుకు అవకాశముంటుంది. కార్డియాక్ అరెస్ట్ జరిగిన తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్లడం కన్నా.. తక్షణమే సీపీఆర్ ప్రక్రియ చేపట్టడం ముఖ్యం.

ఇలా నివారించవచ్చు

ఈ తరహా హఠాన్మరణాలను నివారించవచ్చని వైద్యులు అంటున్నారు. ఇందుకు అందాల్సిన మొదటి పారామెడిక్ సహాయం ‘సీపీఆర్’– కార్డియో పల్మనరీ రీససియేషన్. సీపీఆర్ అంటే మొదట్లో చాలామందికి అవగాహన ఉండేది కాదు. కానీ ఇటీవల సినిమాలూ, కొన్ని సంఘటనల్లో సీపీఆర్ తెలిసిన వ్యక్తులు బాధితుల ఛాతీపై రెండు అరచేతుల వేళ్లని ఒకదాని పక్కన మరొకటి ఉంచి ఛాతీపైన వాటిని ఆనించి బలంగా నొక్కుతున్నట్లుగా లయబద్ధంగా కదలించడాన్ని సీపీఆర్ అంటారన్న అవగాహన కొంత పెరిగింది. సీపీఆర్ చేయడమెలాగో అందరూ తెలుసుకోవాలి. విద్యార్థులందరికీ పాఠశాల స్థాయి నుంచే దీనిపై శిక్షణ ఇవ్వడం మంచిది. ఎయిర్‌పోర్టులూ, రైల్వే / బస్ స్టేషన్లూ, మల్టీప్లెక్స్‌లూ, ఆటస్థలాల వంటి పబ్లిక్ ప్రదేశాల్లో ‘ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీ–ఫిబ్రిలేటర్స్’(ఏఈడీ) అమర్చాలి. గుండె ఆగినప్పుడు.. అవి బయటి నుంచి షాక్ ఇచ్చి గుండె స్పందనలను పునరుద్ధరిస్తాయి. ఇలా మరణించిన వ్యక్తికి పోస్ట్ మార్టమ్ నిర్వహించి, మరణ కారణాలు తెలుసుకోవడం ద్వారా కూడా ఇలాంటి మరణాలను నిలువరించవచ్చు.

ఈ జాగ్రత్తలతో..

- నలభై ఏళ్లు దాటిన వారు ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్ మిల్ టెస్ట్ (టీఎంటీ) పరీక్షలను ఏడాదికి ఒకసారి చేయించుకోవాలి.
- ఛాతీనొప్పి వంటి లక్షణాలు ఉన్నవారుగానీ.. కుటుంబ చరిత్రలో గుండెజబ్బులు ఉన్నవారుగానీ.. బీపీ, కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఊబకాయం, మానసిక ఒత్తిడి, ధూమపానం వంటి రిస్క్ ఫ్యాక్టర్లు ఉన్నవారు 40 ఏళ్లకు ముందే ఈ గుండె పరీక్షలు చేయించుకోవాలి.
- ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, టీఎమ్‌టీ చేయించుకుని.. అవి నార్మల్‌గా ఉంటే గుండె పూర్తి ఆరోగ్యంగా ఉందని నిర్ధారణ అవుతుంది.
- వైద్యులు సూచించే ఆరోగ్యకరమైన సమతులాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, కంటి నిండా నిద్రపోవడం వంటి జీవనశైలిని పాటించాలి.
- ఒత్తిడిని వీలైనంతగా తగ్గించుకుంటూ.. పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.
- ఊబకాయం ఉన్నవారు తమ బరువును తగ్గించుకోవాలి.
- కొలెస్ట్రాల్, హైబీపీ, డయాబెటిస్‌తో బాధపడేవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, వాటిని అదుపులో ఉంచుకోవాలి.


ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలితో.. ఒత్తిడికి దూరంగా ఉంటే.. మన గుండె భద్రంగా ఉన్నట్టే.

కోవిడ్ వ్యాక్సిన్ తర్వాత గుండెపోట్లు పెరిగాయా?

చాలామంది ఈ తరహా మరణాలకు కోవిడ్ వ్యాక్సిన్‌ను కారణంగా చూపుతున్నారుగానీ ఇందుకు శాస్త్రీయమైన రుజువులు లేవు. ఇప్పటికైతే కోవిడ్ వ్యాక్సిన్‌కూ గుండెపోట్లకూ నేరుగా సంబంధం ఉన్నట్లుగా ఆధారాలేవీ లేనందున ఇలాంటి అపోహలను వ్యాప్తి చేయడం సరికాదన్నది వైద్యనిపుణుల అభిప్రాయం.

ఆ కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోండి

సీఎంకు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ఏక్ పోలీసు విధానం అమలు కోసం నిరసన తెలిపిన స్పెషల్ కానిస్టేబుళ్ల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సస్పెండైన 10 మంది స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విధుల నుంచి డిస్మిస్ అయిన కానిస్టేబుళ్ల కుటుంబాలు బుధవారం తెలంగాణ భవన్‌లో ప్రవీణ్ కుమార్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరించాయి. తెలంగాణలో ఏక్ పోలీసు విధానం అమల్లోకి తెస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ గుర్తు చేశారు. కానిస్టేబుళ్లను ముందు పెట్టి రాజకీయాలు చేసే ఉద్దేశం బీఆర్ఎస్ పార్టీకి లేదని స్పష్టంచేశారు.

ఆ షేర్ల బదిలీ అక్రమం

షర్మిలపై వైఎస్ జగన్ కేసులో ఎన్‌సీఎల్‌టీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి, క్లాసిక్ రియాల్టీలకున్న వాటాను తక్షణం పునరుద్ధరించాలని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ మేరకు తల్లి విజయమ్మ ద్వారా తన సోదరి షర్మిల చేసుకున్న అక్రమ బదిలీని నిలిపివేయాలని ఆయన చేసిన వాదనతో బెంచ్ ఏకీభవించింది. వారి వాటాలను వారి పేరుపై మార్చి, వాటాదారులుగా పేర్కొంటూ సభ్యుల రిజిస్టర్‌ను సరిదిద్దాలని సరస్వతి పవర్ బోర్డుకు స్పష్టం చేసింది. ఆ విషయాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు అఫిడవిట్ ద్వారా తెలియజేయాలని స్పష్టంచేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువరించిన బెంచ్... బుధవారం 45 పేజీల తీర్పు కాపీని వెలువరించింది.

తీర్పులో ముఖ్యాంశాలివీ...

- పిటిషనర్లయిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్ భారతి రెడ్డి, క్లాసిక్ రియాల్టీల నుంచి అక్రమ పద్ధతుల్లో ప్రతివాదులు షేర్లను బదిలీ చేసుకున్నారు. ఎందుకంటే పిటిషనర్లు తమ పేరిట ఉన్న షేర్లకు సంబంధించి ఎలాంటి షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారాలపైనా (ఎస్‌హెచ్–4) సంతకాలు చేయలేదు. చెల్లెలిపై ఉన్న ప్రేమాభిమానాలతో అంతిమంగా చెల్లెలికి చెందేలా తల్లిని ట్రస్టీగా పెట్టి పిటిషనర్లు తమ షేర్లను గిఫ్ట్ డీడ్ చేశారు. కానీ కోర్టుల్లో కేసులు తేలాకే ఇవ్వాలనే షరతు పెట్టుకున్నారు కనక దానికి తగ్గట్టుగా ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లను తమ వద్దే ఉంచుకున్నారు.
- షేర్ బదిలీ ప్రక్రియ కోసం తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలు ఉన్నాయి. ఎస్‌హెచ్–4 బదిలీ ఫారాన్ని షేర్ హోల్డర్ల సంతకాలతో, తగిన స్టాంప్ డ్యూటీ చెల్లించి సమర్పించాలి. ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లూ ఉండాలి. కానీ ఇక్కడ ప్రతివాదులు అవేమీ పాటించలేదు.
- ‘డాక్యుమెంట్లు పోయాయి’ అని ప్రతివాదులు చెప్పిన కారణం చట్టపరంగా సరైనది కాదు. ఒకవేళ అదే నిజమైతే పోయినట్లు పోలీస్ కంప్లయింట్ ఉండాలి. దాని ఆధారంగానే డూప్లికేట్ సర్టిఫికెట్లు పొందే ప్రయత్నం చేయాలి. దీనికి ఒరిజినల్ షేర్ హోల్డర్లూ సహకరించాలి. ఒరిజినల్ షేర్ హోల్డర్ల నుంచి అలాంటివేమీ లేకుండా... బోర్డు తీర్మానం ఆధారంగా షేర్లను పొందినట్లు చూపించడం న్యాయసమ్మతం కాదని బెంచ్ అభిప్రాయపడింది.
- గిఫ్ట్ డీడ్‌లు, షేర్ల కొనుగోలు ఒప్పందాలు (ఎస్‌పీఏ) ఉన్నా... అవి అంతర్గతంగా చేసుకున్న వ్యక్తిగత ఒప్పందాలు మాత్రమేనని, వాటి ఆధారంగా కంపెనీ రిజిస్టరులో పేరు మార్పు జరగాలంటే కంపెనీల చట్టం నిర్దేశిస్తున్న ప్రక్రియను పాటించాలని స్పష్టంచేసింది. కంపెనీల చట్టంలోని సెక్షన్ 56 (1) ప్రకారం షేర్ ట్రాన్స్ఫర్ చట్టబద్ధంగా జరుగాలంటే ఎస్‌హెచ్–4, ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లు, స్టాంప్ డ్యూటీ చెల్లించిన రసీదు తప్పనిసరి అని... ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్లకు ఎలాంటి మినహాయింపూ ఉండదని స్పష్టం చేసింది.
- ప్రతివాదులు ఇండెమ్నిటీ బాండ్లు, అఫిడవిట్లు మాత్రమే సమర్పించారని, అవి సరిపోవని తేల్చిచెప్పింది.



బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి తెలంగాణ లోకాయుక్త వార్షిక నివేదిక-2024ను సమర్పిస్తున్న లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉపలోకాయుక్త బీఎస్ జగ్జీవన్ కుమార్

‘భూదాన్’పై విచారణకు రెడీ

- కోర్టు ఆదేశిస్తే కమిషన్ వేసేందుకు సిద్ధం
- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్రంలోని భూదాన్ భూముల వివరాలన్నీ ఇవ్వండి
- భూదాన్ యజ్ఞ బోర్డును ఆదేశించిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానం ఆదేశిస్తే రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూములపై విచారణ జరిపించేందుకు సిద్ధమని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. భూదాన్ ఉద్యమ ప్రయోజనాలు కాపాడేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. రంగారెడ్డి జిల్లా నాగారం సర్వే నంబర్ 181, 194, 195లో భారీ భూ కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేటకు చెందిన బిర్లా మహేశ్.. సర్వే నంబర్ 194, 195లోని భూమిని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పడమటి తండాకు చెందిన రాములు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్ల వివరాలే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూదాన్ భూముల వివరాలు అందించాలని భూదాన్ యజ్ఞ బోర్డును ఆదేశించారు. దానం చేసిన భూములెన్ని.. పేదలకు ఎన్ని పంపిణీ చేశారు.. బోర్డు అధీనంలో ఎన్ని ఉన్నాయి.. ఏమైనా అన్యాక్రాంతమయ్యాయా.. ఏం చర్యలు తీసుకున్నారు అనే సకల వివరాలు అందించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ నేటి (గురువారం)కి వాయిదా వేసింది.

భూములను రక్షించాలన్న ఉద్దేశం బోర్డుకు లేదు..

భూదాన్ భూములను రక్షించాలన్న ఉద్దేశం బోర్డుకు లేనట్లు కనిపిస్తోందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్‌ల తరఫు న్యాయవాదులు.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టంలోని సెక్షన్ 3కు సంబంధించి సుప్రీంకోర్టు, కేరళ హైకోర్టులతోపాటు తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను సమర్పించారు. కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని, అయితే వ్యక్తిగత వివాదాల వంటి చిన్న అంశాలపై కాదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 194లో భూదాన్ భూమి లేదని, గైరాన్ (ప్రభుత్వ) భూమి మాత్రమే ఉందని పిటిషనర్లు, బోర్డు పేర్కొంటున్నందున గతంలో ఇచ్చిన స్టేటస్‌కో మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. దీనిపై గురువారం విచారణ తర్వాత నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు. భూదాన్ బోర్డు తరఫున న్యాయవాది కిరణ్ వాదనలు వినిపిస్తూ.. సర్వే నంబర్లు 181, 182లో 50 ఎకరాలు తమకు ఉందని, 194లో లేదని చెప్పారు. మహేశ్వరం మండలంలోని భూదాన్ వివరాలు కోర్టు ముందు ఉంచామని, ఈ భూములన్నీ సెక్షన్ 220 కింద నిషేధిత జాబితాలో ఉన్నాయని వివరించారు. ఆ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. భూదాన్ భూములను రక్షించాలన్న ఉద్దేశం బోర్డుకు కనిపించడంలేదని, ఈ నాలుగు సర్వే నంబర్ల వివరాలే కాదు.. రాష్ట్ర వ్యాప్త వివరాలు అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఏఐఎస్‌లది వ్యక్తిగత అంశమని, దీనిపై కమిషన్ వేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేపట్టాలని ఆదేశిస్తే సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

రెండు వారాలు గడువిస్తున్నాం

- ఆలోగా సీడ్ ఫామ్ యజమానులకు బిల్లు చెల్లించాలి
- సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చేప పిల్లలు పంపిణీ చేసిన సీడ్ ఫామ్ యజమానులకు రెండు వారాల్లో బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తాము ఇచ్చిన ఉత్తర్వుల అమలు నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. 2023–24 సంవత్సరానికి తాము అందజేసిన ఫిష్ సీడ్స్‌కు సంబంధించిన నగదు చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, తమకు రూ.28 లక్షలు ఇవ్వాలంటూ.. వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం శాకాపూర్ గ్రామానికి చెందిన పుట్టా ఫిష్ సీడ్ ఫామ్ యజమాని బాలరాజు హైకోర్టులో పిటిషన్ వేశారు. మరికొందరు కూడా ఇలాగే పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న న్యాయమూర్తి.. చెల్లింపులపై మూడు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెలలు గడిచినా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదని బాలరాజు సహా మరికొందరు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా కోర్టు ఆదేశాల మేరకు.. పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆలా వర్చువల్‌గా.. మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఫిజికల్‌గా విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆర్థిక శాఖ బడ్జెట్ విడుదల చేసిందని, టోకెన్ నంబర్ రాగానే బిల్లులు చెల్లిస్తామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణకు హాజరు నుంచి అధికారులకు మినహాయింపు ఇస్తూ, వాయిదా వేశారు.

నోట్ల కట్టల మాటున బాబు మహా కుట్ర

ఏస్థాయికైనా దిగజారుతామనేలా దర్యాప్తు సంస్థ మరో బరితెగింపు


రూ.11 కోట్ల జప్తు పేరుతో టీడీపీ కార్యాలయం డైరెక్షన్‌లో హైడ్రామా

పాతాళభైరవి సినిమాలో నేపాలీ మాంత్రికుడిని తలదన్నే రీతిలో సీఎం చంద్రబాబు రోజుకో క్షుద్ర రాజకీయానికి తెరతీస్తున్నారు. తాను ఏంచెప్పినా ఎస్ బాస్ అనే పోలీసు అధికారులతో కూడిన సిట్‌ను మంత్ర దండంగా చేసుకుని రాజకీయ కుతంత్రానికి పాల్పడుతు న్నారు. సామాన్య ప్రజలనే కాకుండా ఏకంగా న్యాయ స్థానాన్ని కూడా బురిడీ కొట్టించేందుకు తెగిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రధాన కార్యాలయం స్క్రిప్టుతో డ్రామా ను రక్తి కట్టించేందుకు ప్రయత్నించి సిట్ బోల్తా పడింది. న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకు గత శనివారం హైదరాబాద్‌లోని వికాట్ కంపెనీ కార్యాలయంలో సోదా ల పేరిట సిట్ హడావుడి చేసింది. అది ఫలించకపోవడంతో తాజాగా నగదు జప్తు కుతంత్రానికి తెరలేపింది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు రెడ్‌బుక్ కుట్రతో చంద్రబాబు ప్రభుత్వం రోజుకో రీతిలో నడుపుతున్న హైడ్రామాలో తాజా ఎపిసోడ్ ఇదిగో ఇలా ఉంది...

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసు దర్యాప్తులో ఏస్థాయికైనా దిగజారతామనేలా సిట్ మరో బరితెగింపునకు పాల్పడింది. నిందితుల బెయిల్ మంజూరును అడ్డుకునేందుకు సరికొత్త నాటకానికి తెరతీసింది. ఇన్నాళ్లైనా ఒక్క ఆధారమూ చూపలేకపోయారని సాక్షాత్తు కోర్టు తప్పుబట్టడంతో ఇంకో ‘కట్ట’కథకు సిద్ధమైంది.

హైదరాబాద్‌కు చెందిన తీగల విజయేందర్‌రెడ్డి హైదరాబాద్ శివారు శంషాబాద్ మండలం కాచారంలో వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీతో పాటు డయాగ్నస్టిక్ సెంటర్లు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ రూ.వందల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయి. ఈ వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ కేంద్ర బిందువు గానే సిట్ హైడ్రామాకు తెరతీసింది. విజయేందర్‌రెడ్డికి చెందిన సులోచన ఫామ్ హౌస్‌పై దాడి చేసి రూ.11 కోట్ల నగదు జప్తు చేసినట్టుగా బుధవారం హైడ్రామా నడిపించింది. వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన డబ్బును ఫామ్ హౌస్‌కు తరలించి రాజ్ కసిరెడ్డికి చెందినదిగా నమ్మించేందుకు సిట్ కుతంత్రం పన్నింది. అయితే, టీడీపీ ప్రధాన కార్యాలయం స్క్రిప్ట్ ప్రకారం సాగిన ఈ పన్నాగం బూమరాంగ్ అయ్యింది. మద్యం అక్రమ కేసులో న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే సిట్ కుట్ర బెడిసికొట్టింది.

–వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపేందుకు సిట్ ఇప్పటికే పలువురు అధికారులు, ఉద్యోగులు, డిస్టిలరీల ప్రతినిధులు, సాక్షులను బెదిరించి, వేధించిన విషయం తెలిసిందే. కాగా, లేని ఆధారాలు సృష్టించాలని, ఏదో ఒక విధంగా భారీగా నగదు జప్తు చేసినట్టు చూపించాలని సిట్‌పై టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి ఉంది. దాంతో రాజ్ కసిరెడ్డికి చెందిన నగదును జప్తు చేసినట్టు చూపించేందుకు ప్రయత్నించింది. టీడీపీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన స్క్రిప్ట్‌ను అమలులోకి తెచ్చింది. అదేమిటంటే... వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన రూ.11 కోట్ల నగదును గుట్టుచప్పుడు కాకుండా సులోచన ఫామ్‌హౌస్‌కు తరలించారు. అది కూడా ఇంజనీరింగ్ కాలేజీ సిబ్బందితోనే చేయించినట్టు తెలుస్తోంది. సిట్ పోలీసులే ఆ నగదు తీసుకెళ్తే ఎవరైనా మొబైల్ ఫోన్లతో వీడియోలు తీస్తారేమోనని సందేహించి ఈ విధంగా ముందు జాగ్రత్తపడ్డారు. నగదును ఫామ్‌హౌస్‌కు చేర్చిన తరువాత కుట్రలో రెండో అంకం మొదలు పెట్టారు. బుధవారం తెల్లవారుజామున సిట్ అధికారులు ఫామ్‌హౌస్‌పై దాడి చేసినట్టు... రూ.11 కోట్ల నగదును గుర్తించి జప్తు చేసినట్లు డ్రామా రక్తి కట్టించారు. ఈ నగదంతా రాజ్ కసిరెడ్డిదేనని... 2024 జూన్ నుంచే ఇక్కడ ఉంచారంటూ కట్టుకథను మీడియాకు లీకు చేశారు.



4. It is submitted that, I came to know that to day morning an alleged seizer of money by the SIT to the tune of 11 crores was made at one Farm House belonging to one Subchana Farms owned by one Theegala Bal Reddy at Kacharam Village, Samshabad Mandal, Ranga Reddy Dist., and it is being projected by the prosecution that the money that was allegedly seized belongs to me which is an utter falsehood and lie.

6. It is submitted that, I have got nothing to do with whatever money that is alleged to have been seized by the SIT and it does not belong to me and that the allegation of the prosecution that the said money belongs to me is baseless.

7. It is submitted that, the said allegation is only to bleak my chances of getting bail.

సిట్ జప్తు చేసిన రూ.11 కోట్లతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ న్యాయస్థానంలో రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్

చిత్తు కాగితాల అట్టపెట్టెల్లో అంత డబ్బు దాచారా?

కట్టుకథతో నమ్మించేందుకు సిట్ చేసిన పన్నాగం నవ్వులపాలైంది. గతంలో ఎప్పుడూ సోదాల్లో దొరకని డబ్బు, అకస్మాత్తుగా పుట్టుకు రావడమే దీనికి కారణం. పైగా ఏకంగా దాదాపు 14 నెలలుగా అక్కడే ఉన్నట్లు తెలపడాన్ని బట్టి చూస్తే... ఇదంతా సిట్ పన్నాగం అని స్పష్టంగా అర్థమవుతోంది. మరోవైపు విజయేందర్‌రెడ్డి అనుకూలంగా మారాకనే ఇదంతా జరగడం గమనార్హం. వాళ్లకు ఆ మనిషి అనుకూలంగా మారాకనే డబ్బు దొరకడం ఏమిటి? నివాసంలోని సొమ్మును వేరేవాళ్లదిగా ఆయనతోనే చెప్పించడం ఏమిటి? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఇక అర్ధరాత్రి చకచకా పుట్టుకొచ్చి పట్టుబడినది అని చెబుతున్న నగదు అంతా ఒకే తరహా అట్టపెట్టెల్లో (ఆఫీసుల్లో ఏ4 తెల్ల కాగితాల బండిల్స్ పెట్టేవి) ఉండడం ఆశ్చర్యపరిచింది. స్టేషనరీ సామగ్రి పెట్టే సాధారణ 12 అట్టపెట్టెల్లో రూ.11 కోట్లను ఉంచారని చెప్పడం సిట్ విస్మయకర తంతు ఏవిధంగా ఉందో తెలుస్తోంది.

బెయిల్‌ను అడ్డుకోవడానికే సిట్ కుట్రలు

సిట్ అధికారులు ఇంత చీప్ ట్రిక్ ఎందుకు పాల్పడ్డారన్నదే కదా సందేహం... అక్కడే ఉంది అసలు కథ. ఈ కేసులో తాము అక్రమంగా అరెస్టు చేసినవారికి బెయిల్ రాకుండా కోర్టును తప్పుదారి పట్టించడమే సిట్ లక్ష్యం. మద్యం విధానంపై అక్రమ కేసులో సిట్ ఒక్క ఆధారాన్ని కూడా సేకరించలేకపోయింది. కేసులో ఏ1గా పేర్కొన్న రాజ్ కసిరెడ్డిని సిట్ ఏప్రిల్ 21న అరెస్టు చేసింది. వంద రోజులుగా ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కానీ, సిట్ ఆధారాలు చూపలేకపోయింది. దీంతో 90 రోజుల తరువాత బెయిల్ ఇచ్చేందుకు సాంకేతికంగా మార్గం సుగమైనట్టే. ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు అదే విషయాన్ని ప్రస్తావించింది. వివిధ సంస్థల పేరిట బ్యాంకులో ఉన్న నగదును జప్తు చేయడం మినహా సిట్ అధికారులు దర్యాప్తులో ఏం గుర్తించారు? ఏం సాధించారు? అని ప్రశ్నించింది. దాంతో సిట్ అధికారుల నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. అందుకే లేని ఆధారాన్ని ఉన్నట్టు చూపాలని భావించారు. హడావుడిగా విజయేందర్‌రెడ్డిని తమ కుట్రలో పావుగా చేసుకున్నారని స్పష్టమవుతోంది. రూ.11 కోట్లు జప్తు చేసినట్టు, ఆ నగదు రాజ్ కసిరెడ్డిది అని కోర్టును తప్పుదారి పట్టించాలన్నది సిట్ పన్నాగం.

–అక్రమ కేసులో అక్రమంగా అరెస్టు చేసిన వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప తదితరుల బెయిల్‌ను అడ్డుకునేందుకు సిట్ ఇదే రీతిలో శనివారం హైడ్రామా సాగించింది. హైదరాబాద్‌లోని వికాట్ గ్రూప్‌నకు చెందిన ప్రధాన కార్యాలయంలో సోదాల పేరుతో హడావుడి చేసింది. కోర్టు నుంచి అనుమతి లేకుండానే దాదాపు 20 మంది సిట్ అధికారుల బృందం వికాట్ కంపెనీ కార్యాలయం వద్ద రాద్ధాంతం సృష్టించి...భయపెట్టేందుకు ప్రయత్నించింది.

ఆ నగదు నాది కాదు... విజయేందర్‌రెడ్డిదే

కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన రాజ్ కసిరెడ్డి రూ.11 కోట్ల జప్తు పేరుతో సిట్ కుట్రను రాజ్ కసిరెడ్డి తిప్పికొట్టారు. ఆ నగదుతో తనకుగానీ తన కుటుంబానికి గానీ ఎటువంటి సంబంధం లేదని న్యాయస్థానానికి నివేదించారు. ఆ నగదుకు వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని విజయేందర్‌రెడ్డే సమాధానం చెప్పాలన్నారు. ఈ మేరకు రాజ్ కసిరెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం సాయంత్రం అఫిడవిట్ దాఖలు చేశారు. విజయేందర్‌రెడ్డి కుటుంబానికి హాస్పిటల్, డయగ్నస్టిక్ సెంటర్లు, ఇంజనీరింగ్ కాలేజీ, ఇతర వ్యాపారాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఏటా వందల కోట్ల రూపాయల టర్నోవర్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ వ్యాపార సంస్థలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సిట్ జప్తు చేసింది ఆ వ్యాపార సంస్థలకు చెందిన నగదే కావచ్చని చెప్పారు. తాను ఫాంహౌస్‌లో నగదు దాచలేదని నివేదించారు.

కట్టుకథలో తాజా పాత్రధారి వరుణ్

మద్యం అక్రమ కేసులో నిందితుడు వరుణ్ పురుషోత్తంను నోట్ల కట్టల కట్టు కథలో సిట్ పాత్రధారిగా చేసుకుంది. ఆయన ఇచ్చిన సమాచారంతోనే తాము ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేసి నగదును గుర్తించినట్టు చెప్పుకొచ్చింది. అక్రమ కేసులో ఏ 40గా పేర్కొన్న వరుణ్ విదేశాలకు పరారయ్యారని సిట్ ఇప్పటివరకు ప్రచారం చేస్తూ వచ్చింది. ఆయనపై లుక్ ఔట్ నోటీసు కూడా జారీ చేసింది. విదేశాల్లో ఉన్న వరుణ్ పురుషోత్తం హఠాత్తుగా హైదరాబాద్‌లో ఎలా ప్రత్యక్షమయ్యారో మరి...? అంటే సిట్ ఆయన్ను అక్రమంగా నిర్బంధించి వేధించి తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించిందని స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇదే రీతిలో గతంలో బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగి సత్యప్రసాద్‌తో పాటు పలువురిని బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేసిన విషయం తెలిసిందే.

లోకేశ్ సన్నిహితుడు కిలారి రాజేష్ సిట్ అధికార ప్రతినిధా!?

రూ.11 కోట్ల జప్తు స్క్రిప్ట్ కథ టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచే నడిపించారన్నది తేటతెల్లమైంది. ఆ నగదును జప్తు చేసినట్టు టీడీపీ అనుకూల ఎల్లో మీడియాకు మంత్రి లోకేశ్ సన్నిహితుడు కిలారి రాజేష్ తెలపడమే దీనికి నిదర్శనం. ఆయనకు ప్రభుత్వంలో ఎటువంటి పదవీ లేదు. సిట్‌తో అధికారికంగా సంబంధం లేదు. కానీ, సిట్ అధికార ప్రతినిధి అన్నట్టుగా బుధవారం తెల్లవారుజామునే రూ.11కోట్ల జప్తు చేసిన ఫొటోలు, సమాచారం ఇవ్వడం మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంటే, ఈ జప్తు కథ అంతా టీడీపీ కేంద్ర కార్యాలయం డైరెక్షన్‌లోనే సాగిందన్నది స్పష్టమైంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 31-7-2025



● స్ఫూర్తి

'నేను స్వీపర్‌గా పనిచేయడం ఏమిటి?'
అని ఆమె అహానికి పోలేదు.
'ఇంత చిన్నజీతానికి పనిచేయడం ఏమిటి?'
అని తాను చేస్తున్న పనిని చిన్నచూపు చూడలేదు.
చిన్నదో, పెద్దదో 'పని' చేయాలి అని గట్టిగా అనుకుంది
ముంబైకి చెందిన ప్రతీక్ష తోండ్వాల్కర్.
పనే ఆమెకు 'పవర్' అయింది. ఎస్‌బీఐలో
స్వీపర్ స్థాయి నుంచి ఏజీఎం స్థాయికి చేరింది...

స్వీపర్ టు ఏజీఎం!



పేదకుటుంబంలో పుట్టిన ప్రతీక్షకు పదిహేడు సంవత్సరాల వయసులోనే వివాహం జరిగింది. ఇరవైలలో ఉన్నప్పుడు భర్త రోడ్డుప్రమాదంలో చనిపోయాడు. ఆ షాక్ నుంచి కోలుకోవడం ఆమెకు చాలా కష్టమైపోయింది. అప్పటికే తనకు రెండు సంవత్సరాల పిల్లవాడు ఉన్నాడు.

'ఇలా ఏడుస్తూ కూర్చుంటే పిల్లవాడి గురించి ఎవరు ఆలోచిస్తారు?' అనుకొని ఆ దుఃఖం నుంచి బయటపడి ధైర్యం తెచ్చుకుంది.

'ఇంట్లో ఖాళీగా కూర్చుంటే కడుపు నిండదు. ఏడుపు ఇంకా ఎక్కువ అవుతుంది. ఇప్పుడు ఏదో ఒక పని చేయాలి' అనుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ముంబై బ్రాంచ్‌కు వెళ్లి 'ఏదో ఒక పని ఇప్పించండి' అని అడిగింది. ఆమె భర్త ఈ బ్రాంచ్‌లో బుక్ బైండర్‌గా పనిచేసేవాడు. ఆ మంచితనం, సానుభూతితో బ్యాంక్ వాళ్లు ఆమెకు తమ బ్రాంచీలో స్వీపర్‌గా పనిచేసే అవకాశం ఇచ్చారు. నెలకు అరవై అయిదు రూపాయల జీతం వచ్చేది.

ఆ జీతంతోనే సర్దుకుపోయి ఉంటే ప్రతీక్ష తన భవిష్యత్ గురించి ఆలోచించేది కాదు.

ఆ సమయంలోనే తాను మరచిపోయిన చదువు గురించి ఆలోచన మొదలైంది. ఆ ఆలోచనతో పాటు అనుమానాలు కూడా మొదలయ్యాయి.

'ఈ వయసులో చదువు ఏమిటి!'

'ఇంట్లో బిడ్డను పెట్టుకొని కాలేజీకి వెళతావా!'... ఇలాంటి మాటలు వినాల్సి వస్తుందేమో అని మొదట భయపడింది. ఆ తరువాత తనకు తానే ధైర్యం తెచ్చుకుంది.

'నేనేమీ తప్పు చేయడం లేదు. చదువుకోబోతున్నాను. అంతే' అని గట్టిగా నిశ్చయించుకుంది.

ఒకవైపు స్వీపర్ పనిచేస్తూనే మరోవైపు నైట్ కాలేజీలో చదువుకునేది. ఇంటర్మీడియెట్ తరువాత మరో నైట్‌కాలేజీలో డిగ్రీ చేసింది. స్వీపర్ నుంచి బ్యాంక్ క్లర్క్‌గా ప్రమోట్ అయింది. కొంతకాలానికి తిరిగి వివాహం చేసుకుంది ప్రతీక్ష. భర్త ప్రమోద్ 'నిన్ను ఇంకా పెద్దస్థాయిలో చూడాలనుకుంటున్నాను' అనేవాడు. బ్యాంక్ ఎగ్జామ్స్ రాయాలని ప్రోత్సహించేవాడు. అలా బ్యాంకు పరీక్షలు రాసి ఒక్కోమెట్టు ఎక్కుతూ ఏజీఎం (అసిస్టెంట్ జనరల్ మేనేజర్) స్థాయికి చేరింది ప్రతీక్ష.

'కష్టాల్లో ఉన్నప్పుడు చదువు తప్ప నాకు మరో దారి కనిపించలేదు. చదువును నమ్ముకునేవారికి, కష్టపడేవారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది' తన అనుభవ జ్ఞానంతో అంటుంది ప్రతీక్ష తోండ్వాల్కర్.

ప్రతీక్ష తన విజయం దగ్గరే ఆగిపోలేదు. తన విజయంతో ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది.


ఆ రెండు అడుగులు

ఆ కష్టకాలాన్ని గుర్తు తెచ్చుకుంటే నాకు ఊపిరి ఆడనట్లుగా ఉంటుంది. అయితే గతంలోనే ఉండిపోతే భవిష్యత్‌ను చూడలేము. నాకు మొదటి నుంచి చదువు అంటే ఇష్టం. ఆ చదువే నాకు ధైర్యాన్ని ఇచ్చి దారి చూపింది. పరిస్థితులే మనకు ధైర్యాన్ని ఇస్తాయి అని చెప్పడానికి నేనే ఉదాహరణ. తెలియని వ్యక్తుల ముందుకు వెళ్లి 'నాకు ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించండి' అని అడగడం నేను ధైర్యంగా వేసిన మొదటి అడుగు అనుకుంటాను. ఎవరు ఏమనుకున్నా సరే నేను చదవాల్సిందే అనుకోవడం నేను ధైర్యంగా వేసిన రెండో అడుగు. ఆ రెండు అడుగులు నా జీవితాన్ని మార్చేశాయి

- ప్రతీక్ష తోండ్వాల్కర్

నేరమే... అయినా!

న్యాయ విచారణలో తీర్పులెప్పుడూ బలహీనుల పక్షమే ఉండాలి...
నేరానికి బలైనా, నేరం చేసినా!
ఆ బలహీనుల వర్గంలో పిల్లలు, మహిళలు ముందుంటారు! అందుకే...
హనీమూన్ మర్డర్ మొదలు ఆడవాళ్లు చేసినట్టుగా నమోదవుతున్న ఆ తరహా నేరాల విషయంలో వాటి వెనుకున్న సామాజిక ఒత్తిళ్ల మీద చర్చ జరగాలి.. ఆ వాతావరణాన్ని విశ్లేషించాలని సోషల్ ఇంజినీర్స్, సైకాలజిస్ట్‌లు అంటున్నారు. వాటిని సుప్రీంకోర్ట్ కూడా పరిగణనలోకి తీసుకుంది. తమకు ఇష్టంలేని పెళ్లి చేసుకున్న అమ్మాయిలు దాన్నుంచి తప్పించుకోవడానికి చేసిన నేరాలను ప్రస్తావిస్తూ ఇటీవలే ఓ అభిప్రాయాన్ని వెల్లడించింది.



సమాజంలోని లింగవివక్ష, సామాజిక నిబంధనలు చాలావరకు స్త్రీని పరాయిగా చూస్తూ.. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను దూరం చేస్తూ ఆమెను నిస్సహాయ స్థితిలోకి నెట్టేస్తున్నాయి. ఈ అణచివేత, నిస్సహాయతే నేరాలకు కారణమవుతున్నాయి. ఇలాంటి సామాజిక నేపథ్యంతో నేరం చేసిన స్త్రీల విషయంలో కఠినమైన శిక్షలకన్నా సంస్కరణ దృక్పథాన్ని అనుసరించాలని ఉద్ఘాటించింది సుప్రీం కోర్ట్.

ఈ నిర్ణయానికి ప్రధాన నేపథ్యం..

కర్ణాటకకు చెందిన శుభ అనే కాలేజ్ స్టూడెంట్.. తన స్నేహితుడు అరుణ్ వర్మతోపాటు వెంకటేశ్, దినేశ్ అనే ఇంకో ఇద్దరు వ్యక్తులతో కలిసి తన కాబోయే భర్తను హత్య చేసింది. నిజానికి శుభకు ఆ పెళ్లి ఇష్టంలేదు. అయినా తల్లిదండ్రులు బలవంతపెట్టడంతో ఆ విషయాన్నే తన స్నేహితుడు అరుణ్‌కి చెప్పి, పెద్దలు నిశ్చయించిన ఆ వరుడి హత్యకు కుట్ర పన్నింది. ఈ కేస్ పూర్వాపరాలను పరిశీలించిన సుప్రీంకోర్ట్.. 'లింగవివక్ష, ఏళ్ల నుంచి పాతుకుపోయిన జెండర్ రోల్స్ వంటివన్నీ మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంకెళ్లగా మారుతూ వారిని అణచివేస్తున్నాయి. అది వాళ్లలో ధిక్కార ప్రవర్తనకు కారణమవుతోంది. ఫలితంగా నేరాలకు పాల్పడుతున్నారు. ఆధునిక మహిళలు చాయిస్ ఆఫ్ ఫ్రీడమ్ హక్కును ఆస్వాదించాలనుకుంటున్నారు. ఉదాహరణకు.. చదువుకున్న అమ్మాయి 'ఆశలు' అనే రెక్కలు తొడుక్కోవాలనుకుంటుంది. ఇండిపెండెంట్‌గా ఉండాలనుకుంటుంది. ఈ క్రమంలో బలవంతపు పెళ్లి తన జీవిత లక్ష్యానికి విడాకులు ఇప్పిస్తుంది. పై చదువులకు వెళ్లనివ్వకుండా అడ్డుకుంటుంది. ఇది కచ్చితంగా ప్రతి చర్యకు దారితీస్తుంది. అయితే ఈ రియాక్షన్స్ మహిళ మహిళకు మారుతుంటాయి.. వాళ్ల నేపథ్యం, స్నేహాలను బట్టి. ఉదాహరణకు మధ్యతరగతికి చెందిన అమ్మాయి.. పేదింటి లేదా ధనిక కుటుంబపు అమ్మాయిల కంటే భిన్నంగా రియాక్ట్ కావచ్చు. తీసుకునే నిర్ణయాన్ని అది ప్రభావితం చేయొచ్చు' అని విశ్లేషించింది.

నేరస్తులు అందరిపట్లా...

స్త్రీలకు సంబంధించి.. నేరానికి ఉసిగొల్పిన సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నేరస్థుల సంస్కరణ దిశగా తీర్పులు ఉండాలన్న సుప్రీంకోర్ట్ అభిప్రాయం హర్షించదగ్గది. అయితే దాదాపుగా నేరాలన్నిటికీ సామాజిక పరిస్థితులే కారణాలుగా ఉంటాయి. నేరస్థుల అందరిపట్లా ఇలాంటి అప్రోచే ఉండాలి. శిక్ష తర్వాత సమాజంలోకి వచ్చిన వాళ్లను సానుకూల దృక్పథంతో చూడాలి. సహానుభూతి ఉండాలి.



- ప్రొఫెసర్ బీనా చింతలపురి

కారణాలను పరిగణించాలి...

సామాజిక, కుటుంబ ఒత్తిళ్లు మహిళలు/అమ్మాయిల స్వేచ్ఛను అడ్డుకోవడమేకాక వాళ్లను నిస్సహాయ స్థితిలోకి నెట్టేస్తున్నాయి. ఇవి కొన్నిసార్లు నేరాలకు దారితీయొచ్చు. కాబట్టి వారిలో పరివర్తన తీసుకురావడం ఎంత అవసరమో.. ఆ సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకుని వారికి క్షమాభిక్ష పెట్టడమూ అంతే అవసరమంటూ సుప్రీంకోర్టు చేసిన సిఫార్సు ఆహ్వానించదగినది. అలాగని సుప్రీంకోర్టు నేరాన్ని సమర్థించట్లేదు. నేరస్థులను చంపితే నేరం చావదని, నేరస్థుల పరివర్తన మీద దృష్టిపెట్టి.. నేర స్వభావానికి కారణమైన సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చెబుతోంది. ఉద్దేశపూర్వకంగా చేసిన నేరానికీ, నిస్సహాయ స్థితిలో ఒక అమ్మాయి చేసిన నేరానికి చాలా తేడా ఉంటుంది. రెండింటిలో శిక్ష ఒకే మాదిరిగా ఉన్నప్పటికీ, వారిలో తేవాల్సిన పరివర్తన ధోరణి, అలాగే క్షమాభిక్ష పెట్టేప్పుడు పరిగణించాల్సిన అంశాలు వేరేగా ఉండాలి.

- మామిడి సుధేష్ణ, హైకోర్ట్ అడ్వకేట్

సంస్కరించడమే పరిష్కారం

మన దేశంలో చాలామంది మహిళలు పిల్లల కోసమో, విడాకులకు సొసైటీలో యాక్సెప్టెన్స్ లేకపోవడం వల్లో, అవమానాలు, అపవాదులకు జడిసో, ఆర్థిక స్వాతంత్ర్యం లేకనో వైవాహిక జీవితంలోని హింసను మౌనంగా భరిస్తున్నారు. భరించలేని కొందరు మాత్రం విపరీత చర్యలకు ఒడిగడుతున్నారు. ఇది కలవరపరచే అంశమే! వారి ఆ చర్యలకు సామాజిక నిర్లక్ష్యం, అన్యాయం, వాళ్లను అర్థం చేసుకోకపోవడమే కారణాలుగా తోస్తున్నాయి. వైఫల్యం చెందిన వ్యవస్థలను సంస్కరించడమే దీనికి పరిష్కారం. కుటుంబం ముఖ్యంగా మగవాళ్లు అమ్మాయిల పట్ల సహానుభూతితో వ్యవహరించాలి. కెరీర్, పెళ్లి, పిల్లలు లాంటి విషయాల్లో వాళ్ల నిర్ణయాలను గౌరవించి ఆమోదించాలి. మద్దతుగా నిలవాలి.



- రాజ్ రాచకొండ, సినీ దర్శకుడు

170 గంటల పాటు భరతనాట్యం!

● రికార్డ్



కర్ణాటకలోని మంగళూరుకు చెందిన రెమోన 170 గంటల పాటు భరతనాట్యం చేసి 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సాధించింది. మూడు గంటలకు ఒకసారి పదిహేను నిమిషాల పాటు బ్రేక్ తీసుకునేది. ఎల్‌సీఆర్‌ఐ ఆడిటోరియంలో జరిగిన రెమోన సుదీర్ఘ నాట్యప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. 170 గంటల పాటు భరతనాట్యం చేసిన తొలి వ్యక్తిగా రెమోన చరిత్ర సృష్టించింది. 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' హెడ్ మనీష్ విష్ణోయి నుంచి 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్' అందుకుంది రెమోన.

'భరతనాట్యం చేయడం సులువు కాదు అంటారు. అలాంటి నాట్యంలో 170 గంటల పాటు ప్రదర్శన ఇవ్వడం సామాన్య విషయం కాదు. కష్టం, అంకితభావంతో ఈ విజయాన్ని సొంతం చేసుకుంది' అని రెమోనను ప్రశంసించారు మనీష్. 'రెమోనా నాట్యప్రదర్శన అద్భుతం. ఇది అరుదైన ఫీట్' అని ప్రశంసించారు రెమోన నాట్య గురువు శ్రీవిద్య. బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న రెమోన భవిష్యత్‌లో మరిన్ని రికార్డ్‌లు నెలకొల్పాలని ఆశిద్దాం.

● కాస్త సరదాగా

ఎం.ఎస్. ధోని - మ్యారేజ్ కౌన్సెలర్




'ఎంఎస్ ధోని మ్యారేజ్ కౌన్సెలర్ ఏమిటీ!!!' అని ఆశ్చర్యపోతున్నారా ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోను చూసి నెటిజనులు సరదాగా అన్నమాట... మ్యారెజ్ కౌన్సెలర్ ఎం.ఎస్. ధోని. ఇక మ్యాటర్‌లోకి వస్తే... ధోని ఒక వివాహ వేడుకకు వెళ్లాడు. తన సిగ్నేచర్ కూల్ స్టైల్లో వధూవరులను నవ్వించాడు. 'కొందరికి అగ్గితో ఆడుకోవడం అంటే ఇష్టం. ఈ అబ్బాయి కూడా అలాంటోడే' అని వరుడిని చూపిస్తూ పెళ్లి గురించి జోక్ చేశాడు ధోని. 'నువ్వు వరల్డ్ కప్ గెలుచుకున్నవా లేదా అనేది ముఖ్యం కాదు. పెళ్లి తరువాత ఏ భర్త అయినా ఒక్కటే' అని మరోసారి నవ్వించాడు. ఈ నవ్వుల్లో మునిగిపోయిన నెటిజనులు కాస్త సరదాగా ధోనీని మ్యారెజ్ కౌన్సెలర్‌ని చేసేశారు!

● సోషల్ మీడియా



దివ్యమైన అమ్మ

చెస్ గురించి పెద్దగా ఆసక్తి లేని వారికి కూడా ఇప్పుడు సుపరిచిత పేరు... దివ్యా దేశ్‌ముఖ్. ప్రపంచం మెచ్చిన అపూర్వ విజయం తరువాత తన తల్లిని కౌగిలించుకొని భావోద్వేగానికి గురవుతున్న దివ్య వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'తల్లి అంటే ఎంతోమంది స్టార్‌ల వెనుక ఉన్న అన్‌సంగ్ హీరో' అని దివ్య తల్లి గురించి ప్రశంసిస్తూ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర. 'ఎంత గ్రాండ్‌మాస్టర్ అయినా తల్లి చాటు బిడ్డే' అన్నారు నెటిజనులు. తల్లులు పిల్లల గురించి ఎన్నో కలలు కంటారు. వారి కలలను తమ కలలుగా భావిస్తారు. వారి కష్టాలను తమ కష్టాలుగా భావిస్తారు. పిల్లల కంటే ఎక్కువగా వారి విజయాలకు సంతోషంతో ఉప్పొంగిపోతారు. అందుకే...అమ్మలు అన్‌సంగ్ హీరోలు. ఉమెన్స్ చెస్ వరల్డ్ కప్ గెలుచుకున్న తరువాత 'ఎవరీ దివ్య దేశ్‌ముఖ్?' అనే ఆసక్తి చాలామందిలో మొదలైంది. చాలా చిన్న వయసు నుంచే చెస్ ఆడడం మొదలుపెట్టిన దివ్య చెస్‌లోనే కాదు చదువులోనూ 'శభాష్' అనిపించుకునేది. 'అయిదేళ్ల వయసు నుంచే చెస్‌లో అద్భుతమైన ఆట తీరును ప్రదర్శిస్తూ వస్తోంది దివ్య. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు గెలుచుకున్న దివ్యకు కామ్ గర్ల్‌గా పేరు. జయాపజయాలలో ఒకే రకంగా ఉండడం కొందరికి మాత్రమే సాధ్యపడుతుంది. అలాంటి వారిలో దివ్య ఒకరు. ఓడిపోయిన సందర్భంలోనూ ఆమె కళ్లలో బాధ కనిపించేది కాదు. టోర్నమెంట్ గెలిచినప్పుడు ట్రోఫీతో నా దగ్గరకు వచ్చేది. తాను సాధించిన విజయం గురించి ఎంతోమాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ చాలా తక్కువగా మాట్లాడేది. తనకు ఇష్టమైన ఆట, చదువును రెండిటినీ విజయవంతంగా సమన్వయం చేసుకునేది. నాగ్‌పూర్ కాకుండా వేరే చోట చెస్ పోటీలు జరిగినప్పుడు పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్లేది. చదువును ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు' అంటూ గత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంది నాగ్‌పూర్‌లోని భారతీయ విద్యాభవన్ స్కూల్ మాజీ ప్రిన్సిపాల్ అంజు భూటాని.



మళ్లీ భయపెడుతున్న ఒంటి కన్ను శివరాసన్

తెల్లలాల్చీ, పైజామాలో ఉన్న శివరాసన్, పక్కనే చందన దండ పట్టుకు నిల్చున్న మానవ బాంబు థాను... వీరి ఫొటోను 1990ల కాలం నాటి భారతీయ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. మే 21, 1991 రాత్రి తమిళనాడు శ్రీపెరంబుదూర్‌లో రాజీవ్‌గాంధీ హత్య జరిగాక మానవబాంబు అనే మాట, ఎల్‌టీటీఈ అనే పేరు జనసామాన్యానికి తెలిసింది. ఈ ప్లాన్ వేసిన వాడు శివరాసన్ అనే ఒంటికన్ను వ్యక్తి అని, అతను ఇంకా దేశంలోనే ఉన్నాడనే ప్రచారంతో భయపడని వారు లేరు. ఏ ఊరిలో ఏ టీ బంకు దగ్గరైనా శివరాసన్ కబుర్లే. ఆడవారు అతని పేరు తలుచుకుని ఒణికేవారు. అలాంటి శివరాసన్ ఆ ప్లానంతా ఎలా వేశాడో, ప్లాన్ ఎగ్జిక్యూట్ అయ్యాక ఎలా తప్పించుకున్నాడో, ఆ తర్వాత ఎలా పోలీసుల చేతికి చిక్కబోయి మరణించాడో సవివరంగా, ఉత్కంఠగా చూపిస్తూ 'సోనీ లైవ్'లో 'ది హంట్- రాజీవ్‌గాంధీ అసాసినేషన్ కేస్' వెబ్ సిరీస్‌లో చూస్తాం. తెలుగువాడైన ప్రసిద్ధ దర్శకుడు నాగేష్ కుకునూర్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఆనాటి రోజులతో పాటు, శివరాసన్‌ను కూడా తిరిగి ఇంటింటిలో చూపి భయపెడుతోంది.

జాఫ్నాకు చెందిన శివరాసన్ ఎల్‌టీటీఈలో చేరి, దాని చీఫ్ ప్రభాకరన్‌కు నమ్మకస్తుడుగా మారి రాజీవ్‌గాంధీ హత్యను అమలుపరిచే టీమ్‌కు నాయకుడిగా చెన్నై చేరుకున్నాడు. అతనితో పాటు నళిని, థాను, మురుగన్ తదితరులు మరో ఎనిమిది మంది వచ్చారు. వీరంతా కలిసి ప్లాన్ చేసి మానవబాంబుగా థానును తయారు చేసి రాజీవ్‌గాంధీ హత్యకు పాల్పడ్డారు. హత్య జరిగాక దేశం మొత్తం ఒక అంధకారంలో ఉండిపోయింది... హంతకులు ఎవరై ఉంటారనే విషయం తెలియక. ఆ సమయంలో సిట్ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న సీబీఐ ఆఫీసర్ కార్తికేయన్ తన టీమ్‌తో సాగించిన నేర పరిశోధనే 'ది హంట్' వెబ్ సిరీస్. దాదాపుగా అంతగా తెలియని నటులతో ఈ సిరీస్ రూపుదిద్దుకున్నా వీరందరిలో శివరాసన్‌గా చేసిన వ్యక్తి అందరినీ ఆకట్టుకుంటున్నాడు. అచ్చు శివరాసన్‌లా కనిపిస్తూ నాటి రూపానికి అతడు జీవం పోశాడు. ఆ నటుడి పేరు షఫీక్ ముస్తఫా. మలయాళం ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే గుర్తింపు పొందిన పాత్రలు వేస్తున్న షఫీక్ శివరాసన్ పాత్ర అవకాశం రావడంతోటే వెంటనే అంగీకరించాడు. 'ఇలాంటి పాత్రను పోషించడానికి చాలా పరిశోధన చేశాను. శివరాసన్ చాలా తెలివైన వ్యక్తి. అలాంటివారు ఎక్కువగా మాట్లాడరు. నేను సిరీస్‌లో ఆ నియమాన్ని పాటించాను' అంటాడు షఫీక్. నాటక రంగం నుంచి వచ్చిన షఫీక్ ఇప్పుడు ఆ పాత్రకు వచ్చిన గుర్తింపుతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. 'శివరాసన్‌లా గాజు కన్ను పెట్టుకుని నటించడం కష్టమైంది' అని చెప్పాడు. ఎప్పుడూ పెన్ను, పేపర్ పట్టుకుని కనిపించే శివరాసన్ ఈ వెబ్ సిరీస్‌లో మరణించే ముందు కవిత రాసి మరణిస్తాడు. ఈ సన్నివేశాల్లో షఫీక్ నటన ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది.

'కత్తి పట్టినవాడు కత్తితోనే పోతాడు' అన్నాడు జీసస్. అహింసతో ఎంత గొప్ప విజయం సాధించవచ్చో నిరూపించారు గాంధీజీ. అసహనం, ఆగ్రహం... కారణాలు ఏవైనా హింసాత్మక వైఖరి పనికి రాదని, ఆయుధం వినాశనానికే కారణమవుతుందని నేటి యువత తెలుసుకోవడానికి ఇలాంటి పాత్రలు, వెంటాడే గతాలు తప్పక ఉపయోగపడతాయి.

● మన(సు)లో మాట

మా అమ్మాయిని చాటింగ్ నుంచి బయట పడేయగలరా

మా అమ్మాయి వయసు 16 సంవత్సరాలు, జూనియర్ ఇంటర్ చదువుతోంది. ఈ మధ్య ఎంతసేపు ఫోన్లోనే ఉంటోంది. చికాకుగా ఉండటం, అందరితో సరిగ్గా మాట్లాడకపోవడంతోపాటు తిండి కూడా బాగా తగ్గించేసింది. చదువు మీద బొత్తిగా ధ్యాస లేదు. ఈ మధ్య నేను అనుకోకుండా తన ఫోన్ చూస్తే ఒక సోషల్ మీడియా యాప్ ద్వారా వేరే దేశంలోని వ్యక్తితో చాటింగ్, ఫోన్స్, వీడియో కాల్స్ మాట్లాడుతున్నట్లు గమనించాను. ఇంకా తన పర్సనల్ ఫొటోలు కూడా ఆ వ్యక్తికి పంపినట్లు చూసి నేను చాలా అప్‌సెట్ అయ్యాను. తన నుంచి ఫోన్ తీసుకుంటే చనిపోతానని బెదిరిస్తుంది. చాకుతో చేతిమీద కోసుకునే ప్రయత్నం కూడా చేసింది. ఎవ్వరితోను చెప్పుకోలేని పరిస్థితి నాది! మా వారితో కూడా చెప్పే ధైర్యం లేదు. దిక్కు తోచని పరిస్థితిలో ఈ ఉత్తరం రాస్తున్నాను! దయచేసి సలహా చెప్పగలరు.

- ఒక సోదరి, హైదరాబాద్

ఇది మీరొక్కరే కాదు, ప్రస్తుతం సమాజంలో చాలామంది ఎదుర్కొంటున్న సమస్య. మీ బాధను నేను అర్థం చేసుకోగలను. ఈ మధ్య కాలంలో టీనేజీ పిల్లలో ఫోన్స్, ఇంటర్నెట్ వాడటం చాలా ఎక్కువ అయింది. సోషల్ మీడియా ప్రభావం వారి మీద చాలా ఎక్కువగా ఉంది. మీ అమ్మాయి విషయానికి వస్తే ఫోన్ వాడకంతో పాటు, క్షణికావేశం, తప్పుడు నిర్ణయాలు, తొందరపాటుతనం, అంతర్గత భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం కనిపిస్తోంది. కౌన్సెలింగ్ 'బిహేవియరల్ థెరపీ' బాగా ఉపయోగపడుతుంది. అయితే మీరు మీ భర్తతో కూడా దీని గురించి చర్చించడం మంచిది. పేరెంట్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ద్వారా మీరు కూడా ఎలా ఉండాలో తెలుసుకోవచ్చు. ఆమెతో ఎక్కువ సాన్నిహిత్యం పెంచుకోండి. తెలియని వ్యక్తులతో చాటింగ్ వలన వచ్చే నష్టాలను వివరించండి. అదే విధంగా ఫోన్ సమయాన్ని ఎలా నిర్దేశించాలో చెప్పండి. తల్లిదండ్రులుగా మీరిద్దరూ కలిసి తనతో ప్రశాంతంగా మాట్లాడటం, వినడం మొదలు పెడితే, ఆమె కోర్కెలు, బాధలు బయటపడతాయి. మీరు ధైర్యంగా, ప్రశాంతంగా ఉండి మానసిక వైద్య నిపుణల సహాయంతో ఈ సమస్య నుంచి మీ అమ్మాయిని తప్పకుండా పూర్తిగా బయటికి తీసుకు రావచ్చు.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 30న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,00,010	1,01,750	1,00,480	1,01,750	99,650	1,00,470
బంగారం (22 క్యారెట్లు)	93, 560	92,100	92,100	94,860	91,680	92,100
వెండి	1,17,200	1,17,100	1,27,000	1,17,100	1,16,800	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



క్వార్టర్ ఫైనల్లో అర్జున్, నిహాల్ సరీన్

రియాద్: ఈ-స్పోర్ట్స్ వరల్డ్‌కప్‌లో భాగంగా చెస్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, నిహాల్ సరీన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మొత్తం 16 మంది గ్రాండ్ మాస్టర్లు నాలుగు గ్రూప్‌లుగా విడిపోయి ఈ టోర్నీలో ఆడుతున్నారు. గ్రూప్ 'బి' నుంచి అర్జున్... గ్రూప్ 'ఎ' నుంచి లెవాన్ అరోనియన్ (అమెరికా)... గ్రూప్ 'సి' నుంచి అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)... గ్రూప్ 'డి' నుంచి మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. గ్రూప్ 'బి'లో అర్జున్ ముందుగా 2-0తో నిహాల్ సరీన్‌పై... ఆ తర్వాత 2-1తో మాక్సిమి లాగ్రేవ్ (ఫ్రాన్స్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. అర్జున్ చేతిలో ఓడిన నిహాల్, లాగ్రేవ్ మరో క్వార్టర్ ఫైనల్ బెర్త్ కోసం పోటీపడ్డారు. ఇందులో నిహాల్ 1.5-0.5తో లాగ్రేవ్‌పై విజయం సాధించాడు. 15 లక్షల 50 వేల డాలర్ల (రూ. 13 కోట్ల 57 లక్షలు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్‌కు 2,50,000 డాలర్లు (రూ. 2 కోట్ల 19 లక్షలు) లభిస్తాయి. రెండో స్థానం పొందిన ప్లేయర్‌కు 1,90,000 డాలర్లు (రూ. 1 కోటీ 66 లక్షలు), మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 1,45,000 డాలర్లు (రూ. 1 కోటీ 27 లక్షలు) దక్కుతాయి.



సమమా... సమర్పణమా!

- సిరీస్‌ను సమం చేసే లక్ష్యంతో టీమిండియా
- సొంతగడ్డపై పట్టు కోసం ఇంగ్లండ్
- గాయంతో బెన్ స్టోక్స్ దూరం
- మధ్యాహ్నం గం.3:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేటి నుంచి ఇంగ్లండ్‌తో భారత్ ఆఖరి టెస్టు

మాంచెస్టర్‌లో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు 0/2 కాగానే మ్యాచ్‌తో పాటు సిరీస్ కూడా ముగిసినట్లే అనిపించింది. కానీ మన ఆటగాళ్ల అసాధారణ పోరాటం సిరీస్ ఆశలు సజీవంగా ఉంచగలిగింది. గత మ్యాచ్‌తో పెరిగిన ఆత్మవిశ్వాసం, ఉత్సాహంతో ఇప్పుడు భారత్ గెలుపుపై దృష్టి పెట్టింది. సీనియర్లు తప్పుకున్న తర్వాత తొలి సిరీస్, యువ జట్టు, కొత్త కెప్టెన్... ఇలాంటి ప్రతికూలతలతో బరిలోకి దిగిన జట్టు ప్రత్యర్థి వేదికపై సిరీస్‌ను సమం చేసినా అది గెలుపుతో సమానమే! అలాంటి అవకాశం ముందుండగా టీమిండియా చివరి పోరుకు సిద్ధమైంది. మరోవైపు అన్నీ తానే అయి జట్టును నడిపించిన కెప్టెన్ బెన్ స్టోక్స్ దూరం కావడంతో బలహీనపడిన ఇంగ్లండ్ ఆఖరి టెస్టును ఎలా ముగిస్తుందో చూడాలి.

లండన్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ చివరి అంకానికి చేరింది. ఇరు జట్ల మధ్య నేటి నుంచి ఓవల్ మైదానంలో చివరిదైన ఐదో టెస్టు జరగనుంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉండగా...భారత్ ఈ మ్యాచ్‌లో గెలిస్తే 2-2తో సిరీస్ సమంగా ముగుస్తుంది. మ్యాచ్ గెలిచినా లేక 'డ్రా' అయినా 'అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ' సిరీస్‌ను ఇంగ్లండ్ సొంతం చేసుకుంటుంది. బుమ్రా, పంత్ లేకపోవడంతో పాటు పలు ఇతర మార్పులతో భారత్ సన్నద్ధం కాగా, స్టోక్స్ దూరం కావడంతో నాలుగు మార్పులతో ఇంగ్లండ్ బరిలోకి దిగనుంది. 2007లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ నెగ్గిన తర్వాత ఆడిన నాలుగు సిరీస్‌లనూ భారత్ చేజార్చుకుంది. ఓవల్‌లో గెలుపు దక్కితే సమంగా నిలిచి సగర్వంగా జట్టు స్వదేశానికి చేరవచ్చు.

జురేల్, ఆకాశ్‌దీప్‌కు చోటు...

సిరీస్‌కు ముందు అనుకున్నట్లుగానే బుమ్రా మూడు టెస్టులకే పరిమితమవుతూ ఈ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో మరో పేసర్ ఆకాశ్‌దీప్ ఆడటం ఖాయమైంది. గత టెస్టులో పూర్తిగా విఫలమైన అన్షుల్ కంబోజ్‌ను కూడా జట్టు పక్కన పెట్టాలని నిర్ణయించడంతో ప్రసిధ్ కృష్ణ టీమ్‌లోకి రానున్నాడు. వీరితో పాటు సిరాజ్ పేస్ బౌలింగ్‌ను నడిపించనున్నాడు. ఓవల్ పిచ్, వాతావరణాన్ని బట్టి చూస్తే స్పిన్నర్‌కంటే నాలుగో పేసర్ అవసరమే ఎక్కువగా కనిపిస్తోంది. పైగా ముందే చెప్పినట్లు టీమిండియా స్పెషలిస్ట్ స్పిన్నర్‌కంటే బ్యాటింగ్ చేయగలిగే ఆటగాడికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది. అదే జరిగితే గత మ్యాచ్‌లో విఫలమైనా సరే... శార్దుల్‌కే మరో అవకాశం దక్కుతుంది. లేదంటే అర్ష్‌దీప్ సింగ్ టెస్టుల్లో అరంగేట్రం చేయవచ్చు. ఎలా చూసినా 'చైనామన్ స్పిన్నర్' కుల్దీప్ యాదవ్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా సిరీస్‌ను ముగించే అవకాశాలే కనిపిస్తున్నాయి. పంత్ స్థానంలో గత రెండు టెస్టుల్లో సబ్‌స్టిట్యూట్‌గా చేసిన జురేల్ తుది జట్టులోకి వస్తాడు. బ్యాటింగ్‌కు సంబంధించి సానుకూల స్థితి ఉండటం జట్టుకు మేలు చేసే అంశం. సిరీస్‌లో టాప్-5 పరుగుల జాబితాలో గిల్, రాహుల్, జడేజా ఉన్నారు. ఈ ముగ్గురూ మరో సారి సత్తా చాటితే భారీ స్కోరు ఖాయం. యశస్వి జైస్వాల్ కాస్త మెరుగ్గా ఆడాల్సి ఉండగా, సాయి సుదర్శన్ కూడా రాణించడం అవసరం. సుందర్ తన బ్యాటింగ్ పదునేమిటో మాంచెస్టర్‌లో చూపించాడు.



రూట్

> **2** ఓవల్ మైదానంలో 15 టెస్టులు ఆడిన భారత్ 2 గెలిచి, 6 ఓడింది. 2021 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై నెగ్గిన టీమిండియా... 2023 డబ్ల్యూటీసీ ఫైనల్లో ఇక్కడే ఆస్ట్రేలియా చేతిలో ఓడింది.

పిచ్, వాతావరణం

బౌన్సీ వికెట్‌తో పేస్ బౌలింగ్‌కు అనుకూలం. పిచ్‌పై పచ్చిక కనిపిస్తోంది. టాస్ గెలిచే జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. మ్యాచ్ రోజుల్లో అప్పుడప్పుడు వర్ష సూచన ఉంది.

నాలుగు మార్పులతో...

ఓల్డ్ ట్రఫోర్డ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా 143 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేసి ఇంగ్లండ్ బాగా అలసిపోయింది. కోలుకునేందుకు మూడు రోజుల విరామం కూడా చాలా తక్కువ. అటు శారీరకంగా, ఇటు మానసికంగా కూడా జట్టు కాస్త దెబ్బ తిని ఉంది. ఇలాంటి స్థితిలో కెప్టెన్ బెన్ స్టోక్స్ భుజం గాయంతో మ్యాచ్ నుంచి తప్పుకోవడం జట్టుకు పెద్ద దెబ్బ. ఆటగాడిగా మాత్రమే కాకుండా సారథిగా అతను మైదానంలో ఉండే విలువేమిటో ఇంగ్లండ్‌కు బాగా తెలుసు. కానీ ఈ మ్యాచ్ కూడా ఆడితే గాయం మరింత ముదిరే ప్రమాదం ఉండటంతో స్టోక్స్ దూరమయ్యాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా కూడా ఓలీ పోప్ ప్రభావం చూపించాల్సి ఉంది. క్రాలీ, డకెట్ శుభారంభం ఇవ్వాల్సి ఉండగా, రూట్ బ్యాటింగ్ జట్టుకు ప్రధాన బలం. గత టెస్టులో విఫలమైన బ్రూక్ ఇక్కడ రాణించాలని పట్టుదలగా ఉన్నాడు. ఆరో స్థానంలో బెతెల్‌కు అవకాశం దక్కింది. అయితే ఇంగ్లండ్ బౌలింగ్ ఒక్కసారిగా బలహీనంగా కనిపిస్తోంది. ఆర్చర్, కార్స్‌లకు విశ్రాంతినివ్వగా...గత టెస్టులో పూర్తిగా విఫలమైన స్పిన్నర్ డాసన్‌ను ముందే పక్కన పెట్టారు. అయితే అతి పేలవంగా 52.80 సగటుతో 10 వికెట్లు తీసిన వోక్స్ మళ్లీ బౌలింగ్ భారాన్ని మోయాల్సి వచ్చింది. మిగతా ముగ్గురు పేసర్లలో టంగ్‌కు మళ్లీ అవకాశం దక్కగా... అట్కిన్సన్, ఒవర్టన్‌లకు సిరీస్‌లో ఇదే తొలి మ్యాచ్ కానుంది.



భారత జట్టు హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్

తుది జట్ల వివరాలు:

భారత్ (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురేల్, శార్దుల్ ఠాకూర్/అర్ష్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్. **ఇంగ్లండ్:** ఓలీ పోప్ (కెప్టెన్), జాక్ క్రాలీ, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెతెల్, జేమీ స్మిత్, క్రిస్ వోక్స్, అట్కిన్సన్, ఒవర్టన్, టంగ్.



నంబర్‌వన్ అభిషేక్ శర్మ

ఐసీసీ టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరాడు. భారత జట్టు ఇటీవల టి20 మ్యాచ్‌లు ఆడకపోయినా... ఏడాది కాలంగా 'టాప్' ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఇటీవల వెస్టిండీస్‌తో సిరీస్‌కు దూరం కావడంతో ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 829 పాయింట్లతో అగ్రస్థానానికి చేరగా... హెడ్ 814 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (804 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు. ఇక ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్న స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా... టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో జడేజా 422 పాయింట్లతో 'టాప్'లో ఉండగా... బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మిరాజ్ 305 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ ప్లేయర్ స్టోక్స్ (301 పాయింట్లు) మూడో ర్యాంక్‌కు చేరాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో జో రూట్ (ఇంగ్లండ్; 904 పాయింట్లు) నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతుండగా... రిషభ్ పంత్ ఏడో ర్యాంక్‌లో నిలిచాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

హిస్టారికల్ డ్రామా

పద్దెనిమిదో శతాబ్దంలో భారతదేశంలోని బెంగాల్ ప్రావిన్స్‌లో ఒక తిరుగుబాటుదారుడు ఎదిగిన నేపథ్యంతో ఓ సినిమా రానుంది. ఈ ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ డ్రామాలో రిషబ్ శెట్టి హీరోగా నటించనున్నారు. అశ్విన్ గంగరాజు దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ ద్విభాషా (తెలుగు, కన్నడం) సినిమాను బుధవారం ప్రకటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. ''తెలుగు, కన్నడలతో పాటుగా తమిళ, హిందీ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తాం. మరిన్ని ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. మరోవైపు 'కాంతార: చాప్టర్ 1' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌తో బిజీగా ఉన్నారు రిషబ్ శెట్టి. ఈ చిత్రం అక్టోబరు 2న విడుదల కానుంది. అలాగే రిషబ్ శెట్టి హీరోగా 'జై హనుమాన్, ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' సినిమాల చిత్రీకరణలు ప్రారంభం కావాల్సి ఉంది.



రిషబ్ శెట్టి

కింగ్డమ్ ప్రపంచంలోకి వెళ్తారు

- విజయ్ దేవరకొండ

''కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'కింగ్డమ్'. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్‌కి వచ్చిన ప్రతి ఒక్కరికీ మా చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది'' అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కింగ్డమ్'. సత్యదేవ్ ముఖ్య పాత్ర పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ- ''జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్డమ్' ఇది. ఈ చిత్రంలోని భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. సినిమా ఔట్‌పుట్ పట్ల మేము చాలా సంతృప్తిగా ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న భరోసాతోనే సినిమా విడుదల ముందు ఇంత ప్రశాంతంగా ఉంటున్నాం'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ- ''ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద సవాల్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము పాస్ అయ్యాం. బుకింగ్స్ బాగున్నాయి.. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు. భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో కథకు కీలకమైన మధు అనే పాత్ర పోషించాను. మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని ఆశాభావం వ్యక్తం చేశారు.



విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే, నాగవంశీ



పాండిరాజ్, త్యాగరాజన్, నిత్యామీనన్, సెల్వి త్యాగరాజన్, నందిని, విజయ్ సేతుపతి, సురేష్

పరోటా చేయడం నేర్చుకున్నాను

- విజయ్ సేతుపతి

''నేను ఏ పాత్ర చేసినా ఆ సినిమాను ఎంజాయ్ చేస్తూనే చేశాను. ఈ 'సార్ మేడమ్' చిత్రం కూడా నాకు మంచి అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమా కోసం పరోటా చేయడం నేర్చుకున్నాను. అందరూ రిలేట్ అయ్యే కథ ఇది. పాండిరాజ్ ఈ కథను చక్కగా తెరకెక్కించారు'' అని విజయ్ సేతుపతి అన్నారు. పాండిరాజ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, నిత్యామీనన్ హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా 'తలైవన్ తలైవి'. సత్యజ్యోతి ఫిలిమ్స్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న తమిళంలో విడుదలైంది. ఈ చిత్రం 'సార్ మేడమ్' పేరుతో ఆగస్టు 1న తెలుగులో విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకురాలు నందినీ రెడ్డి మాట్లాడుతూ- ''ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. మంచి హోమ్‌ఫుడ్‌లాంటి సినిమా ఇది'' అని తెలిపారు. ''తెలుగులో సినిమా చేసి చాలా రోజులైంది. అందుకే ఈ సినిమాకి తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పాలనుకున్నాను. మంచి ఫ్యామిలీ సినిమా ఇది'' అని చెప్పారు నిత్యామీనన్. ''భార్యాభర్తల మధ్య జరిగే ఒక అందమైన ప్రేమకథా చిత్రమిది. లవ్, కామెడీ, యాక్షన్, మాస్.. ఇలా అన్ని ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు పాండిరాజ్. ''తెలుగు ఆడియన్స్ ఈ సినిమాని ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని త్యాగరాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ సుకుమార్, లిరిక్ రైటర్ రాంబాబు గోసాల, ఎన్వీఆర్ సినిమాస్ సురేష్ మాట్లాడారు.

ప్రేమకథ ఆలస్యం

హీరోయిన్ శ్రీలీల బాలీవుడ్‌లో నటిస్తున్న తొలి హిందీ చిత్రం రిలీజ్ వాయిదా పడింది. కార్తీక్ ఆర్యన్, శ్రీలీల హీరో హీరోయిన్లుగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ ప్రేమకథ రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమా ఈ దీపావళికి విడుదల కావడం లేదని, వచ్చే ఏడాది రిలీజ్ చేస్తామని దర్శకుడు అనురాగ్ బసు వెల్లడించారు. ''ఇప్పటి వరకు మా సినిమా చిత్రీకరణ 40 శాతం పూర్తయింది. కార్తీక్ ఆర్యన్ మా సినిమాతో పాటుగా మరో సినిమా కూడా చేస్తున్నాడు. ఈ రెండు సినిమాల్లో కార్తీక్ డిఫరెంట్ లుక్స్‌తో కనిపిస్తాడు. ఈ లుక్స్ పరంగా ఇబ్బందులున్నాయి. ఆగస్టు లేదా సెప్టెంబరులో మా సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభిస్తాం. అయితే 'సయారా' సినిమా స్టోరీకి మా కథ దగ్గరగా ఉందని, దీంతో స్క్రిప్ట్‌లో మార్పులు చేయాల్సి రావడం వల్లే ఈ ఏడాది మా చిత్రం రిలీజ్ కావడం లేదన్న వార్తల్లో నిజం లేదు. 'సయారా' కథకు, మా సిని మాకు సంబంధం లేదు'' అన్నారు అనురాగ్ బసు. ఇలా శ్రీలీల తొలి హిందీ సినిమా రిలీజ్ అనుకున్న సమయానికన్నా కాస్త ఆలస్యంగా కానుంది. ఇక ప్రస్తుతం తెలుగులో 'ఉస్తాద్ భగత్‌సింగ్', తమిళంలో 'పరాశక్తి' వంటి చిత్రాలతో శ్రీలీల బిజీగా ఉన్నారు.



శ్రీలీల

నా జీవిత అనుభవాలతో...

''నేను రాసిన పుస్తకాలు నా జీవిత అనుభవాల నుంచి వచ్చాయి. అవి నాకు నేర్పిన పాఠాలనే నా పుస్తకాల్లో పొందుపరిచాను'' అని బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ అన్నారు. ఆయన విలక్షణమైన నటుడే కాదు.. మంచి రచయిత కూడా అనే సంగతి తెలిసిందే. ఆయన రాసిన పుస్తకాల్లో ఇప్పటికే మూడు బుక్స్‌ని రిలీజ్ చేశారాయన. తాజాగా 'డిఫరెంట్ బట్ నో లెస్' అనే నాలుగో పుస్తకాన్ని ఆవిష్కరించారు అనుపమ్ ఖేర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ''నా నిజ జీవిత ఘటనలతో రాసిన ఈ పుస్తకం నాకు చాలా ప్రత్యేకం. ఇందులో నేను దర్శకత్వం వహించిన 'తన్వి ది గ్రేట్' సినిమా కథ, షూటింగ్‌లో ఎదురైన సవాళ్లు, వాటిని ఎదుర్కొన్న విధానాన్ని ప్రస్తావించాను. నేను బాక్సాఫీస్ వసూళ్ల గురించి పెద్దగా పట్టించుకోను. మా సినిమా ఎప్పటికైనా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని చెప్పారు. ఇదిలా ఉంటే.. కరణ్ టాకర్, జాకీ ష్రాఫ్, అరవింద్ స్వామి నటించిన 'తన్వి ది గ్రేట్' ఈ నెల 18న విడుదలైన సంగతి తెలిసిందే.



అనుపమ్ ఖేర్

సస్పెన్స్ థ్రిల్లర్

ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'థ్యాంక్యూ డియర్'. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వంలో మహాలక్ష్మి ప్రొడక్షన్స్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో శ్రీకాంత్ తోట మాట్లాడుతూ- ''ప్రపంచంలో జరుగుతున్న ఒక బర్నింగ్ ఇష్యూకి వాణిజ్య అంశాలు కలిపి కుటుంబమంతా చూసేలా 'థ్యాంక్యూ డియర్' తీశాం. ఒక మంచి సందేశంతో అందరూ కనెక్ట్‌లా ఉంటుంది'' అని తెలిపారు. ''సస్పెన్స్ థ్రిల్లర్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన మా చిత్రం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది'' అని చెప్పారు బాలాజీ రెడ్డి. ''నా తొలి సినిమా ఇది.. నాకు ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది'' అన్నారు ధనుష్ రఘుముద్రి. ''మా సినిమాని చూసి, మమ్మల్ని సపోర్ట్ చేయాలి'' అని రేఖ నిరోషా కోరారు. ఈ కార్యక్రమంలో లైన్ ప్రొడ్యూసర్ పునీత్, సంగీత దర్శకుడు సుభాష్ మాట్లాడారు.



ధనుష్, రేఖా నిరోషా

హనీమూన్ ఇన్ షిల్లాంగ్

మేఘాలయ హనీమూన్ హత్య కేసు దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో 'హనీమూన్ ఇన్ షిల్లాంగ్' అనే చిత్రం తెరపైకి రానుంది. బాలీవుడ్ దర్శకుడు ఎస్పీ నింబావత్ ఈ సినిమాని తెరకెక్కించనున్నట్లు ప్రకటించారు. తన ప్రియుడు రాజ్ కుష్వాహాతో కలిసి భర్త రాజా రఘువంశీని సోనమ్ హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది. మే 11న రాజా రఘువంశీ, సోనమ్ పెళ్లి జరిగింది. వీరిద్దరూ అదే నెల 20న హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లారు. మే 23 నుంచి ఇద్దరూ అదృశ్యమయ్యారు. ఈ ఘటన జరిగిన 11 రోజుల తర్వాత (జూన్ 2న) రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలోని లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. రాజా రఘువంశీని హత్య చేసిన ఘటనలో సోనమ్, రాజ్ కుష్వాహాతో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'హనీమూన్ ఇన్ షిల్లాంగ్' అనే సినిమా తీయనున్నట్లు ఎస్పీ నింబావత్ పేర్కొన్నారు. ''భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగొద్దనే ఈ సినిమా తీసేందుకు సిద్ధమయ్యా. స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి'' అని తెలిపారు ఎస్పీ నింబావత్. ''మా సోదరుడు రాజ రఘువంశీ మృతిపై సినిమా తీసేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు'' అని సచిన్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్ నెట్‌వర్క్

శ్రీకాంత్, శ్రీరామ్, కామ్నా జెఠ్మలానీ, ప్రియా వడ్లమాని, శ్రీనివాస్ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'నెట్‌వర్క్'. సతీష్ చంద్ర నాదెళ్ల దర్శకత్వంలో రమ్య సినిమా బ్యానర్‌పై లావణ్య యస్ఎస్, ఎంజీ జంగం నిర్మించారు. ఈ వెబ్ సిరీస్ నేటి నుంచి (గురువారం) ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ''ఆన్‌లైన్ డిపెండెంట్, ఆన్‌లైన్ గ్యాంబ్లర్, ఆన్‌లైన్ డేటింగ్, ఆన్‌లైన్ ఇన్‌ఫ్లూయెన్సర్.. ఇలా నాలుగు పాత్రల నెట్‌వర్క్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ కథనం ఆసక్తిగా సాగుతుంది. కథలో వచ్చే మలుపులు వీక్షకులను ఎగ్జైట్ చేస్తాయి'' అని మేకర్స్ పేర్కొన్నారు. తాగుబోతు రమేష్, సమ్మెట గాంధీ, జోష్ రవి, మీనా కుమారి, మాస్టర్ అవ్యుక్త్ వల్లూరి, కల్పలత ఈ సిరీస్‌లో ఇతర కీలక పాత్రల్లో నటించారు.



శ్రీరామ్

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	144	81,482
నిఫ్టీ ▲	34	24,855

విదేశీ సూచీలు			
నాస్‌డాక్ (అమెరికా)	21,200	▲	101
డోజోన్స్ (అమెరికా)	44,682	▲	49
ఎఫ్‌టీఎస్ఈ 100 (బ్రిటన్)	9,130	▼	6
డాక్స్ (జర్మనీ)	24,285	▲	66
షాంఘై (చైనా)	3,615	▼	6
నికాయ్ (జపాన్)	40,655	▼	20

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.70	87.72
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.00	117.99
€	యూరో	ఎస్‌బీఐ	99.48	102.23
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.22	59.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	57.96
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.26	68.90
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.44	23.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.91	24.96
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.28	13.10

ఎం అండ్ ఎం లాభం జూమ్

క్యూ1లో రూ. 4,083 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆటో రంగ దేశీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్ఎం) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ. 4,083 కోట్లను తాకింది. వివిధ బిజినెస్ విభాగాల్లో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,283 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 37,218 కోట్ల నుంచి రూ. 45,529 కోట్లకు ఎగసింది. ఆటో, వ్యవసాయ రంగ బిజినెస్ పురోగతి, పటిష్ట మార్జిన్ల కారణంగా లాభదాయకత 20 శాతం మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో 17 శాతం అధికంగా 2,47,249 వాహనాలను విక్రయించింది. గత క్యూ1లో 2,11,550 యూనిట్ల అమ్మకాలు సాధించింది. ట్రాక్టర్ల విక్రయాలు సైతం 10% ఎగసి 1,32,964 యూనిట్లకు చేరాయి. ఆదాయంలో ఎస్‌యూవీ వాటా 5.7% మెరుగుపడగా.. ట్రాక్టర్ల విభాగంలో మార్కెట్ వాటా 0.5 శాతం బలపడి 45.2 శాతాన్ని తాకినట్లు ఎంఅండ్ఎం గ్రూప్ సీఈవో, ఎండీ అనిష్ షా పేర్కొన్నారు. ఇది ఒక త్రైమాసికంలో అత్యధికమని వెల్లడించారు.

ఎంఅండ్ఎం షేరు 0.3% బలపడి రూ. 3,206 వద్ద క్లోజైంది.

పీఎన్‌బీ లాభం 48% డౌన్

క్యూ1లో రూ. 1,675 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్–జూన్ (క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 48 శాతం క్షీణించి రూ. 1,675 కోట్లకు పరిమితమైంది. ఈ కాలంలో అధిక పన్ను వ్యయాలతోకూడిన కొత్త విధానంలోకి మారినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అశోక్ చంద్ర వెల్లడించారు. దీంతో లాభాలు ప్రభావితమైనట్లు పేర్కొన్నారు. పన్ను వ్యయాలు రెట్టింపై రూ. 5,083 కోట్లకు చేరాయి. అయితే కొత్త విధానంలోకి మారడం ద్వారా ఇకపై ప్రతీ త్రైమాసికంలోనూ రూ. 700 కోట్లమేర పొదుపునకు వీలుంటుందని చంద్ర తెలియజేశారు. కాగా.. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,252 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 32,166 కోట్ల నుంచి రూ. 37,232 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం మాత్రం రూ. 10,476 కోట్ల నుంచి రూ. 10,578 కోట్లకు స్వల్పంగా బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.98 శాతం నుంచి 3.78 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.6 శాతం నుంచి 0.38 శాతానికి తగ్గాయి.

పీఎన్‌బీ షేరు 1% నష్టంతో రూ. 108 వద్ద ముగిసింది.

ఇండిగో లాభం నేలచూపు

క్యూ1లో రూ. 2,176 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో దేశీ ఎయిర్‌లైన్స్ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 2,176 కోట్లకు పరిమితమైంది. ప్రయాణికుల సంఖ్య పుంజుకున్నప్పటికీ ఎయిర్‌స్పేస్‌పై ఆంక్షలు, నిర్వహణపరమైన సవాళ్లు ప్రతికూల ప్రభావం చూపాయి. ఇండిగో బ్రాండు విమానయాన సేవల కంపెనీ గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,729 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 6% పైగా ఎగసి రూ. 21,534 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 20,249 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో ఎదురైన విదేశీ సవాళ్లు మొత్తం విమానయాన రంగాన్ని ప్రభావితం చేసినట్లు కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. ఈ కాలంలో 12% అధికంగా 3.1 కోట్ల ప్రయాణికులకు సేవలు సమకూర్చినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు 0.3% బలహీనపడి రూ. 5,740 వద్ద ముగిసింది.

‘ఫార్చ్యూన్’లో మళ్లీ రిలయన్స్ టాప్

- గ్లోబల్–500 లిస్ట్‌లో 88వ ర్యాంకు
- ఎల్ఐసీ, ఐవోసీ, ఎస్‌బీఐ సహా 9 సంస్థలకు చోటు



న్యూఢిల్లీ: ఈ ఏడాది (2025) ఫార్చ్యూన్ గ్లోబల్–500 కంపెనీల జాబితాలో భారత్ నుంచి తొమ్మిది కంపెనీలకు చోటు లభించింది. వీటిలో అయిదు ప్రభుత్వ రంగానికి చెందినవి కాగా, నాలుగు ప్రైవేట్ రంగానికి చెందినవి. అన్నింటికన్నా మెరుగ్గా ప్రైవేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ 88వ స్థానంలో నిల్చింది. అయితే, 2024లోని 86వ ర్యాంకు నుంచి రెండు స్థానాలు తగ్గింది. అటు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) 95వ ర్యాంకులో కొనసాగింది. 22 ఏళ్లుగా ఫార్చ్యూన్ గ్లోబల్ లిస్టులో స్థానం దక్కించుకుంటున్న ఏకైక ప్రైవేట్ రంగ కంపెనీ రిలయన్స్ కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రిలయన్స్ స్థూల ఆదాయం 7.1% పెరిగి రూ. 10,71,174 కోట్లకు చేరింది. 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలను బట్టి కంపెనీలకు ర్యాంకింగ్ ఉంటుంది.

ఐవోసీ డౌన్.. ఎస్‌బీఐ అప్..

అటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) 11 ర్యాంకులు తగ్గి 127వ స్థానానికి పడిపోగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 15 స్థానాలు మెరుగుపడి 163 ర్యాంకును, హెచ్‌డీఎఫ్‌సీ 48 స్థానాలు ఎగబాకి 258వ ర్యాంకును దక్కించుకున్నాయి. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ఒక ర్యాంకు తగ్గి 181వ స్థానానికి పరిమితమైంది. ఇక మిగతా వాటిలో టాటా మోటార్స్ (283 ర్యాంకు, 12 స్థానాలు డౌన్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (285 స్థానం, 27 స్థానాల క్షీణత), ఐసీఐసీఐ బ్యాంక్ (464 ర్యాంకు, ఎలాంటి మార్పు లేదు) ఉన్నాయి.

వాల్‌మార్ట్ నంబర్ వన్.

ఫార్చ్యూన్ మ్యాగజైన్ రూపొందించిన 2025 లిస్టులో అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఎప్పట్లాగే అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, అమెజాన్ రెండో స్థానంలో, చైనాకు చెందిన స్టేట్ గ్రిడ్ 3వ స్థానంలో నిల్చాయి. టాప్ 10లో మూడు చైనా కంపెనీలు ఉన్నాయి.

రూపాయి మూడేళ్లలో అతిపెద్ద పతనం

89 పైసలు దిగజారి
87.80 వద్ద ముగింపు



ముంబై: భారత్‌పై ఆగస్టు 1 నుంచి జరిమానాతో సహా 25% సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనతో దేశీయ కరెన్సీ రూపాయి మూడేళ్లలో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో ఏకంగా 89 పైసలు బలహీనపడి 87.80 వద్ద ముగిసింది. 2022, డిసెంబర్ 24 (99 పైసలు క్షీణత) తర్వాత రూపాయి ఒకే రోజు ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. నెలాఖరున దిగుమతిదార్ల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సైతం దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయి.

టారిఫ్‌లతో జీడీపీపై ఎఫెక్ట్

నిపుణుల అంచనా



న్యూఢిల్లీ: ఊహించిన దానికన్నా అధిక స్థాయిలో టారిఫ్‌లు విధించడంతో పాటు పెనాల్టీలు కూడా వేయాలన్న అమెరికా నిర్ణయంతో భారత స్థూల దేశీయోత్పత్తిపై (జీడీపీ) ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు తెలిపారు. పరస్పరం ప్రయోజనకరంగా ఉండే డీల్‌ను కుదుర్చుకోవడం ద్వారా భారత్ దీన్ని అధిగమించగలదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. భారీ టారిఫ్‌ల వల్ల ఇరు దేశాల మధ్య అత్యధిక వాణిజ్యం జరిగే ఫార్మా, టెక్స్‌టైల్స్, లెదర్, ఆటోమొబైల్స్, మెరైన్ ఉత్పత్తుల్లాంటి కీలక రంగాలపై నేరుగా ప్రభావం పడుతుందని ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు. ప్రాథమికంగా టారిఫ్‌లను ప్రకటించినప్పుడే 2025–26 జీడీపీ వృద్ధి అంచనాలను 6.2 శాతానికి కుదించగా, తాజాగా పెనాల్టీల పరిమాణాన్ని బట్టి మరింతగా తగ్గించే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, 25% టారిఫ్‌ల విధింపు దురదృష్టకరమని పరిశ్రమ వర్గాలు వ్యాఖ్యానించాయి. దీని వల్ల ఎగుమతులపై ప్రభావం పడుతుందని ఫిక్కీ ప్రెసిడెంట్ హర్ష వర్ధన్ అగర్వాల్ తెలిపారు. టెక్స్‌టైల్స్ రంగానికి టారిఫ్‌లు పెను సవాలుగా మారతాయని టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్య సీఐటీఐ ఆందోళన వ్యక్తం చేసింది.

స్వల్ప లాభాలతో సరి

సూచీలకు ఎల్‌అండ్‌టీ షేరు దన్ను



ముంబై: పరిమిత శ్రేణిలో ట్రేడైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఎల్‌అండ్‌టీ షేరు 5% రాణించి దన్నుగా నిలిచింది. సెన్సెక్స్ 144 పాయింట్లు పెరిగి 81,482 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 24,855 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు రోజంతా స్వల్ప శ్రేణిలో లాభాల్లోనే కదలాడాయి. ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పాలసీ వెల్లడి (బుధవారం రాత్రి), అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పంద చర్చల తుది గడువు(ఆగస్టు 1న) సమీపిస్తున్న పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఒక దశలో సెన్సెక్స్ 281 పాయింట్లు బలపడి 81,619 వద్ద, నిఫ్టీ 81 పాయింట్లు ఎగసి 24,902 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి.

- తొలి త్రైమాసికం పటిష్ట ఫలితాలతోఎల్‌అండ్‌టీ షేరుకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో 5% లాభపడి రూ.3,665 వద్ద ముగిసింది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 8% అప్	రెండేళ్లపాటు 6.4 శాతం వృద్ధి: ఐఎంఎఫ్

జీఎన్‌జీ భళా... ఇండిక్యూబ్ డీలా



ముంబై: దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బుధవారం రెండు కంపెనీల షేర్లు లిస్టయ్యాయి. ఇందులో జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ లిస్టింగ్ భారీ లాభాలు పంచగా.., ఇండిక్యూబ్ స్పేసెస్ లిస్టింగ్ నిరాశపరిచింది. జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ. 237)తో పోలిస్తే 47% భారీ ప్రీమియంతో రూ.350 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 53.58% ఎగసి రూ.364 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 41% లాభంతో రూ.333.50 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,802 కోట్లుగా నమోదైంది.

- వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ సంస్థ ఇండిక్యూబ్ స్పేసెస్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ. 237)తో పోలిస్తే 7.72% డిస్కౌంట్‌తో రూ.219 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 15% క్షీణించి రూ.202 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 8% నష్టంతో రూ.218 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,576 కోట్లుగా నమోదైంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

నార్‌సెట్-2025

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థలలో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)-9 నోటిఫికేషన్ విడుదలైంది.

» **ఎయిమ్స్ సంస్థలు:** ఎయిమ్స్ భటిండా, ఎయిమ్స్ భోపాల్, ఎయిమ్స్ భువనేశ్వర్, ఎయిమ్స్ అవంతిపుర, ఎయిమ్స్ దేవ్‌ఘర్, ఎయిమ్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ గువాహటి, ఎయిమ్స్ కళ్యాణి, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఎయిమ్స్ పాట్నా, ఎయిమ్స్ రాజ్‌కోట్,ఎయిమ్స్ రిషికేశ్, ఎయిమ్స్ విజయ్‌పూర్, ఎయిమ్స్ సీఏపీఎఫ్ఐఎంఎస్.
» **అర్హత:** డిప్లొమా(జీఎన్ఎం)తో పాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/పోస్ట్–బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** నార్‌సెట్-9 ఆన్‌లైన్ సీబీటీ(స్టేజ్–1) ప్రిలిమినరీ, సీబీటీ(స్టేజ్–2) ప్రధాన పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**11.08.2025
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.08.2025 నుంచి 28.08.2025 వరకు
» **సీబీటీ ప్రిలిమినరీ పరీక్ష తేది:** 14.09.2025.
» **సీబీటీ మెయిన్ పరీక్ష తేది:** 27.09.2025.
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఎస్ఆర్ఎఫ్‌టీఐ, కోల్‌కతాలో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ) వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** ప్రొఫెసర్(ఎడిటింగ్)-01, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్)-01,యానిమేటర్-01, పర్సనల్ అసిస్టెంట్-01, కెమెరా అసిస్టెంట్-01, ప్రొజెక్షన్ అసిస్టెంట్-01, లైటింగ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రొఫెసర్‌కు 52 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 37 ఏళ్లు, యానిమేటర్, పర్సనల్ అసిస్టెంట్‌కు 32 ఏళ్లు, కెమెరా అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, లైటింగ్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.78,000 నుంచి రూ.2,09,200, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.56,100 నుంచి రూ.1,77,500, యానిమేటర్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400, పర్సనల్ అసిస్టెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, కెమెరామెన్‌కు రూ.25,500 నుంచి రూ.81,100, ప్రొజెక్షన్, లైటింగ్ అసిస్టెంట్‌కు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.08.2025.
» **వెబ్‌సైట్:** https://srfti.ac.in

టీటీడీ తిరుపతిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఒప్పంద ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ(ఎండీ/ఎంఎస్) చదివిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.53,495.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సెంట్రలైజెడ్ ఔట్‌సోర్సింగ్ సెల్, టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్స్, కేటీ రోడ్, తిరుపతి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.tirumala.org

కొచ్చిన్ పోర్టు అథారిటీలో 10 అప్రెంటిస్‌లు

కేరళలోని కొచ్చిన్ పోర్ట్ అథారిటీలో వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 10.
» **విభాగాల వారీగా ఖాళీలు:** ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్-04, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్-02, మెడికల్ డిపార్ట్‌మెంట్-04
» **అర్హత:** 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో బీబీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** రూ.9000.
» **వయసు:** 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెరిట్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్టింగ్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.08.2025.
» **వెబ్‌సైట్:** https://cochinport.gov.in

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్(అథ్లెట్ రిలేషన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.70,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.08.2025.
» **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ)

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ)ఒప్పంద ప్రాతిపదికన లీడ్ రీసెర్చ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.60,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.08.2025.
» **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

» 100 ఎఫ్ఎస్ఓ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్
» స్క్రీనింగ్, మెయిన్ ఎగ్జామ్, ఫిజికల్ టెస్ట్, సీపీటీతో ఎంపిక



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 100 ఎఫ్ఎస్ఓ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్, ఫిజికల్ టెస్టులు, సీపీటీలో ప్రతిభ ఆధారంగా నియామకాలు జరుపనుంది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ ఎఫ్ఎస్ఓ నోటిఫికేషన్ వివరాలు, వేతనాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర సమాచారం..

- **పోస్టు:** ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 100

అర్హతలు

ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బోటనీ/ఫారెస్ట్రీ/హార్టికల్చర్ /జువాలజీ/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/జియాలజీ/అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి లేదా కెమికల్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

01.07.2025 నాటికి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది.

శారీరక ప్రమాణాలు

- పురుషులు కనీస ఎత్తు 163 సెంటీమీటర్లు, ఛాతి 84 సెంటీమీటర్లు ఉండాలి (గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెంటీమీటర్లు పెరగాలి).
- మహిళలు కనీసం ఎత్తు 150 సెంటీ మీటర్లు, ఛాతి 79 సెంటీమీటర్లు ఉండాలి (గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెంటీమీటర్లు పెరగాలి).
- షెడ్యూల్ కులాలు, కొన్ని వర్గాలకు ఎత్తులో మినహాయింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు వేతన శ్రేణి రూ.32,670 – రూ.1,01,970 లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఆఫ్‌లైన్ విధానంలో స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. రాత పరీక్షలో ఎంపికైన వారికి ఫిజికల్ టెస్టులు(వాకింగ్ టెస్టు, మెడికల్ ఎగ్జామినేషన్) ఉంటాయి. చివరగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు(సీపీటీ) నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

స్క్రీనింగ్ టెస్టు

మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల విధానంలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో పార్ట్ ఏలో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటిక్స్(ఎస్ఎస్‌సీ స్టాండర్డ్) 75 ప్రశ్నలు–75 మార్కులకు; పార్ట్ బీలో జనరల్ ఫారెస్ట్రీ 75 ప్రశ్నలు–75 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు. ఈ పరీక్ష ప్రశ్న పత్రం డిగ్రీ స్థాయిలో ఉంటుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కును తగ్గిస్తారు. స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు.

450 మార్కులకు మెయిన్ పరీక్ష

- మెయిన్ పరీక్షలో క్వాలిఫైయింగ్ టెస్ట్‌తోపాటు మరో మూడు పేపర్లు ఉంటాయి. మొత్తం వంద మార్కులకు క్వాలిఫైయింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంగ్లిష్ 50 మార్కులకు, జనరల్ తెలుగు 50 మార్కులకు ఉంటాయి. ఈ పరీక్ష వ్యవధి 100 నిమిషాలు. క్వాలిఫైయింగ్ టెస్ట్ ప్రశ్న పత్రం పదో తరగతి స్థాయిలో ఉంటుంది.
- మెయిన్ పరీక్షలోని పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 150 ప్రశ్నలు–150 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పేపర్ వ్యవధి 150 నిమిషాలు.
- పేపర్ 2లో మ్యాథమెటిక్స్(ఎస్ఎస్‌సీ స్టాండర్డ్) నుంచి 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు.
- పేపర్ 3లో జనరల్ ఫారెస్ట్రీపై 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు.
- ఇలా ఒక్కో పేపర్‌కు 150 మార్కుల చొప్పున మొత్తం 450 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కులు తగ్గిస్తారు.

ఫిజికల్ టెస్టు

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా 1:2 నిష్పత్తిలో ఫిజికల్ టెస్టుకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ టెస్టులో భాగంగా వాకింగ్ టెస్టు, వైద్య పరీక్షలు ఉంటాయి. వాకింగ్ టెస్టులో పురుష అభ్యర్థులు 4 గంటల్లో 25 కిలోమీటర్లు, మహిళా అభ్యర్థులు 4 గంటల్లో 16 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఫిజికల్ టెస్టు అర్హత పరీక్ష మాత్రమే. దీనికి ఎలాంటి మార్కులు ఉండవు.

సీపీటీ ఇలా

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇందులో అర్హత సాధించేందుకు ఓసీలు కనీసం 40 మార్కులు, బీసీలు కనీసం 35 మార్కులు, ఎస్సీ/ఎస్టీలు కనీసం 30 మార్కులు సాధించాలి.

స్క్రీనింగ్ టెస్ట్ సిలబస్

- స్క్రీనింగ్ టెస్ట్ పార్ట్ ఏ జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్ విభాగంలో.. జనరల్ సైన్స్, ఏపీ, జాతీయ ప్రాధాన్య ఉన్న కరెంట్ ఈవెంట్స్, భారత దేశ చరిత్ర; భారత దేశ, ఏపీ జాగ్రఫీ; ఇండియన్ పాలిటీ, ఎకానమీ; మెంటల్ ఎబిలిటీ–రీజనింగ్ అండ్ ఇన్ఫరెన్సెస్; సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అదేవిధంగా మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అరిథమెటిక్, జామెట్రీ, స్టాటిస్టిక్స్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- స్క్రీనింగ్ టెస్ట్ పార్ట్ బీ జనరల్ ఫారెస్ట్రీ విభాగంలో.. ప్లాంట్ సైన్స్, ఫారెస్ట్ అండ్ ఎకాలజీ, హార్టికల్చర్, సాయిల్ సైన్స్, మేనేజ్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ అండ్ వాటర్‌షెడ్స్, జనరల్ సిల్వికల్చర్, అగ్రో ఫారెస్ట్రీ అండ్ సోషల్ ఫారెస్ట్రీ, కమ్యూనిటీ పార్టిసిపేషన్, యానిమల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎకనామిక్ జువాలజీ, ఫారెస్ట్ అడ్మినిస్ట్రేషన్, రిమోట్ సెన్సింగ్–శాటిలైట్ కమ్యూనికేషన్, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్, రెన్యూవబుల్, నాన్ రెన్యువబుల్ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- మెయిన్ ఎగ్జామ్‌లోనూ దాదాపు ఇవే సిలబస్ అంశాలు కొంత విస్తృత స్థాయిలో ఉంటాయి. స్క్రీనింగ్ టెస్టుతో పోల్చుకుంటే మెయిన్‌లో ప్రశ్నలు మరింత కఠినంగా అడిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు తొలి రోజు నుంచే మెయిన్ పరీక్షపై ఫోకస్ చేస్తూ సమగ్రంగా ప్రిపరేషన్ సాగించాలి. తద్వారా స్క్రీనింగ్‌లో అర్హత సాధించడంతోపాటు మెయిన్‌కు సైతం ప్రిపరేషన్ పూర్తవుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 28.07.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 17.08.2025
- **ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** 07.09.2025
- **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in



పచ్చని అంచున పొగమంచు..

సహ్యాద్రి పర్వతాలుగా పిలుచుకునే మహబూబ్ (నిర్మల్) ఘాట్స్ ఈ సీజన్లో బాగా ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్-నాగపూర్ దారిలో పాత ఎన్‌హెచ్-44 దారిలో నిర్మల్ జిల్లా కేంద్రానికి 10-12 కి.మీటర్ల దూరంలో ఈ సహ్యాద్రి పర్వతాలు స్వాగతం పలుకుతాయి. ఒంపులు, ఘాట్ రోడ్డు చుట్టూ పచ్చని, ఎత్తయిన చెట్లతో వానాకాలంలో ఇక్కడి వాతావరణం ఆకట్టుకుంటుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా...

వరుస క్రమంలో వనదేవతలు

పూజారులతో అధికారుల సమాలోచన
మేడారం గద్దెల ప్రాంగణం పరిశీలన



గద్దెల ప్రాంగణంలో పూజారులు, అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దివాకర టీఎస్

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో భక్తులకు వనదేవతల దర్శనం సులువుగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మక్క–సారలమ్మ గద్దెల పక్కన గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు, పూజారులు సమాలోచన చేశారు. ఈ మేరకు బుధవారం మేడారంలో గద్దెల ప్రాంగణంలో క్యూలైన్ల మార్పులు, చేర్పులతోపాటు వరుస క్రమంలో గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను ఏర్పాటు చేసేందుకు సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులతో కలిసి కలెక్టర్ దివాకర టీఎస్, డీఎస్పీ రవీందర్ పరిశీలించి పూజారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దీనిపై పూజారులు కొంత మేరకు సానుకూలత వ్యక్తంచేశారు. గద్దెల మార్పులు, చేర్పులపై గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులు వారివారి పూజారులతో చర్చించి అంతిమ నిర్ణయం వెల్లడిస్తామని అధికారులకు తెలిపారు. నలుగురు దేవతలను వరుస క్రమంలో ఉంచితే జాతర సమయంలో భక్తులు సులువుగా ఒకేసారి దర్శించుకునే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

4 నుంచి టీజీసీపీజీఈటీ-2025 పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: 2025–26 విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీజీసీపీజీఈటీ–2025 పరీక్షలు ఆగస్టు 4 నుంచి 11వరకు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 44 సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు రోజుకు 3 సెషన్ల చొప్పున జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పీజీ కోర్సులతో పాటు పీజీ డిప్లొమా ఐదేళ్ల కోర్సుకు సంబంధించి ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, ఐలమ్మ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలతో పాటు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి... డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ వర్సిటీల్లో ప్రవేశాలకు ఈ సెట్ కీలకమని పేర్కొన్నారు. టీజీసీపీజీఈటీ–2025 పరీక్షలు సీడీటీ పద్ధతిలో జరుగుతాయని, మరిన్ని వివరాలకు అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఇక బెట్టింగ్ యాప్స్‌కి ప్రచారం చేయను: ప్రకాశ్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం వ్యవహారంలో నిర్వాహకుల నుంచి తనకు డబ్బు అందలేదని, ఇకపై అలాంటి ప్రచారం చేయనని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ మీడియాకు వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ అధికారుల ఎదుట ఆయన బుధవారం విచారణకు హాజరయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన తన న్యాయవాదితో కలసి వచ్చారు. బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణకు రావాలంటూ ఈడీ ప్రకాశ్‌రాజుకు ఈనెల 21న నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. దాదాపు ఐదు గంటల పాటు విచారణ కొనసాగింది. దుబాయ్ నుంచి ఆపరేట్ అయ్యే ఒక యాప్ కోసం ప్రమోట్ చేసిన విషయంపై ప్రకాశ్‌రాజును అధికారులు ప్రశ్నించారు. గత ఐదేళ్ల ఆయన బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా ఎవరూ డబ్బు సంపాదించాలని భావించొద్దని సూచించారు. ఈడీ అధికారులు తాను చెప్పిన విషయాలు నమోదు చేసుకున్నారని, మరోసారి విచారణకు రావాలని చెప్పలేదని తెలిపారు.

నమ్రత నెట్‌వర్క్‌లో ఆశావర్కర్లు?

నిరుపేద గర్భిణుల సమాచార సేకరణకు వినియోగం
వారి ద్వారానే బేరసారాలూ చేసినట్లు అనుమానాలు
తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు వక్రమార్గం



సాక్షి, హైదరాబాద్: సరోగసీ పేరుతో శిశు విక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత అలియాస్ పచ్చిపాల నమ్రత నెట్‌వర్క్‌లో కొందరు ఆశావర్కర్లు ఏజెంట్లుగా ఉండి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరి ద్వారానే తెలుగు రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల నుంచీ నిరుపేద గర్భిణుల వివరాలు తెలుసుకుంటూ వారితో.. నమ్రత, ఇతర నిందితులు బేరసారాలు సాగించినట్లు అంచనా వేస్తున్నారు. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఈ కోణంలో ప్రశ్నించాలని నిర్ణయించారు.

మంచి ట్రాక్ రికార్డు ఉన్నా పదేపదే నేరాలు...

విజయవాడకు చెందిన డాక్టర్ నమ్రత విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కళాశాల నుంచి 1995లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆపై కర్ణాటకలో ఉన్న జేజేఎం మెడికల్ కాలేజీ నుంచి గైనకాలజీలో ఎండీ చేశారు. 1998లో ఫెర్టిలిటీ రంగంలోకి వచ్చిన ఆమె బెంగళూరు, ముంబై, సింగపూర్, జర్మనీ, ఎడిన్‌బర్గ్‌లో శిక్షణ పొందారు. ఈ విధంగా మంచి చదువు, అనుభవం ఉన్నప్పటికీ తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం అక్రమ మార్గం పట్టారు. తన వద్దకు సంతానం కోసం వచ్చే వారికి ఐవీఎఫ్ ద్వారా చికిత్స చేసే కంటే సరోగసీని ప్రోత్సహిస్తే ఎక్కువ డబ్బు వస్తుందని ఆశపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఐవీఎఫ్, ఐయూఐ ద్వారా సంతానం పొందే అవకాశం ఉన్న వారికి కూడా తప్పుడు నివేదికలు ఇచ్చి సరోగసీకి ప్రోత్సహించారని, దీని ముసుగులోకి శిశువుల అక్రమ రవాణాకు తెరలేపారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసుల్లో చిక్కుకుని జైలుకు వెళ్లి రావడం పరిపాటిగా మారిందని అంటున్నారు.

తమ సిబ్బందితో పాటు ఆశావర్కర్ల ద్వారా..

చైల్డ్ ట్రాఫికింగ్‌కు అవసరమైన చిన్నారులను గుర్తించడానికి నమ్రత ప్రసూతి ఆస్పత్రుల్లో పనిచేసే వారిలో కొందరితో పాటు మరికొందరు ఆశావర్కర్లను కూడా ఏజెంట్లుగా మార్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరి ద్వారానే శిశు విక్రయాలకు బేరసారాలు సాగించారని భావిస్తున్నారు. కొన్ని కేసుల్లో నేరుగా చిన్నారులను విక్రయించేసి, ఖరీదు చేసిన వారి పేర్లు, వివరాలతోనే బర్త్ సర్టిఫికెట్లను కూడా సృష్టించినట్లు అనుమానిస్తున్నారు. 'సృష్టి'కి సంబంధించిన అన్ని బ్రాంచీల్లో గత కొన్నేళ్లుగా ఈ తరహా శిశు జననాలు, శిశు అక్రమ రవాణా ఉదంతాల సంఖ్య 100కు పైగా ఉండే అవకాశం ఉందని, ఇందులో ఒక్క విశాఖపట్నంలోనే 30 వరకు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం విశాఖలో కొత్త సృష్టి ఆస్పత్రి భవనం నిర్మాణంలో ఉన్నట్లు గుర్తించారు.

పోలీసు కస్టడీపై నేడు కోర్టు తీర్పు

చైల్డ్ ట్రాఫికింగ్ వ్యవహారాలకు సంబంధించి నార్త్‌జోన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన 8 మంది నిందితులు ప్రస్తుతం చంచల్‌గూడలోని మహిళ, పురుషుల జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిలో కొందరు బెయిల్ కోసం పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. మరోపక్క ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించడంతో పాటు 'సృష్టి'కేంద్రంగా సాగిన చిన్నారుల అక్రమ రవాణాను గుర్తించడానికి నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణలను లోతుగా విచారించాలని గోపాలపురం పోలీసులు నిర్ణయించారు. వారిని వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం వాదనలు పూర్తి కాగా.. గురువారం తీర్పు వెలువడనుంది.

నీట్ పీజీ అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: దేశంలో వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నీట్ పీజీ–2025ను ఆగస్టు మూడో తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను గురువారం ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) బుధవారం ప్రకటించింది. సందేహాల నివృత్తి కోసం 7996165333 ఫోన్ నంబర్‌ను, ఎన్‌బీఈ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రూ.40 కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మహిళ నుంచి స్వాధీనం చేసుకున్న ఎన్సీబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.40 కోట్ల విలువైన హైడ్రోపోనిక్ (మట్టికి బదులు పోషకాలు అధికంగా ఉండే నీటితో మొక్కలను పెంచే పద్ధతి) గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి నుంచి ఈ గంజాయిని పట్టుకున్నట్టు సమాచారం. ఎన్సీబీ అధికారులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా.. హైడ్రోపోనిక్ గంజాయిని బ్యాంకాక్‌లో కొన్నానని, భారత్‌లో ఈ గంజాయికి డిమాండ్ ఉండటంతో ఇక్కడికి తీసుకొచ్చానని ఆ మహిళ అధికారులకు తెలిపినట్టు సమాచారం. దీంతో అధికారులు గంజాయిని ఎక్కడికి చేరవేస్తున్నారు? దాన్ని కొనుగోలు చేస్తున్న వారిపై లోతైన దర్యాప్తు ప్రారంభించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఇంత భారీ మొత్తంలో గంజాయి పట్టుబడటం కలకలం రేపింది. అయితే గంజాయి పట్టివేతను ఎన్సీబీ అధికారులు అధికారికంగా ధ్రువీకరించలేదు. కాగా, ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి రైల్లో గంజాయి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందడంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. 10వ ప్లాట్‌ఫారంపై మూడు బ్యాగులు కనిపించగా.. తెరిచి చూస్తే 32.800 కిలోల బరువుంది. దాని విలువ రూ.20 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మరో ఘటనలో ఒడిశా నుంచి కారులో హైదరాబాద్‌కు తరలిస్తున్న మరో కేసులో ఎనిమిది కిలోల గంజాయిని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు.

ఎంబీబీఎస్, బీడీఎస్‌కు 17,941 రిజిస్ట్రేషన్లు


ముగిసిన రాష్ట్ర కోటా రిజిస్ట్రేషన్ల గడువు
ఆగస్టు 5న సుప్రీంకోర్టు తీర్పు అనంతరమే కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: నీట్ యూజీ–2025 కింద ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల రాష్ట్ర కోటాకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈనెల 25తోనే ఈ ప్రక్రియ ముగియాల్సి ఉండగా, స్థానికత అంశంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో గడువును కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారానికి పొడిగించింది. జీవో 33 ప్రకారం రాష్ట్రంలో 9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ రెండేళ్లు పూర్తిచేసిన విద్యార్థులే రాష్ట్ర కోటా కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న కాళోజీ వర్సిటీ నోటిఫికేషన్‌పై కొందరు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. బుధవారం నాటికి మెడికల్ సీట్లలో రాష్ట్ర కోటా కింద 17,941 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 329 మంది సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక కోటా కింద దరఖాస్తు చేసుకున్నారు. అలాగే స్థానికత అంశంపై హైకోర్టులో 130 పిటిషన్లు కూడా దాఖలైనట్లు సమాచారం. నీట్ యూజీ –2025 పరీక్షలో రాష్ట్రం నుంచి 43,400 మంది క్వాలిఫై కాగా, వీరిలో సగానికన్నా తక్కువ మొత్తంలో 17,941 మంది మాత్రమే సీట్ల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో కలిపి 8,915 సీట్లు ఉండగా, అందులో రాష్ట్ర కోటా కింద కన్వీనర్ కోటాలో దక్కేవి 5,577 మాత్రమే. ప్రైవేటులో 50 శాతం రాష్ట్ర కన్వీనర్ కోటా కింద కేటాయించనుండగా, మిగతా 50 శాతం మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా కింద కేటాయించుకుంటారు.

నేడు ముగియనున్న ఎంసీసీ గడువు

రిజిస్ట్రేషన్ల గడువు బుధవారంతో ముగియగా, ఆల్ ఇండియా కోటా కింద మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) రిజిస్ట్రేషన్ల గడువు గురువారంతో ముగియనుంది. కాగా సుప్రీంకోర్టులో స్థానికత అంశంపై ఆగస్టు 5న కేసు విచారణకు రానుంది. అదేరోజు స్థానికతపై తుదితీర్పు వస్తుందని భావిస్తున్న కాళోజీ వర్సిటీ అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియను ఆ తరువాతే ప్రారంభించాలని నిర్ణయించారు. సుప్రీంకోర్టు తీర్పు తరువాత రాష్ట్ర ర్యాంకులను ప్రకటించి, తదనుగుణంగా ఆగస్టు రెండో వారం తరువాతే రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని వర్సిటీ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. సుప్రీంకోర్టులో జరిగే వాదనల అనంతరం వెలువడే ఉత్తర్వులకు అనుగుణంగానే కౌన్సెలింగ్ జరుగుతుందని కాళోజీ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.



నాగార్జునసాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం 8 గేట్లు.. సాగర్ 26 గేట్లు..

జలాశయాలనుంచి కిందకు కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్/దోమలపెంట/ మేళ్లచెరువు: కృష్ణా పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరద కొనసాగుతోంది. జలాశయాలన్నీ నిండుకుండలా మారడంతో క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 3,10,398 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 8 రేడియల్ క్రస్ట్‌గేట్లను 10 అడుగులు ఎత్తి 2,16,888 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే మీదుగా దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా మరో 65,476 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. దీంతో నాగార్జునసాగర్ జలాశయానికి 2,82,364 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 586.10 అడుగులకు (300.8385 టీఎంసీలు) చేరుకుంది. దీంతో 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా 2,65,456 క్యూసెక్కుల నీరు స్పిల్‌వే మీదుగా దిగువ కృష్ణానదిలోకి వదులుతున్నారు. విద్యుదుత్పాదన ద్వారా 27,080 క్యూసెక్కులు.. మొత్తం 2,92,536 క్యూసెక్కుల నీరు కృష్ణా నదిలోకి విడుదలవుతోంది. ఇక సాగర్ కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వ ద్వారా 17,516 క్యూసెక్కుల నీరు సాగుకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో కొనసాగుతున్న నీటివిడుదల

జూరాల, సుంకేసుల నుంచి వరద నీటి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండడంతో శ్రీశైలం ప్రాజెక్టు 8 గేట్లు ఎత్తి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,49,310 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 26,345, సుంకేసుల నుంచి 1,10,478 మొత్తం 2,86,133 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. శ్రీశైలంలో ఆనకట్ట గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేరకు పైకెత్తి స్పిల్ వే ద్వారా 2,16,152 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.7 అడుగుల నీటిమట్టం వద్ద 202.9673 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పులిచింతల ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు బుధవారం 12 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి 2,98,651 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ నుంచి 3,01,167 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. కాగా, ఈ ప్రాజెక్టులోని తెలంగాణ వైపు ఉన్న విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలంగాణ జెన్‌కో ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

పీ అండ్ జీ సీఈఓగా హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి

అంతర్జాతీయ కంపెనీ అధిపతిగా శైలేష్ జెజురికర్
ఆయన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల క్లాస్‌మేట్



సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యనభ్యసించిన శైలేష్ జెజురికర్ ప్రముఖ వినియోగ వస్తువుల దిగ్గజ కంపెనీ ప్రాక్టర్ అండ్ గాంబుల్ (పీ అండ్ జీ) గ్లోబల్ సీఈఓగా నియమితులయ్యారు. పీ అండ్ జీ కంపెనీ అమెరికన్ మల్టీనేషనల్ కన్స్యూమర్ గూడ్స్ కార్పొరేషన్. అమెరికాలోని సిన్సినాటి ప్రధాన కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 58 ఏళ్ల శైలేష్ జెజురికర్ ప్రస్తుతం పీ అండ్ జీకి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. 2026, జనవరి 1 నుంచి ఆ సంస్థ సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన పాఠశాల విద్యాభ్యాసం హెచ్‌పీఎస్‌లో సాగగా.. 1987లో ముంబై విశ్వవిద్యాలయం నుంచి బీఏ ఎకనామిక్స్‌లో పట్టా పొందారు. 1989లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-లక్నోలో ఎంబీఏ పూర్తి చేసి, అదే సంవత్సరం పీ అండ్ జీలో చేరారు. తాజాగా భారతీయ గ్లోబల్ సీఈఓల జాబితాలో శైలేష్ జెజురికర్ కూడా చేరారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివి మైక్రోసాఫ్ట్ సీఈఓగా పని చేస్తున్న సత్య నాదెళ్ల, డెలాయిట్ కన్సల్టింగ్‌కు చెందిన సౌమ్య చక్రవర్తి, టెస్లాకు చెందిన నాగేందర్ వంటి వారు శైలేష్ క్లాస్‌మేట్స్. హెచ్‌పీఎస్ 1984 బ్యాచ్‌లో శైలేష్ పాఠశాల హెడ్‌బాయ్‌గా నియమితులయ్యారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, శైలేష్ జెజురికర్‌లు మంచి స్నేహితులు. గ్లోబల్ సీఈఓల ఫ్యాక్టరీగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నిలవడం గర్వకారణమని ఈ సందర్భంగా పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇక ఏ రోజుకారోజే శ్రీవాణి టికెట్ దర్శనాలు

ఒకటో తేదీ నుంచి అమలు: టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల: శ్రీవాణి దర్శన టికెట్లు ఆఫ్‌లైన్‌లో పొంది శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం వారి దర్శన సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుమలలోని గోకులం సమావేశ మందిరంలో బుధవారం శ్రీవాణి దర్శనాలపై సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలివి..

● ప్రస్తుత విధానం వల్ల శ్రీవాణి టికెట్ దర్శనం కోసం భక్తులకు సుమారుగా మూడు రోజుల సమయం పట్టేది. వారి సౌకర్యార్థమై ఏ రోజు కారోజు టికెట్ జారీచేసి దర్శనం కల్పించనున్నాం. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఈ నూతన విధానాన్ని అమలు చేస్తాం. ● తిరుమలలో ఉదయం 10 గంటల నుంచి మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన టికెట్ల జారీ. రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుంచి దర్శన టికెట్ల కోటా ఉన్నంతవరకు జారీ. యథావిధిగా తిరుమలలో ఆఫ్ లైన్ ద్వారా 800 టికెట్లు, రేణిగుంట విమానాశ్రయంలో 200 టికెట్ల జారీ. ● ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబర్ 31 వరకు ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులకు యథావిధిగా ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతి. ● నవంబర్ 1 నుంచి శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులు సాయంత్రం 4:30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతి.

ఎవరి కమిటీ వారిదే.. ఎవరి నివేదిక వారిదే

ఇంజనీరింగ్ ఫీజులపై అంతర్గత కమిటీలు
ప్రతీ కాలేజీని నిశితంగా పరిశీలించాలని ఆదేశం


సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజులకు సంబంధించి అంతర్గత కమిటీలను నియమించనున్నారు. వీటిలో ఎవరు ఉండాలనేది ప్రత్యేక కమిటీలో ఉన్న వారికే విడిచిపెట్టాలని నిర్ణయించారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని నియమించాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సూచించారు. ఇంజనీరింగ్ ఫీజుల పరిశీలనకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం భేటీ అయి కాలేజీల అభిప్రాయాలు తెలుసుకుంది. దీనికి కొనసాగింపుగా అంతర్గత కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆడిట్ విభాగం అధికారి ఫైనాన్స్, ఆడిటింగ్‌లో నిష్ణాతులైన వారిని కమిటీలోకి తీసుకుంటారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ అధికారి కాలేజీల భూముల డాక్యుమెంట్లను పరిశీలించి సలహాల కోసం రెవెన్యూ సిబ్బందిని తీసుకుంటారు. అదేవిధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పన పరిశీలన, సిబ్బందికి వేతనాలు ఇచ్చే విధానాల పరిశీలనకు అనుభవజ్ఞులైన వారిని తీసుకుంటారు.

కాలేజీల వ్యవహారాలపైనా..

ఫీజుల పెంపు విషయమే కాకుండా కాలేజీల వ్యవహారాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిటీ నిర్ణయించింది. కోర్ గ్రూపులు ఎందుకు నిర్వీర్యం అవుతున్నాయి? ఎమర్జింగ్ కోర్సుల్లో ఫ్యాకల్టీ ఎవరు? వాళ్ల బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు వివరాలను తీసుకుంటారు. రికార్డుల్లో మాత్రమే అర్హులు ఉండటం, వాస్తవంగా అర్హత లేనివారితో బోధన చేయించే అంశాలను గుర్తించాలని ప్రభుత్వం సూచించింది. ఇలాంటి కాలేజీలపై తదుపరి చర్యలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు కాలేజీలు ఇష్టానుసారం యాజమాన్య కోటా సీట్లు అమ్ముకుంటున్నాయనే ఫిర్యాదులనూ పరిగణనలోనికి తీసుకోనున్నారు. కాలేజీలు మొదలైనప్పుడు ఆర్థిక పరిస్థితి... ఇప్పుడు పరిస్థితిని బేరీజు వేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీని ఆధారంగా అడ్డగోలు సీట్ల అమ్మకాలను నిరోధించే కార్యాచరణను రూపొందించే వీలుంది. కాలేజీల భూముల రికార్డులను పరిశీలించేందుకు ఎమ్మార్వోలు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుంటారు.

మేం అంతా చేస్తాం... స్వేచ్ఛ కావాలి

ప్రైవేటు కాలేజీలకు చెందిన ప్రతీ అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని, అయితే, తమకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయం కీలక అధికారితో ఆయన ఈ మేరకు తన అభిప్రాయాన్ని పంచుకున్నట్లు తెలిసింది. విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులు సహకరించకపోయినా, కనీసం తమ పనులకు అడ్డుపడకుంటే ముందుకెళ్లొచ్చని చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని సీఎంవో కీలక అధికారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇవ్వడంతో బాలకిష్టారెడ్డి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం । 31-7-2025

నల్లమలలో పులి గాండ్రింపు

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో 36కు పెరిగిన పులుల సంఖ్య



- 2023–24తో పోల్చితే 3 పులులు అధికం
- సత్ఫలితాలు ఇస్తున్న అటవీ శాఖ చర్యలు
- పెరుగుతున్న ఆడ పులుల సంతతి

అచ్చంపేట: నల్లమలలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు (ఏటీఆర్)లో ప్రస్తుతం 36 పులులు, 2 పులి పిల్లలు ఉన్నాయి. ఇందులో 13 మగ, 20 ఆడ పులులు కాగా.. మరొకటి గుర్తించాల్సి ఉంది. అటవీశాఖ లెక్కల ప్రకారం 2023–24లో 33 పెద్ద పులులు ఉండగా.. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) 2024–25 ఫేజ్–4 మానిటరింగ్‌లో భాగంగా ఆటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పులుల పర్యవేక్షణ సర్వే ప్రకారం 36కు చేరింది. 2019 నుంచి వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక్కడ పెరుగుతున్న పులుల సంతతిలో ఆడ పులుల సంఖ్య ఎక్కువగా ఉంది. పులుల సంతతి పెంచేందుకు అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తుండటంతో మరో రెండు, మూడేళ్లలో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా పులులు వేటాడి తమ ఆహారాన్ని సులభంగా సాధించుకునేలా జింకలు, దుప్పులు, గడ్డి క్షేత్రాలు, ఇతర జంతువులను పెంచాల్సిన అవసరం ఉంది.



పులుల వృద్ధికి ఏటీఆర్ అనుకూలం

అమ్రాబాద్ టైగర్ రిజర్వు (ఏటీఆర్)లో జీవవైవిధ్యంతో పాటు పులుల వృద్ధికి అనుకూల వాతావరణం ఉండటంతో వాటి సంతతి పెరుగుతోంది. ఇందులో చెంచుల పాత్ర ముఖ్యమైనది. తాజా లెక్కల ప్రకారం 36 పులులు ఉన్నాయి. పెరుగుదల మా శాఖ ప్రణాళిక బద్ధంగా చేపట్టిన చర్యలకు ఫలితం. ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఈ అభయారణ్యం ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోంది.

– గోపిడి రోహిత్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

గణన ఇలా..

ఏటీఆర్ పరిధిలోని పది రేంజ్‌లను నాలుగు బ్లాక్‌లుగా విభజించారు. 2024, డిసెంబర్ 20 నుంచి 2025, మే 15వ తేదీల్లో 1,594 కెమెరా ట్రాప్‌ల ద్వారా పాదముద్రలను పరిశీలించారు. 797 లొకేషన్లలో ప్రతి 2 కిలోమీటర్లకు ఒక కెమెరా ట్రాప్ రికార్డ్ చేసి పులులకు సంబంధించి డేటాను విశ్లేషించారు. నాలుగు నెలల కాలంలో పులుల అడుగులు, ముద్రలు, విసర్జనలు, స్క్రాప్, రేక్ మార్కులు వంటి ప్రత్యక్ష ఆధారాలను నమోదు చేశారు.

పెరుగుతున్న ఆడ పులులు

నల్లమల అభయారణ్య ప్రాంతం 2,611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో 2,166,37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్‌జోన్‌గా ఉంది. దేశంలోనే రెండో అతిపెద్ద టైగర్ రిజర్వుగా ఏటీఆర్ నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ప్రకృతి రమణీయ దృశ్యాలు, కృష్ణానది జలపాతాలు, క్రూరమృగాలు, జంతువుల సందడికి నిలయం. ఈ అడవుల్లో జీవ వైవిధ్యానికి పెద్దపులులు, చిరుతలే కీలకం. పులుల సంరక్షణకు చేపట్టిన చర్యలతో అమ్రాబాద్ అభయారణ్యంలో ఏటేటా పులులు, చిరుతల సంఖ్య పెరుగుతోంది. దాదాపు 200లకు పైగా పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా అభయారణ్యం ఉంది. సాధారణంగా పులులు రెండున్నర ఏళ్ల తర్వాత సంతానోత్పత్తికి సిద్ధంగా ఉంటాయి. ఏటీఆర్‌లో సంతానోత్పత్తికి అనుకూలంగా ఉన్న ఆడపులుల సంఖ్య పెరిగిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 20 ఆడపులులు.. రెండు పులి పిల్లలు ఉన్నాయి. సాధారణంగా పెద్దపులి దట్టమైన అటవీ ప్రాంతంలో చెట్లపై గుర్తులు, మూత్ర విసర్జన చేసి తన హద్దులను ఏర్పాటు చేసుకుంటుంది. ఎంచుకున్న సరిహద్దులో 25 చదరపు కిలోమీటర్ల మేర సంచరిస్తుంది. ప్రస్తుతం ఏటీఆర్‌లో వరహా, బౌరమ్మ, తారా, ఎఫ్–53, ఎం–19 పేర్లతో పులులకు నామకరణం చేశారు. పులికి సిగ్గెక్కువ కావడంతో ఒంటరిగా తిరిగేందుకు ఇష్టపడుతుంది. పెద్దపులి శాఖాహార జంతువులను వేటాడి ఆహారంగా తీసుకుంటుంది.

జనావాసాల తరలింపుపై కార్యాచరణ

ఏటీఆర్‌లో పెద్దపులులకు అనుకూలమైన వాతావరణం ఉండేలా చూసేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. కోర్ ఏరియాలోని జనావాసాలను బయటకు తరలించేందుకు ఇప్పటికే తొలి దశలో సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపెంట, కొమ్మనపెంట గ్రామాలను పెద్దకొత్తపల్లి మండలం బాకారం గ్రామ సమీపంలో అటవీశాఖ స్థలాన్ని ఎంపిక చేసి అక్కడికి తరలించే ఏర్పాట్లు చేస్తోంది. రెండో దశలో వట్టువర్లపల్లి, తాటిగుండాలు, మరి కొన్ని గ్రామాలను ఖాళీ చేయించి ఇతర చోట్లకు తరలించి వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆయా కుటుంబాలకు ప్యాకేజీలు అందించే ఏర్పాటు చేస్తున్నారు. పులుల సంతానోత్పత్తికి అనువైన రోజులు కావడంతో జూలై నుంచి సెప్టెంబర్ వరకు వాటి ఏకాంతతకు భంగం కలగొద్దని నిషేధాజ్ఞలు విధించారు. ఈ మూడు నెలల పాటు అటవీ ప్రాంతంలోకి పర్యాటకులు, ఇతరులెవరినీ అనుమంతిచరు. ఏటీఆర్‌ను ఎకో సెన్సిటివ్ జోన్‌గా ఏర్పాటు చేసే ప్రతిపాదనలు చేశారు. పది కిలోమీటర్ల దూరం వరకు ఎలాంటి అభివృద్ధి, నిర్మాణాలు చేపట్టాలన్నా ఎకో సెన్సిటివ్ జోన్ కమిటీ అనుమతి తప్పనిసరిగా అవసరం.

గుర్తింపు ఇలా..

- పెద్ద పులులను ఇప్పటికే అందుబాటులో ఉన్న ఫొటో గ్రాఫ్‌ల డేటాబేస్‌తో పాటు పులులు చారల ఆధారంగా మ్యాచ్ చేస్తారు
- మగ, ఆడ వాటిని వాటి శరీర భాగాలను బట్టి గుర్తిస్తారు
- పులులను గుర్తించాక వాటికి ప్రత్యేక ఐడీ కేటాయిస్తారు
- ఏ రెండు పులుల చారలు ఒకే విధంగా ఉండవు
- మనుషుల వేలి ముద్రల మాదిరిగానే వాటి స్ట్రైప్ ప్యాటర్న్ ప్రతీ పులికి ప్రత్యేకంగా ఉంటుంది

నల్లమలలో పులుల వివరాలిలా..

ఏడాది	మొత్తం పులులు	మగ	ఆడ	లింగం గుర్తించనివి	పిల్లలు
2017	6	2	4	–	–
2018	7	3	4	–	–
2019	12	5	5	–	2
2020	12	6	5	–	1
2021	13	6	7	–	–
2022	19	7	6	–	6
2023–24	33	11	15	–	7
2024–25	36	13	20	1	2







నల్లమలలో కెమెరాకు చిక్కిన పులులు

లెదర్ పార్కులు లేవా?

- తోళ్ల పరిశ్రమల ఏర్పాటుకు ఏళ్లుగా ఎదురుచూపులు
- ఉమ్మడి ఏపీలోనే పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు
- తెలంగాణ ఏర్పడ్డాక ముందుకు సాగని వైనం
- తుక్కుగా మారుతున్న యంత్రాలు.. కబ్జాల పాలవుతున్న భూములు
- ఏర్పాటైతే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి
- మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు కేంద్రమంత్రికి.. మంత్రి శ్రీధర్‌బాబు వినతి



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్మించిన భవనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దళిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లెదర్ పార్కుల లక్ష్యం నీరుగారిపోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తోళ్ల పరిశ్రమల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళిక రచించింది. లిడ్‌క్యాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో దళితులు అధికంగా ఉన్న చోట్ల కనీసం 25 ఎకరాలకు తగ్గకుండా భూములు కేటాయించింది. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చారు. తర్వాత పాలకుల పట్టింపు కరువై ముందుకు సాగలేదు. తెలంగాణ ఏర్పడ్డాక కేంద్ర ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ సంస్థ) కింద పార్కులు అభివృద్ధి చేయాలని భావించారు. 2016లో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మెగాపార్కుకు సుమారు రూ.270 కోట్లతో 2 వేల మందికి ఉపాధి కల్పించాలని తలచినా కార్యరూపం దాల్చలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటా విడుదలలో జాప్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు సహకరించాలని ఇటీవల పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు.

వేలాది మంది నిరీక్షణ

పరిశ్రమకు ముడిసరుకుగా వధశాలల్లో లభ్యమయ్యే తోళ్ల శుద్ధి చేసి ఉత్పత్తులు తయారు చేయాలి. చెప్పులు, బూట్లు, గార్మెంట్స్ తయారు చేసి, మార్కెట్ చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్ జిల్లా ఎనుమాముల, హైదరాబాద్ పరిధి రాయదుర్గంలో కామన్ సర్వీస్ కేంద్రంగా శిక్షణ పొందిన కార్మికులతో తోళ్లశుద్ధి, ఉత్పత్తి జరిగేది. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించి యంత్రాలు తెచ్చారు. తర్వాతి కాలంలో పట్టింపు లేక మూతపడ్డాయి. మళ్లీ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులు శిక్షణ పొందారు. తెలంగాణ ఉద్యమం, నిధులు విడుదల కాక ఆచరణలోకి రాలేదు. అప్పటి నుంచి శిక్షణ పొందిన వారంతా తమ ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పార్కు అభివృద్ధి చేసేందుకు కొత్త భవనం నిర్మించి ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్, జమ్మికుంట, మంచిర్యాల జిల్లా మందమర్రిలో శిక్షణ పొందినవారంతా ఓ సంఘంగా ఏర్పడి అక్కడి భూముల రక్షణకు పోరాటం చేస్తున్నారు.



యంత్రాలన్నీ తుక్కుగా మారిపోయి..

రూ.కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన యంత్రాలు ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి. ఇటీవలే వరంగల్ జిల్లా ఎనుమాముల, ప్రధాన కార్యాలయం రాయదుర్గంలో ఉన్న యంత్రాలను తుక్కు కింద అమ్మేసేందుకు టెండర్లు పిలిచారు. దీంతో తోళ్ల పరిశ్రమలు తెరుచుకుంటాయా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



లెదర్ పార్కుల భూములు కబ్జాలకు గురవుతున్నాయి. పాత యంత్రాలను అమ్మేస్తున్నారు. ఉపాధి లేక వేలాది మంది అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే తోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– కొంగరి శంకర్, అధ్యక్షుడు, రాష్ట్ర మాదిగ హక్కుల దండోరా

లెదర్‌పార్కులు ఏర్పాటు చేసే ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా
స్టేషన్ ఘన్‌పూర్	జనగామ
ఆర్మూర్	నిజామాబాద్
మందమర్రి	మంచిర్యాల
జినుకుంట	నాగర్‌కర్నూల్
రుక్మాపూర్	కరీంనగర్
షోలేపల్లి	మహబూబ్‌నగర్
మల్లెమడుగు	ఖమ్మం
జమ్మికుంట	కరీంనగర్
దుద్దెడ	సిద్దిపేట
ఎనుమాముల	వరంగల్



కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లో కబ్జాకు గురైన లెదర్ పార్కు భూమి



మంచిర్యాల జిల్లా మందమర్రిలో లెదర్‌పార్కులో ఏర్పాటు చేసిన షెడ్డు

తెలంగాణను ఢిల్లీకి తాకట్టు పెడతారా?

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రవీందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఎక్కువైందనే పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాదయాత్ర చేయిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఏనాడైనా పాదయాత్ర చేసిన చరిత్ర ఉందా అని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్‌కు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఒకవైపు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ డైరెక్షన్‌లో పాలన నడుస్తుంటే.. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీలో తనకేదో పరపతి పెరిగిందని ఓవర్ యాక్షన్ చేస్తున్నారని విమర్శించారు. మీనాక్షి నటరాజన్ చేతుల్లోనే రిమోట్ కంట్రోల్ ఉందని, ఆమె చెప్పినట్లే పాలన జరుగుతోందని విమర్శించారు. నటరాజన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తుండటాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని వెల్లడించారు. సెక్రటేరియట్‌లో ప్రభుత్వ అధికార యంత్రాంగంతో ఆమె సమీక్షలు జరపడం, సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం ఘటనలో ఆమె మంత్రులతో సమీక్ష చేయడం ఏమిటని, సీఎంకు వివరాలు చెప్పాల్సిన మంత్రులు మీనాక్షికి చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ డమ్మీ సీఎం అని లీడర్‌కు, కేడర్‌కు ఎప్పుడో తెలిసిపోయిందని, ఆరు గ్యారంటీలు అమలు చేయలేక సీఎం చేతులెత్తేస్తున్నారని రవీందర్‌రావు విమర్శించారు.

రెండో విడతలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మొదటి విడతలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక కాని అర్హులకు రెండో విడతలో కచ్చితంగా అవకాశం కల్పిస్తామని నారాయణపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చెప్పారు. పేదలందరికీ ఇళ్లు కట్టించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణలో ఇల్లు లేని పేదలు ఉండొద్దనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న అందుబాటులో ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో బుధవారం పర్ణికారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలు పరిష్కరించాలని తనకు దరఖాస్తులు ఇచ్చారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య

- ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు వ్యాఖ్యానించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన జిల్లా విద్యాధికారుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యావ్యవస్థలో అత్యంత కీలకమైన పాత్ర డీఈవోలదే అని, వారి పాత్ర మరింత చురుకుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ, సమాన, సమగ్ర విద్యా వ్యవస్థను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రస్తావిస్తూ, పాఠశాలల్లో నమోదు రేటు పెరుగుతోందని, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇ.నవీన్ నికోలస్ డీఈవోలకు పలు సూచనలు చేశారు.

డీపీఆర్ తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం

- ఎంపీ అనిల్‌కుమార్ ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–కల్వకుర్తి మధ్య నాలుగు లైన్ల రహదారి అభివృద్ధిపై ప్రజల డిమాండ్లు కేంద్ర ప్రభుత్వ దృష్టికి వచ్చాయని కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. తుక్కుగూడ–దిండి మధ్య (కల్వకుర్తి మీదుగా) జాతీయ రహదారి–765ను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో జాతీయ రహదారుల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, తెలంగాణలో ఉన్న జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి కూడా ప్రతిపాదనలు వచ్చిన ప్రతిసారీ పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. డీపీఆర్ పూర్తయిన తర్వాతే ప్రాజెక్టును తీసుకోవాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

మంచిర్యాలలో వందేభారత్‌కు హాల్ట్ ఇవ్వండి

- రైల్వే మంత్రిని కోరిన కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ




సాక్షి, న్యూఢిల్లీ: ప్రయాణికుల సౌలభ్యం కోసం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్–నాగ్‌పూర్ వందేభారత్ ట్రైన్‌తో పాటు కేరళ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ వంశీకృష్ణ మంచిర్యాలకు సంబంధించిన సమస్యను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో సింగరేణి కాలరీస్ ఉన్నాయని, ఈ ప్రాంతం నుంచి ఏటా రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల రెవెన్యూ రైల్వే శాఖకు వస్తుందని లోక్‌సభ వేదికగా గుర్తుచేశారు. వందేభారత్ రైలుకి మంచిర్యాల నుంచి కనెక్టివిటీ లేకపోవడంతో చాలా మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వంశీకృష్ణ తెలిపారు. మంచిర్యాలకు సంబంధించి వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ల విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం 144 రూట్లలో వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని, చాలా ప్రాంతాల్లో వందేభారత్ రైళ్లు నడపాలని వినతులు వస్తున్నాయని, సమయానుకూలంగా వీటిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ప్రమోషన్‌పై నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు

- అటవీ శాఖ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: శేరిలింగంపల్లి జోన్ అర్బన్ బయో డైవర్సిటీ వింగ్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ ప్రమోషన్‌పై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 'వరంగల్ సర్కిల్‌లోని కరీంగనర్‌లో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పనిచేస్తున్నప్పుడు అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7 కింద 2017, అక్టోబర్‌లో ఏసీబీ ట్రాప్ కేసు నమోదైంది. 2019లో క్రిమినల్ కేసు ముగిసింది. 2021లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చార్జ్ మెమో జారీ చేయగా వివరణ ఇచ్చా. అయితే, శాఖాపరమైన చర్యలు పెండింగ్‌లో ఉన్నందున పదోన్నతి కోసం పరిగణనలోకి తీసుకోవడం లేదు'అంటూ అనిల్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. నాలుగు నెలల్లో శాఖాపరమైన విచారణ ముగించి, పదోన్నతిపై నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం లేదంటూ అనిల్ ధిక్కరణ పిటిషన్ వేయగా, దానిని జస్టిస్ మాధవి దేవి విచారణ చేపట్టి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 3 నెలల్లో పిటిషనర్ ప్రమోషన్‌పై నిర్ణయం తీసుకోవాలని, లేదంటే కోర్టు ధిక్కరణ కింద ప్రతివాదులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

'కొండంత' వినాయకుడు!



ప్రకృతిని ఆస్వాదించాలే కానీ ప్రతీది మనసుకు హత్తుకుంటుంది. శిలలపై శిల్పాలు చెక్కినారని గొప్పగా పాడుకోవడమే కాదు.. నిశితంగా పరిశీలిస్తే కనిపించే ప్రతి రాయిలోనూ ఏదో ఒక రూపం సాక్షాత్కరిస్తుంది. పేరులోనే కొండను దాచుకున్న పత్తికొండ పరిసర ప్రాంతాల్లో ఎత్తయిన కొండలు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఎవరో పేర్చినట్లుగా ఉండే ఈ కొండలను చూసేందుకు రెండు కళ్లూ చాలవు. తుగ్గలి మండలం కోతికొండ గ్రామ సమీపంలోని ఓ కొండ అచ్చం వినాయక రూపాన్ని పోలి ఉండటం స్థానికులతో పాటు ఆ దారిన వచ్చివెళ్లే ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. – డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



దారి ఇలా.. బడికి వెళ్లేదెలా..?

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలోని ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. చిన్న చినుకు పడినా ఈ దారి దారుణంగా మారుతోంది. దీనికి తోడు బడికి వెళ్లే రహదారి దళిత వాడ వద్ద మురుగునీరు నిల్వ కావడంతో పిల్లలు అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నారు.
– ఇచ్ఛాపురం రూరల్

ఆహారం కోసం..

నెల్లూరులోని ఫతేఖాన్‌పేట రైతు బజార్ సమీపంలో పడి ఉన్న చెత్తాచెదారం వద్దకు ఓ యువకుడు వచ్చాడు. చెత్తను అటుఇటుగా విసిరేస్తూ ఏదో వెతకసాగాడు. ఇంతలో అతడికి ఆహారం కనిపించింది.. దాన్ని తీక్షణంగా పరిశీలించి.. వాసన చూసి... ఆకలికి తాళలేక దాన్నే తినేశాడు. ఈ దృశ్యం అక్కడ చూపరుల మనసును ఒక్కసారిగా కలిచివేసింది. ఆ దృశ్యాలే ఇవీ...





క్లుప్తంగా...

'ఉపాధి' అంబుడ్స్‌మెన్ల ఎంపికకు నలుగురు అధికారుల కమిటీ

సాక్షి, అమరావతి : ఉపాధి హామీ పథకం అమల్లో అందే ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణకు స్వతంత్రతో వ్యవహరించే అంబుడ్స్‌మెన్‌ల నియమాయానికి ప్రభుత్వం నలుగురు అధికారులతో కమిటీని నియమించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 19 జిల్లాలో అంబుడ్స్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీఏడీ స్పెషల్ సీఎస్.. ఎస్ఎస్ రావత్ ఎంపిక కమిటీకి చైర్ పర్సన్‌గా వ్యవమరిస్తారని, సభ్యులుగా కేంద్రం ప్రకటించే వ్యక్తితో పాటు, రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొంది.

ఎంఐసీఈ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్: ఆమ్రపాలి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక పెట్టుబడులకు మీటింగ్స్, ఇన్‌సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ (ఎంఐసీఈ) అభివృద్ధికి అనువైన వాతావరణం ఉందని ఏపీ టీడీసీ ఎండీ ఆమ్రపాలి అన్నారు. చెన్నైలో బుధవారం జరిగిన ఇండియన్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రీ అసోసియేషన్ సౌతిండియా ఎంఐసీఈ ఇండస్ట్రీస్ లీడర్స్ కనెక్ట్‌లో ఆమె మాట్లాడారు. ఏపీలో విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి కీలక నగరాలను ఎంఐసీఈ గమ్యస్థానాలుగా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. స్థిరమైన ప్రాంతీయ పర్యాటక అభివృద్ధి కోసం పీపీపీ విధానం అమలు చేస్తున్నామని తెలిపారు.

కౌలు రైతులపై నిర్లక్ష్యం తగదు
ఏపీ కౌలు రైతుల సంఘ డిమాండ్

సాక్షి, అమరావతి: సాగు చేయని భూయజమానులకు ముందుగా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం, వడ్డీలకు అప్పులు చేసి మరీ సాగు చేసే కౌలు రైతులకు ఈ పథకం కింద పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని ఏపీ కౌలు రైతుల సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. భూ యజమానులతో పాటు ఆగస్టు 2వ తేదీన కౌలుదారులందరికీ పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 నుంచి 80 శాతం సాగు భూమిలో పంటలు పండిస్తున్నది కౌలురైతులేనని వారు పేర్కొంటూ.. రాష్ట్రంలో కౌలురైతులు 32 లక్షల మందికి పైగా ఉన్నారని చెప్పారు. వీరిలో 10 లక్షల మంది భూమిలేని గ్రామీణ నిరుపేదలన్నారు. ఒకపక్క వారికి గుర్తింపు కార్డుల జారీలో తీవ్ర జాప్యం చేస్తూ, మరోవైపు సీసీఆర్సీ కార్డులు జారీ తర్వాతే అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తామనడం సమంజసం కాదన్నారు.

ఏడు నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, తాడేపల్లి–మంగళగిరి, శ్రీకాకుళం, ఒంగోలు, విజయవాడ, కడప నగరపాలక సంస్థల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు అనుమతిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం, కర్నూలు, ఒంగోలు, శ్రీకాకుళం, కడప నగరాల్లోని స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లలో కంటెయినర్ పద్ధతిలో వంద షాపులు చొప్పున, తాడేపల్లి–మంగళగిరి, విజయవాడలలో 40 షాపుల చొప్పున నగరపాలకసంస్థలు నిర్మిస్తాయి. ఈ షాపులను 18 ఏళ్లు నిండి, వీధి వ్యాపారిగా నగరపాలకసంస్థ వద్ద రిజిస్టర్ చేసుకుని, గుర్తింపు కార్డు పొందిన వారికి కేటాయిస్తారు.

రేపు మోటూరు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవం

సాక్షి, అమరావతి: ప్రముఖ సంపాదకులు మోటూరు హనుమంతరావు 24వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదాన సభను శుక్రవారం గుంటూరులో నిర్వహించనున్నట్టు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అవార్డుకు శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి విలేకరి గేదెల మాధవరావు ఎంపికయ్యారని వెల్లడించారు. గిరిజన ప్రాంత సమస్యలపై ఆయన రాసిన వివిధ కథనాలకు ఈ పురస్కారం లభించినట్టు వివరించారు.

రాజ్ భవన్‌కు కొత్త వాహనాలు

సాక్షి, అమరావతి : రాజ్‌భవన్ అధికారులు, ఉద్యోగుల కోసం కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 5 క్రిస్టాలు, 2 మారుతీ డిజైర్ కార్లతో పాటు 2 యాక్టివా స్కూటర్ల కొనుగోలుకు అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. గవర్నర్ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శితో పాటు ప్రోటోకాల్ అవసరాల కోసం క్రిస్టా, మారుతీ డిజైర్ కార్లు కేటాయిస్తారు. యాక్టివా స్కూటర్లను రాజ్‌భవన్ సిబ్బందికి కేటాయిస్తారు.

ధర దడ!

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
కొండెక్కిన కొబ్బరి... ఘాటెక్కిన ఎండు మిరప
చేదెక్కిన బెల్లం... మండుతున్న ఎర్రగడ్డల ధరలు



బద్వేలు పట్టణంలోని కూరగాయల మార్కెట్

కడప అగ్రికల్చర్/బద్వేలు: నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కాయి. ఎర్రగడ్డలు.. ఎండు మిరప.. పప్పు.. ఉప్పు.. బెల్లం.. అల్లం.. ఒకటా రెండా నిత్యావసర సరుకుల ధరలన్నీ చుక్కల్ని తాకుతున్నాయి. ఇక కూరగాయలు ధరలు కూడా తగ్గేదే లేదంటూ అమాంతంగా పెరిగి సామాన్యుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ధరల భారంతో జీవనం సాగించడం భారంగా మారిందని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

ధరల ఘాటు..

ఇటీవల టమోట ధరలు మోత మోగగా ప్రస్తుతం ఉల్లిగడ్డల వంతు వచ్చింది. కొనకుండా కోయకుండానే కళ్లలో ఉల్లి నీళ్లు తెప్పిస్తోంది. ఇక నిత్యం కూరల్లో వాడుకునే ఎండు కొబ్బెర కిలో గతేడాది రూ. 180 ఉండగా ఈ ఏడాది రూ. 350లకు చేరింది. కిలోపైన ఏకంగా 170 పెరిగింది. దీంతోపాటు ఎండు మిర్చి గతేడాది కిలో రూ. 120 ఉండగా ప్రస్తుతం రూ. 160కు చేరుకుంది. కిలో చింతపండు రూ. 100 నుంచి రూ. 140కి, బెల్లం రూ. 50 నుంచి 65 రుపాయలకు చేరింది. ఇక వంటనూనె ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది పామాయిల్ కిలో ధర రూ. 90 ఉండగా ఈ ఏడాది కిలో రూ. 120 పెరిగింది. సన్‌ఫ్లవర్ గతేడాది కిలో రూ. 112 ఉండగా ఈ ఏడాది కిలో రూ. 145 పెరిగింది. గతేడాది వేరుశనగ కిలో రూ. 150 ఉండగా ప్రస్తుతం కిలో రూ. 155 ఉంది.

- మొన్నమొన్నటి వరకు తక్కువగా ఉన్న కూరగాయల ధరలు నేడు అమాంతంగా పెరిగాయి. కిలో 10 రూపాయల ఉన్న టమోట నేడు రూ. 30లకు చేరుకున్నాయి. అలాగే కిలో పచ్చి మిరప 20 నుంచి 60 రూపాయలకు చేరాయి. వీటితోపాటు క్యారెట్, బీన్స్ వంటివి 60 రూలకు చేరింది. అనప, మునగలు కిలో రూ. 50లు పలుకుతున్నాయి.



నేతల మాటలు నీటి మూటలు..

కొండెక్కిన ధరలు నేలకు దింపుతామంటూ ఎన్నికల్లో నేతల మాటల గారడీనీ తలపిస్తున్నాయి. సగటు మనిషి జీవన ప్రమాణాల్లో మార్పులు తెద్దామన్న చిత్తశుద్ధి ఏ నాయకుడికి లేకపోయింది. సంచి నిండా డబ్బు పట్టుకెళ్తే నిత్యావసర వస్తువులు,కూరగాయలు జేబు నిండా రావడం లేదు. బియ్యం ధర వింటే దెయ్యాన్ని చూసినంత భయమేస్తోంది. కాస్తో కూస్తో మంచి రకం బియ్యం కేజీ ఎనభై పై మాటే. కంది పప్పు మాట వింటే కలలో కూడా కెవ్వుమనాల్సి వస్తోంది. రూ.150 నుంచి రూ.175లు పలుకుతున్నాయి. పల్లీల మాట వింటేనే తల్లీ నీకో దండం అనాల్సిందే. మంచిరకం రూ.140 నుంచి రూ.160లు ఉన్నాయి.గ్యాస్ బండ ఎప్పుడో గుదిబండై కూర్చుంది. నేతల మాటలు అమలయ్యేదెప్పుడో!



కూరగాయలను కొనలేకున్నాం



మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. నిత్యం సామాన్యులు సైతం వాడుకునే టమోట, మిరపకాయలు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. నిన్నామొన్నటి వరకు కిలో రూ. 10 ఉన్న టమోట రూ. 30 చేరింది. మిరపకాయలు 60 రూపాయలు ఉన్నాయి. దీంతో పచ్చడి మెతుకులు కూడా తినే పరిస్థితి కరువైయింది. – అంబటి రాజశేఖర్‌రెడ్డి, ఆలంఖాన్‌పల్లి, కడప

ఆకాశాన్నంటిన నిత్యావసరాల ధరలు



బియ్యం,బ్యాలు,ఉద్ది పప్పు శనకాయపప్పులు చింతపండు ఎండుమిర్చి దేనిని ముట్టుకున్నా ధరలు కాలిపోతున్నాయి. ఏమి తిని బతకాలయ్యా.. రేట్లు ఇట్లా మండిపోతుంటే పట్టించుకునే వారు లేరు. కూరగాయలు పండే కాలంలోనే ఇలా రేట్లు మండిపోతుంటే వచ్చే ఎండాకాలం ఎలా ఉంటాయో తల్చుకుంటేనే భయమేస్తోంది. ధరలు తగ్గించే మార్గం చూడండయ్యా..
–సుబ్బమ్మ, గృహిణి, గాంధీనగర్, బద్వేలు

బెంగుళూరు నుంచి వచ్చే కూరగాయలన్నీ ధర ఎక్కువే



బెంగుళూరు నుంచి వచ్చే కూరగాయల ధరలు ఎక్కువగానే ఉంటాయి. క్యారెట్,కాకరకాయలు,బీన్స్ ఒక రకం వంకాయలు, బోండామిర్చి, ఆలుగడ్డలు,తదితర కూరగాయలు బెంగుళూర్ నుంచి రావాల్సిందే. ధరలెక్కువగా ఉండడం వల్ల సాయంత్రం వరకూ అమ్మినా మాకు వేయి రూపాయలు కూలి మిగలడం లేదు. పచ్చి సరుకు త్వరగా అమ్ముడుపోతేనే పదిరూపాయలు ఉంటాయి. లేకుంటే నష్టం తప్ప లాభం లేదు.
–సుబ్బరాయుడు, కూరగాయల అంగడి యజమాని,బద్వేలు

నగరాన్ని గాలికొదిలేశారు.!

దేశంలోనే కాలుష్యం పెరిగిన నగరాల్లో రెండో స్థానంలో వైజాగ్



- 2024-25లో నగరంలో 32.9 శాతం పెరిగిన వాయు కాలుష్య స్థాయిలు
- గత పదేళ్లలో కాలుష్య నియంత్రణకు రూ.129.4 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- ఇప్పటివరకు రూ.39 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన రాష్ట్రం
- వైఎస్సార్ సీపీ హయాంలో కాలుష్య నియంత్రణకు అధిక మొత్తం వినియోగం
- కూటమి అధికారంలోకి వచ్చాక మహా నగరంపై నిర్లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం: మనిషి మనుగడకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన ఆహారం అత్యవసరం. వీటిలో ఏది లోపించినా అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం ఇదే పరిస్థితి. మరి మన మహానగరం విశాఖపట్నం సురక్షితమేనా అంటే, కాదనే సమాధానం వినబడుతోంది. విశాఖలో కాలుష్యం గణనీయంగా పెరిగి, ప్రాణ వాయువు కొరవడుతోంది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా.. దేశవ్యాప్తంగా 130 నగరాల్లో కాలుష్య స్థాయిలు ఎలా పెరుగుతున్నాయనే అంశంపై అధ్యయనం చేసింది. 2024–25లో సంపూర్ణ డేటాని సేకరించి.. నివేదిక విడుదల చేసింది. మొత్తం 130 నగరాల్లో అత్యంత ఎక్కువగా కాలుష్యం పెరిగిన జాబితాలో ఔరంగాబాద్ మొదటి స్థానంలో ఉండగా.. విశాఖ రెండో స్థానంలో ఉంది. కాలుష్యం పెరిగిన నగరాల జాబితాలో విశాఖ రెండో స్థానానికి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, నగర కాలుష్యంపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

2024-25 నుంచి 32.9 శాతం పెరుగుదల

దేశంలో వాయు కాలుష్యం పెరిగిన నగరాల్లో విశాఖపట్నం రెండో స్థానంలో నిలిచిందని జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అధ్యయనం వెల్లడించింది. 2019లో ప్రారంభించిన ఈ కార్యక్రమం, 2017–18 నాటి పీఎం 10 స్థాయిలను ప్రామాణికంగా తీసుకుని అంచనా వేసింది. ఎన్‌సీఏపీ గణాంకాల ప్రకారం, 2024–25లో విశాఖ నగరంలో కాలుష్యం 32.9 శాతం పెరిగింది. ఇది గతంలో ఎన్నడూ లేనంత దారుణమని నివేదిక పేర్కొంది. పీఎం 10 సాంద్రత 101 మైక్రోగ్రామ్స్‌పర్ క్యూబిక్ మీటర్‌కు చేరడం ఆందోళన కలిగించే అంశంగా హెచ్చరించింది. మొదటి స్థానంలో ఉన్న ఔరంగాబాద్‌లో 33.3 శాతం గాలి నాణ్యత క్షీణించింది. విశాఖతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం సహా 13 నగరాల్లో వాయు కాలుష్యం గణనీయంగా పెరిగినట్లు ఈ అధ్యయనం తేల్చింది.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే..

2019లో ప్రారంభమైన కాలుష్య నియంత్రణ ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడ, కర్నూలు, కడప, అనంతపురం సహా 13 నగరాలను ఎంపిక చేశారు. ఈ నగరాల్లో గాలిలో దుమ్ము, వాహన ఉద్గారాలు, పారిశ్రామిక కాలుష్యం నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. విశాఖ నగరానికి ఇప్పటి వరకూ రూ.129.4 కోట్లు కేటాయించారు. ఇందులో గత వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో విడుదలైన రూ.39.6 కోట్లు ఖర్చు చేసి.. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించింది. విశాఖలో ఏప్రిల్ 2017 నుంచి మార్చి 2018 వరకూ పీఎం10 స్థాయిలు 159 నమోదు కాగా.. 2019 డిసెంబర్‌కి ఈ సంఖ్య 108కి చేరింది. 2020 జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ 96కి తగ్గింది. 2021 నాటికి మరింత కాలుష్యం తగ్గి 90కి చేరుకుంది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం కాలుష్యం అమాంతం పెరిగిపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధుల గురించి పట్టించుకోకుండా నగరంపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది.

నగరంలో పీఎం 10 స్థాయిలు

సంవత్సరం	పీఎం10
2018 ఏప్రిల్	159
2019 డిసెంబర్	108
2020 సెప్టెంబర్	96
2021 డిసెంబర్	90
2024 సెప్టెంబర్	101

(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్‌మీటర్)

గతేడాది సెప్టెంబర్‌లో మరింత దారుణంగా...

2024–25 దేశవ్యాప్త అధ్యయనం ప్రకారం విశాఖలో వాయు నాణ్యత మరింత క్షీణించింది. ముఖ్యంగా గత ఏడాది సెప్టెంబర్‌లో పీఎం 2.5 సాంద్రత స్థాయిలు దారుణంగా నమోదయ్యాయి. దేశంలోని టాప్–10 అత్యంత కాలుష్య నగరాల రోజువారీ జాబితాలో విశాఖ పదిసార్లు చోటు దక్కించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. పోర్టు నుంచి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ వరకు అన్నింటి నుంచి కాలుష్యం నగరంలో విస్తరిస్తోంది. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం రోజురోజుకూ పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకపోతే గాలి నాణ్యత మరింత దిగజారి, ఢిల్లీ లాంటి దుర్భర పరిస్థితులు విశాఖలో కూడా తలెత్తుతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



నగరంలో వాయు కాలుష్యం



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,183 మంది స్వామివారిని దర్శించుకోగా 25,906 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

వైభవంగా జనార్దన స్వామి కల్యాణం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం పర్వదినం సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష పూజలు చేసి ఊంజల్ సేవ, చుట్టోత్సం నిర్వహించి అనంతరం పవళింపు సేవ జరిపించారు. అర్చకుడు వంగల పవన్ కుమార్ ఆచార్య ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్

తిరుపతి సిటీ: తిరుపతి టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించిందన్నారు. గత నెలలో న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, రికార్డులు, మౌళిక సదుపాయాలను పరిశీలించారు. కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ తదితర అంశాలపై విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. నేషనల్ బోర్డ్ నిబంధనల మేరకు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తుండడంతో ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చారు.

జీవశాస్త్రంపై ఆసక్తి పెంచాలి

తిరుపతి సిటీ: భవిష్యత్ తరాలకు జీవశాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు అధ్యాపకులు, మేధావులు చొరవ చూపాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు సూచించారు. బుధవారం ఎస్వీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్, సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జీవశాస్త్రం, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో భౌతిక, రసాయన శాస్త్రాల వంటి మూలశాస్త్రాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. జీవశాస్త్రం వంటి కోర్సులను విద్యార్థులు ఆసక్తితో చదవాల్సిన అవసరం ఉందని, అందులో ప్రావీణ్యం సాధించిన అభ్యర్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

పరిశోధనలపై ముగిసిన వర్క్‌షాప్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల చిన్న పిల్లల విభాగం ఆధ్వర్యంలో వైద్య పరిశోధనలపై మూడు రోజులుగా కొనసాగిన వర్క్ షాప్ బుధవారంతో ముగిసింది. కార్యశాలలో భాగంగా నూతన ఆవిష్కరణలపై పలు వైద్య కళాశాలల నుంచి విచ్చేసిన యువ వైద్యులకు రీసెర్చ్ మెథడాలజీపై పరిశోధనాత్మక శిక్షణ నిచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, బెనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసికి చెందిన బయో మెడికల్ పరిశోధకులు డాక్టర్ సంజీవ్ కుమార్, డాక్టర్ గౌరీ బాలచందర్, మినిస్ట్రీ ఆఫ్ హోమో అఫైర్స్ డాక్టర్ తనూ ఆనంద్ పాల్గొన్నారు





పావనకరం పవిత్రోత్సవం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుణ్ణి శాస్త్రోక్తంగా అర్చించటం బ్రహ్మాదులకు కూడా సాధ్యం కానిపని. అలాంటిది సామాన్య మానవులు జరిపే శాస్త్రోక్త విధానమైన భగవత్పూజా విధానం అతిదుస్సాధ్యమని చెప్పొచ్చు. ఎందుకంటే స్వామివారికి జరిగే నిత్యపూజల్లో, ఉత్సవాలలోనూ ద్రవ్య మంత్రతంత్రాది లోపాలు అనేకం చోటు చేసుచేసుకోవడం పరిపాటి. ఇలా తెలిసీ తెలియక జరిగిన దోషనివృత్తికి ప్రత్యేకంగా ఉత్సవ రూపాల్లో ఉన్న ఒక ప్రాయశ్చిత్తం చెప్పబడి ఉన్నది. దానికే పవిత్రారోపణం లేక పవి త్రోత్సవం అని పేరు. ఆగస్టు 3 నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరగనున్న సందర్భంగా....

పవిత్రోత్సవం అంటే పరమపవిత్రమైన ప్రాయశ్చిత్త మహోత్సవం. సంవత్సరానికొకసారి ఆలయ పవిత్ర వాతావరణం పునఃస్థాపితం కావడానికి జరిపే ఉత్సవమిది. ఆలయాల్లో సంవత్సర పర్యంత చేసే ఆరాధనలలో జరిగే దోషాలను నిత్య, నైమిత్తిక, కామ్య ఉత్సవాలైన నిత్యారాధనాహోమ (బలి) నివేదన, బలి సమర్పణలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, జ్యేష్ఠాభిషేక, సహస్రకలశ స్నపన, ఆరాధనాదులు, దేశ ప్రజాజనహితార్థం ఆచరించే యజ్ఞ యాగాది క్రియలలో జరిగే మంత్ర, తంత్ర, క్రియా రూప, శౌచ, అశౌచ దోషనివారణకై స్వామికి జరిపించే ఉత్సవం.

ఈ పవిత్రోత్సవంలో పూసలుగా అమర్చబడిన మాలలను ప్రతిష్ఠించి శ్రీస్వామివారికి, ఆలయపరివార దేవతలకు సమర్పించటం ప్రధానఘట్టం. పవిత్ర సూత్రాలను పవిత్రమండపంలోని పీఠంలో ఉంచి వాటిని దర్భకొసలతో కూడిన పంచగవ్యాలతో ప్రోక్షణ చేసి ఆగమోక్త విధానంగా వాటిని ప్రతిష్ఠించి ఉక్త హోమం జరిపి ఉత్సవమూర్తులకు అష్టకలశ స్నపనం జరిపి ధ్వజ ఛత్ర చామర పింఛ నృత్య గేయ సమాయుక్తంగా ఆచార్యుడు ఆలయ ప్రదక్షిణం చేసి దేవదేవుణ్ణి విశేషంగా అర్చించి అష్టోత్తరశత పవిత్ర సూత్రాలను జాను పర్యంతం సమర్పించడం ఉత్తమం. చతుః పంచాశత్ (54) సూత్రములను ఊరువుల వరకు సమర్పిస్తే మధ్యమం. సప్తవింశతి (27) సూత్రాలను నాభ్యంతం సమర్పిస్తే అధమం అని ఆగమోక్తం. వీటిలో యథాశక్తి సమర్పించాలి. పవిత్రములను ఈవిధంగా దేవ దేవునికి ఆరోపణ చేయటమే పవిత్రారోపణం. ఇదే విధంగా పరివారదేవతలకు కూడా ఒక్కొక్కరికీ సమర్పించాలి. ముందుగా అంకురార్పణ చేయాలి. ఇది దాదాపు అన్ని ప్రధాన ఆలయాలలోనూ సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా జరిపించవలసిన ఉత్సవం.

తిరుమలలో వేంచేసి ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆశ్రితజన వత్సలుడు అయిన శ్రీమన్నారాయణునికి వైఖానసాగమోక్తంగా జరిగే ఈ పవిత్రోత్సవం భక్తితో చేయించినా, కళ్లారా దర్శించినా భక్తులు సర్వపాపాల నుంచి విముక్తి పొంది యశస్సు, సంపద, సంవత్సరార్చన ఫలం, విష్ణుసాయుజ్యం, అశ్వమేధయాగ ఫలం, సర్వోపద్రవనివారణయేగాక సర్వాభీష్టఫలాలు పొంది నిర్వృతులై, ధర్మ తత్పర నిష్ఠాగరిష్ఠులై సుఖిస్తారని భృగు సంహిత చెబుతోంది.

పవిత్రోత్సవం అనే మాటకు పవిత్రీకరణ కార్యక్రమమని పేరు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు వ్రేలికి దర్భతో చేయబడిన పవిత్రం ధరించి కార్యక్రమం జరపడం అలవాటు. దీనివల్ల కార్యక్రమానికి మానసికంగా యజమానికి నిర్మలతత్త్వం చేకూరుతుందనేది సంప్రదాయం.

ఆలయాల్లో పవిత్రోత్సవం ఏడాదికొక పర్యాయం ఆలయపవిత్ర వాతావరణం పునఃస్థాపితమయ్యేందుకు జరుగుతుందని చెప్పుకున్నాం కదా... ఐతే ఇది బ్రహ్మోత్సవాది సందర్భాల్లో, అంతకు ముందు బలిపీఠాల వద్ద, మూలబేరం వద్ద జనసమ్మర్దం వల్ల ఏర్పడిన కాలుష్యాన్ని పోగొట్టేందుకు జరిపే సంప్రోక్షణం కన్నా భిన్నమైంది. దానికి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అని పేరు. పవిత్రోత్సవంలో మంత్ర, వేద, పురాణపారాయణాది కార్యక్రమాల ద్వారా భగవానుడే లేదా మూలమూర్తే విద్యుదుత్పాదక యంత్రంగా పనిచేయడం జరుగుతుంది.

ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో తిరుమల వేంకటేశ్వర స్వామి వారి వార్షిక పవిత్రోత్సవం వైభవోపేతంగా జరుగుతుంది. ఈ రోజుల్లో శ్రీవేంకటేశ్వర స్వామి, ఆయన దేవేరులతోపాటు ఉత్సవ విగ్రహాలు ఆలయ కల్యాణ మండపంలోని యాగశాలలో ఉంచబడి ఉత్సవానంతరం పూర్ణాహుతి అయిన తర్వాత మరల ఆలయప్రవేశం గావించబడతాయి. ఈ దినాల్లో శాస్త్రోక్తంగా హోమాది కార్యక్రమాలు నిర్వర్తిస్తారు.

మొదటిరోజున పట్టుపోగులతో తులసిపూసలు లేదా తామరతూడు సరంలా కనిపించే పవిత్రాలను యాగశాలలో ఉంచుతారు. రెండవరోజున శాస్త్రోక్త మర్యాదలతో ఈ పవిత్రములను శ్రీవారి ఆలయానికి, బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి నడుమగల ప్రధాన ఇతర పరివారదేవతలకు సమర్పించటం జరుగుతుంది. మూడవ రోజున పవిత్ర విసర్జనం జరుపబడి పూర్ణాహుతితో ఉత్సవం సమాప్తమవుతుంది.

చారిత్రకంగా ఈ పవిత్రోత్సవం 15వ శతాబ్దంలో అమల్లో ఉన్నట్లు తెలుస్తోంది. తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆలయ పవిత్రతను కాపాడటానికి, ఏడాది పొడవునా జరిగే అర్చనలు, ఉత్సవాలలో యాత్రికుల లేదా సిబ్బంది వల్ల తెలియకుండా జరిగే దోషాలను నివారించడానికి వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తారు.

శ్రావణ శుద్ధ ఏకాదశినాడు ఉత్సవ మూర్తిని తిరుమామణిమండపంలో వేంచేపు చేస్తారు. ద్వాదశినాడు తలకు, మెడకు, మణికట్టుకు తిరుపవిత్రంతో అలంకరించి దేవేరులతో కూడా ఊరేగింపు జరుపుతారు. శ్రావణ శుక్ల ద్వాదశి విష్ణు పవిత్రారోపణ దినంగా తులసి పెంచటానికి ఉపయోగించే భూమిలో పెరిగిన ప్రత్తి చెట్లనుండి తీసిన దారంతో ఈ పవిత్రం చేస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అన్నప్రసాద నివేదన తప్పకుండా జరుగుతుంది. ఈ పవిత్రోత్సవాలను ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజమాసాల్లో శుక్లపక్షంలోని పాడ్యమి, విదియ, పంచమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, పౌర్ణమిల్లో భరణి, రోహిణి, పునర్వసు, పుష్యమి, హస్త, స్వాతి, రేవతి, శ్రవణం మొదలైన నక్షత్రాల్లో ఆచరించాలని పాంచరాత్రాగమం చేస్తోంది.


ఈ పవిత్రోత్సవాల్లో ఉపయోగించే పవిత్రాలు బంగారు, వెండి, రాగి, మృణ్మయం, పత్తి, ముంజ గడ్డి, దర్భ, పట్టు మొదలైన వాటితో చేస్తారు. అలా చేసిన పవిత్రాలను ఆచార్యుడు స్వీకరించి, పంచగవ్యాదులతో ప్రోక్షించి, ఆ ఆలయాగమాన్ననుసరించి పవిత్రాలకు యజ్ఞ ఆరాధనాదులను పూర్తి చేస్తారు.

వీటిని స్వామికి సమర్పించడంవల్ల సర్వులకూ ఆయుః క్షేమాభివృద్ధి కలుగుతుంది. శ్రీమన్నారాయణారాధనను అత్యంత భక్తి శ్రద్ధలతో సంవత్సర కాలం చేస్తే కలిగే ఫలితమంతా పవిత్రారోపణమాచరిస్తే కలుగుతుందని ప్రతీతి.

ఈ పవిత్రోత్సవం మహాప్రాయశ్చిత్తం కాబట్టి ప్రతీ సంవత్సరం చేయాలి. ఈ ఉత్సవం అలా ఆచరించకున్నా పరమాత్మకు ఆ సంవత్సరకాలం చేసిన ఆరాధనమంతా నిష్ఫలమవుతుంది. అందువల్ల ఈ ఉత్సవాన్ని ప్రతిసంవత్సరం ఆచరించాలని ఆగమశాస్త్రాలు చెప్తున్నాయి.

ఈ కార్యక్రమంలో ఉత్సవ విగ్రహాల్ని యాగశాలలో ఉంచడం, ఆ తర్వాత రోజు పవిత్రాలు యాగశాలలో ఉంచడం, తర్వాత పవిత్రసమర్పణం, పూర్ణాహుతి జరిపి ఉత్సవాలకు స్వస్తి వాచకం పలుకుతారు.

డి.వి.ఆర్. భాస్కర్





కార్యక్రమాలు..

హోమాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్ర మండపంలోని యాగశాలలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణలు చేస్తారు.

ముఖ్య ఉద్దేశ్యం...

ఏడాది పొడవునా జరిగిన దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా ఆగమశాస్త్రం ప్రకారం ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.

ఎప్పుడు ప్రారంభం...

ఈ పవిత్రోత్సవాలు హిందూ క్యాలెండర్ ప్రకారం శ్రావణ మాసంలోని ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి ముఖ్యమైన రోజులలో మూడు రోజుల పాటు జరుగుతాయి. ఉత్సవాలకు ముందు రోజు 'అంకురార్పణం'తో ప్రారంభమవుతాయి. ఇందులో నవ ధాన్యాలను మట్టి పాత్రలలో విత్తుతారు.

● నిర్మల వాణి

కటాక్ష నిరీక్షణా...

ఆమె ఒక్క కంటి చూపుతో మొత్తం బ్రహ్మాండాన్ని సృష్టించ గలదు. అదే ఒక్క కంటి చూపుతో మొత్తం బ్రహ్మాండాన్ని నాశనమూ చేయగలదు. అందుకే ఆమెను 'కటాక్ష కటాక్ష నిరీక్షణ' అని వర్ణిస్తారు.

మనం ఆమె మాయలో ఎంత లోతు మునిగి ఉన్నామనేది తెలుసుకోవాలంటే మనకు మనం చిన్న పరీక్ష పెట్టుకోవచ్చు. మనం కళ్ళు మూసుకొని ఏ విధమైన ఆలోచనలూ లేకుండా ఆ తల్లి మీదనే మన చిత్తాన్ని ఉంచి, ఎంత సమయం ఉండగలమనేది చూసుకుంటే, మనం ఆ తల్లి మాయలో ఎంత లోతుగా చిక్కుకొని ఉన్నామనేది అర్థమవుతుంది. ఈ ఆలోచనలే ఆమె సృష్టించే మాయ. ఈ ఆలోచనలు లేకుండా ఉండడమనేది ఒక సామాన్య మానవునికి కేవలం నిద్రలో మాత్రమే సాధ్యమవుతుంది. మెలకువగా ఉంటూ ఆలోచనలు లేకుండా ఉండగలిగితే, ఆ స్థితిని నిర్విచార స్థితి అంటారు. మనం అంతర్ముఖులమై ధ్యానమగ్నులమైనప్పుడు, మన లోపల కుండలినీ శక్తి ఆజ్ఞా చక్రాన్ని దాటినప్పుడు మాత్రమే మానవులు అటువంటి స్థితిని పొందగలరు. అటువంటి స్థితిలో మనం ఏ పనులు చేసినా, వాటి కర్మ ఫలం మనకు అంటదు. నిజానికి ఈ స్తోత్రంలో అమ్మవారిని 1000 నామాలతో స్తుతించడం జరిగింది. మనం ప్రస్తుతం సహజ యోగ పరంగా ప్రాధాన్యత కలిగిన కొన్ని ముఖ్యమైన నామాల భావార్థాలను తెలుసుకుందాం.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

987వ నామం వద్ద అమ్మవారిని 'త్రికోణగా' అని వర్ణిస్తారు. 'త్రికోణగా' అంటే త్రికోణంలో నివసించేది అని అర్థం. మన వెన్నుపాము అడుగున ఉన్న త్రికోణాకారపు ఎముకలో అమ్మ వారు కుండలినీ శక్తి రూపంలో నిద్రాణ స్థితిలో ఉంటారు.



ఈ త్రికోణార ఎముకను వైద్య శాస్త్ర పరిభాషలో 'శాక్రమ్' ఎముక అని పిలుస్తారు. 'శాక్రమ్' అనే పదం 'శేక్రెడ్' అనే గ్రీకు పదం నుండి పుట్టింది. 'శేక్రెడ్' అంటే 'పవిత్రమైన'. 'శాక్రమ్ బోన్' అంటే 'పవిత్రమైన ఎముక' అని అర్థం.

99 వ నామం వద్ద అమ్మవారిని 'మూలాధారైక నిలయా' అనగా మూలాధారమునే నివాసంగా కలిగినది అని కీర్తిస్తారు. మూలాధారం అంటే షట్చక్రాలలో మొదటిదైన మూలాధార చక్రం కంటే కొంచెం పైన ఉంటుంది. ఈ మూలాధారంలో కుండలినీ శక్తి రూపంలో అమ్మవారు నివసిస్తారు. 'కుండల' అంటే సంస్కృతంలో 'సర్పిలాకారం' అనే అర్థం ఉంది. ఈ శక్తి మన వెన్నుపాము అడుగున ఉన్న మూలాధారం అని పిలువబడే త్రికోణాకారపు ఎముకలో మూడున్నర చుట్లు తిరిగి సర్పిలాకారంలో నిద్రిస్తున్న పాములా ఉంటుంది. అందువల్ల దీనికి కుండలినీ శక్తి అనే పేరు వచ్చింది.

110వ నామం వద్ద అమ్మవారిని 'కుండలినీ' అని 111వ నామం వద్ద 'బిసతంతు తనీయసి' అని వర్ణిస్తారు. 'బిసతంతు తనీయసి' అనగా తామరకాడ లోని ప్రోగుల వంటి స్వరూపం కలిగినది అని అర్థం. ఈ కుండలినీ శక్తి అనేక దారపు ప్రోగులు కలిపి పేనిన ఒక త్రాడు వలె ఉంటుంది అని వివరిస్తారు. 597వ నామం వద్ద 'త్రికోణాంతర దీపికా' అని వర్ణిస్తారు. అంటే అర్థం మూడు బిందువులతో ఏర్పడు త్రిభుజం మధ్యన వెలుగుతోంది అని. మన లోపల కుండలినీ శక్తి చల్లని అగ్ని వలె ఉంటుంది.

– డా. పి. రాకేష్

(సహజ యోగ సంస్థాపకురాలు, పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● ఇస్లాం వెలుగు

ఆదుకునే వారికోసం ఆకాశ ద్వారాలు

ఒకసారి దైవప్రవక్త (స) పూర్వ సమాజానికి చెందిన ఒక వృత్తాంతాన్ని వినిపించారు. అదేమిటంటే, ఒక వ్యక్తి ఒక నిర్జన ప్రదేశం గుండా ప్రయాణిస్తున్నాడు. అంతలో అతనికి ఆకాశం నుండి మాటలు వినిపించాయి. తలపైకెత్తి చూశాడు. ఆకాశమంతా నిర్మలంగా ఉంది. కాని మాటలు వినిపించిన ప్రదేశం మాత్రం మేఘావృతమై ఉంది. ఫలానా వ్యక్తి పంటచేనుకు నీటి అవసరం ఉంది. అక్కడ వర్షించమని మేఘాలకు ఆదేశం అందడంతో మేఘాలు అటువైపుకు కదిలాయి. అక్కడ సన్నని వర్షం ప్రారంభమైంది. అది చిన్న కాలువలా తయారై ఆ వ్యక్తి పంట చేను వైపు ప్రవహిస్తోంది. ఆ మాటలు విన్న వ్యక్తి ప్రవహిస్తున్న కాలువను అనుసరిస్తూ.. ఆ ఫలానా అతని చేను దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ ఒక వ్యక్తి చేతిలో పార పట్టుకొని ఆ వస్తున్న నీటి కాలువను తన చేలో పంటకు పెట్టుకుంటూ కనిపించాడు. ఆశ్చర్యంతో ఆ మనిషినే తదేకంగా కొద్దిసేపు చూసి, కాస్త భయం భయంగా అతన్ని సమీపించాడు. అతనితో మాటలు కలిపి పేరేమిటని ఆరా తీశాడు. అదే పేరు. అంతకు ముందు తాను విన్న పేరు. ఆకాశవాణి వినిపించిన పేరు. అతను మరింత ఆశ్చర్యానికి గురై, 'నువ్వు చేసే సత్కార్యాలు ఏమిటి?' అని అడిగాడు.

సమాధానంగా ఆ వ్యక్తి 'ఏముందీ.. నేను పండించిన పంటలో పెట్టుబడి తీసేసి, పంటను మూడు భాగాలుగా విభజిస్తాను. ఒక భాగాన్ని పేదసాదల కోసం ఖర్చుపెడతాను. ఒక భాగం నాకు, నాకుటుంబ పోషణ కోసం ఉంచుకుంటాను. మరోభాగం మరో పంటకు విత్తనంగా వాడతాను. ఇది తప్ప మరేమీ లేదు.' అని చెప్పాడు.



అంటే ఆ వ్యక్తి తన సంపాదనలో ఖచ్చితంగా ఒక నిర్ణీత భాగాన్ని పేదలు, అగత్య పరులకోసం వెచ్చించేవాడు. ఇతరుల కోసం ఖర్చుపెట్టడం అనేది దైవానికి ఎంతగా నచ్చిందంటే, ఏకంగా ఆ వ్యక్తి పేరునే ఉచ్చరిస్తూ, నేరుగా ఆకాశం నుండి అతని పంట చేలోనే వర్షం కురిపించమని మేఘాలను ఆదేశించడం జరిగింది. పరులను ఆదుకునే వారికోసం ఆకాశ ద్వారాలు తెరుచుకోవడం అంటే ఇదే.

అందుకే దైవప్రవక్త ప్రవక్త (స) వారు, పేదసాదలను ఆదుకోవాలని, అనాథలను అక్కున చేర్చుకోవాలని, అగత్య పరుల అవసరాలు తీర్చాలని, రుణగ్రస్తులను రుణ విముక్తులను చెయ్యాలని, అమాయక ఖైదీల విడుదలకు కృషి చెయ్యాలని, ఎవరు ఏవిధమైన కష్టనష్టాల్లో ఉన్నా, బాధల్లో ఉన్నా, వారు తెలిసిన వారయినా, తెలియని వారైనా, బంధువులైనా, కాకపోయినా, అన్ని రకాల రాగ ద్వేషాలకు అతీతంగా వారి కష్టాలు, బాధలు తొలగించే ప్రయత్నం చెయ్యాలని పదే పదే ఉపదేశించారు. ఎవరైతే కష్టాల్లో ఉన్నవ్యక్తి కష్టాన్ని దూరం చేస్తాడో, దేవుడు అతని కష్టాలను దూరం చేస్తాడని ప్రవక్త మహనీయులు బోధించారు.

భూ వాసులపై కరుణ చూపేవారిపై ఆకాశ వాసి కరుణ చూపుతాడని ఆయన చెప్పారు. కనుక అన్నిరకాల సంకుచితాలకు దూరంగా, సమస్త మానవులపై, ప్రాణులపై ప్రేమ, సానుభూతి కలిగి, ఉన్నంతలోనే అగత్య పరులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. దైవం మనందరికీ మంచి బుద్ధిని ప్రసాదించాలని, మనందరిలో సేవా గుణాన్ని నింపాలని మనసారా కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● బౌద్ధ వాణి

ఉత్తమ జాతి కాదు... ఉత్తమ గుణం ముఖ్యం

ఒక జాతిగాని, కులంగానీ, వంశంగానీ మొత్తంగా ఉన్నతోన్నతమైంది ఉంటుందా అనే ధర్మసంశయం ఆనందుణ్ణి పట్టి పీడించసాగింది. ఆనందుడు బుద్ధుని సోదరుడు. భిక్షువై, తన అన్న ఆదర్శాలను పాటిస్తూ, భిక్షు సంఘంలో జీవించాడు. ఆనందుడు ఒకసారి బుద్ధునితో–



''భగవాన్! మీరు సింధూ దేశంలో మేలు జాతి సైంధవ అశ్వాలు ఉంటాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో శ్రేష్ఠమైన వృషభాలు జన్మిస్తాయని చెప్పారు. మేలు జాతికి చెందిన ఛద్దంతి ఏనుగులు ఏనుగుల్లో ఉత్తమమైనవని సెలవిచ్చారు. అలాగే ధాన్యాల్లో, ఫలాల్లో, వృక్షాల్లో ఉత్తమ జాతి గురించి వివరించారు. కానీ, ఉత్తమమైన మానవ జాతి గురించి, ఆ జాతి జీవించే ప్రదేశాలూ, దేశాలూ, వంశాలూ, జాతుల గురించి చెప్పనే లేదు?' అని ప్రశ్నించాడు.

దానికి బుద్ధుడు– ''ఆనందా! అలాంటి ప్రత్యేక జాతులూ, వంశాలు మానవుల్లో ఉండవు. ఒకే గుణాన్ని అందిపుచ్చుకునే వంశంగానీ, జాతిగానీ, కులంగానీ ఉండవు. ఉత్తముడైన వాడు ఎక్కడో ఒకచోట జన్మించవచ్చు. అలా ఒక ఉత్తముడు జన్మించడం వల్ల ఆ వంశానికో, జాతికో కీర్తి సంతోషాలు కలగవచ్చు. అంతేకానీ, ఉత్తమమైన జాతిగానీ, అధమమైన జాతిగానీ మనుషుల్లో ఉండవు'' అని చెప్పాడు.

జంతువులు తమ బలాల్ని బట్టి ఉత్తమమైనవి ఎంచబడతాయని, మనుషులు బలాన్ని బట్టిగాక, గుణాల్ని బట్టి ఎంచబడతారనే బుద్ధ సందేశాన్ని ఆనందుడు గ్రహించాడు.

జాత్యహంకారులకు ఈ బుద్ధప్రబోధం పెద్ద కనువిప్పు.

– డా. బొర్రా గోవర్ధన్


● ధర్మసందేహం

వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు?

సాధారణంగా వరలక్ష్మీ వ్రతాన్ని శ్రావణ పున్నమి ముందు శుక్రవారం చేసుకోవాలన్నది సంప్రదాయం కనుక ఆగస్టు 1 శుక్రవారం చేసుకోవాలా? లేక ఆగస్టు 8న వచ్చే శుక్రవారం చేసుకోవాలా... అన్న సందేహం సహజం. చాలామంది పంచాంగకారులు 8వ తేదీని పున్నమి అయినా ఆ వేళే చేసుకోవాలని నిర్ణయించారు. అయినా మనకు గ్రంథ ప్రమాణం, సంప్రదాయ వేత్తల ఉపదేశ ప్రమాణమూ కావాలి కనుక వ్రతనిర్ణయ కల్పవల్లి అనే గ్రంథం

శ్రావణస్య సితేపక్షే పూర్ణిమోపాంత భార్గవే
వరలక్ష్మీ వ్రతం కార్యం మోక్షసంపత్ ఫలప్రదమ్

అని భవిష్యోత్తర పురాణోక్తిని ఉట్టంకిస్తూ చెప్పింది కాబట్టి మంచి సంపద, మోక్షమూ కలిగించే వరలక్ష్మీ వ్రతం శ్రావణ మాస శుక్లపక్షంలోని పున్నమికి దగ్గరగా ఉన్న శుక్రవారం నాడు చేసుకోవాలన్నదే నిర్ణయంగా చెప్పబడింది.



ఒకవేళ పున్నమిరోజునే శుక్రవారం వస్తే.. ఆ రోజే వరలక్ష్మీ వ్రతం చేసుకోవాలి.

ఈ మేరకు ఈ ఆగస్టు 8నే వరవలక్ష్మీవ్రతం చేసుకోవాలనే సంకేతం కదా!

ఒకవేళ ఏ కారణం చేతనైనా 8 వతేదీ ఆటంకం కలుగుతుందేమో అని అనుకొనే వారు ఆగస్టు 1న వచ్చే రెండవ శుక్రవారం కూడా వరలక్ష్మీ వ్రతం చేసుకోవచ్చు.

● సువార్త

యేసు ప్రేమ ఒక అత్యున్నత నాయకత్వ లక్షణం

యేసు ప్రేమ ఒక అత్యున్నత నాయకత్వ లక్షణం. ఇట్టి సాహసోపేత ప్రేమకు లోబడనివారంటూ ఉండరు. శత్రువును సైతం ప్రేమించి క్షమించే నైజమే క్రీస్తు యేసు ప్రత్యేకత. ఈ రాజస ప్రేమ వైభవం గూర్చి వివరించడం ఎవరి తరం కాదు. ఇంతగా మానవాళిని ప్రేమించిన క్రీస్తు వద్దకు నేరుగా వెళ్ళి అదే అడిగితే ఆయన ఇలా అంటున్నాడు. 'ఈ ప్రేమ నాది కాదు, ఇది పరమ తండ్రి ప్రేమ. నా తండ్రి ప్రేమ నాలో ఉండబట్టే ఇలా ప్రేమించగలుగుతున్నాను'

యేసు ప్రేమతో ప్రపంచ యాత్ర పేరిట ఈ లోక రాజ్యాలను జయించే సాహసానికి ఎవరైనా పూనుకోవచ్చు. ఎప్పుడూ తీరిగ్గా కూర్చొని అనుకూలంగా ఆలోచనలు చేసే ఎవరికైనా తెలిసొచ్చేది ఏమంటే, 'ప్రేమ సానుకూలతలను, ఆత్మవిశ్వాసాన్ని అధికంగా పెంచి దీటుగా అపజయాలను ఎదుర్కొని శక్తిమేర వాటిని ప్రతిఘటించి అడ్డగిస్తుంది. అది కూడా ప్రేమతోనే యుద్ధం చేస్తుంది. యేసు ప్రేమ లాంటి ప్రేమకే ఇది సాధ్యం' అనేదే.



ప్రేమ దేవునిది దేవుని నుండి కలిగేది కాబట్టి తోటి పొరుగు వానిని, ఈ సమాజాన్ని దేవుని ప్రేమతో ప్రేమించేవారే దేవున్ని ఎరుగుతారు. అలాగే ప్రేమించే వారే దేవుని వలన పుడుతున్నారు (యోహాను 1:13, 1యోహాను 4:7). వీరంతా ఆత్మ సంబంధంగా దేవుని వలన కొత్తగా జన్మిస్తున్న వారుగా గ్రంథం పేర్కొంటుంది. దేవుని ద్వారా పుడుతూ, ప్రేమించుటను బట్టి దేవున్ని ఎరిగే ఈ రెండు లక్షణాలు కలవారే నాయకత్వంలో మెరుగ్గా రాణిస్తారు.

అన్నార్తులు, వస్త్రహీనులు, నిరాశ్రయులు, అనాథలు, రోగులు, ఖైదీలు, విధవరాండ్రు, వద్ధులు, పామరులు, పాపులను పరామర్శిస్తూ వారిని ఆదరించడం స్వస్థపరచడం ధైర్యపరచడం సమాధానపరచడమే కాక, వారికి ఆత్మ సంబంధ జ్ఞానం పంచడం వారిని పవిత్ర పరచడం అనేవి దైవ స్వభావపు లక్షణాలు(మత్త 25 : 34 – 40, యాకోబు1:27). బాధితులను పరామర్శించి ధైర్యం నూరిపోయడం, అక్కడ అంతటా ఆశావహుల వాతావరణం ఏర్పాటు చేస్తూ సానుకూల పరిస్థితులు సృష్టించడం నాయకుల బాధ్యత. ఇలా చేయుటకు, చురుక్కు తగ్గ చొరవతో కాస్త ముందడుగు వేయుటకు మంచి సహృదయతే కాక దేవుని నడిపింపు తప్పనిసరి. అయితే అందుబాటులో సైకిలో, స్కూటరో, కారో లేకుంటే రెండు కాళ్ళు ఉన్నాయని గుర్తుంచుకోక తప్పదు. ఎందుకంటే, నడక నాయకత్వ లక్షణం కూడా. అవసరమైతే నడిచి వెళ్ళయినా బాధితులను పరామర్శించి అతనికి లేదా ఆమెకు పరిచర్య చేయవచ్చు. ఒక యువకుడు తన కాళ్ళకు అందమైన చెప్పులు, ఖరీదైన బూట్లు లేవని దిగులుగా ఉన్నప్పుడు రెండు కాళ్ళు లేక నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తిని చూసి సిగ్గుతో తలదించుకొని దేవున్ని ఘన పరిచాడు.

– జేతమ్

బిజినెస్ రీల్

మోటరోలా నుంచి మోటో జీ86 ఫోన్



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మోటరోలా తాజాగా మోటో జీ86 పవర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. ఇందులో 8జీబీ ర్యామ్, 128 జీబీ మెమరీ వెర్షన్ ధర రూ. 17,699గా ఉంటుంది. అదనంగా రూ. 1,000 బ్యాంక్ డిస్కౌంటు పోగా రూ. 16,999కే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఇందులో 6.67 అంగుళాల పీఓఎల్ఈడీ సూపర్ హెచ్‌డీ ఫ్లాట్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ 7ఐ, 50 ఎంపీ ఓఐఎస్ సోనీ కెమెరా, రెండు రోజుల వరకు సరిపోయే 6720 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, మీడియాటెక్ డైమెన్సిటీ 7400 చిప్ మొదలైన ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో అన్ని లెన్స్‌లతో 4కే వీడియో రికార్డింగ్ చేసే వీలుంటుంది.

పేటీఎం ట్రావెల్ మెగా సేల్



న్యూఢిల్లీ: రాఖీ, జన్మాష్టమి తదితర పండుగల సందర్భంగా ట్రావెల్ మెగా ఫెస్టివల్ సేల్ కింద ప్రయాణికులకు ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు పేటీఎం (వన్97 కమ్యూనికేషన్స్) వెల్లడించింది. దీని ప్రకారం దేశీయంగా విమాన సర్వీసుల్లో 12%, అంతర్జాతీయ రూట్లలో 10%, బస్ బుకింగ్స్‌పై 20 % డిస్కౌంటు పొందవచ్చు. అలాగే యూపీఐ ద్వారా రైలు బుకింగ్స్‌కి పేమెంట్ గేట్‌వే చార్జీలు ఉండవు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్ కార్డుదారులు ప్రత్యేక రాయితీలు పొందవచ్చు. పేటీఎం ద్వారా బుక్ చేసుకున్న రైలు టికెట్లను రద్దు చేసుకుంటే 100% తక్షణ రీఫండ్‌తో, ఉచిత క్యాన్సిలేషన్ అవకాశాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది. జూలై 31 వరకు ఈ ఆఫర్ ఉంటుంది.

ఎమిరేట్స్ ఎన్‌బీడీ నుంచి జోయాలుక్కాస్ భారీ రుణం



దుబాయి: ఎమిరేట్స్ ఎన్‌బీడీ నుంచి 500 మిలియన్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్(ఏఈడీ) రుణాన్ని పొందినట్లు జోయాలుక్కాస్ తెలిపింది. బ్రిటన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా సహా కీలకమైన అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపార విస్తరణకు రుణాల నిధులను వినియోగిస్తామని కంపెనీ తెలిపింది. జోయాలుక్కాస్ వ్యూహాత్మక అవశ్యకతలను తీర్చడం తమ ప్రధాన బాధ్యత అని ఎన్‌బీడీ హోల్‌సేల్ బ్యాంకింగ్ గ్రూప్ హెడ్ అహ్మద్ ఏఐ ఖస్సీమ్ తెలిపారు. తద్వారా జ్యువెలరీ రిటైలింగ్ నిరంతర అభివృద్ధి, అంతర్జాతీయ ప్రమాణాల పెంపునకు తమ వంతు పాత్ర పోషించినట్లు అవుతుందని హర్షం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-7-2025

విశాఖ	455-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	410-00
వరంగల్	552-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LT	3,659.20	4.68
SUNPHARMA	1,736.30	1.51
TATACONSUM	1,076.00	1.36
NTPC	338.3	1.11
MARUTI	12,588.00	0.95

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	668	-3.52
HEROMOTOCO	4,241.00	-1.95
POWERGRID	290	-1.06
BAJAJ-AUTO	8,046.00	-1
CIPLA	1,558.20	-1

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,133
ఎన్ఎస్ఈ	89,523
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,50,278
ఎఫ్ఐఐ	- 850
డీఐఐ	+1,829

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.09	$ 69.21
బ్రెంట్	72.52	$ 71.68

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 8% అప్..



న్యూఢిల్లీ: ఈ ఏడాది (2025) తొలి త్రైమాసికంలో నెమ్మదించిన దేశీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ రెండో త్రైమాసికంలో పుంజుకుంది. మొత్తం స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు పరిమాణంపరంగా ఎనిమిది శాతం, టోకు అమ్మకాలు విలువపరంగా 18 శాతం పెరిగాయి. అత్యధికంగా ఐఫోన్ 16 టోకు అమ్మకాలు నమోదైనట్లు టెక్నాలజీ మార్కెట్ రీసెర్చ్ సంస్థ కౌంటర్‌పాయింట్ తమ నెలవారీ స్మార్ట్‌ఫోన్స్ ట్రాకర్ నివేదికలో తెలిపింది. కొత్త ఫోన్లను ప్రవేశపెట్టడం, మార్కెటింగ్, వేసవిలో అమ్మకాలు పటిష్టంగా ఉండటం, బ్రాండ్లు భారీగా డిస్కౌంట్లు ఇవ్వడం సులభతరమైన ఈఎంఐలు, మిడ్-ప్రీమియం సెగ్మెంట్లలో ప్రత్యేక ఆఫర్లు మొదలైన అంశాలు స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు పెరగడానికి దోహదపడినట్లు వివరించింది. కొనుగోలుదారుల సెంటిమెంట్ మెరుగుపడటంతో అల్ట్రా ప్రీమియం (రూ. 45,000 పైగా రేటు ఉండే ఫోన్లు) సెగ్మెంట్ వార్షికంగా 37 శాతం వృద్ధి నమోదు చేసినట్లు కౌంటర్‌పాయింట్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ ప్రాచిర్ సింగ్ తెలిపారు. దేశీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్..రెండో త్రైమాసికంలో విలువపరంగాను, సగటు విక్రయ ధరపరంగాను (ఏఎస్‌పీ) రికార్డు స్థాయి పనితీరు కనపర్చేందుకు అల్ట్రా-ప్రీమియం సెగ్మెంట్ దోహదపడినట్లు వివరించారు.

వివో టాప్..

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలకు సంబంధించి పరిమాణంపరంగా వివో అగ్రస్థానంలో నిలవగా, విలువపరంగా శాంసంగ్, యాపిల్ అగ్రస్థానంలో ఉన్నట్లు కౌంటర్‌పాయింట్ తెలిపింది. పరిమాణం ప్రకారం వివోకి 20 శాతం, శాంసంగ్‌కి 16 శాతం, ఒప్పోకి 13 శాతం, రియల్‌మీకి 10 శాతం, షావోమీకి 8 శాతం వాటా ఉంది. హోల్‌సేల్ అమ్మకాల విలువపరంగా శాంసంగ్, యాపిల్ చెరి 23 శాతం వాటాతో పోటాపోటీగా టాప్‌లో ఉన్నాయి. వివోకి 15 శాతం, ఒప్పోకి 10 శాతం, రియల్‌మీకి 6 శాతం, వన్‌ప్లస్‌కి 4 శాతం వాటా ఉంది.

ఎన్ఎస్ఈలో ఇన్వెస్టర్ ఖాతాలు 23 కోట్లు



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో ట్రేడింగ్ ఖాతాల సంఖ్య జూలైలో 23 కోట్ల స్థాయిని దాటింది. అకౌంట్ల సంఖ్య ఏప్రిల్‌లో 22 కోట్ల మార్కును దాటగా కేవలం మూడు నెలల్లోనే మరో 1 కోటి అకౌంట్లు జతయ్యాయి. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 4 కోట్ల ఖాతాలు (మొత్తం అకౌంట్లలో 17 శాతం) ఉండగా, తర్వాత స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (2.5 కోట్లు, 11 శాతం వాటా), గుజరాత్ (2 కోట్లకు పైగా, 9 శాతం వాటా), పశ్చిమ బెంగాల్..రాజస్థాన్ (చెరి 1.3 కోట్లు, 6 శాతం వాటా) ఉన్నాయి. మొత్తం ఇన్వెస్టర్ అకౌంట్లలో దాదాపు సగ భాగం వాటా ఈ అయిదు రాష్ట్రాలదే ఉంది. టాప్ 10 రాష్ట్రాల వాటా నాలుగింట మూడొంతులు ఉందని ఎన్ఎస్ఈ వెల్లడించింది. విశిష్ట ఖాతాదారుల సంఖ్య 11.8 కోట్లుగా ఉంది. సాధారణంగా ఒకే ఇన్వెస్టరు పలు బ్రోకరేజీ సంస్థల్లో అకౌంట్లు తీసుకోవచ్చు. ఇన్వెస్టర్లలో యువత, మొదటిసారిగా పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఎన్ఎస్ఈ వివరించింది. డిజిటలీకరణ వేగవంతం కావడం, మొబైల్ ఆధారిత ట్రేడింగ్ సొల్యూషన్స్ విస్తృతంగా వినియోగంలోకి రావడం తదితర అంశాలు ఇన్వెస్టర్ల సంఖ్య పెరగడానికి కారణమని సంస్థ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ తెలిపారు.

రేర్ ఎర్త్ ప్రాసెసింగ్‌లో రాష్ట్రాలూ పాలుపంచుకోవాలి

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ మూలకాలు సహా కీలక ఖనిజాల వెలికితీత, ప్రాసెసింగ్‌లో రాష్ట్రాల ప్రభుత్వాలు చురుగ్గా పాలుపంచుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒక అధ్యయన నివేదికలో తెలిపింది. ఇది క్రిటికల్ ఖనిజాలకు అదనపు విలువను జోడించే వ్యవస్థపరంగా భారత్ స్వయం సమృద్ధిని సాధించేందుకు, ప్రాంతీయంగా ఆర్థికాభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని పేర్కొంది. విద్యుత్ వినియోగాన్ని, డివైజ్‌ల పరిమాణాన్ని తగ్గించగలిగే భౌతిక, రసాయనిక స్వభావాలున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అనేవి నేడు నిర్మాణ, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ తదితర రంగాల్లో కీలకంగా మారినట్లు నివేదిక వివరించింది.



గత నాలుగేళ్లుగా భారత్ ఏటా సగటున 3.3 కోట్ల డాలర్ల విలువ చేసే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, సంబంధిత ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ దిగుమతులు 3.19 కోట్ల డాలర్లకు చేరగా, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ దిగుమతులు మరింత అధికంగా 24.9 మిలియన్ డాలర్లకు చేరినట్లు నివేదిక పేర్కొంది. లాంథనం, ల్యూటీషియం లాంటివి రేర్ (అరుదైన) ఎర్త్ మూలకాల కోవకు చెందుతాయి. వాస్తవానికి ఇవి పుష్కలంగా ఉన్నప్పటికీ, వెలికితీత ప్రక్రియ చాలా సంక్లిష్టమైన వ్యవహారం కావడంతో రేర్ ఎర్త్ మూలకాలుగా పరిగణిస్తారు.

జియో ఫైనాన్షియల్‌కు రూ. 15,825 కోట్లు


ప్రమోటర్ల నుంచి సమీకరణ



న్యూఢిల్లీ: ప్రమోటర్ గ్రూప్ నుంచి రూ. 15,825 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ బోర్డు ఆమోదముద్ర వేసింది. ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా ఈ నిధులు సమీకరించనున్నట్లు కంపెనీ వివరించింది. ప్రస్తుతం అంబానీ కుటుంబంతో పాటు వివిధ గ్రూప్ హోల్డింగ్ సంస్థలకు కంపెనీలో 47.12 శాతం వాటాలు ఉన్నాయి. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 54.19 శాతానికి పెరుగుతుంది. ఒక్కొక్కటి రూ. 316.50 రేటు చొప్పున 50 కోట్ల వరకు వారంట్లను కంపెనీ జారీ చేయనుంది. వీటి ముఖ విలువ రూ. 10గా ఉంటుంది. ఇష్యూ అనంతరం ప్రమోటర్ గ్రూప్‌లో భాగమైన సిక్కా పోర్ట్స్ అండ్ టెర్మినల్స్ వాటా 1.08 శాతం నుంచి 4.65 శాతానికి, జామ్‌నగర్ యుటిలిటీస్ అండ్ పవర్ వాటా 2.02 శాతం నుంచి 5.52 శాతానికి పెరుగుతుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడదీసిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధానంగా ఇన్వెస్టింగ్, ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్ బ్రోకింగ్ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

విద్యుత్‌కు డిమాండ్ అంతంతే..!

- 2025లో దేశీయంగా 4 శాతం పెరుగుతుందని అంచనా
- ఐఈఏ నివేదిక



న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధంలో వేసవి ఉష్ణోగ్రతలు మరీ తీవ్రంగా లేకపోవడంతో విద్యుత్‌కి డిమాండ్ అంతగా ఉండకపోవచ్చని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) అంచనా వేస్తోంది. 2025లో విద్యుత్ వినియోగం 4 శాతం స్థాయిలో పెరగవచ్చని ఒక నివేదికలో తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే 2025-26 వ్యవధిలో, దశాబ్దకాలంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్‌కి డిమాండ్ పెరగనున్నప్పటికీ భారత్, చైనాలో మాత్రం ఇది ఓ మోస్తరు స్థాయికి పరిమితం కావచ్చని వివరించింది. ఐఈఏ ప్రకారం భారత్‌లో గతేడాది విద్యుత్ వినియోగం 6 శాతం పెరగ్గా ఈసారి 4 శాతం స్థాయిలో ఉండనుంది. అలాగే చైనాలో 2024లో వినియోగం 7 శాతం పెరగ్గా ఈ ఏడాది 5 శాతానికి పరిమితం కానుంది. డిమాండ్ నెమ్మదించినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఎలక్ట్రిసిటీ వినియోగ వృద్ధిలో ఈ రెండు దేశాల వాటా, గతేడాది తరహాలోనే, 50 శాతానికి పైగా ఉంటుందని ఐఈఏ తెలిపింది. 'అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల వల్ల భారత్‌లో పారిశ్రామిక కార్యకలాపాలపై ప్రభావం పడింది. అలాగే వేసవి తీవ్రత కూడా పెద్దగా లేకపోవడం వల్ల 2024తో పోలిస్తే 2025 ప్రథమార్ధంలో విద్యుత్ వినియోగం 1.4 శాతమే పెరిగింది. వేసవి ముగిసిపోయినందున, ఇక సెప్టెంబర్‌లో డిమాండ్ మెరుగుపడితే, వార్షికంగా సుమారు 4 శాతం మేర వృద్ధి నమోదు కావచ్చు' అని ఐఈఏ తెలిపింది. పరిశ్రమలు, సేవల కార్యకలాపాలు పుంజుకుని, ఏసీల అమ్మకాలు కూడా పెరగడం వల్ల 2026లో ఎలక్ట్రిసిటీ డిమాండ్ 6.6 శాతం పెరగవచ్చని పేర్కొంది.

రెండేళ్లపాటు 6.4 శాతం వృద్ధి

- భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ విశ్వాసం
- గత అంచనాలు పెంచుతూ నిర్ణయం



న్యూయార్క్: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) భారత ఆర్థిక వ్యవస్థ పట్ల ఆశావహ అంచనాలను ప్రకటించింది. 2025, 2026 సంవత్సరాల్లో జీడీపీ 6.4 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేస్తుందని తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిన అంచనాలను ఐఎంఎఫ్ స్వల్పంగా పెంచడం గమనార్హం. ఈ ఏడాదికి సంబంధించి 0.2 శాతం, వచ్చే ఏడాదికి 0.1 శాతం మేర తాజా అంచనాల్లో ఎగువకు సవరించింది. ఈ మేరకు తన తాజా నివేదికను విడుదల చేసింది. బలమైన వినియోగానికి.. ప్రభుత్వ పెట్టుబడులకు చురుకైన సంస్కరణలు మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొంది. రానున్న కాలంలో ఈ సానుకూల వృద్ధిని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకమని ఐఎంఎఫ్ పరిశోధన విభాగం చీఫ్ డెనిజ్ ఇగాన్ పేర్కొన్నారు. వేగంగా ఉపాధి సృష్టి, నైపుణ్యాల కల్పన ద్వారా వ్యవసాయ రంగంలో అధికంగా ఉన్న కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడంతోపాటు.. మౌలిక వసతులు, వాణిజ్య అడ్డంకులను తొలగించడం భారత్ ముందున్న ప్రాధాన్యతలుగా తెలిపారు. మధ్య కాలానికి భారత్ విద్యపై పెట్టుబడులు పెంచడం, భూ సంస్కరణలు చేపట్టడం, సామాజిక భద్రత కల్పించడం, నిబంధనలు, పాలనా యంత్రాంగం నుంచి అవరోధాలను తొలగించడం కూడా కీలకమేనని పేర్కొన్నారు.

అంతర్జాతీయ వృద్ధి అంచనాలూ పెంపు

వర్ధమాన దేశాల్లో ఆర్థిక వృద్ధి 2025లో 4.1 శాతం, 2026లో 4 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇక చైనా ఆర్థిక వృద్ధి రేటు అంచనాలను సైతం 2025 సంవత్సరానికి 0.8 శాతం పెంచి 4.8 శాతంగా ఐఎంఎఫ్ ప్రకటించింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో బలమైన పనితీరుకు తోడు, అమెరికాతో టారిఫ్‌లు గణనీయ స్థాయి నుంచి తగ్గడాన్ని సానుకూలంగా ప్రస్తావించింది. 2026లో 4.2 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. ఇక అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి అంచనాలను సైతం స్వల్పంగా పెంచి 2025లో 3 శాతంగా, 2026లో 3.1 శాతంగా ఉంటుందని పేర్కొంది.

ఓఎన్‌డీసీ, జెమ్ పోర్టల్‌లో ఇండియా పోస్ట్ సర్వీసులు



న్యూఢిల్లీ: ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ పోర్టల్‌తో అనుసంధానంపై ఇండియా పోస్ట్ కసరత్తు చేస్తుంది. దీనితో పోస్టల్ సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి రాగలవని, థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ కంపెనీలతో పోస్టల్ విభాగం పోటీపడేందుకు వీలవుతుంది. కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో సమావేశమైన సందర్భంగా పోస్టల్ శాఖ అధికారులు ఈ విషయాలను వివరించారు. ఇండియా పోస్ట్ ఐటీ 2.0 ఫ్రేమ్‌వర్క్ కింద ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. రియల్ టైమ్‌లో ట్రాక్ చేసేందుకు, డిజిటల్ చెల్లింపులు మొదలైన వాటికి ఉపయోగపడేలా ప్లాట్‌ఫాంను కొత్తగా అప్‌గ్రేడ్ చేసినట్లు పేర్కొన్నారు.

జేవీలో వాటాల కొనుగోలుకు రెనోకి సీసీఐ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: భారత్‌లో జాయింట్ వెంచర్‌లో భాగస్వామి నిస్సాన్ వాటాలను రెనో గ్రూప్ కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం రెనో నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియాలో జపాన్ సంస్థ నిస్సాన్ సంస్థలకు చెందిన మిగతా 51 శాతం వాటాలను రెనో గ్రూప్ బీవీ, దాని నామిని రెనో ఎస్ఏఎస్ కొనుగోలు చేస్తాయి. రెనో గ్రూప్ బీవీ సంస్థ ప్యాసింజర్ కార్ల డిజైన్, తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, రెనో ఎస్ఏఎస్ సంస్థ విడిభాగాలు, పరికరాల తయారీ నిర్వహణ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

క్యూ1 ఫలితాలు

హ్యుందాయ్ లాభం స్లోడౌన్

రూ. 1,369 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 8 శాతం క్షీణించి రూ. 1,369 కోట్లకు పరిమితమైంది. దేశీయంగా అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,490 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 17,568 కోట్ల నుంచి రూ. 16,628 కోట్లకు వెనకడుగు వేసింది. ఈ కాలంలో 6 శాతం తక్కువగా 1,80,399 వాహనాలకు విక్రయించింది. గత క్యూ1లో 1,92,055 యూనిట్ల అమ్మకాలు సాధించింది. వీటిలో దేశీ విక్రయాలు 11 శాతం క్షీణించి 1,32,259 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ1లో 1,49,455 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎగుమతుల్లో 3 శాతం వృద్ధి సాధించినట్లు కంపెనీ పేర్కొంది. 1.5 లక్షల యూనిట్ల సామర్థ్యంతో ఏర్పాటైన పుణే ప్లాంటులో ఇంజిన్ల ఉత్పత్తి ప్రారంభమైనట్లు తెలియజేసింది. మొత్తం అమ్మకాలలో ఎస్‌యూవీలు 68 శాతం వాటా ఆక్రమించినట్లు తెలియజేసింది. కంపెనీపై రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ కొరత ప్రభావం లేదని స్పష్టం చేసింది. సమీపకాలానికి అవసరమైన స్థాయిలో నిల్వలున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో హ్యుందాయ్ షేరు బీఎస్ఈలో 0.8 శాతం బలహీనపడి రూ. 2,085 వద్ద ముగిసింది.

వరుణ్ బెవరేజెస్ నిలకడైన పనితీరు

- లాభం పైకి, ఆదాయం కిందకు
- వేసవిలో అకాల వర్షాలతో ఆటంకాలు



న్యూఢిల్లీ: పెప్సీకో ఉత్పత్తులను తయారు చేసే వరుణ్ బెవరేజెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నిలకడైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 5 శాతం వృద్ధి చెంది రూ.1,325 కోట్లకు చేరింది. ఆదాయం 2 శాతం క్షీణించి రూ.7,163 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,262 కోట్లు, ఆదాయం రూ.7,334 కోట్లుగా ఉండడం గమనార్హం. అమ్మకాలు 3 శాతం తగ్గి 389.7 మిలియన్ కేసులకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 401.6 మిలియన్ కేసులుగా ఉన్నాయి. జూన్ త్రైమాసికం వ్యాప్తంగా అసాధారణ వర్షాలు అమ్మకాలపై ప్రభావం చూపించినట్టు సంస్థ ప్రకటించింది. దేశీ అమ్మకాలు 7.1 శాతం తగ్గగా, అంతర్జాతీయంగా అమ్మకాలు 15.1 శాతం పెరగడం.. మొత్తం మీద స్థిరమైన పనితీరుకు తోడ్పడింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు ధర 2 శాతం తగ్గి రూ.522 వద్ద ముగిసింది.

టాటా స్టీల్‌కు రెట్టింపు లాభం

జూన్ క్వార్టర్‌లో రూ.2,007 కోట్లు



న్యూఢిల్లీ: టాటాస్టీల్ లాభం జూన్ త్రైమాసికంలో రెట్టింపునకు పైగా పెరిగి రూ.2,007 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.918 కోట్లుగా ఉంది. ఆదాయం ఇదే కాలంలో రూ.55,031 కోట్ల నుంచి రూ.53,466 కోట్లకు తగ్గింది. ముఖ్యంగా వ్యయాలు తగ్గడం లాభాల వృద్ధికి దోహదం చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వ్యయాలు రూ.52,389 కోట్లుగా ఉంటే, తాజాగా ముగిసిన త్రైమాసికంలో రూ.50,347 కోట్లకు తగ్గాయి. వ్యయాలు తగ్గిన మేర లాభం నమోదు కావడం గమనించొచ్చు. ముడి సరుకులకు చేసిన ఖర్చు రూ.18,028 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ.20,642 కోట్లుగా ఉంది. దేశీ మార్కెట్ నుంచి ఆదాయం రూ.32,958 కోట్ల నుంచి రూ.31,014 కోట్లకు తగ్గింది. అంతర్జాతీయంగా ఎన్నో అస్థిరతలు నెలకొన్నప్పటికీ క్యూ1లో పనితీరు ఎంతో మెరుగుపడినట్టు టాటా స్టీల్ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్ తెలిపారు. 25వేలకు పైగా డీలర్లు, పంపిణీదారుల నెట్‌వర్క్ కలిగి ఉండడం, కస్టమర్ల అవసరాలపై దృష్టి సారించడం ద్వారా అధిక విలువ కలిగిన ఉత్పత్తుల అమ్మకాలను పెంచుకోగలిగినట్టు చెప్పారు. కంపెనీ నికర రుణభారం రూ.84,835 కోట్లుగా ఉంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు పెద్దగా మార్పు లేకుండా రూ.161 వద్ద స్థిరపడింది.

పవర్ గ్రిడ్ లాభం డీలా

రూ. 3,631 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 3 శాతం క్షీణించి రూ. 3,631 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 3,724 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 11,280 కోట్ల నుంచి రూ. 11,444 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 6,643 కోట్ల నుంచి రూ. 7,114 కోట్లకు పెరిగాయి. రుణ సమీకరణ పరిమితిని రూ. 16,000 కోట్ల నుంచి రూ. 25,000 కోట్లకు పెంచేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది ఎన్‌సీడీల ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌సహా వివిధ మార్గాలలో రుణాలను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు బీఎస్ఈలో 1.4 శాతం బలహీనపడి రూ. 289 వద్ద ముగిసింది.

అదరగొట్టిన పీఅండ్‌జీ హైజీన్ హెల్త్

రెట్టింపునకు పైగా పెరిగిన లాభం



న్యూఢిల్లీ: ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ హైజీన్ అండ్ హెల్త్‌కేర్ (పీఅండ్‌జీ హైజీన్ అండ్ హెల్త్) లాభం జూన్ త్రైమాసికంలో రెట్టింపునకు పైగా పెరిగి రూ.192 కోట్లకు దూసుకుపోయింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.81 కోట్లుగానే ఉంది. ఇదే కాలంలో ఆదాయం రూ.932 కోట్ల నుంచి రూ.937 కోట్లకు పెరిగింది. విక్స్, విస్పర్ తదితర ప్రముఖ బ్రాండ్లపై ఈ సంస్థ ఉత్పత్తులను విక్రయిస్తుంటుంది. వ్యయాలు 18 శాతం తగ్గి రూ.680 కోట్లకు పరిమితం కావడం లాభాలకు బూస్టినిచ్చింది. ఈ సంస్థ జూలై-జూన్ నుంచి ఏప్రిల్-మార్చి కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా మార్చుకుంటున్నట్టు ఈ ఏడాది జనవరిలో ప్రకటించింది.

మెరుగైన ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు 6 శాతానికి పైగా ఎగసి రూ.13,885కు చేరుకుంది.

హిటాచీ ఎనర్జీ పటిష్టం

రూ.132 కోట్లకు పెరిగిన లాభం



న్యూఢిల్లీ: హిటాచీ ఎనర్జీ ఇండియా జూన్ త్రైమాసికంలో పటిష్ట పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు ఎన్నో రెట్ల వృద్ధితో రూ.132 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.10 కోట్లుగానే ఉంది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,327 కోట్ల నుంచి రూ.1,530 కోట్లకు పెరిగింది. నిర్వహణ సామర్థ్యం పెంచుకోవడంతోపాటు ఆర్డర్లను మెరుగ్గా నిర్వహించడం బలమైన పనితీరుకు సాయపడినట్టు కంపెనీ ప్రకటించింది. జూన్ చివరికి కంపెనీ చేతిలో ఆర్డర్లు రూ.11,339 కోట్లకు పెరిగాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి ఉన్న ఆర్డర్ల విలువ రూ.2,437 కోట్లు.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ధర 5 శాతానికి పైగా లాభపడి రూ.20,825 వద్ద స్థిరపడింది.

వీ గార్డ్ పనితీరు బలహీనం

25 % తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ: ఎలక్ట్రికల్ ఉపకరణాల విక్రయ సంస్థ వీగార్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బలహీన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 25 శాతం తగ్గి రూ.74 కోట్లకు పరిమితమైంది. ఆదాయం సైతం ఇదే కాలంలో ఒక శాతం తగ్గి రూ.1,466 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.99 కోట్లు, ఆదాయం రూ.1,477 కోట్ల చొప్పున ఉన్నాయి.

బీఎస్ఈలో వీగార్డ్ షేరు ధర ఒక శాతానికి పైగా నష్టంతో రూ.381 వద్ద స్థిరపడింది.

తరుణ్ ముందుకు...

- తొలి రౌండ్‌లోనే ఓడిన ప్రణయ్
- ఉన్నతి, ఆకర్షి కూడా నిష్క్రమణ


రక్షిత శ్రీ


తరుణ్

మకావు: మకావు ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి, పారిస్ ఒలింపియన్ లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... హెచ్‌ఎస్ ప్రణయ్, మన్‌రాజ్ సింగ్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, కిరణ్ జార్జి, సతీశ్ కుమార్ కరుణాకరన్, రిత్విక్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తరుణ్ 21–19, 21–13తో సహచరుడు మన్‌రాజ్ సింగ్‌పై, లక్ష్య సేన్ 21–8, 21–14తో జియోన్ హైయోక్ జిన్ (దక్షిణ కొరియా)పై, ఆయుశ్ 21–10, 21–11తో హువాంగ్ యు కాయ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించారు. ప్రపంచ 33వ ర్యాంకర్ ప్రణయ్ 21–18, 15–21, 16–21తో ప్రపంచ 75వ ర్యాంకర్ యోహానెస్ మార్సెలినో (ఇండోనేసియా) చేతిలో... శంకర్ 18–21, 14–21తో హు జె ఆన్ (చైనా) చేతిలో... కిరణ్ జార్జి 15–21, 10–21తో ఎన్జీ కా లాంగ్ అంగస్ (హాంకాంగ్) చేతిలో... సతీశ్ కుమార్ 19–21, 12–21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో, రిత్విక్ 16–21, 8–21తో చికో వర్డాయో (ఇండోనేసియా) చేతిలో ఓటమి చవిచూశారు.

రక్షిత శ్రీ సంచలనం

మహిళల సింగిల్స్‌లో ఆరుగురు భారత క్రీడాకారిణులు బరిలోకి దిగగా... రక్షిత శ్రీ మినహా మిగతా ఐదుగురు తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. తొలి రౌండ్‌లో రక్షిత శ్రీ 63 నిమిషాల్లో 18–21, 21–17, 22–20తో ప్రపంచ 35వ ర్యాంకర్ పోర్న్‌పిచా చోయికివోంగ్ (థాయ్‌లాండ్)ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఉన్నతి హుడా 21–16, 19–21, 17–21తో జూలీ జేకబ్సన్ (డెన్మార్క్) చేతిలో, తస్నీమ్ మీర్ 6–21, 14–21తో టాప్ సీడ్ చెన్ యు ఫె (చైనా) చేతిలో, ఆకర్షి కశ్యప్ 14–21, 16–21తో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్) చేతిలో, అనుపమ 16–21, 10–21తో రికో గుంజి (జపాన్) చేతిలో, అన్‌మోల్ 21–23, 11–21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు.

రుత్విక జోడీకి నిరాశ

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జోడీకి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని–రోహన్ ద్వయం 20–22, 17–21తో వు గువాన్ జున్–లీ చియా సిన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది. తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) జంట ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. తొలి రౌండ్‌లో తనీషా–ధ్రువ్ ద్వయం 21–10, 21–15తో రచాపోల్–నత్తమోన్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గింది. ఇతర మ్యాచ్‌ల్లో హేమ నాగేంద్ర బాబు–ప్రియ (భారత్) 11–21, 14–21తో పువానత్–ఫుంగ్‌ఫా (థాయ్‌లాండ్) చేతిలో ... సతీశ్–ఆద్య (భారత్) 18–21, 21– 23 తో అమ్రీ–నితా (ఇండోనేసియా) చేతి లో... ఆయుశ్–శ్రుతి (భారత్) 10–21, 11– 21 తో రెహాన్–గ్లోరియా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు.




హర్‌దీప్ ‘పసిడి’ పట్టు

గ్రీకో రోమన్ 110 కేజీల విభాగంలో స్వర్ణం సొంతం

- ఈ ఘనత సాధించిన నాలుగో భారతీయ రెజ్లర్‌గా గుర్తింపు
- అండర్–17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్



ఏథెన్స్ (గ్రీస్): అందరి అంచనాలను తారుమారు చేస్తూ... ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత యువ రెజ్లర్ హర్‌దీప్ స్వర్ణ పతకం సాధించి సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన 110 కేజీల విభాగం ఫైనల్లో హర్‌దీప్ 3–3 పాయింట్లతో యజ్దాన్ రెజా డెల్‌రూజ్ (ఇరాన్)పై గెలుపొందాడు. ఇద్దరి స్కోర్లు సమమైనప్పటికీ... నిబంధనల ప్రకారం చివరి పాయింట్ హర్‌దీప్ సాధించడంతో భారత రెజ్లర్‌కు స్వర్ణం ఖరారైంది. యజ్దాన్‌కు రజతం దక్కింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని అందించిన నాలుగో రెజ్లర్‌గా 16 ఏళ్ల హర్‌దీప్ గుర్తింపు పొందాడు. గతంలో వినోద్ కుమార్ (45 కేజీలు; 1980లో).. పప్పూ యాదవ్ (51 కేజీలు; 1992లో)... సూరజ్ (55 కేజీలు; 2022లో) ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం ఆసియా అండర్–17 విభాగంలో చాంపియన్‌గా ఉన్న హర్‌దీప్... తొలి రౌండ్‌లో 2–0తో బక్తూర్ సావెట్‌ఖాన్ (కజకిస్తాన్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–2తో తొమెల్కా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9–0తో అనతోలి నవచెంకో (ఉక్రెయిన్)పై, సెమీఫైనల్లో 4–2తో ఎమ్రుల్లా కప్‌కాన్ (టర్కీ)పై విజయం సాధించాడు. హరియాణాలోని ఝజ్జర్ జిల్లాకు చెందిన హర్‌దీప్ తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ప్రస్తుతం హర్‌దీప్ బహదూర్‌గఢ్‌లోని ‘హింద్ కేసరి’ సోనూ అఖాడాలో ధర్మేందర్ దలాల్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.


అశ్విని

మరో నాలుగు పతకాలు ఖాయం...

ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. మహిళల విభాగంలో భారత రెజ్లర్లు రచన (43 కేజీలు), మోనీ (57 కేజీలు), అశ్విని విష్ణోయ్ (65 కేజీలు), కాజల్ (73 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఈరోజు జరిగే ఫైనల్స్‌లో జిన్ హువాంగ్‌తో రచన... మద్‌ఖియా ఉస్మనోవా (కజకిస్తాన్)తో మోనీ, ముఖాయో రఖిమ్‌జొనోవా (ఉజ్బెకిస్తాన్)తో అశ్విని; వెన్‌జిన్ కియు (చైనా)తో కాజల్ తలపడతారు.

14 ఏళ్ల ప్రపంచ రికార్డు బద్దలు

పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో లియోన్ మర్చండ్ ఘనత



సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఫ్రాన్స్ స్టార్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. బుధవారం జరిగిన 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ సెమీఫైనల్ ఈవెంట్‌ను 23 ఏళ్ల మర్చండ్ 1 నిమిషం 52.61 సెకన్లలో ముగించాడు. ఈ క్రమంలో 14 ఏళ్లుగా అమెరికా మేటి స్విమ్మర్ ర్యాన్ లోచ్టె (1ని:54 సెకన్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును మర్చండ్ బద్దలు కొట్టాడు. సెమీఫైనల్లో తొలుత 50 మీటర్లను (బటర్‌ఫ్లయ్ స్టయిల్) 24.10 సెకన్లలో పూర్తి చేసిన మర్చండ్... తదుపరి 50 మీటర్లను (బ్యాక్‌స్ట్రోక్ స్టయిల్) 28.40 సెకన్లలో ముగించాడు. తర్వాత 50 మీటర్లను (బ్రెస్ట్‌స్ట్రోక్ స్టయిల్) 32.13 సెకన్లలో... చివరి 50 మీటర్లను (ఫ్రీస్టయిల్) 28.06 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈరోజు జరిగే ఫైనల్లో మర్చండ్ తన పేరిట నమోదైన కొత్త ప్రపంచ రికార్డును మళ్లీ సవరించే అవకాశాలు ఉన్నాయి. కొత్త ప్రపంచ రికార్డు సృష్టించిన లియోన్ మర్చండ్‌కు 30 వేల డాలర్లు (రూ. 26 లక్షల 28 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. గత ఏడాది స్వదేశంలో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మర్చండ్ నాలుగు స్వర్ణాలు, ఒక కాంస్యంతో కలిపి ఐదు పతకాలు సాధించి అదరగొట్టాడు. గత రెండు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో (2022, 2023) మర్చండ్ 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో స్వర్ణ పతకాలు సాధించాడు.

హడలెత్తించిన హెన్రీ

- 6 వికెట్లతో మెరిసిన న్యూజిలాండ్ పేసర్
- జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 149 ఆలౌట్
- కివీస్ తొలి ఇన్నింగ్స్ 92/0


హెన్రీ

బులవాయో (జింబాబ్వే): న్యూజిలాండ్ పేసర్లు మ్యాట్ హెన్రీ (6/39), నాథన్ స్మిత్ (3/20) విజృంభణతో తొలి టెస్టులో జింబాబ్వే స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే... తొలి ఇన్నింగ్స్‌లో 60.3 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (116 బంతుల్లో 39; 6 ఫోర్లు), వికెట్ కీపర్ తఫద్జా ట్సిగా (78 బంతుల్లో 30; 5 ఫోర్లు) కాస్త పోరాడగా... మిగిలినవాళ్లు విఫలమయ్యారు. తొమ్మిదేళ్ల తర్వాత న్యూజిలాండ్‌తో ఆడుతున్న తొలి టెస్టులో జింబాబ్వే ప్రభావం చూపలేకపోయింది. బ్రియాన్ బెనెట్ (6), బెన్ కరన్ (13), సీన్ విలియమ్స్ (2), సికందర్ రజా (2) పెవిలియన్‌కు వరుస కట్టారు. న్యూజిలాండ్ బౌలర్లలో హెన్రీ 6 వికెట్లతో విజృంభించగా... నాథన్ స్మిత్ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇటీవల ముక్కోణపు టి20 టోర్నమెంట్ ఫైనల్లో చివరి ఓవర్‌లో అద్వితీయ బౌలింగ్‌తో కివీస్‌ను గెలిపించిన హెన్రీ... సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అదే జోరు కనబర్చాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసింది. ఓపెనర్లు విల్ యంగ్ (69 బంతుల్లో 41 బ్యాటింగ్; 4 ఫోర్లు), డెవాన్ కాన్వే (87 బంతుల్లో 51 బ్యాటింగ్; 8 ఫోర్లు) అజేయంగా నిలిచారు. కాన్వే టెస్టు కెరీర్‌లో 12వ అర్ధశతకం తన ఖాతాలో వేసుకున్నాడు. చేతిలో 10 వికెట్లు ఉన్న న్యూజిలాండ్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 57 పరుగుల వెనుకబడి ఉంది. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా జరగడం లేదు... అంటే ఇందులో గెలిచినా, ఓడినా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో నమోదు కాదు. న్యూజిలాండ్, జింబాబ్వే మధ్య ఇప్పటి వరకు 17 టెస్టులు జరగగా... అందులో 11 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలవగా... మరో 6 టెస్టులు ‘డ్రా’ అయ్యాయి. ఇరు జట్ల మధ్య 2016 తర్వాత ఇదే తొలి టెస్టు కావడం గమనార్హం.

పాక్‌తో పోరుకు భారత్ నిరాకరణ

- సెమీఫైనల్ బరిలోకి దిగేందుకు విముఖత
- వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నమెంట్



బర్మింగ్‌హామ్: ‘వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్’ (డబ్ల్యూసీఎల్) టోర్నమెంట్‌లో భాగంగా దాయాది పాకిస్తాన్‌తో సెమీఫైనల్లో తలపడేందుకు భారత జట్టు నిరాకరించింది. లీగ్ దశలోనూ పాకిస్తాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన భారత స్టార్లు... దాయాదితో మైదానంలో తలపడేది లేదని మరోసారి తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడబోమని... భారత చాంపియన్స్ జట్టు ప్లేయర్లు శిఖర్ ధావన్, ఇర్ఫాన్ పఠాన్, హర్భజన్ సింగ్, యువరాజ్ సింగ్, సురేశ్ రైనా స్పష్టం చేశారు. లీగ్ దశలో పాక్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన భారత్... మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో గెలిచి మూడింట ఓడి 3 పాయింట్లు దక్కించుకుంది. అయితే చివరి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారీ విజయం నమోదు చేసుకున్న భారత్... మెరుగైన రన్‌రేట్‌తో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన పాకిస్తాన్‌తో గురువారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి సెమీఫైనల్లో భారత్ తలపడాల్సి ఉండగా... మన ప్లేయర్లు ఈ మ్యాచ్‌ను సైతం బహిష్కరించారు. మరో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఆ్రస్టేలియాతో ఆడనుంది.

‘హండ్రెడ్’లో ఐపీఎల్ ఫ్రాంచైజీల హవా

- మూడు జట్లతో ఒప్పందం పూర్తి
- త్వరలో మరో జట్టుతో అగ్రిమెంట్
- మొత్తంగా ఆరు ఫ్రాంచైజీల కాంట్రాక్ట్ పూర్తి



లండన్: ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహిస్తున్న ‘హండ్రెడ్’ లీగ్‌లోని ఎనిమిది జట్లలో వాటాల అమ్మకం దాదాపుగా పూర్తయింది. ఆరు జట్లకు సంబంధించి ఒప్పందాలు అధికారికంగా ఖాయం అయ్యాయని, మరో రెండు జట్ల విషయంలో చర్చలు తుది దశలో ఉన్నాయని ఈసీబీ ప్రకటించింది. ఈ రెండు జట్లకు సంబంధించి కూడా కొన్ని చిన్న సాంకేతిక అంశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని, త్వరలోనే ఇది కూడా పూర్తవుతుందని బోర్డు వెల్లడించింది. ఈ ఎనిమిది టీమ్‌లలో నాలుగు టీమ్‌లను ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో జట్లు ఉన్న యాజమాన్యాలే సొంతం చేసుకోవడం విశేషం. టి20 క్రికెట్ నుంచి స్వల్ప మార్పులతో 100 బంతులు ఆడే విధంగా 2021లో ప్రారంభమైన ‘హండ్రెడ్’ లీగ్ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటూ నాలుగు సీజన్లు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు నేరుగా ఈసీబీ ఈ టోర్నీలో ఎనిమిది జట్ల నిర్వహణను పర్యవేక్షిస్తుండగా... ఒప్పందాలు పూర్తయిన తర్వాత అక్టోబర్ 1 నుంచి ఆయా ఫ్రాంచైజీ యజమాన్యాలు నడిపించుకునే విధంగా హక్కులు అందిస్తారు. అయితే అంతకు ముందే ఆగస్టు 5 నుంచి 31 వరకు జరిగే 2025 సీజన్‌ను కూడా ఈసీబీనే నిర్వహిస్తుంది. ‘హండ్రెడ్’లో ఉన్న జట్లలో నార్తర్న్ సూపర్ చార్జర్స్‌ను 100 శాతం వాటాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం సన్ గ్రూప్ సొంతం చేసుకోగా, లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ యజమాని సంజీవ్ గోయెంకా 70 శాతం వాటాతో మాంచెస్టర్ ఒరిజినల్స్‌ను దక్కించుకున్నారు. సదరన్ బ్రేవ్ టీమ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం జీఎంఆర్ గ్రూప్ 49 శాతం వాటాతో తీసుకోగా...ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ కూడా 49 శాతం వాటాతో ఓవల్ ఇన్విన్సిబుల్స్‌లో భాగస్వామిగా మారింది. అయితే ఇంకా రిలయన్స్–ఓవల్ ఒప్పందం అధికారికంగా ఖాయం కాలేదు. ఇదే తరహాలో ట్రెంట్ రాకెట్స్ జట్టుకు సంబంధించి కెయిన్ ఇంటర్నేషనల్ కంపెనీ ఒప్పందం కూడా ఇంకా పూర్తి కాలేదు. మరోవైపు బర్మింగ్‌హామ్ ఫోనిక్స్ టీమ్‌కు నైట్‌హెడ్ క్యాపిటల్ సంస్థ, లండన్ స్పిరిట్ టీమ్‌లో క్రికెట్ ఇన్వెస్టర్ హోల్డింగ్స్ లిమిటెడ్, వెల్ష్ ఫైర్ టీమ్‌లో సంజయ్ గోవిల్ ప్రధాన వాటాదారులుగా ఉన్నారు. ‘హండ్రెడ్’లో ఎనిమిది జట్ల కోసం బయటి వ్యక్తులను భాగస్వాములుగా చేసుకోవడంలో ఈసీబీలో 500 మిలియన్ పౌండ్లు (సుమారు రూ.5,800 కోట్లు) పెట్టుబడుల రూపంలో వచ్చాయి.

లక్నో సూపర్ జెయింట్స్ బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్



లక్నో: టీమిండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ) జట్టుతో చేరనున్నాడు. ఈ సీజన్ వరకు కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో కలిసి పనిచేసిన భరత్ అరుణ్... తాజాగా ఆ జట్టును వీడాడు. బౌలింగ్ కోచ్‌గా అపార అనుభవం ఉన్న భరత్ అరుణ్ సేవలను వినియోగించుకునేందుకు వివిధ ఫ్రాంచైజీలు పోటీ పడగా... లక్నో జట్టుతో చర్చలు సఫలమైనట్లు సమాచారం. ‘అరుణ్ త్వరలోనే లక్నో జట్టుతో చేరనున్నారు. ఈ మేరకు చర్చలు జరిగాయి. అధికారిక ప్రకటన త్వరలోనే వస్తుంది’ అని ఎల్‌ఎస్‌జీ అధికారి తెలిపారు. మంగళవారం కేకేఆర్ హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిత్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టును వీడగా... ఇప్పుడు భరత్ అరుణ్ కూడా అదే బాట పట్టాడు. 2025 ఐపీఎల్ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కేకేఆర్... పేలవ ప్రదర్శనతో పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మరోవైపు రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఈ ఏడాది ఐపీఎల్‌లో ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ తాజా సీజన్‌లో ఎల్‌ఎస్‌జీ మెంటార్‌గా వ్యవహరించాడు. అతడు ఏడాది కాలానికే ఒప్పందం కుదుర్చుకోవడంతో... ముున్ముందు కొనసాగుతాడా లేదా తేలాల్సి ఉంది. ప్రస్తుతం లాంగర్ లక్నో హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

భారత్ X తజికిస్తాన్

న్యూఢిల్లీ: సెంట్రల్ ఆసియా ఫుట్‌బాల్ అసోసియేషన్ (సీఏఎఫ్‌ఏ) నేషన్స్ కప్‌లో భారత జట్టు తొలి పోరులో తజికిస్తాన్‌తో తలపడనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో... డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్, ఆతిథ్య తజికిస్తాన్, అఫ్గానిస్తాన్‌తో కలిసి భారత జట్టు గ్రూప్ ‘బి’ నుంచి బరిలోకి దిగనుంది. ఆసియా కప్–2027 క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్‌కు ఇది సన్నాహకంగా నిలవనుంది. ఈ టోర్నీలో భాగంగా తొలి మ్యాచ్ తజికిస్తాన్‌తో ఆడనున్న టీమిండియా... ఆ తర్వాత సెప్టెంబర్ 1న ఇరాన్‌తో, సెప్టెంబర్ 4న అఫ్గానిస్తాన్‌తో తలపడనుంది. కిర్గిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఒమన్ గ్రూప్ ‘ఎ’ నుంచి బరిలోకి దిగనున్నాయి.



వర్షంలో ఓ మహిళ: శ్రీనగర్ దాల్ సరస్సులో షికారాపై జీవాలకోసం మేత తీసుకెళుతున్న మహిళ



ఆకాశం వైపు ఆశగా: గాజాలో విమానాల ద్వారా జారవిడుస్తున్న ఆహారం కోసం పరుగెడుతున్న అన్నార్తులు



గొర్రెల కాపరి: లద్దాఖ్‌లో జీవాలను ఓ కంట కనిపెడుతూ సేదతీరుతున్న గొర్రెల కాపరి

భద్రతా ఉల్లంఘనల్లో ఎయిరిండియా సెంచరీ

డీజీసీఏ ఆడిట్‌లో వెల్లడైన లోపాలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ విమానయాన సంస్థ ఎయిరిండియాలో దాదాపు 100 భద్రతా ఉల్లంఘనలు జరిగాయని భారత విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించింది. ఎయిర్‌లైన్ గురుగ్రామ్ స్థావరంపై డీజీసీఏ ఈ నెల 1 నుంచి నాలుగువరకు ఆడిట్ నిర్వహించింది. కార్యకలాపాలు, విమాన షెడ్యూలింగ్, రోస్టరింగ్ మరియు ఇతర కీలక విధులను పరిశీలించింది. ఈ సందర్భంగా అనేక ఉల్లంఘనలు గుర్తించినట్లు డీజీసీఏ తెలిపింది. విమానయాన సంస్థ సిబ్బంది శిక్షణ, విధులు, విశ్రాంతి కాల నిబంధనలు, సిబ్బంది సామర్థ్యం, ఎయిర్‌ఫీల్డ్ అర్హత వంటి అంశాల్లో నిబంధనలు పాటించలేదని తేలింది. వీటిలో ఏడు ఉల్లంఘనలను లెవల్-1గా వర్గీకరించారు. ఇవి తక్షణ దిద్దుబాటు చర్య అవసరమయ్యే తీవ్రమైన భద్రతా ప్రమాదాలుగా తెలిపింది. అంతేకాదు.. మార్పులకు అనుగుణంగా బోయింగ్ 787, 777 పైలట్లకు ఎయిరిండియా శిక్షణ ఇవ్వలేదని గుర్తించినట్లు డీజీసీఏ వెల్లడించింది. ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారనే విషయంపై నివేదికను సమర్పించాలని ఎయిరిండియాను ఆదేశించింది.

ఆడిట్ నివేదిక అందింది: ఎయిరిండియా డీజీసీఏ ఆడిట్ నివేదిక తమకు అందిందని ఎయిరిండియా ధ్రువీకరించింది. నిర్ణీత గడువులోగా స్పందిస్తామని తెలిపింది. ''అన్ని విమానయాన సంస్థలకు ఆడిట్‌లు జరుగుతాయి. అందులో భాగంగానే ఎయిరిండియా వార్షిక డీజీసీ ఆడిట్ జూలైలో జరిగింది. ఇందులో కనుగొన్న విషయాలను మేం అంగీకరిస్తున్నాం. నిర్ణీత సమయ వ్యవధిలోపు మా ప్రతిస్పందనను, తీసుకున్న దిద్దుబాటు చర్యలను డీజీసీఏకు సమర్పిస్తాం. ప్రయాణీకులు, సిబ్బంది భద్రతకు మా సంస్థ పూర్తిగా కట్టుబడి ఉంది''అని ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది.

అహ్మదాబాద్ ప్రమాదం తరువాత..

జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ కూలిపోయిన తర్వాత ఎయిర్‌లైన్స్‌పై తీవ్ర పరిశీలన జరిగిన నేపథ్యంలో ఆడిట్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఈ నెలలో 15 పేజీల ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రెండు ఇంజన్‌లకు ఇంధన సరఫరా సెకన్ల వ్యవధిలో ఆగిపోయిందని తెలిపింది. రెండు ఇంధన స్విచ్‌లు కొన్ని సెకన్ల వ్యవధిలో 'రన్'నుంచి 'కటాఫ్'కు మారాయని నివేదిక పేర్కొంది. 'ఎందుకు ఆపేసావు?'అని ఒక పైలట్.. మరో పైలట్‌ను అడగ్గా, తాను అలా చేయలేదని మరో పైలట్ బదులివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో రికార్డయ్యింది.

అల్ ఖైదా ఉగ్రవాది షమా పర్వీన్ అరెస్టు

కర్ణాటకలో పట్టుబడిన 30 ఏళ్ల మహిళ

బెంగళూరు: భారత్‌లో అల్-ఖైదా (ఏఐక్యూఎస్) మాడ్యూల్ కీలక కుట్రదారురాలిని గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. గుజరాత్‌లో ముగ్గురు ఉగ్రవాదుల అరెస్టు తరువాత.. బెంగళూరులో 30 ఏళ్ల షమా పర్వీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పర్వీన్ మొత్తం మాడ్యూల్‌ను నడుపుతున్నారని గుజరాత్ వర్గాలు తెలిపాయి. జూలై 23న గుజరాత్, ఢిల్లీ, నోయిడా నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను మొహమ్మద్ ఫర్దీన్, సెఫుల్లా కురేషి, జీషన్ అలీ, మొహమ్మద్ ఫైక్‌లుగా గుర్తించారు. వీరంతా సోషల్ మీడియా యాప్ ద్వారా సమన్వయం చేసుకుంటున్నారని, దేశవ్యాప్తంగా ప్రముఖ ప్రదేశాల్లో దాడులకు ప్లాన్ చేశారని దర్యాప్తులో తేలింది. దేశం వెలుపల ఉన్న ఉగ్రవాదుల సూచన మేరకు సంప్రదింపులు జరుపుతున్నారని అధికారులు తెలిపారు. భారత్, పొరుగు దేశాల్లో అల్-ఖైదా తన ప్రాబల్యాన్ని విస్తరించడానికి చురుగ్గా ప్రయత్నిస్తుందంటూ ఇటీవల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నివేదికకు ఇది ఊతమిస్తోంది. ఎమిర్ ఒసామా మెహమూద్ నేతృత్వంలోని ఏక్యూఐఎస్.. జమ్మూ కశ్మీర్, బంగ్లాదేశ్, మయన్మార్‌లలో కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి యొక్క 1267 ఆంక్షల కమిటీ తన 32 నివేదికలో వెల్లడించింది.

ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధుల విడుదల

- ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో నిధులు విడుదల చేయనున్న ప్రధాని మోదీ
- సుమారు 9.7 కోట్ల మంది ఖాతాల్లో రూ. 2 వేల చొప్పున జమ
- రూ. 5 వేల కోట్ల ఫసల్ బీమా బకాయిలు
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయ రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద అందిస్తున్న నిధులను ఆగస్టు రెండో తేదీన విడుదల చేయనుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నిధుల విడుదల కార్యక్రమం జరగనుంది. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.7 కోట్ల రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.20,500 కోట్లకు పైగా నిధులను ప్రత్యక్ష బదిలీ విధానం ద్వారా జమ చేయనున్నారు. పీఎం కిసాన్ కింద ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 19వ విడత నిధులను విడుదల చేశారు. 19వ విడతతో ఈ పథకం కింద ఇంతవరకు మొత్తంగా పంపిణీ చేసిన మొత్తం రూ.3.69 లక్షల కోట్లకు చేరగా 20వ విడత నిధులతో ఈ మొత్తం ఏకంగా రూ.3.89 లక్షల కోట్లను దాటనుంది. పంటల ఉత్పత్తిని పెంచడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఉత్పత్తులకు న్యాయమైన ధరలను నిర్ధారించడం లక్ష్యంగా కేంద్రం ఈ నిధులను విడుదల చేస్తోంది. ఈ నిధుల విడుదల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించే అంశమై వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బుధవారం అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. నిధుల విడుదలపై విస్తృత కార్యక్రమాలను నిర్వహించాలని, కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటు కృషి సఖీలు, డ్రోన్ దీదీలు, బ్యాంక్ సఖీ, పశు సఖీ, బీమా సఖీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

ఫసల్ బీమా కింద రూ. 5 వేల కోట్ల బకాయిలు

దేశ వ్యాప్తంగా సకాలంలో పరిహారం అందేలా అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా సంస్థలు రైతులకు రూ.5,405 కోట్ల మొత్తాలను బకాయిపడ్డాయని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా చెప్పారు. బీమా కార్యక్రమంలో పాలుపంచుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు, బీమా సంస్థల మధ్య వివాదాలు, బ్యాంకుల తప్పులు, ఆలస్యమైన బీమా ప్రతిపాదనలు, రాష్ట్రాలు సబ్సిడీ వాటాను ఆలస్యంగా విడుదల చేయడం వంటి కారణాలతో బకాయిలు పేరుకుపోయాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.

43 ఓటీటీలపై కేంద్రం కొరడా

అశ్లీల కంటెంట్‌తో నిండిపోయాయంటూ వాటిని నిషేధించిన కేంద్రం

న్యూఢిల్లీ: అశ్లీలత, అనైతికత, హింసకు పర్యాయపదాలుగా మారుతున్న కొన్ని ఓటీటీ వేదికలపై కేంద్ర ప్రభుత్వం నిషేధ కొరడా ఝులిపించింది. అశ్లీలతతో నిండిపోయి ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఇలాంటి అభ్యంతరకర వీడియోలను కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. అనైతికత, అశ్లీలత, హింసలను విపరీతంగా కుమ్మరిస్తున్న కంటెంట్‌ను ప్రసారం చేసే పలు ఓటీటీ వేదికల నిషేధ పర్వం కొనసాగుతోందని ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఇటీవల 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధించగా ఇప్పటివరకు మొత్తం 43 ఓటీటీ వేదికలను బ్లాక్ చేసినట్లు కేంద్రం బుధవారం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఈ మేరకు ఒక ప్రశ్నకు సమాధానంగా సమాచార, ప్రసార శాఖ, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభకు ఈ విషయం వెల్లడించారు. అశ్లీలత, హింస, సాంస్కృతిక అంశాలపై సున్నితమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు నైతిక, చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఈ 43 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఓటీటీలను చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్రసారం చేసే వేదికలుగా మార్చొద్దని ఆయన అన్నారు. ఐటీ నిబంధనలు, 2021 ప్రకారమే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, స్వీయనియంత్రణ వ్యవస్థలు నడుచుకోవాలని ఫిబ్రవరిలోనే ఒక అడ్వైజరీని జారీచేశామని ఆయన గుర్తుచేశారు. ప్రసారం చేసే కంటెంట్‌ను వయస్సు ఆధారంగా వర్గీకరించాలని లోక్‌సభలో సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ సూచించారు. ఐటీ చట్టంలో నిబంధనల ప్రకారమే ఈ వర్గీకరణ ఉంటుందని ఆయన అన్నారు. పిల్లల వయస్సుకు తగని రీతిలో ఉన్న కంటెంట్‌ను నియంత్రించేందుకు తగిన రక్షణ చర్యలు, యాక్సెస్ నియంత్రణ చర్యలను అమలు చేయాలని ఓటీటీ ప్లాట్‌ఫామ్ యాజమాన్యాలకు ఆయన సూచించారు. చట్టవ్యతిరేక కంటెంట్‌ను ప్రసారం చేసినందుకే 43 ఓటీటీలపై నిషేధం విధించినట్లు ఆయన స్పష్టంచేశారు. సర్వీస్ ప్రొవైడర్లు, ఓటీటీ యాప్‌లు తాము ప్రసారం చేసే సమాచారం, కంటెంట్‌పై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల హెచ్చరికలు జారీచేసిన విషయం విదితమే. గత ఏడాది మార్చిలోనూ ప్రభుత్వం పోర్నోగ్రాఫిక్ కంటెంట్‌ను ప్రసారంచేస్తున్నందుకు 18 ఓటీటీలను నిషేధించింది. బూతు కంటెంట్‌ను తొలగించాలని గత ఏడాది సెప్టెంబర్‌లోనూ ప్రభుత్వం హెచ్చరించింది. బిగ్ షాట్స్, ఉల్లూ, ఏఎల్‌టీటీ, దేసీఫ్లిక్స్, బూమెక్స్, నవరసా లైట్, గులాబ్, కంగన్, బుల్, జల్వా, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్‌ప్రైమ్, ఫెనియో, షోఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టీవీ, హాట్‌ఎక్స్ వీఐపీ, హల్‌చల్, మూడ్‌ఎక్స్, నియాన్‌ఎక్స్ వీఐపీ, ఫుగీ, మోజ్‌ఫ్లిక్స్, ట్రిఫ్లిక్స్ యాప్‌లపై ప్రభుత్వం నిషేధం విధించింది.

చొరబాటుకు ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులు హతం..

- పూంచ్ సెక్టార్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టిన భద్రతా దళాలు
- జమ్మూకశ్మీర్ అంతటా కొనసాగుతున్న భారీ సెర్చ్ ఆపరేషన్

పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి జమ్మూకశ్మీర్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఇద్దరు పాకిస్తాన్ ఉగ్రవాదులు హతమయ్యారు. బుధవారం తెల్లవారుజామున పూంచ్ జిల్లాలోని దేఘ్వార్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వద్ద ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భద్రతా దళాలు.. చొరబాటును భగ్నం చేశాయి. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. భారీ సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. శ్రీనగర్ శివార్లలో జరిగిన ప్రత్యేక ఎన్‌కౌంటర్‌లో ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రధాన సూత్రధారి, అతని ఇద్దరు సహచరులను భద్రతా దళాలు సోమవారం హతమార్చిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో మరణించిన వారిలో పహల్గాం దాడి ప్రధాన సూత్రధారి సులేమాన్ అలియాస్ ఆసిఫ్ కూడా ఉన్నాడు. మరో ఇద్దరు ఉగ్రవాదులను జిబ్రాన్, హంజా ఆఫ్ఘనిగా గుర్తించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఎమ్4 కార్బైన్ రైఫిల్, రెండు ఏకే రైఫిల్స్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. హతమైన ఉగ్రవాదుల మృతదేహాలను స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఇళ్లలోనే ఉండండి

ఉష్ణోగ్రతల పెరుగుదలతో అమెరికన్లకు వాతావరణ శాఖ హెచ్చరిక

న్యూయార్క్: అమెరికా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం, వేడిగాడుల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని నేషనల్ వెదర్ సర్వీస్ హెచ్చరించింది. ప్రధానంగా మిడ్-వెస్ట్, ఆగ్నేయ, ఈశాన్య అమెరికాను ఈ వేడిగాలులు ప్రభావితం చేయనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచుల్ సూచించారు. నగరంలోని లాగ్వార్డియా విమానాశ్రయంలో మంగళవారం మధ్యాహ్నం 37.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జూలైలో ఇది రికార్డు స్థాయి ఉష్ణోగ్రత. 1966 జూలై 3న లాగ్వార్డియా విమానాశ్రయంలో నమోదైన ఆల్-టైమ్ హై ఉష్ణోగ్రత 41.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇక ఫ్లోరిడాలోనూ టంపాలో 37.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 2020లో 37.2 డిగ్రీల సెల్సియస్ నమోదైన తరువాతే.. ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఈ నేపథ్యంలో.. వేడి ప్రమాదకరంగా ఉందని, ప్రాణాంతకం కూడా కావచ్చని ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎక్స్‌లో హెచ్చరించింది. సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. తుఫానుల తరువాత ఈ ప్రాంతం చల్లబడుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో స్విమ్మింగ్ పూల్ పనివేళలు పొడిగించారు. ప్రజలు ఆశ్రయం పొందేందుకు శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మొన్న 'డాగ్ బాబు' ఇప్పుడు 'డాగేశ్'

పట్నా: బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ మొత్తంగా ప్రభుత్వ వ్యవస్థలకే తలనొప్పిగా మారింది. రెవెన్యూ వ్యవస్థలో లోపాలను తనిఖీ చేయాలనుకున్నారో ఏమో తెలియదు! ఓ వ్యక్తి మరో శునకానికి నివాస ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారు. ఇటీవలే 'డాగ్ బాబు'పేరుతో ఓ శునకానికి రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీచేయడం, దీంతో సంబంధిత విభాగంపై విమర్శలు వెల్లువెత్తడం తెల్సిందే. అయితే తాజాగా అదే బిహార్‌లోని నవాడా జిల్లాలో ఉన్న సిర్దాల బ్లాక్‌లో 'డాగేశ్ బాబు'పేరుతో మరో దరఖాస్తు ఆర్టీపీఎస్ కార్యాలయానికి చేరింది. అందులో దరఖాస్తుదారు కాలమ్‌లో కుక్క ఫొటోను చూసి అధికారులు అవాక్కయ్యారు. ఈ విషయం ఏకంగా నవాడా జిల్లా కలెక్టర్ రవి ప్రకాశ్ దృష్టికి వెళ్లింది. రాష్ట్రంలో మరో కుక్కకు స్థానిక నివాస ధృవీకరణ పత్రం కావాలని అభ్యర్థన రావడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు ఈ దరఖాస్తు చేసిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. సరదాగా చేసే ఇలాంటి పనుల వల్ల ప్రభుత్వ వ్యవస్థ సమయం వృథా అవ్వడమే కాదు, అధికారులు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వ సేవల దుర్వినియోగాన్ని సహించబోమన్న కలెక్టర్.. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ నెల 24వ తేదీన మసౌరీ రెవెన్యూ అధికారులు 'డాగ్ బాబు'పేరుతో ఓ శునకానికి నివాస పత్రాన్ని జారీ చేశారు. అందులో 'డాగ్ బాబు'తండ్రిపేరు కుత్తా బాబు, తల్లి పేరును కుతియాదేవిగా పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో తెగ వైరల్ అయ్యింది. స్పందించిన అధికారులు.. విషయం తమ దృష్టికి రాగానే సర్టిఫికెట్ రద్దు చేశామని తెలిపారు. ఈ దరఖాస్తు చేసిన వ్యక్తి, కంప్యూటర్ ఆపరేటర్‌పైనా చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది.

'ధర్మస్థల' కేసులో దొరకని అవశేషాలు

మూడో ప్రాంతంలో తవ్వకాలు ప్రారంభించిన సిట్

బెంగళూరు: కర్ణాటకలోని ధర్మస్థలలో జరిగిన సామూహిక ఖననం కేసులో మొదటి రెండు ప్రాంతాల్లో మానవ అవశేషాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పుడు మూడవ ప్రదేశంలో తవ్వకాలు ప్రారంభించింది. 1995 నుంచి 2014 మధ్యకాలంలో ధర్మస్థలలో పనిచేశానని, మహిళలు, మైనర్లతో సహా అనేక మృతదేహాలను అక్కడ ఖననం చేశానని మాజీ పారిశుధ్య కార్మికుడు చెప్పడం, ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం తెలిసిందే. కార్మికుడు తెలిపిన 15 స్థావరాల వివరాల ఆధారంగా సిట్ ఇప్పటివరకు రెండు ప్రదేశాల్లో తవ్వకాలు చేసింది. ఆ రెండు ప్రదేశాల్లోనూ ఎలాంటి మానవ అవశేషాలు కనిపించలేదు. నేత్రావతి నది వెంబడి ఉన్న మొదటి ప్రదేశంలో మంగళవారం తవ్వకాలు నిర్వహించారు. జేసీబీని ఉపయోగించి లోతుగా తవ్వినప్పటికీ ఎలాంటి అవశేషాలు దొరకలేదు. రెండవ స్థలం కూడా అలాగే ఖాళీగా కనిపించింది. ప్రస్తుతం మూడో ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి. కార్మికుడు చెప్పిన 15 ప్రదేశాల్లో ఎనిమిది నేత్రావతి నది ఒడ్డున, నాలుగు ప్రదేశాలు నదికి సమీపంలోని హైవే పక్కన ఉన్నాయి. 13వ స్థలం నేత్రావతిని ఆజుకురికి కలిపే రహదారిపై, మిగిలిన రెండు హైవే సమీపంలోని కన్యాడి ప్రాంతంలో ఉన్నాయి.

చీఫ్ మార్పు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం: హోంమంత్రి

ఈ కేసు దర్యాప్తులో సిట్ చీఫ్ సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రణబ్ మొహంతీని మార్చే విషయం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేయడానికి డైరెక్టర్ జనరల్ ర్యాంకుల అధికారుల జాబితాలో మొహంతీ పేరు కూడా ఉండటంతో.. మార్పు విషయమై మీడియా మంత్రిని ప్రశ్నించింది. కేంద్రంలో ఉండి కూడా ప్రత్యేక దర్యాప్తు బృందానికి నేతృత్వం వహించే అవకాశం ఆయనకు ఉంటుందని, ఆయనను కొనసాగించాలా? లేదా మరొకరిని నియమించాలా? అనే విషయం రాష్ట్ర ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. చట్టం, నియమాలు అనుమతిస్తే ఆయన అక్కడే కొనసాగుతారని, లేదంటే అదే హోదా కలిగిన అధికారిని నియమిస్తామని పరమేశ్వర స్పష్టం చేశారు. సిట్ దర్యాప్తు గురించి ప్రశ్నించంగా.. 'ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలు చేయను. దర్యాప్తు పూర్తయి నివేదిక అందిన తరువాత మాట్లాడతాను'అని హోంమంత్రి తెలిపారు.

టీఆర్ఎఫ్ ఉగ్రసంస్థపై ఆంక్షలకు ఐరాస రెడీ

తాజా నివేదికలో ఉగ్రవాద సంస్థ పేరును ప్రస్తావించిన భద్రతా మండలి

న్యూయార్క్: పాకిస్తాన్ విషయంలో భారత్‌కు ఒక దౌత్యపరమైన విజయం లభించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)'జమ్మూకశీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసినట్లు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి(యూఎన్‌ఎస్‌సీ) పేర్కొంది. పహల్గాం దాడిని టీఆర్ఎఫ్ స్వయంగా అంగీకరించిందని, అందుకు సంబంధించిన చిత్రాన్ని ప్రచురించిందని యూఎన్‌ఎస్‌సీ తాజా నివేదికలో తెలిపింది. ఆ తరువాత వెనక్కి తగ్గిందని కూడా ప్రస్తావించింది. అయితే.. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా మద్దతు లేకుండా టీఆర్ఎఫ్ ఇంతటి దాడికి తెగించేది కాదని ఐరాస భద్రతా మండలిలోని పర్యవేక్షణా బృందం(ఎంటీ) పేర్కొంది. ఉగ్రవాద గ్రూపులు ప్రాంతీయ ఉద్రిక్తతలకు కారణమవుతాయని హెచ్చరించిన యూఎన్‌ఎస్‌సీ... నిరోధించేందుకు ముందస్తు చర్యలు అవసరమని పేర్కొంది. ఇలా యూఎన్‌ఎస్‌సీ పర్యవేక్షణ బృందం టీఆర్ఎఫ్ గురించి అధికారికంగా ప్రకటించడం ఇదే తొలిసారి. 2019 తరువాత లష్కరే తోయిబా లేదా పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఏ ఇతర ఉగ్రవాద సంస్థ గురించైనా తన నివేదికలో యూఎన్‌ఎస్‌సీ ప్రస్తావించడం ఇదే తొలిసారి. అయితే.. టీఆర్ఎఫ్‌ను ఉగ్రవాద జాబితాలో చేర్చాలంటూ భారత్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత సైతం భారత్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. అయితే.. ఈ ప్రయత్నాలను పాకిస్తాన్ అడ్డుకుంది. అయితే.. ఇటీవల టీఆర్ఎఫ్‌ను నిషేధిత ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చుతూ అమెరికా ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత యూఎన్‌ఎస్‌సీ ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలోనే టీఆర్ఎఫ్‌పై ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. యూఎన్‌ఎస్‌సీ తన నివేదికలో ఒక సభ్య దేశం సూచించినట్టుగా అని పేర్కొనడం గమనార్హం.

భర్త హత్య కేసులో ప్రొఫెసర్‌కు జీవిత ఖైదు

తన కేసు తానే వాదించుకుని సంచలనమైన మమతా పాఠక్

ఛతర్‌పూర్: భర్త హత్య కేసులో కోర్టులో తానే వాదించుకుని సంచలనంగా మారిన మాజీ ప్రొఫెసర్ మమతా పాఠక్‌కు జీవిత ఖైదు పడింది. జిల్లా కోర్టు తీర్పును పునరుద్ఘాటించిన మధ్య ప్రదేశ్ హైకోర్టు 97 పేజీల వివరణాత్మక తీర్పు ఇచ్చింది. రిటైర్డ్ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ నీరజ్ పాఠక్ 2021లో తన సొంత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. మొదట విద్యుత్ షాక్‌తో మరణించారని నమోదు చేసిన పోలీసులు.. పోస్ట్‌మార్టం ఫలితాలు, పరిశోధనల తరువాత అతని భార్య, మమతా పాఠక్‌పై హత్యా అభియోగం మోపారు. ఆమెను దోషిగా 2022లో కోర్టు తేల్చింది. జీవిత ఖైదు విధించింది. అయితే మానసిక వికలాంగుడైన బిడ్డను చూసుకోవడానికి ఆమెకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. జిల్లా కోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా ఆమె మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్పూర్ బెంచ్‌లో అప్పీల్ చేసుకుంది. కోర్టులో తన కేసు తానే వాదించింది. ఆ సందర్భంగా.. వేడి వల్ల కాలిన గాయాలు, విద్యుత్ షాక్‌తో కలిగిన గాయాలు ఒకేలా కనిపిస్తాయని, రసాయన విశ్లేషణ మాత్రమే వాటి తేడాను కనిపెట్టగలదని వాదించారు. ఆమె వాదన కోర్టును దిగ్భ్రాంతికి గురిచేసింది. 'ఆ విషయం చెప్పడానికి మీరు కెమిస్ట్రీ ప్రొఫెసరా?'అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ఆమె అవునని సమాధానం ఇచ్చారు. ఆమె తార్కిక విధానం, అత్యంత ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా వాదించడం, హత్య కేసులో విచారణ ఎదుర్కొంటున్నప్పుడు కూడా ఆమె ధైర్యం కోల్పోకపోవడం వీడియో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించింది. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన కోర్టు మమతా పాఠక్‌కు న్యాయమైన విచారణ జరిగేలా చూసేందుకు సీనియర్ న్యాయవాది సురేంద్ర సింగ్‌ను అమికస్ క్యూరీగా నియమించింది. సుదీర్ఘ చర్చలు, సాక్ష్యాల తరువాత పరిస్థితులు ఆమె నేరం చేసినట్టు స్పష్టంగా ఉందని కోర్టు గమనించింది. సుప్రీంకోర్టు తీర్పులు, న్యాయపరమైన పూర్వాపరాలను ప్రస్తావించిన కోర్టు.. మమతా పాఠక్‌ను దోషిగా తేల్చింది. జీవిత ఖైదు విధించింది.

వరదల కారణంగా దెబ్బతిన్న కారు

మున్సిపల్ కార్పొరేషన్‌కు వ్యక్తి లీగల్ నోటీసులు

ఘజియాబాద్: వరదల కారణంగా తన కారు దెబ్బతిన్నదని, అందుకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మున్సిపల్ కార్పొరేషన్‌కు లీగల్ నోటీసులు పంపించారు. 'జూలై 23న భారీ వర్షాల కారణంగా సాహిబాబాద్, వసుంధర మధ్య రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. నీటిలో నిలిచిపోయిన కారుకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. అందుకు మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత వహించాలి'అంటూ వసుంధర నివాసి అమిత్ కిశోర్ కోర్టుకెక్కారు. వాహనాన్ని నోయిడా సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్తే మరమ్మతుల అంచనా వ్యయం దాదాపు రూ.5 లక్షలు అయ్యిందని, మరమ్మతు ఖర్చులు చెల్లించాలన్నారు. అంతేకాదు.. తాను అనుభవించిన మానసికమైన వేదనకు రూ.5లక్షలు అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సాహిబాబాద్, వసుంధర పరిసర ప్రాంతాలలో డ్రైనేజీని మెరుగుపరచడానికి, మూసుకుపోయిన డ్రెయిన్లను శుభ్రం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నోటీసులో కోరారు. 15 రోజుల్లోపు లిఖితపూర్వక ప్రతిస్పందన ఇవ్వాలని కిషోర్ నోటీసుల్లో హెచ్చరించారు. ఈ సమస్య తన కారు గురించి మాత్రమే కాదని, నగర పౌర మౌలిక సదుపాయాల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుందని కిషోర్ నోటీసుల్లో పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారుడిగా ఈ చట్టపరమైన చర్య ప్రజా ప్రయోజనాల కోసం పోరాటమేనని ఆయన నొక్కి చెప్పారు. అయితే.. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధికారిక స్పందన ఇప్పటివరకు రాలేదు. కానీ, సోషల్ మీడియాలో, స్థానికంగా చర్చనీయాంశమైంది. అనేకమంది అమిత్ కిషోర్‌కు మద్దతుగా నిలిచారు.

అమర్‌నాథ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత

భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం

శ్రీనగర్: పహల్గాం, బాల్తాల్ మార్గాల్లో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. బుధవారం తెల్లవారుజామునుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేసినట్లు జమ్మూ కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధూరి తెలిపారు. రెండు మార్గాల్లోనూ కురుస్తున్న భారీ వర్షాలు బేస్ క్యాంపుల నుంచి యాత్రికుల రాకపోకలను ప్రభావితం చేశాయన్నారు. పరిస్థితి మెరుగుపడేవరకు బాల్తాల్, నున్వాన్ బేస్ క్యాంపుల వైపు ఎలాంటి రాకపోకలను అనుమతించబోని తెలిపారు. ఈ విషయంలో యాత్రికులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తామని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడితే యాత్రను తిరిగి ప్రారంభించే విషయాలను కూడా యాత్రికులకు తెలియజేస్తామన్నారు. జూలై మూడో తేదీన ప్రారంభమైన ఈ యాత్ర ఆగస్టు 9వ తేదీతో ముగియనుంది. ఈ పవిత్ర వార్షిక యాత్ర కోసం ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు వస్తారు. యాత్రికులు రెండు మార్గాల్లో పుణ్య క్షేత్రానికి చేరుకుంటారు. ఒకటి 48 కిలోమీటర్ల పొడవైన పహల్గాం మార్గం కాగా, మరోటి నిటారుగా ఉన్న తక్కువ దూరమైన బాల్తాల్ మార్గం. ఈ ఏడాది ఇప్పటివరకు 3.93 లక్షల మంది యాత్రికులు అమర్‌నాథ్‌ను దర్శించుకున్నారు.

'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

భారతీయ సమాజం
సమాజ శాస్త్ర మౌలికాంశాలు - కులం

1. 'సమాజ శాస్త్రం' (Sociology) అనే పదాన్ని మొదట రూపొందించిందెవరు?
ఎ) సోక్రటీస్ బి) అరిస్టాటిల్
సి) ఆగస్ట్ కోమ్ట్ డి) దుర్క్‌హైమ్
2. 2011 జనాభా లెక్కల ప్రకారం కింది వాటిని జతపరచండి?
1) హిందువులు ఎ) 79.8 శాతం
2) ముస్లింలు బి) 14.2 శాతం
3) క్రైస్తవులు సి) 2.3 శాతం
4) సిక్కులు డి) 1.7 శాతం
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
డి) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి
3. సమాజ శాస్త్రం పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) దుర్క్ హైమ్ బి) మాక్స్ వెబర్
సి) అరిస్టాటిల్ డి) ఆగస్ట్ కోమ్ట్
4. భారతీయ సమాజం వివిధ జాతుల ప్రదర్శన శాల (Ethnological Museum) అని పేర్కొన్నవారు?
ఎ) వి.ఎ.స్మిత్ బి) జిమ్మెల్
సి) పరేటో డి) మాకియవెల్లీ
5. సమాజ శాస్త్రం శాస్త్రీయంగా దేన్ని అధ్యయనం చేస్తుంది?
ఎ) మానవుడిని
బి) మానవ సంఘాలను
సి) వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక సంబంధాలను
డి) పౌరుల హక్కులు, విధులను
6. భారత రాజ్యాంగం ఎన్ని భాషలను గుర్తించింది?
ఎ) 22 బి) 24 సి) 25 డి) 26
7. ది పీపుల్ ఆఫ్ ఇండియా గ్రంథాన్ని ఎవరు రచించారు?
ఎ) మలినో విస్కీ బి) బి.ఎస్. గుహా
సి) రిస్లీ డి) హెడన్
8. సమాజ శాస్త్రం (Sociology) అనే పదం లాటిన్ భాషలోని సొసైటస్(Societus), గ్రీకు భాషలోని లోగోస్(Logos) అనే పదాల నుంచి ఉద్భవించింది. దీని అర్థం?
ఎ) సమాజం, శాస్త్రం
బి) సమాజం, సూత్రాలు
సి) సామూహిత, శాస్త్రం
డి) సామూహికత, శాస్త్రం
9. కింది వాటిలో దక్షిణ భారత సాంస్కృతిక అంశం కానిది?
ఎ) హిందుస్తానీ సంగీతం
బి) జల్లికట్టు సి) యక్షగానం
డి) భరతనాట్యం
10. 'మానవుడు సామాజిక జంతువు' అని చెప్పినవారు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) దుర్క్ హైమ్
సి) హెర్బర్ట్ స్పెన్సర్ డి) అరిస్టాటిల్
11. సమాజం అంటే 'సామాజిక సంబంధాల అల్లిక' అని చెప్పిందెవరు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) మెక్ ఐవర్ డి) మాక్స్ వెబర్
12. పరిణామ సిద్ధాంతాన్ని మొదట ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) దుర్క్ హైమ్ డి) చార్లెస్ డార్విన్
13. 'ది సోషల్ సిస్టమ్' గ్రంథ రచయిత?
ఎ) మార్టన్ బి) పార్సన్స్
సి) కార్ల్‌మార్క్స్ డి) ఆగస్ట్ కోమ్ట్
14. సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్ గ్రంథ రచయిత?
ఎ) రాబర్ట్ కె మర్టన్ బి) రాబర్ట్ పార్క్
సి) రాడ్‌క్లిఫ్ బ్రౌన్ డి) దుర్ఖెయిమ్
15. 'ఎక్కడైతే జీవితం ఉందో, అక్కడ సమాజం ఉంది' అని చెప్పింది?
ఎ) మెక్ ఐవర్ బి) కింగ్స్‌లీ డేవిస్
సి) దుర్క్ హైమ్ డి) మాక్స్ వెబర్
16. సంస్కృతి అంటే?
ఎ) వేషభాషలు, నడవడి విధానం, మతం, కళలు మొదలైన వాటి సమ్మేళనం
బి) శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి
సి) ఒక సముదాయం సాధించిన ఉన్నత అంశాలు
డి) పైవన్నీ
17. 'సోషల్ చేంజ్ ఇన్ మోడర్న్ ఇండియా' అనే గ్రంథ రచయిత?
ఎ) రామ్ అహుజా బి) కుప్పుస్వామి
సి) కేట్కార్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
18. 'ద సోషల్ కాంట్రాక్ట్' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) టానీస్ బి) రూసో
సి) అరిస్టాటిల్ డి) ప్లేటో
19. 'ఇంత వరకు ఉన్న సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రయే' అని పేర్కొన్నవారు? (గ్రూప్-2, 2000 బ్యాగ్‌లాగ్ పోస్ట్)
ఎ) లెనిన్ బి) మావో
సి) కార్ల్ మార్క్స్ డి) హిట్లర్
20. కులం అభివ్యక్తీకరణల్లో అస్పృశ్యతను అతినిక్రృష్టమైందిగా పరిగణించిన వారు? (సీడీపీవో-2013)
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్ బి) సర్దార్ పటేల్
సి) నెహ్రూ డి) గాంధీ
21. 'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) హట్టన్ బి) ఘుర్యే
సి) కుప్పుస్వామి డి) ఎం.ఎన్. శ్రీనివాస్
22. ఉన్నత అంతస్తును సాధించడానికి తొలిమెట్టుగా... ఉన్నత కులాల వారి ఆచారాలు, నమ్మకాలను నిమ్న కులాల వారు సమష్టిగా అవలంభించే ప్రక్రియను ఏ పేరుతో పిలుస్తారు? (సీడీపీవో-2013)
ఎ) ఆధునికీకరణ బి) సంస్కృతీకరణ
సి) పాశ్చాత్యీకరణ డి) నగరీకరణ
23. గ్రామాల్లో కులాల మధ్య సంబంధాలను నియంత్రించే వ్యవస్థ ఏది? (సీడీపీవో-2013)
ఎ) బంధుత్వం బి) వర్గం
సి) స్నేహం డి) జాజ్‌మాని(Jajmani)
24. బ్రహ్మ ఏ అవయవం నుంచి క్షత్రియులు ఆవిర్భవించారు? (సీడీపీవో-2013)
ఎ) పాదాలు బి) తొడలు
సి) చేతులు డి) భుజాలు
25. కుల క్రమానుగత శ్రేణిలో అన్నిటికంటే పై శ్రేణిలో ఉండేవారు? (సీడీపీవో-2013)
ఎ) వైశ్యులు బి) బ్రాహ్మణులు
సి) శూద్రులు డి) క్షత్రియులు
26. 'ది అన్‌టచబుల్స్'అనే గ్రంథాన్ని రాసిందెవరు?
ఎ) శ్రీనివాస్ బి) అంబేద్కర్
సి) ఘుర్యే డి) గాంధీ
27. అస్పృశ్యులను 'హరిజనులని'సంభోదించింది? (సీడీపీవో-2013)
ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
బి) అంబేద్కర్ సి) విద్యాసాగర్
డి) గాంధీ
28. కింది వాటిలో ఏది కుల లక్షణం కాదు?
ఎ) అంతర్వివాహం బి) వృత్తి అనుబద్ధత
సి) ఛాయ(Colour)
డి) సహపంక్తి భోజన కట్టుబాటు



29. ఒక వ్యక్తి కుల సభ్యత్వం దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) అంతస్తు బి) సంపద
సి) పుట్టుక డి) ఆరోగ్యం
30. కులం ఒకే _____ సమూహం.
ఎ) బహిర్వివాహిత బి) సంవృత
సి) అంతర్వివాహిత డి) అనివార్య
31. కులం, వర్గం, అధికారం(Caste, Class and Power) గ్రంథం రచించింది ఎవరు?
ఎ) పి.వి.బెయిలీ బి) ఆంద్రె బీటెల్లీ
సి) ఎం.ఎన్. శ్రీనివాస్
డి) హట్టన్
32. ఎలాంటి అంటరానితనాన్ని అయినా నిషేధించే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్-14 బి) ఆర్టికల్-17
సి) ఆర్టికల్-16 డి) ఆర్టికల్-18
33. కుల వ్యవస్థకు ___ స్వభావం ఉంటుంది?
ఎ) క్రమానుగత శ్రేణి(Hierarchical)
బి) సౌష్ఠవ(Symmetrical)
సి) పరస్పర వ్యతిరేక(Contradictory)
డి) సహకార(Co-operative)
34. కిందివాటిలో కులవ్యవస్థను బలహీన పరచని కారణాలేవి?
ఎ) పారిశ్రామికీకరణ, నగరీకరణ
బి) రవాణా సౌకర్యాలు పెరగడం
సి) రాజ్యాంగం డి) రిజర్వేషన్ పాలసీ
35. కింది వాటిలో కుల వ్యవస్థ లక్షణం కానిది?
ఎ) శుచి- అశుచి
బి) క్రమానుగత శ్రేణి ఆరాధన
సి) క్రమానుగత శ్రేణి
డి) వారసత్వ రీత్యా వచ్చే ప్రత్యేకీకరణ
36. కులస్తరీకరణకు ఇది ఆధారం?
ఎ) పునర్జన్మ
బి) వర్ణాశ్రమ వ్యవస్థ - చతుర్వర్ణాలు
సి) పురుషార్థాలు
డి) మత విభాగం
37. రుగ్వేదంలో పేర్కొనని వర్ణాలు ఏవి?
ఎ) ఆర్య, శూద్ర వర్ణాలు
బి) ఆర్య, దాస వర్ణాలు
సి) బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు
డి) క్షత్రియ, శూద్ర వర్ణాలు
38. భారతీయ కులవిధానం గురించి ప్రస్తావన మొట్టమొదట దేనిలో కనిపిస్తుంది?
ఎ) మహాభారతం బి) ఉపనిషత్తులు
సి) వేదాలు డి) రామాయణం
39. క్యాస్ట్(Caste)అనే పదం ఏ భాషలోని కాస్టా (Casta) అనే పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) స్పానిష్, పోర్చుగీసు బి) జర్మన్
సి) లాటిన్ డి) ఏదీకాదు
40. అస్పృశ్యులు ముందంజ వేయక పోవడానికి కారణం?
ఎ) విజ్ఞాన లేమి బి) నిరక్షరాస్యత
సి) అల్పులమనే భావన
డి) సంప్రదాయ ధోరణులు
41. కుల వ్యవస్థలో లేని అంశం?
ఎ) ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం
బి) శ్రామికులు గతిశీలతను తిరస్కరించడం
సి) వ్యక్తులకు వృత్తులను ఇవ్వడం
డి) సహకారాన్ని అందించడం
42. కుల వ్యవస్థను బ్రాహ్మణులే, బ్రాహ్మణుల కోసం సృష్టించారని పేర్కొన్నవారు?
ఎ) ఆబె దుబాయ్(Abbe Dubois)
బి) జి.ఎస్. ఘుర్యే(G. S. Ghurye)
సి) కేట్కర్
డి) ఎం.ఎన్. శ్రీనివాస్
43. భారతీయ సమాజంలోని స్తరీకరణ రూపం?
ఎ) సామాజిక వర్గం
బి) అంతస్తు సమూహం
సి) ఎస్టేట్ డి) కులం
44. 'ఒకే పేరును కలిగి, ఒకే పూర్వీకుడి సంతతి అని భావిస్తూ ఒకే సజాతీయ సముదాయంగా మెలుగుతూ ఉండే కొన్ని కుటుంబాల మొత్తమే కులం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్
బి) హెర్బర్ట్ రిస్లే
సి) మెకైవర్ డి) హట్టన్
45. వెలికి గురైనవారు(Out castes).. కుల వ్యవస్థాపన ఫలితమే. కుల వ్యవస్థను నిర్మూలిస్తే తప్ప వారిని స్వతంత్రులను చేయలేమని భావించిన వారు?
ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
బి) మహాత్మాగాంధీ సి) కామరాజ్
డి) బి.ఆర్.అంబేద్కర్
46. సరైన క్రమాన్ని తెల్పండి?
1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
3) వైశ్యులు 4) శూద్రులు
ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
సి) 4, 3, 1, 2 డి) 2, 1, 3, 4
47. సంస్కారపరమైన అశుచి (Ritual Pollution) కి ఆధారాలు?
ఎ) జన్మ బి) శరీరం నుంచే వచ్చే వాసనలు
సి) మరణం
డి) జనన, మరణాలు
48. కింది వాటిలో సరికానిది?
ఎ) కులం సంస్కృతి వాహకంగా పనిచేస్తుంది
బి) కులం సామాజిక గతిశీలతను ప్రోత్సహిస్తుంది
సి)కులం రాజకీయాలతో ముడిపడి ఉంటుంది
డి) కులం సామాజిక జీవనానికి కావలసిన ప్రకార్యాలను తీరుస్తుంది.


సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) ఎ; 5) సి;
6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి;
11) సి; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ;
16) డి; 17) డి; 18) బి; 19) సి; 20) సి;
21) డి; 22) బి; 23) డి; 24) డి; 25) బి;
26) బి; 27) డి; 28) సి; 29) సి; 30) సి;
31) బి; 32) బి; 33) ఎ; 34) బి; 35) బి;
36) బి; 37) బి; 38) సి; 39) ఎ; 40) సి;
41) ఎ; 42) ఎ; 43) డి; 44) బి; 45) డి;
46) ఎ; 47) ఎ; 48) బి.

కాస్మిక్ సంవత్సరం దేని ప్రమాణం?

గ్రహాలు
మాదిరి ప్రశ్నలు

1. గ్రీకు భాషలో ప్లానెట్ అనే పదం దేన్ని సూచిస్తుంది?
ఎ) విశ్వంలో ఒక వస్తువు
బి) ఎల్లప్పుడూ తిరుగుతున్న వస్తువు
సి) స్వయం ప్రకాశకత్వం
డి) ఉపగ్రహాలను కలిగింది
2. సూర్యుడు ఏ రకమైన నక్షత్రం?
ఎ) పెద్ద పరిమాణం ఉన్న నక్షత్రం
బి) చిన్న పరిమాణం ఉన్న నక్షత్రం
సి) మరుగుజ్జు నక్షత్రం
డి) మధ్యతరహా పరిమాణం ఉన్న నక్షత్రం
3. సూర్యుడి తర్వాత దగ్గరగా ఉన్న నక్షత్రం?
ఎ) ప్రాక్సిమా సెంటారీ
బి) సీరియస్ సి) QBI-352
డి) మెఘాలినిక్ మేఘం
4. సౌరకుటుంబం కలిగిన మన పాలపుంతకు భారతీయులు పెట్టిన పేరు?
ఎ) శివగంగ బి) పాతాళగంగ
సి) ఆకాశగంగ డి) హిమగంగ
5. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) కోపర్నికస్ బి) టాలమీ
సి) భాస్కరాచార్యుడు
డి) న్యూటన్
6. సౌరకుటుంబాన్ని మొదట పరిశీలించినవారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఐన్‌స్టీన్ డి) పౌల్సన్
7. భూమిపై ఉన్న ప్రతి వస్తువుపైనా గురుత్వ బలం సమానంగా ఉంటుందని నిరూపించిన వారు?
ఎ) కోపర్నికస్ బి) జిల్లెట్
సి) గెలీలియో డి) డాప్లర్
8. బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) జార్జియస్ లైమెట్రీ
బి) హబుల్ సి) గెలీలియో
డి) న్యూటన్
9. ప్రస్తుతం సౌరకుటుంబంలో గుర్తించిన గ్రహాల సంఖ్య?
ఎ) 7 బి) 8
సి) 9 డి) 10
10. భూమికి దగ్గరగా ఉన్న ఖగోళ వస్తువు?
ఎ) సూర్యుడు బి) అంగారకుడు
సి) చంద్రుడు డి) బుధుడు
11. సూర్యుడి నుంచి గ్రహాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఉపయోగించే ప్రమాణం?
ఎ) కాంతి సంవత్సరం
బి) ఖగోళ ప్రమాణం
సి) పార్-సెక్
డి) పైవన్నీ
12. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ మార్గంలో పరిభ్రమిస్తున్నాయి?
ఎ) సరళరేఖ బి) వృత్తాకార
సి) దీర్ఘవృత్తాకార డి) వక్రమార్గం
13. సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం?
ఎ) శుక్రుడు బి) బుధుడు
సి) భూమి డి) శని
14. ధ్రువ నక్షత్రం పేరు?
ఎ) జొడాయిక్
బి) ఎప్సిలాన్ ఆరిగా
సి) పొలారిస్ డి) ఆండ్రోమెడ్
15. హేలీ తోకచుక్క ఎన్నేళ్లకు ఒకసారి కనిపిస్తుంది?
ఎ) 66 బి) 76
సి) 86 డి) 100
16. కిందివాటిలో ఏ గ్రహం పగలు ఎక్కువ వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది?
ఎ) శుక్రుడు బి) అంగారకుడు
సి) బృహస్పతి డి) బుధుడు
17. సౌరకుటుంబంలో పరిమాణంలో భూమి ఏ స్థానంలో ఉంది?
ఎ) 1 బి) 2
సి) 4 డి) 5
18. సౌరకుటుంబంలోని గ్రహాల చలనాలను పరిశీలించిన దేశస్థులు?
ఎ) భారతీయులు బి) చైనీయులు
సి) గ్రీకులు డి) జపనీయులు
19. రెండు గ్రహాల మధ్య దూరం రెండింతలు అయినప్పుడు వాటి మధ్య విశ్వగురుత్వాకర్షణ బలం?
ఎ) రెండు రెట్లు తగ్గుతుంది
బి) రెండు రెట్లు పెరుగుతుంది
సి) నాలుగు రెట్లు పెరుగుతుంది
డి) నాలుగు రెట్లు తగ్గుతుంది
20. ఒక ఇనుపగోళం, అల్యూమినియం గోళాలను ఒకే ఎత్తు నుంచి శూన్యంలో ఒకేసారి జారవిడిచినప్పుడు ఏది ముందుగా కిందికి చేరుతుంది?
ఎ) ఇనుపగోళం
బి) అల్యూమినియం గోళం
సి) రెండూ ఒకేసారి కిందికు చేరుతాయి
డి) రెండూ పైకి వెళ్తాయి
21. ఒక వస్తువు భారం ఎక్కడ ఎక్కువగా ఉంటుంది?
ఎ) భూమి కేంద్రం వద్ద
బి) భూమధ్యరేఖ వద్ద
సి) ధ్రువాల వద్ద
డి) పైవన్నీ
22. ప్రదేశాన్ని బట్టి ఒక వస్తువుకు చెందిన ఏ భౌతికరాశి మారుతుంది?
ఎ) ద్రవ్యరాశి
బి) ఘనపరిమాణం
సి) ఆకారం డి) భారం
23. చంద్రుడిపై గురుత్వ త్వరణం విలువ?
ఎ) $9.8ms^{-2}$ బి) $9.8cms^{-2}$
సి) $1.67cms^{-1}$ డి) $1.67ms^{-2}$
24. భూమిపై పలాయన వేగం?
ఎ) $11.2\ kms^{-1}$ బి) $11.2\ ms^{-1}$
సి) $11.2\ cms^{-1}$ డి) $1.12\ ms^{-1}$



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

25. విశ్వగురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించిన వారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) అరిస్టాటిల్ డి) కోపర్నికస్
26. భూస్థిర ఉపగ్రహం ఆవర్తన కాలం?
ఎ) 24 సెకన్లు బి) 24 నిమిషాలు
సి) 24 గంటలు డి) 24 రోజులు
27. ఇప్పటివరకు కనుగొన్న ఉపగ్రహాల్లో అతి పెద్దది?
ఎ) చంద్రుడు బి) గనిమెడ
సి) యూరోపా డి) ఫోబోస్
28. భూమిని పోలిన ఉపగ్రహం?
ఎ) చంద్రుడు బి) ఫోబోస్
సి) టైటాన్
డి) పైవన్నీ
29. శాస్త్రవేత్తలు ఇటీవల భూమిని పోలిన గ్రహాన్ని కనుగొన్నారు. దానిపేరు?
ఎ) సూపర్ నోవా బి) సూపర్ ఎర్త్
సి) సుప్రీం ఎర్త్
డి) న్యూ ఎర్త్ గ్లోబ్
30. ప్లూటో ఉపగ్రహం చరాన్ గురించి పరిశోధించడానికి ప్రయోగించిన అంతరిక్ష నౌక పేరు?
ఎ) న్యూహారిజాన్ బి) కేసిని
సి) హ్యూగన్స్ డి) స్పిట్జర్
31. మరుగుజ్జు గ్రహం హోదా పొందిన గ్రహం?
ఎ) బుధుడు బి) అంగారకుడు
సి) భూమి డి) ప్లూటో
32. భూమిపై సముద్రంలో ఆటుపోటులు ఏర్పడటానికి కారణం?
ఎ) భూమి, సూర్యుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వార్షణ బలం
బి) భూమి, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
సి) సూర్యుడు, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
డి) భూమి, అంగారకుడి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
33. విశ్వం గురించి అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
ఎ) కాస్మాలజీ బి) ఆస్ట్రానమీ
సి) స్పేస్ డి) జియాలజీ
34. భూమికి ఇతర వస్తువులను ఆకర్షించే గురుత్వాకర్షణ బలం ఉందని వివరించిన తొలి భారతీయ శాస్త్రవేత్త?
ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
సి) బ్రహ్మగుప్తుడు
డి) వరాహమిహిరుడు
35. సూర్యుడిలో పొరలు ఏవి?
ఎ) ఫొటోస్ఫియర్
బి) క్రోమోస్ఫియర్ సి) కరోనా
డి) పైవన్నీ
36. ఏ గ్రహాన్ని ఉదయతార, సాయంత్రం తారగా పిలుస్తారు?
ఎ) అంగారకుడు బి) శుక్రుడు
సి) శని డి) యురేనస్
37. అరుణ గ్రహం అని దేన్ని పిలుస్తారు?
ఎ) శని బి) భూమి
సి) అంగారకుడు డి) బృహస్పతి
38. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం స్థానాన్ని కింది కక్ష్య నుంచి పై కక్ష్యవరకు పెంచినప్పుడు దాని కక్ష్యావేగం?
ఎ) పెరుగుతుంది
బి) తగ్గుతుంది
సి) మారదు
డి) రెండు రెట్లు పెరుగుతుంది
39. బృహస్పతి ఉపగ్రహం పేరు?
ఎ) గనిమెడ బి) యూరోపా
సి) కెలిస్టో డి) పైవన్నీ
40. సౌరకుటుంబంలో గరిష్ఠ సాంద్రత ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) శని
సి) బృహస్పతి డి) బుధుడు
41. సంవత్సర కాలవ్యవధి తక్కువగా ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) బుధుడు
సి) యురేనస్ డి) శని
42. భూస్థిర ఉపగ్రహాలను భూమి కేంద్రం నుంచి ఎన్ని కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు?
ఎ) 3,600 కి.మీ. బి) 36,000 కి.మీ.
సి) 42,400 కి.మీ. డి) 56,500 కి.మీ.
43. మన పాలపుంత వ్యాసం సుమారు ఎన్ని కాంతి సంవత్సరాలు?
ఎ) 102 బి) 103
సి) 104 డి) 105
44. కాస్మిక్ సంవత్సరం దేని ప్రమాణం?
ఎ) దూరం బి) కాలం
సి) ద్రవ్యరాశి డి) పరిమాణం
45. భూ కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
ఎ) టాలమీ బి) కోపర్నికస్
సి) గెలీలియో డి) న్యూటన్
46. గ్రహం ఏ భౌతికరాశిపై పలాయనవేగం ఆధారపడి ఉంటుంది?
ఎ) ద్రవ్యరాశి బి) వ్యాసార్థం
సి) గురుత్వ త్వరణ విలువ
డి) ఆకారం
47. చంద్రుడిపై పలాయన వేగం?
ఎ) $2.42\ ms^{-1}$ బి) $2.42\ kms^{-1}$
సి) $2.42\ cms^{-1}$ డి) $11.2\ kms^{-1}$
48. సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలకు కావలసిన అభికేంద్రక బలాన్ని అందించేవి?
ఎ) విద్యుత్ బలాలు
బి) విశ్వగురుత్వాకర్షణ బలాలు
సి) అయస్కాంత బలాలు
డి) పైవన్నీ
49. సంవత్సర కాలవ్యవధి గరిష్ఠంగా ఉన్న గ్రహం?
ఎ) శని బి) బృహస్పతి
సి) నెప్ట్యూన్ డి) శుక్రుడు
50. భూమికి అతిచేరువలో పరిభ్రమిస్తోన్న కృత్రిమ ఉపగ్రహ ఆవర్తన కాలం (సుమారుగా)?
ఎ) 24 గంటలు బి) 10 గంటలు
సి) 500 సెకన్లు డి) 5000 సెకన్లు

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) సి;
5) ఎ; 6) బి; 7) సి; 8) ఎ;
9) బి; 10) సి; 11) బి; 12) సి;
13) బి; 14) సి; 15) బి; 16) డి;
17) డి; 18) సి; 19) డి; 20) సి;
21) సి; 22) డి; 23) డి; 24) ఎ;
25) ఎ; 26) సి; 27) బి; 28) సి;
29) బి; 30) ఎ; 31) డి; 32) సి;
33) ఎ; 34) సి; 35) డి; 36) బి;
37) సి; 38) బి; 39) డి; 40) ఎ;
41) బి; 42) సి; 43) డి; 44) బి;
45) ఎ; 46) డి; 47) బి; 48) బి;
49) సి; 50) డి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్‌లో 10 సీనియర్ కన్సల్టెంట్ పోస్టులు

ఢిల్లీలోని ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కన్సల్టెంట్ (ప్లానింగ్)-06, సీనియర్ కన్సల్టెంట్ (ఆపరేషన్)-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(సివిల్), ఎంబీఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,50,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.08.2025.
» **వెబ్‌సైట్:** www.edcilindia.co.in

ఈడీసీఐఎల్ (ఇండియా) లిమిటెడ్‌లో 12 పోస్టులు

ఈడీసీఐఎల్(ఇండియా) లిమిటెడ్.. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో జనరల్ మేనేజర్, ఆఫీసర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్ (డిజిటల్ ఎడ్యుకేషన్ సిస్టమ్)-01, జనరల్ మేనేజర్(బిజినెస్ డెవలప్‌మెంట్)-01, ఆఫీసర్ ట్రైనీ-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30.06.2025 నాటికి 28 నుంచి 44 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, ఆఫీసర్ ట్రైనీకి రూ.37,500 నుంచి రూ.1,31,800.
» **ఎంపిక విధానం:** డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**18.08.2025.
» **వెబ్‌సైట్:** https://www.edcilindia.co.in

అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?

తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150-600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పీఠభూమి:

- దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్.. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం–బొగ్గు.

తెలంగాణ పీఠభూమిలో

2 రకాల శిలలు ఉన్నాయి. అవి.

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

గోండ్వానా శిలలు: పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం – బొగ్గు.
దక్కన్ శిలలు: అగ్ని పర్వత ఉద్భేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గొండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా–తుంగభద్ర నదీ లోయల మధ్య 350-450 మీటర్ల ఎత్తులో, భీమా–గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.
- మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600-900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పర్వతాలు (కొండలు, గుట్టలు):

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

- పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.
  ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

జిల్లా పేరు పేరు	పర్వతాల స్థానిక
ఆదిలాబాద్	నిర్మల్ గుట్టలు
కరీంనగర్	రాఖీ గుట్టలు
వరంగల్	కందికల్ గుట్టలు
ఖమ్మం	పాపి కొండలు

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

జిల్లా	పర్వతాలు
మహబూబ్‌నగర్ అమ్రాబాద్ కొండలు	నల్లమల కొండలు,
రంగారెడ్డి	అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు
నల్గొండ	నంది కొండలు, యాదగిరి గుట్ట.

- తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ జాగ్రఫీ

- హైదరాబాద్ – సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్‌సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.
- 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో ; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోషీకరణ చెంది అవశిష్ట పీఠభూమిగా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహావృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్–వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్తి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. .

మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) కరీంనగర్
   3) ఆదిలాబాద్ 4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) నల్గొండ 4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్ 2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్ 4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు 2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు 4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ 2) మెదక్
   3) రంగారెడ్డి 4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
    1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
    3) నల్గొండ 4) ఆదిలాబాద్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3;
6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

USB in data cables stands for?

Model Questions

1. To make the number keypad act as directional arrows you press the _______ key.
   a) Num lock b) Caps lock
   c) Arrow lock d) Shift
   e) None of these
2. The skill to find an individual item in a file instantly ___ is used
   a) File allocation table
   b) Directory c) Sequential access
   d) Direct access
   (e) None of these
3. _____ memory improves processing by acting as a temporary high-speed holding area between the memory and the CPU.
   a) RAM b) ROM
   c) Cache memory
   d) Flash memory e) EPROM
4. A DVD is an example of a(n) _____
   a) Hard disk b) Optical disc
   c) Output device
   d) Solid-state storage device
   e) None of these
5. A ___ is a resourcefully designed "empty" document that can be adapted to the user's needs
   a) File b) Guide
   c) Template
   d) User guide file
   e) None of these
6. The hardware device normally referred to as the 'brain' of the computer is the___
   a) RAM chip b) Data input
   c) CPU
   d) Secondary storage
   e) None of these
7. One of the oldest calculating devices was
   a) Arithmometer
   b) Ready reckoner
   c) Abacus d) All of these
   e) None of these
8. All formula in Excel start with
   a) % b) + c) =
   d) – e) None of these
9. The Recycle Bin stores discarded items until _______
   a) Another user logs on
   b) The computer is shut down
   c) The end of the day
   d) You empty it
   e) None of these
10. Which of the following special effects can you use for the slide background?
    a) Gradient b) Texture
    c) Picture d) All of these
    e) None of these
11. Which of the following is not a valid formula in Microsoft Excel?
    a) = A2 + A1 b) = A2 + 1
    c) = A1 + A3 d) = 1A + 2
    e) = A1 + A2
12. What does the acronym ISP stands for?
    a) Internal Service Provider
    b) International Service Provider
    c) Internet Service Provider
    d) Internet Service Providing
    e) Internet Service Provision
13. What is the full form of WWW?
    a) World Wide Web
    b) World Wide Web
    c) World with Wet
    d) World Wide Wet
    e) World Weak Web
14. Which of the following is hardware?
    a) Assembler b) Server
    c) Compiler d) Interpreter
    e) OS
15. USB in data cables stands for?
    a) Unicode Smart Bus
    b) Universal Structural Bus
    c) Unicode Serial Bus
    d) Universal Smart Bus
    e) Universal Serial Bus
16. Which of the following is not a binary number?
    a) 11101 b) 110 c) 233
    d) 1001 e) 100110
17. ____ is approximately one billion bytes.
    a) Megabyte b) Kilobyte
    c) Terabyte d) Gigabyte
    e) Bit
18. A normal compiler takes source code as input and produces ___ as output
    a) Machine code b) Object code
    c) Assembly code d) C++
    e) None of these
19. ____ is an internet forum to discuss spacious range of topics like current news, articles and current affairs, etc.
    a) E-Learning b) Chatting
    c) E-Discussions
    d) Newsgroup e) None of these



BANK EXAMS

COMPUTER AWARENES

20. A technique in which a number of similar items or transactions to be processed are grouped and processed in a designated sequence during a machine run is ____.
    a) Batch processing
    b) Online processing
    c) Real time processing
    d) All of these e) None of these
21. Ada is a/an _______
    a) High-level programming language for the development of defense
    b) Structured programming language
    c) Association of data processing
    d) All of the above
    e) None of the above
22. What is the number of bit patterns provided by a 7-bit code?
    a) 256 b) 128 c) 64
    d) 512 e) All of these
23. Regarding a VDU, which statement is more correct?
    a) It is a peripheral device
    b) It is an input device
    c) It is an output device
    d) It is a hardware item
    e) None of the above
24. Which printer is very commonly used for desk top publishing?
    a) Dot matrix printer
    b) Ink Jet Printer
    c) Daisy wheel printer
    d) Laser printer
    e) None of these
25. The radix of a hexadecimal system is:
    a) 8 b) 3 c) 16
    d) 2 e) 10
26. Which of the following are types of sound files?
    a) LOG files b) DAT files
    c) WAV files d) DAV files
    e) None of these
27. Permanent Memory in computer is called
    a) RAM b) Auxiliary storage
    c) CPU d) CD ROM
    e) None of these
28. Apple Macintoshes (Macs) and PCs use different CPU's to process data and different__
    a) Languages b) Methods
    c) Operating system
    d) Storage devices
    e) None of these
29. Smaller and less expensive PC based servers are replacing today ________ in many businesses
    a) Super computers
    b) Clients c) Laptops
    d) Mainframes
    e) None of the above
30. After a picture has been taken with a digital camera and processed appropriately, the actual print of the picture is considered
    a) Data b) Output
    c) Input d) The process
    e) None of these
31. _____ is the science that attempts to produce machines that display the same type of intelligence that humans do.
    a) Nanoscience
    b) Nanotechnology
    c) Simulation
    d) Artificial intelligence
    e) None of the above
32. SMTP, FTP and DNS are applications of the ____ layer.
    a) Data link b) Network
    c) Transport d) Application
    e) None of these
33. ____ provides a common address space and routes the packets of data across the entire internet?
    a) IP b) TCP c) UDP
    d) ALU e) None of these
34. ____ was the precursor to internet as we know it today?
    a) ARPANET b) USENET
    c) TELNET d) DBMS
    e) None of these
35. Hardware that adds two numbers is:
    a) The control unit
    b) An internal CPU register
    c) Arithmetic Unit
    d) Browser
    e) None of these
36. What is the decimal from of 3b4?
    a) 846 b) 848 c) 946
    d) 948 e) None of these
37. The term _______ designate equipment that might be added to a computer system to enhance its functionality.
    a) Digital device
    b) System add
    c) Disk pack
    d) Peripheral device
    e) None of these
38. A device designed to read information encoded onto a small plastic card is..
    a) Light pen
    b) Pun chard card
    c) Magnetic tape
    d) Magnetic e) Badge reader
39. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is
    a) Generalization
    b) Inheritance c) Encapsulation
    d) Information hiding
    e) None of these
40. This part of operating system manages the essential peripherals, such as the keyboard, screen, disk drives, and parallel and serial ports_____
    a) Basic input / output system
    b) Secondary input / output system
    c) Peripheral input / output system
    d) Marginal input / output system
    e) None of these
41. Which of the following is not a type of key?
    a) Alphabetic Keys
    b) Numeric keys
    c) Function keys
    d) Toggle keys e) None of these
42. What is gutter margin?
    a) Margin that is added to the left margin when printing
    b) Margin that is added to right margin when printing
    c) Margin that is added to the binding side of page when printing
    d) Margin that is added to the outside of the page when printing
    e) None of these
43. To insert a new slide in a presentation, press_____
    a) CTRL+N b) CTRL+M
    c) CTRL+O d) CTRL+S
    e) CTRL+F
44. ______ is a combination of software and hardware
    a) Firmware b) Shareware
    c) Freeware d) Netware
    e) Software
45. Memory which forgets everything when you switch off the power is known as
    a) Corrupted b) Volatile
    c) Non-Volatile
    d) Non - Corrupted
    e) None
46. Format command is used to create____
    a) Sector b) Memory
    c) Tracks d) Tracks and sector
    e) None of these

KEY

1) a 2) d 3) c 4) b 5) c
6) c 7) c 8) c 9) d 10) d
11) d 12) c 13) b 14) b 15) e
16) c 17) d 18) b 19) d 20) a
21) d 22) b 23) a 24) d 25) c
26) c 27) b 28) c 29) d 30) b
31) d 32) d 33) a 34) a 35) c
36) d 37) d 38) e 39) b 40) a
41) e 42) c 43) b 44) a 45) b
46) d